
శ్రీమన్మహాభారతము

(శ్లోక వచన నీలకంఠ చిత్సుఖానంద వ్యాఖ్య సహితము)



12 సంపుటములు

ఇందులోని పర్వములు సంగ్రహముగా...



బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

ముద్రణ : అక్టోబరు, 2021

ప్రతులు : 500

ప్రతులకు : **యస్.వి. సుబ్రహ్మణ్య సోమయాజి**
సి-27, సెక్టర్ -4, అలకాపూర్ టౌన్ షిప్
మణికొండ పోస్టు, హైదరాబాద్-500 089.
సెల్ : **9849584555, 8008495534**
email : yajiassociates@gmail.com

మూల్యము : **పదునెనిమిది పర్వముల**
సంపూర్ణ మహాభారతము రూ ₹ 10,800
(12 సంపుటముల మూల్యము)

ముద్రణ : **శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్‌ప్రింటర్స్**
2/4, బ్రాడీపేట,
గుంటూరు - 522 002
ఫోన్ : 2235036

జగద్గురు శ్రీశ్రీశ్రీ
శివకల్యాణానందభారతీ మహాస్వామి

శివ సంకల్పమస్తు



గురుసంకల్పము సదా శుభపరిణామమే యగును. నేను ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే రోజులలో విద్యాశాఖ అధికారులు ఎవరు వచ్చినా నా చేత సంస్కృత శ్లోకాలు – తాత్పర్యాలు చెప్పించే వారు. ఒకసారి ఒక విద్యాశాఖాధికారి నన్ను TTD సంస్థలలో చేర్పించి వేదపండితుని చేయిస్తానన్నారు. కాని మా నాన్నగారు "వేదము మన రక్తములో నున్నది. వేరేగా చదవనక్కరలేదు. మారుతున్న కాలమాన పరిస్థితులనుబట్టి ఉపాధి విద్య ముందుగా నేర్చుకో, తరువాత ఆర్షవిజ్ఞానముపై బుద్ధినిలుపు"అని హితము పలికారు. అలాగే బి.కామ్, సి.ఏ ఇరువదొక్క సంవత్సరముల ప్రాయములోనే పూర్తిచేశాను. పది సంవత్సరములలో ఉన్నత పదవులనలరించాను. అప్పటినుండి ఆర్షవిజ్ఞాన సముపార్జన ప్రారంభించాను. కవితలు, కావ్యాలు, ప్రబంధాలు చదివాను. పురాణేతిహాసములు అధ్యయనము చేశాను. వేదభాగాలు నేర్చుకున్నాను. ఉపాసనలు, వ్రతములు, తీర్థయాత్రలు చేశాను. ద్వాదశ జ్యోతిర్లింగములు, అధికాధిక దేవీ పీఠములు, తిరుపతులు దర్శించాను. గంగా, యమునా, సరస్వతి, గోదావరి, కృష్ణ, కావేరీ మున్నగు ద్వాదశ నదీ పుష్కరములన్నిటిలో మునుకలిడితిని. గ్రంథరచనా ప్రస్థానమును నలుబదేండ్ల వయసులో ప్రారంభించాను. పెద్దల ఆశీస్సులు, దైవానుగ్రహమువలన రామాయణ, భాగవతములను సంపూర్ణముగ తెనుగువచనములో అనువదించాను. మహాభారతమును అనువదించుట అసాధ్యమని తలంచి మహాభారతాంతర్గత ధర్మతత్త్వోపాఖ్యానములు రెండువందలు పైచిలుకు తెనుగు వచనానువాదము చేసితిని. ఈ గ్రంథమును పరిశీలించిన శ్రీ శ్రృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠాధీశ్వరులగు జగద్గురు శ్రీశ్రీశ్రీ శివకల్యాణానందభారతీ మహాస్వామివారు నన్ను ఆశీర్వదించి వేదవ్యాస ప్రణీత సంపూర్ణ మహాభారతమును మూలశ్లోక వచనసుధా సహితముగ వ్రాయమని ఆదేశించిరి. ఒక్కరివల్ల ఆ మహాయజ్ఞము జరుగునాయని సందేహించితిని. కాని శివార్పణ సంకల్పముతో

"నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసస్తతో జయముదీరయేత్"

యను మంత్రమును జపించి 3.7.2012 గురుపౌర్ణమినాడు ప్రారంభించితిని. నా స్వాధ్యాయ అనుష్ఠానములు ఇతోధిక సఫలత గూర్చినవి. ఎట్టకేలకు పదునెనిమిది పర్వముల మూలశ్లోకములు – ఆంధ్రానువాదము DTP తో సహా 3.7.2020 నాటికి పూర్తిచేయగలిగితిని. శ్రీరాజరాజేశ్వరీ ప్రతాప భారతీ అనుగ్రహపాత్రుడనై శ్రీమద్రామాయణ, శ్రీమద్భాగవత, శ్రీమన్మహా భారతములను పూర్తిగా తెనుగులో అనువదించి కృతార్థుడనైతిని. ఇది జగద్గురు శ్రీశ్రీశ్రీ శివకల్యాణానందభారతీమహాస్వామి వారి శివసంకల్ప సిద్ధియని విశ్వసించి సాష్టాంగ ప్రణామములాచరించుచున్నాను.

రచయిత

సరిపల్లె వేంకటసుబ్రహ్మణ్య సోమయాజి

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసస్తతో జయ ముదీరయేత్

శ్రీమన్మహాభారత మహాత్మ్యము

ఆదిపర్వము ఒకటి, రెండు, అరువది రెండవ అధ్యాయములలో మహాభారత మహాత్మ్యము వర్ణించబడినది. వేదతుల్యమైన యీ గ్రంథము పురాణేతిహాసములలో శ్రేష్ఠమైనది. ఇందులో ధర్మార్థముల యొక్క ఉపదేశము సంపూర్ణముగనున్నది. ఈ పరమపావన ఇతిహాసము మోక్షబుద్ధిని కలుగజేయును. జయమనెడి యీ ఇతిహాసమును సర్వత్ర విజయేచ్ఛగలవారు అవశ్యము పఠనము లేదా శ్రవణము చేయవలెను. వారికి మనోవాక్కాయ పాపములు తొలగిపోవును. వారికి యీ లోకములో రోగవ్యాధి భయములుండవు. పరలోకసుఖములు తప్పక లభించును. ధనము, యశస్సు, ఆయుష్షు, పుణ్యము, స్వర్గప్రాప్తి లభించును.

మహాభారతములో భరతవంశరాజుల యొక్క జన్మవృత్తాంత వర్ణన యుండుటచే దీనికి మహాభారతముయను పేరుగలిగెను. మహాభారతము యను నామము యొక్క వ్యుత్పత్త్యార్థము తెలుసుకొన్నంత మాత్రమున మానవుడు పాపవిముక్తుడగును. మహాభారతములో మహాత్ములగు రాజర్షుల విభిన్నమగు జన్మవృత్తాంతములు వర్ణించబడినవి. మంత్ర పద ప్రయోగములున్నవి. అనేక సిద్ధాంతముల ననుసరించి ధర్మస్వరూపము యొక్క వివేచన చేయబడినది. విచిత్రయుద్ధముల వర్ణన యున్నది. రాజుల అభ్యుదయ గాథలున్నవి. ఋషులు, గంధర్వులు, రాక్షసుల యొక్క కథలున్నవి. పుణ్యతీర్థములు, పవిత్ర దేశములు, వనములు, పర్వతములు, నదులు, సముద్రములు మున్నగువాని మహాత్మ్యము ప్రతిపాదించబడినది. పుణ్యప్రదేశములు, నగరములయొక్క వర్ణన యున్నది. శ్రేష్ఠ ఉపచారములు, అలౌకిక పరాక్రమములు వర్ణించబడినవి. స్వాగత సత్కారముల విధివిధానము నిరూపించబడినది. శ్రీకృష్ణభగవానుని మహిమ, పార్వతీపరమేశ్వరుల తత్త్వము, అనేక ఆధ్యాత్మ గీతలు, గోవుల మహాత్మ్యము, సంపూర్ణ స్మృతుల రహస్యము మహాభారతమునందు చెప్పబడినవి. మహాభారతము ధర్మరక్షణ గ్రంథము.

శ్రీ వేదవ్యాస మహర్షి ప్రతిదినము ప్రాతఃకాల నిత్యవిధులొనరించుచు శుచియై తపస్సుతో, నియమవ్రతముతో మూడు సంవత్సరములలో యీ మహాభారత గ్రంథమును పూర్తిచేసెను. మహాభారతమును వినినను, చదివిననూ ఇతర కర్మలు చేయలేకపోయితిమను చింతాశోకములు పొందవలసిన అవసరము యుండదు. కేవలము మహాభారత పఠన శ్రవణాదులు వలన సర్వకర్మలు చేసిన ఫలితమువచ్చును. రాజసూయ – అశ్వమేధయాగముల ఫలప్రాప్తి సిద్ధించును. భ్రూణహత్యాది పాపములు తొలగును. అత్యంత క్రూరుడైననూ మహాభారత శ్రవణముచే రాహుచ్యుత చంద్రునివలె పాపవిముక్తుడగును. మహాభారత గ్రంథ పారాయణము చేయు గృహస్థు యొక్క పుత్రసంతతి గొప్ప సేవాపరాయణులై తాము సేవించు యజమానికి ప్రీతిపాత్రులగుదురు. మహాభారత గ్రంథ శ్రవణ పఠనాదుల వలన అంతఃకరణ శుద్ధిగలిగి, ఉత్తమ శీలస్వభావములు వృద్ధిచెందును. మహాభారత గ్రంథమును పఠించిన పిమ్మట యోగ్యులగువారికి దానమిచ్చుటచే సముద్రావృతమైన పృథివిని దానమునిచ్చినటులగును.

శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక చిత్సుఖానంద వచన సుధా సహితము)

ఆదిపర్వము

సంపుటి : 1

ఓం ధాతాయనమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

ఆదిపర్వము - సంగ్రహ పరిచయము

వ్యాసమహర్షి ఆదిపర్వమును రెండువందల ఇరువదేడు అధ్యాయములతో ఎనిమిదివేల ఎనిమిది వందల ఎనభైనాలుగు శ్లోకములతో రచించెను. ఆదిపర్వములో అనుక్రమణి - పర్వసంగ్రహ - పౌలోమ - ఆస్తీక - అంశావతరణ - సంభవ - జాతుగృహ - హిడింబాసురవధ - బకాసురవధ - చైత్రరథ - స్వయంవర - వైవాహిక - విదురాగమన - రాజ్యలాభ - అర్జున వనవాస - అర్జున ద్వారకాగమన - సుభద్రాహరణ - ఖాండవ వన దహనమనెడి పదునెనిమిది ఉపపర్వములున్నవి. కాని ప్రస్తుత గ్రంథములో రెండువందల ముప్పది నాలుగు అధ్యాయములున్నవి. బహుశా పరిష్కర్తలు పాఠకుల సౌలభ్యముకొరకై కొన్ని అధ్యాయములు విడదీయుటవలన యీ భేదము ఏర్పడి యుండ వచ్చును.

మహాభారతగ్రంథ ఆవిర్భావము: మహా భారతము వేదార్థ ప్రతిబోధకమై ఉత్తమసంస్కారవర్ధితమై, అనేక శాస్త్రములసారమై, బ్రహ్మవిద్యానిధియని మహాత్ములు శ్లాఘించిరి. మహాభారతము చతుర్వేద సమ్మితము. ధర్మ ప్రతిపాదికము, పాపభయహరమునై యున్నదని ఋషులు విశ్వసించిరి. అందుచే నైమిశారణ్య ఋషులు ముక్తకంఠముతో మహాభారతసంహితను చెప్పమని సూతుడగు ఉగ్రశ్రవుని అడిగిరి. అందుకు ఉగ్రశ్రవుడు "మునులారా! మహాతపస్వి వేదవ్యాసమహర్షి నియమవ్రతుడై ధ్యానయోగముతో మహాభారత గ్రంథస్వరూపము నంతటిని విచారణచేసి జ్ఞానదృష్టితో ఆదిపర్వము నుండి అంత్యపర్వమువరకు సర్వమును ప్రత్యక్షమొనర్చు కొనెను. పిమ్మట బ్రహ్మదేవుడు ప్రత్యక్షముకాగా "భగవాన్! నేనొక మహాకావ్యమును రచించ సంకల్పించితిని. ఈ గ్రంథము శాస్త్రసారమును, వేదహృదయమును, వేదాంగములు, ఉపనిషత్తుల విషయమును విస్తృతముగ నిరూపించును. ఇతర ఇతిహాసముల, పురాణముల ప్రాశస్త్యమును వ్యక్తమొనర్చును. భూతభవిష్యవర్తమానముల గురించి వర్ణించును. జరామృత్యువులు, భయరోగములు, పదార్థ సత్యత్వ మిథ్యాత్వములు మున్నగువానిని గూర్చి విశేష రూపములో నిశ్చయాత్మకముగ దెలుపును. అధికారి భేదముననుసరించి భిన్నభిన్న ధర్మములు - ఆశ్రమ లక్షణములు - చాతుర్వర్ణములవారి కర్తవ్యవిధానము, తత్ఫలములు, పృథివి, గ్రహనక్షత్ర తారాగణములు, సత్యాది చతుర్యుగములు మున్నగు వాని పరిమాణ ప్రమాణములు - చతుర్వేదముల అధ్యాత్మిక అభిప్రాయములు - అధ్యాత్మశాస్త్రములు గురించి, న్యాయము - శిక్ష - చికిత్స - దానము - పాశుపతము యను వాని గురించి విశదముగ ఈ గ్రంథము నిరూపించును. లోకపావన తీర్థములు, దేశములు, నదులు, పర్వతములు, వనములు, సముద్రముల వర్ణన, దివ్యనగరములు, దుర్గములయొక్క నిర్మాణ కౌశల్యము, భిన్నభిన్న భాషలు - జాతులు యొక్క విశేషములు, లోక వ్యవహారసిద్ధి కొరకు ఆవశ్యక కర్తవ్యములు, లోకోపయోగ పదార్థముల వివేచన యీ గ్రంథములో ప్రతిపాదించబడును."అనెను. అపుడు బ్రహ్మదేవుడు "వ్యాసమహర్షీ! నీవు విశిష్టమైన తపస్సు చేసితివి. ఉత్కృష్టమైన కులములో పుట్టితివి. ఋషిపుంగవులలో శ్రేష్ఠుడవు. నీ రచనను కావ్యమని వాక్రుచ్చితివి గావున నీ గ్రంథము కావ్యముగా ప్రసిద్ధిచెందును. నీ కావ్యమును అధిగమించి యింకొక కావ్యమును ఎన్నడూ ఎవరూ ఆవిష్కరింపజాలరు."అనెను. ఉపాఖ్యానములతోగలిపి యీ మహాభారత గ్రంథము లక్షశ్లోకములుగా రచించబడినది. మున్ముందుగా భారతసంహిత ఇరువది నాలుగువేల శ్లోకములలోనే రచించబడినటుల, దానిలో ఉపాఖ్యానములులేనటుల పండితులు అభిప్రాయపడిరి. కాని వేదవ్యాసమహర్షి నూటఏబది శ్లోకములతో గూడిన

పర్వానుక్రమణిక రచించెనుగావున యీ వాదము అప్రస్తుతము. ఉగ్రశ్రవుడు వంద పర్వముల మహాభారతమును పదునెనిమిది పర్వముల వ్యవస్థారూపముగ నైమిశారణ్యములో శౌనకాది మహామునులకు వినిపించెను.

మహాభారత కథారంభ ఉపాఖ్యానములు: మహాభారత కథారంభమునకు ముందుగా నూటఎనిమిది అధ్యాయములలో అనేక ఉపాఖ్యానములున్నవి. ఇవి మహాభారత కథకు నాందీప్రస్తావనగా నున్నవి. వీనిలో మొదటి ఏబదిఎనిమిది అధ్యాయములు జనమేజయుని సత్రయాగ ప్రారంభమునుండి సమాప్తివరకు సంబంధించినవై యున్నవి. తరువాతనున్న ఏబది అధ్యాయములందు కౌరవపాండవుల పూర్వపురుషుల చరిత్రలున్నవి.

యుధిష్ఠిరాదులు తమ మనుమడు పరీక్షిత్తును రాజ్యాభిషిక్తునిచేసి స్వర్గారోహణకు ఉపక్రమించిరి. తదనంతరము పరీక్షిత్తుకుమారుడు జనమేజయమహారాజు రాజ్యము నేలెను. ఒకప్పుడు జనమేజయుడు సత్రయాగమును తలబెట్టి యాగవేదిక రక్షణార్థమై తన తమ్ములు శ్రుతసేన, ఉగ్రసేన, భీమసేనులను రక్షకులుగా నియమించెను. ఆ సమయమున సారమేయమను దేవతా శునకము సత్రయాగ సమీపమునకు వచ్చి ఆనందముతో గెంతులు వేయసాగెను. జనమేజయుని తమ్ములు ఆ శునకమును ఛీ ఛీ యని కట్టెలతో బాది తరిమికొట్టిరి. ఆ దెబ్బలకు బాధతో మూల్గుచు తన తల్లి సరమ వద్దకు చేరెను. జనమేజయుని తమ్ములు తనను అకారణముగ కొట్టిరని చెప్పి భోరున విలపించెను. తాను యజ్ఞద్రవ్యములను చూచుట, తాకుట చేయలేదని కూడ వివరించెను. అందులకు సరమ క్రోధము వహించి జనమేజయుని యజ్ఞవాటికకు పోయి "నిరపరాధులను దండించుట న్యాయమా" యని నిలదీసెను. "ధర్మాద్విచలితం హంతి నృపమేవ సబాంధవమ్" దండననిచ్చువాడు రాజైనను నిరపవాధులను దండించుటచే సబాంధవముగ నశించునను ధర్మమును స్మరించి "నీకు అకస్మాత్తుగా ఊహించని భయము కలుగుగాక" యని శపించెను. జనమేజయమహారాజు సరమయొక్క శాపమును స్మరించుకొనుచు సత్రయాగము పూర్తయిన పిమ్మట హస్తినాపురమునకు మరలి శాపజనిత భయమును తొలగించుకొనుటకు శ్రుతశ్రవమహర్షి పుత్రుడగు సోమశ్రవుని గురువుగా, పురోహితునిగా వరించెను. జనమేజయమహారాజు తన తమ్ములను గురుశుశ్రూషాతత్పరులై ధర్మశిక్షణ పొందమని ఆదేశించెను. ఈ సందర్భమున సూతమహర్షి "గురుశుశ్రూషద్వారా జ్ఞానప్రకాశము ఎటుల ప్రాప్తించునో తెలియజేయుటకు ఒక ఉపాఖ్యానమును చెప్పెను. అయోధధౌమ్యుడను మహర్షి యొక్క శిష్యులు ఉపమన్యు – ఆరుణి – వేదుడను ముష్వురు గురుశుశ్రూషతో ఎట్టి మహత్త్వమును పొందిరో తెలియబరచెను. అటులనే వేదుడు తన శిష్యుడగు ఉత్తంకుని గురుభక్తి నెటుల పరీక్షించెనో వివరించెను. ఈ ఉపాఖ్యానములో తత్త్వార్థపూర్ణ అశ్వినీదేవతా స్తోత్రము (3వ అధ్యాయము) యున్నది.

తదనంతరము సూతమహర్షి మహాభారత కథకు నాందీప్రస్తావనగా భృగువంశము గురించి పరిచయమొనర్చ నారంభించెను. చ్యవన మహర్షి ఉత్పత్తి, భృగుమహర్షి అగ్నిదేవునకు శాపమునిచ్చిన వైనము, అగ్నిదేవుని శాపవిమోచనము వివరించబడెను. చ్యవనుని కుమారుడు ప్రమతి. ప్రమతికి ఘృతాచియను అప్సరస యందు రురువు జన్మించెను. రురువు కుమారుడు శునకుడు. శునకుని పుత్రుడే శౌనకమహర్షి. ఈ శౌనకాది మహర్షులే సత్రయాగమును నైమిశారణ్యలో చేయుచుండిరి. ఆ సందర్భమున సూతమహర్షి మహాభారత కథను వినిపించుటకు పూనుకొనెను. ఈ కథను పూర్వము వైశంపాయన మహర్షి వేదవ్యాసమహర్షి ఆదేశానుసారము సర్పయాగ సందర్భమున జనమేజయమహారాజునకు వివరించినదే సూతమహర్షి శౌనకాది మహామునులకు యధాతథము

దెలిపెను. భృగువంశజుడైన రురువు ప్రమద్వరల ప్రేమవృత్తాంతము కడు ఆదర్శనీయము. ప్రమద్వర సర్పకాటుచే మృతిచెందెను. రురువు దేవతలను ప్రార్థించి తన ఆయుర్దాయములో సగభాగమును సమర్పించి తన ప్రియురాలిని బ్రతికించుకొని వివాహమాడెను. తదనంతరము రురువు సర్పములపై పగబూని వానిని వధించసాగెను. ఒకనాడు దుందుభమును (విషరహితసర్పము) రురువు చంపబోయెను. కాని రురువు యొక్క దర్శనమాత్రముచే ఆ దుందుభము శాపవిమోచనము చెంది తన పూర్వజన్మను వివరించి అహింసకు మించిన పరమధర్మములేదని, సమస్త ప్రాణులకు అభయప్రదాన మొసంగవలెనని చెప్పెను. అంతేగాక అహింస – సత్యభాషణము – క్షమ – వేదస్వాధ్యాయము బ్రాహ్మణునకు ఉత్తమ ధర్మములనెను. క్షత్రియులకు సంబంధించిన దండనీతి బ్రాహ్మణుడు అనుసరించరాదని హితము బలుకుచు పూర్వము జనమేజయుని సర్పయాగములో గొప్ప సర్పహింస జరిగెననియు, ఆ సమయమున తపోబలసంపన్నుడు, వేదవేదాంత పారంగతుడునగు ఆస్తీకమహాముని ఆ యాగమును ఆపించి భయభీతులు చెందిన సర్పములకు రక్షణ నొసంగెనని పలికెను. ఈ ప్రకారము పౌలోమ పర్వము పూర్తయ్యెను.

తదనంతరము ఆస్తీకముని జన్మవృత్తాంతము ప్రారంభించబడినది. జరత్కారుడను ఋషి యాయావర వృత్తి నవలంబించి తీర్థస్నానములు చేయు కఠోరవ్రతదీక్షవహించి దేశసంచారము చేయుచుండెను. ఆయనకు ఒకప్పుడు తన పితృదేవతల దర్శనమై తమకు ఊర్ధ్వగతులు కలిగించుటకు సంతానవంతుడవుగమ్మని ఆదేశించిరి. జరత్కార మహర్షి వారితో తనపేరుతో సమానమగు కన్య తనకు భిక్షగా లభించినచో సంతానవంతుడనయ్యెదనని వాగ్దానమొనర్చెను. అదే సమయమున నాగమాత కద్రువ తన పుత్రులను జనమేజయుని యజ్ఞాగ్నిలో భస్మమగునటుల శపించియుండెను. ఆ శాపమును నివారించుటకై నాగరాజు వాసుకి తన సోదరి జరత్కారిని జగత్కారునకు యిచ్చి వివాహమొనర్చెను. జరత్కారునకు ఆమె గర్భమునందు వేదవేదాంగ పారంగతుడు, తపస్వియగు ఆస్తీకుడను పుత్రుడు గలిగెను. దీర్ఘకాలము గడిచిన పిమ్మట పాండవ వంశజుడైన జనమేజయమహారాజు సర్పయాగమును తలబెట్టి సర్పసంహారము నారంభించినపుడు ఆస్తీకముని తన మాతృవంశ సర్పజాతిని తత్సంకటము నుండి విముక్తులను గావించెను. అటులనే అనేకానేక వ్రతములను, స్వాధ్యాయమును అనుష్ఠించి త్రివిధ ఋణములను తీర్చుకొనెను.

ఈ సందర్భములో నాగులకు మాతృశాపము ఎటుల సంభవించెనో తెలియజేయమని శౌనకమహర్షి అడిగెను. అందులకు ఉగ్రశ్రవుడు తన తండ్రి రోమహర్షునుని ద్వారా వినిన ఆస్తీక వృత్తాంతమును వివరించనారంభించెను. కశ్యపమహర్షి అనుగ్రహము వలన ఆయన భార్య కద్రువ వేయి అండములను, వినతాదేవి రెండు అండములను ప్రసవించిరి. దాసీజనముచే అండములన్నిటిని ఉష్ణజనిత పాత్రలలోనుంచిరి. కద్రువ యొక్క వేయి అండములు పగిలి వేయిమంది నాగకుమారులు బయల్పడిరి. వినతాదేవి ప్రసవించిన రెండు అండములు నిశ్చలముగనుండుటచే ఆమె సవతి సౌభాగ్యమునకు ఈర్ష్యచెంది ఒక అండమును బలవంతముగ పగులగొట్టెను. కాని ఆ అండములోనున్న శిశువుయొక్క దేహము పైభాగము పూర్తిగా వికసించినను అధోభాగము మాత్రము కొద్దిపాటి పరిపుష్టి గలిగియుండెను. అపుడా శిశువు క్రోధముతో తన తల్లి వినతాదేవిని "మాతా! నీవు సవతి సౌభాగ్యమునకు ఈర్ష్యచెంది నాకు యీ దుస్థితి కలిగించితివి గావున నీవు అయిదువందల సంవత్సరములు సవతిదాస్యమును చేయుదువుగాక. కాని నీ రెండవ అండమునుండి ఉత్పన్నమగు పుత్రుడు నీకు దాస్యవిముక్తి కలిగించును"అనెను. అటులపలికి నింగికెగిసిన పక్షిరాజు అరుణుడు సూర్యదేవుని అనుగ్రహముతో ఆయన

రథమునకు సారథియై నాటినుండి ప్రాతఃకాలములందు అరుణారుణ కాంతులతో తూర్పుదిశలో దర్శనమీయసాగెను.

ఒకనాడు సూర్యోదయ సమయమున కద్రువ - వినతలు విహారము చేయుచు దూరముగా సముద్రతీరమునందు సంచరించుచున్న ఉచ్చైశ్రవమను అశ్వమును దర్శించిరి. వారిరువురు ఉచ్చైశ్రవము యొక్క అందమును పరిపరి విధముల ప్రశంసించిరి. ఉచ్చైశ్రవము యొక్క తోకమాత్రమే నల్లగానున్నదని కద్రువ వితండవాదము చేయసాగెను. వినతాదేవి మాత్రము అటువంటిదేమీలేదని రూఢిగా వాదించెను. వారు వివాదము చేయుచు తమలో ఓడినవారు, గెలిచినవారికి దాస్యము చేయవలెనను పందెముతో మరునాడు ఆ అశ్వమును పరీక్షగ దర్శించ నిర్ణయించుకొనిరి. కద్రువ ఎటులైననూ ఆ పందెములో గెలువవలెనని ఆశించి తన పుత్రులగు నాగులను ఉచ్చైశ్రవము యొక్క తోకను కరిచిపెట్టుకొని నల్లగాయున్నటుల దర్శింపజేయమనెను. కొందరు నాగులు అట్టి కపటవ్యవహారము కూడదని ప్రతిఘటించిరి. అపుడామె తనకు ఎదురుపలికిన పుత్రులు జనమేజయుని సర్పయాగములో భస్మమగునటుల శపించెను. అదే సమయమున దేవాసురులు అమృతప్రాప్తికై సముద్రమంధనము చేసిరి. దేవతలు అమృత భాండమును స్వర్గమునందొకచోట నిక్షిప్తమొనర్చి సురక్షిత వ్యవస్థనేర్పరచిరి.

తదనంతరము మహాతేజస్వి గరుత్మంతుడు ఉద్భవించెను. మహాసాహసము, పరాక్రమము, తేజస్సు ఆయనలో పుట్టుకతోనే వ్యక్తమైనవి. ఆయనకు ఇచ్ఛానుసారము రూపము ధరించుశక్తియున్నది. కామగమనశక్తియున్నది. విహంగ రూపములో ఉద్భవించిన గరుత్మంతుడు స్వల్పకాలములోనే అత్యంత భయంకరమగు విశాలకాయమును ధరించెను. ఆయన కనులు విద్యున్మాలికలవలె మెరియుచు పింగళవర్ణములోనున్నవి. ఆకాశమునకెగిరి బడబానలమువలె భీషణుడై, ప్రళయకాలాగ్నివలె ప్రకాశించుచున్న గరుడునిజూచి దేవతలు అగ్నిదేవుడనుకొని తేజఃపుంజములను వ్యాపింప జేయవలదని ప్రార్థించిరి. అపుడు అగ్నిదేవుడు దేవతలతో "నాతో సమానరూపము గల యీ విహంగరాజు వినతాదేవి పుత్రుడు. ఇతడు నాగులను నశింపజేయును. దేవతలకు హితముగూర్చును. దైత్యరాక్షసులకు శత్రువగును. ఆ మహాత్ముని దర్శించుటకు పోయెదము"అనెను. తత్సమయమున దేవతలు సుపర్ణుని గురించి స్తుతించిరి. (23 వ అధ్యాయము) గరుత్మంతుడు తన తల్లి వినతాదేవికి సహాయమొనర్చుటకై కద్రువ సంతానమును తన వీపుపై ఎక్కించుకొని నాగులను సముద్రమునందొక రమణీయద్వీపమునకు గొనిపోవుచు ఆకాశమునందెగిరి సూర్యదేవుని సమీపమునుండి వెడలెను. అందుచే నాగులు సూర్యతాపమునకు మూర్ఛిల్లిరి. అపుడు కద్రువ దేవేంద్రుని ప్రార్థించి (25 వ అధ్యాయము) వర్షము కురిపించి వారి తాపమును ఉపశమింపజేసెను. తదనంతరము గరుడుడు తన మాతయొక్క దాస్య వృత్తాంతమునెరిగి ఆమెకు దాస్యవిముక్తి కలిగించుటకై కద్రువ కోరిన అమృతకలశము దెచ్చుటకు బయలుదేరెను. గరుడుడు తన తండ్రి కశ్యపుని ఆశీస్సులుగైకొని అమృతము దెచ్చుటకు స్వర్గలోకమునకేగెను. ఈ సందర్భమున గరుడోత్పత్తికి కారణమైన వాలఖిల్య మహర్షుల తపః ప్రభావము వివరించబడినది. కశ్యప ప్రజాపతి ఒకప్పుడు పుత్రకామనతో యజ్ఞమును చేసెను. ఆ యజ్ఞమునకు ఋషులు - గంధర్వులు - దేవతలు సహాయ సహకారములు అందించిరి. ఇంద్రుడు సమిధలను తెచ్చు కార్యమును చేపట్టెను. వాలఖిల్య మహర్షులు ఆయనకు సహకరించదలంచి వారందరు కలిసి ఒక మోదుగపుల్లను అతి కష్టముతో మోయుచు గోవుగిట్టముద్రలో పడిననీటిలోపడి గొప్పక్లేశమును పొందిరి. ఆ దృశ్యమును జూచి ఇంద్రుడు హేళనగా నవ్వెను. వాలఖిల్యులు

అంగుష్ఠములో సగభాగమే ప్రమాణముగల దేహాకారముతో నుండిరి. వారు సూర్యకిరణములను మాత్రమే పానము చేయుచు తపస్సుచేయుదురు. తపస్సేవారికి ధనము. ఇంద్రుడు వారిపైనుండి దాటుకొనిపోయి అవమానించెను.

ఇంద్రుడొనర్చిన అసత్కార్యమునకు వాలఖిల్య మహర్షులు రోషము చెందిరి. దేవతలందరికి రాజుగ వేరొక ఇంద్రుడు ఉద్భవించవలెనని మనస్సులో సంకల్పించి కశ్యపమహర్షి యజ్ఞాగ్నిలో భిన్నభిన్న మంత్రములతో విధిపూర్వకముగ ఆహుతులనీయసాగిరి. నవీన ఇంద్రుడు ఇచ్ఛానుసారము పరాక్రమము ప్రదర్శించువానిగ, శౌర్యవీర్యములలో వర్తమాన ఇంద్రునికన్న వందరెట్లు ప్రతాపవంతుడగునటుల సంకల్పించిరి. వారి సంకల్పము నెరిగిన దేవేంద్రుడు తక్షణమే కశ్యపమహర్షి చెంతకేగి శరణుకోరెను. అపుడు కశ్యప మహర్షి ఒకింత ఆలోచనచేసి వాలఖిల్యమునులను సమీపించి "తపోధనులారా! బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము పురందరుడు ఇపుడు ముల్లోకములకు ఇంద్రాధిపత్యమును పొందెను. మీరిపుడు వేరొక ఇంద్రుని ఉత్పత్తి చేయుటకు ప్రయత్నించుచున్నారు. ఆ విధముగ చేసినచో బ్రహ్మదేవుని వచనము మిథ్యావచనమగును. మరి మీ సంకల్పముకూడ మిథ్యకారాదు. కనుక మీరు సంకల్పించిన మహాబలుడు – సత్వగుణసంపన్నుడు పక్షీంద్రుడు కావలెను. దేవరాజు తనతప్పు తాను తెలుసుకొని మీ క్షమనుగోరి యాచకునిగ వచ్చియున్నాడు. మీరు ఇతనిపై అనుగ్రహము జూపుడు"అనెను. కశ్యపమహర్షి సూచననాలకించిన వాలఖిల్యమునులు ఆయనను గౌరవించి "ప్రజాపతీ! ఈ యజ్ఞములో మా అనుష్ఠానము వేరొక ఇంద్రునికొరకు – నీ యజ్ఞానుష్ఠానము పుత్రునికొరకు జరిగినది. మా అనుష్ఠానసహిత నీ యజ్ఞముయొక్క ఫలమును నీవే స్వీకరించుము. అందరికీ ఏది మంచిదగునో అది చేయుము"అనిరి. ఆ ప్రకారము వినతాదేవి పుత్రులు పక్షిజాతిపై ఇంద్రపదవులను భోగించిరి.

గరుత్మంతుడు అమృతభాండమును దెచ్చు మహత్కర్మకు పూనుకొని స్వర్గమునకు వెడలెను. దేవతా సమూహము అస్త్రశస్త్రములతో యుద్ధసన్నద్ధు లయ్యిరి. వినతానందనుడు తన రెక్కలతో, నఖములతో దేవతలను క్షతవిక్షత మొనర్చెను. గరుడుడు కామరూపము ధరించి ఎనిమిదివేల ఒక వంద ముఖములతో నదీజలములను పుక్కిటపట్టి నలుదిశలనుండి ఆక్రమించిన అగ్నిజ్వాలలను ఆర్పివేసెను. అమృతభాండముపైనున్న లోహచక్రము యొక్క రంధ్రములో దూరి, అచట రక్షణగనున్న సర్పములను ఖండఖండములుచేసి వధించి, అమృతభాండమును చేతబట్టుకొని యంత్రమును ఛేదించి ఆకాశమునకు ఎగిరెను. తాను అమృతమును సేవించలేదు. గరుడుని పరాక్రమమును జూచి శ్రీమహావిష్ణువు మెచ్చుకొని ఏదైనా వరము కోరుకొనమనెను. అందులకు గరుడుడు శ్రీమహావిష్ణువు యొక్క రథధ్వజముపై యుండునటుల, మరియు తాను అమృతము సేవించకనే అజరుడు – అమరుడగునటుల వరమును కోరెను. విష్ణు భగవానుడు "ఏవమస్తు"యని పలికెను. ఆ రెండువరములను పొందిన పిమ్మట గరుడుడు "విష్ణుదేవా! నేను కూడ నీకు వరము నీయ దలంచితిని. తామేదైనా వరము కోరుకొనుడు"అనెను. అందులకు భగవంతుడు "గరుడా! నీవు నా వాహనము గావలెను"అని కోరెను. ఆ ప్రకారము భగవంతుని రథధ్వజముపై గరుడుడు, గరుడుని వీపుపై భగవంతుడు ఒకరిపైనొకరు (భగవంతునిపై భక్తుడు భక్తునిపై భగవంతుడు) ఆధారముగా నుండిరి. భగవంతుని కోర్కె నంగీకరించిన గరుడుడు వేవేగ అమృతభాండమును గొనిపోవుచుండగా దేవేంద్రుడు ఎదుర్కొని వజ్రాయుధమును ప్రయోగించెను. గరుడుడు దధీచిమహర్షి అస్థికలతో నిర్మితమైన ఆయుధమును గౌరవించదలంచి ఒక ఈకను విడిచెను. ఆ ఈకను జూచి ప్రాణులన్నియు ''సుపర్ణుడని''కొనియాడిరి. ఇంద్రుడు కూడ గరుడుని బలమును గ్రహించి

మైత్రీబంధమునేర్పరుచుకొనెను. అమృత భాండమును ఇతరులకు సమర్పించినచో దేవతలను కష్టములపాల్జేయుదురని గరుత్మంతునకు విన్నవించుకొనెను. అందులకు గరుడుడు "దేవేంద్రా! నేనొక కారణవశమున అమృతభాండమును గొనిపోవుచున్నాను. నేను ఎవరికీ సమర్పించుటలేదు. నేనొకచోట దీనిని పెట్టి వెడలిపోయెదను. తరువాత నీవు దానిని ఏమైనా చేసుకొనుము"అనెను. తదనంతరము గరుడుడు నాగులవద్దకు పోయి "ఇదిగో! మీరు కోరిన విధముగ అమృతభాండమును దెచ్చి యిచటపెట్టుచుంటిని. మీరు శుచియై అమృతమును సేవించుడు. మీ కార్యసిద్ధి గావించితిని గావున మా మాతకు దాస్యవిముక్తినీయుడు"అనెను. నాగులు అందులకు అంగీకరించి స్నానమొనర్చి శుద్ధియుగుటకు వెడలిరి. ఆ సమయమున దేవేంద్రుడు అమృతభాండమును హరించుకొనిపోయెను. నాగులు అమృత కలశము మాయమగుటచే నిరాశచెందిరి. అమృతభాండమును గరుత్మంతుడు పెట్టిన ప్రదేశముపైనున్న తృణాదులు పవిత్రములగుటచే నాటినుండి దర్భలకు పవిత్రములను నామము గలగెను. గరుత్మంతుడు దేవతలకు ఆ విధముగ ఉపకారము చేసినందులకు దేవేంద్రుడు వరము నీయదలంచెను. అపుడు గరుత్మంతుడు తన మాతపై నాగులు కపటముతో వ్యవహరించుట స్మరించి, నాగులను తనకు ఆహారమగునటుల కోరుకొనెను. అపుడు దేవేంద్రుడు శ్రీమహావిష్ణువు యొక్క అంగీకారముతో గరుత్మంతునకు వరమునిచ్చెను. ఆ ప్రకారము గరుత్మంతునకు సుపర్ణుడు – సర్పభోజి – విష్ణురథధ్వజుడను నామములు సిద్ధించెను.

పాండవ వంశాంకురమగు పరీక్షిన్మహారాజు రాజ్యము నేలుచు ఒకనాడు వనాంతరములోనికి మృగయా వినోదియై వెడలెను. ఆయనొక మృగమును వెంటదరుముచు బహుదూరము పోయెను. కాని ఆ మృగము అదృశ్యమయ్యెను. ఆయన అలసట చెంది దాహార్తితో వనమునందున్న శమీకముని ఆశ్రయమునకు పోయెను. అచట తపస్సమాధి యందున్న మునిని "బ్రహ్మన్! నేను పాండవవంశ అభిమన్యు పుత్రుడగు పరీక్షిత్తును. దాహార్తినై వచ్చితిని" అని పలికెను. కాని ఆ ముని సమాధిస్థితుడై యుండుటచే మౌనము వహించి బదులు పలుకక యుండెను. అందుకు మహారాజు కుపితుడై చెంతనేయున్న ఒక మృతసర్పమును ధనస్సు కొనతో పైకెత్తి ముని భుజముపై వేసెను. పిమ్మట పరీక్షిన్మహారాజు మునియొక్క సమాధిస్థితిని గ్రహించి క్రోధమును విడిచి మనోవ్యధ బొందుచు పశ్చాత్తాపముతో తన రాజధానికి మరలిపోయెను. ఆ మహామునికి శృంగియను పుత్రుడుండెను. అతడు అదే సమయమున గురుకులవాసము నుండి తిరిగి వచ్చి తన తండ్రి యెడల పరీక్షిత్తుచేసిన అపరాధమును తెలుసుకొని క్రోధము చెందెను. ఏడురోజుల అనంతరము పరీక్షిన్మహారాజు నాగరాజు తక్షకుని కాటుచే మృతిచెందునటుల శపించెను. ఆ విషయము తెలుసుకున్న శమీకముని తన పుత్రుని చర్యకు అప్రియము చెందెను. ప్రజారక్షకుడగు రాజు విధాత యనబడును. అతడు పదిమంది శ్రోత్రియులతో సమానుడను మనుధర్మవాక్యమున్నది. నీవు పెద్దవాడవైననూ తండ్రిగా నీకు సత్కర్మోపదేశమును చేయవలసి యున్నది. తండ్రి ఉపదేశముల నాచరించుటవలన పుత్రుడు గుణవంతుడు, మహాయశస్వి యగును. యోగైశ్వర్య సంపన్నులగు ప్రభావశాలురకు క్రోధాధికముండును. క్రోధము ధర్మనాశకరము. మనస్సును, ఇంద్రియములను వశము నందుంచుకొని క్రోధమును జయించవలెను. క్రోధమును జయించుటకు క్షమాగుణము నలవరచుకొనవలెను. క్షమాగుణము వలననే బ్రహ్మలోక ప్రాప్తి యగును. ఇటుల తన పుత్రునకు ఉపదేశించి ఒక శిష్యుని ద్వారా పరీక్షిన్మహారాజునకు ఒక సందేశము పంపెను. తక్షకుని కాటువలన మృత్యువు సంభవించునున్నది గావున

రక్షించుకొను వ్యవస్థ చేసుకొనమని హితవు చెప్పెను. పరీక్షిన్మహారాజు తక్షణమే ఒంటిస్తంభము మేడను కట్టించి అన్నివైపుల సురక్షిత వ్యవస్థ నేర్పరచుకొనెను. మంత్రశాస్త్ర విశారదుడగు కాశ్యప బ్రాహ్మణుడు విషకాటుకు చికిత్స చేయదలంచి పరీక్షిన్మహారాజు భవనమునకు పయనమయ్యెను. ఆయనకు మార్గమధ్యములో తక్షకుడు కలిసి తన విషకాటుకు చికిత్స యుండదని పలికెను. అపుడా కాశ్యపుడు తన విద్యాబలమును ప్రదర్శించెను. అది జూచిన తక్షకుడు ఆ బ్రాహ్మణునకు విధిలిఖిత ఆయుర్దాయమును దర్శించమనెను. పరీక్షిత్తునకు మృత్యుసమయమాసన్నమైనదని తెలిసిన కాశ్యపుడు తనకు తక్షకుడు భక్తితో సమర్పించిన ధనమును గ్రహించి వెనుదిరిగి పోయెను. తదనంతరము తక్షకుడు కొంతమంది బ్రాహ్మణ తపస్వులు గొనిపోవుచున్న ఫలమూలాదులందు కీటక రూపమున ప్రవేశించెను. పరీక్షిత్తు దైవయోగముచే ఒక ఫలమును భుజించుటకు ప్రయత్నించగా కీటక రూపముగ నున్న తక్షకుడు నిజరూపము దాల్చి కాటు వేసెను. పరీక్షిన్మహారాజు ఆ కాటుకు నేలగూలెను.

తదనంతరము పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు రాజ్యాభిషిక్తుడయ్యెను. జనమేజయ మహారాజునకు కొంతకాలము గడిచిన పిమ్మట తన తండ్రి తక్షకుని విషకాటుకు ఎటుల దగ్ధమయ్యెనో మంత్రుల ద్వారా తెలిసెను. ఆయన తక్షకునిపై ప్రతీకారము దీర్చుకొనదలంపుతో సర్పయాగమును ఉత్తంక మహర్షి అధ్వర్యమును ప్రారంభించెను. పూర్వము ఉత్తంకమహర్షి గురుదక్షిణకై పౌష్యమహారాణి వద్ద నుండి కుండలములు గ్రహించి తీసుకొని పోవుచుండగా తక్షకుడు వానిని అపహరించెను. అపుడు ఉత్తంకుడు నాగలోకమునకు పోయి అనేక క్లేశముల ననుభవించి వానిని మరల దెచ్చుకుని గురుపత్నికి సమర్పించుకొనెను. అందుచే ఉత్తంక మహర్షి కూడ తక్షకునిపై ప్రతీకారము దీర్చుకొనుటకు సర్పయాగ ఆధ్వర్యమును చేపట్టెను. పూర్వమే నాగులకు తమ తల్లి కద్రువ శాపమున్నదని విదితము. అందుచే సర్పయాగము దైవ విధానముచే ప్రారంభమయ్యెను. సర్పయాగములో బలి గానున్న కొన్ని సర్పములను రక్షించుకొను విధానమును పూర్వమే బ్రహ్మదేవుడు నిర్ణయించెను. ఆ విషయమునెరిగిన నాగరాజు వాసుకి తన చెల్లెలు జరత్కారిని మునివర్యుడగు జరత్కారునకు యిచ్చి వివాహము జరిపెను. జరత్కార మహర్షి పుత్రుడగు ఆస్తీకముని ఆ సర్పయాగమును ఆపించెను. జనమేజయ మహారాజు ఆస్తీకుని కోరిక మేర సర్పయాగము మధ్యలోనే ఆపివేసెను. ఆ ప్రకారము చాలామంది నాగులు సర్పయాగములో దగ్ధమైనను శేషించిన నాగజాతి రక్షించబడెను. అపుడు నాగులు "ఆస్తీకుని నామము స్మరించు వారికి" సర్పభయము లేకుండునటుల వరము నిచ్చిరి. ఇటుల ప్రథమ ఏబది ఎనిమిది అధ్యాయముల ఉపాఖ్యానములు పూర్తయినవి.

మహాభారత ఉపక్రమములు

తదనంతరము ఏబది అధ్యాయములలో అంశావతరణ-సంభవ పర్వములు ప్రారంభమగును. జనేమజయమహారాజు సర్పయజ్ఞము చేయుటకై దీక్షను గ్రహించెనని తెలిసినంతనే శ్రీకృష్ణద్వైపాయన మహర్షి ఆ యజ్ఞమునకు వెడలెను. ఆయన కాళీ (సత్యవతి) యను కన్యకు శక్తిపుత్రుడగు పరాశర మహర్షి ద్వారా యమునానది యందొక ద్వీపమునందు జన్మించెను. ఆయనే పాండవులకు పితామహుడు ఆయన జన్మించినంతనే తన ఇచ్ఛానుసారము దేహమును పెంచుకొనెను. ఆ మహాయశస్వి పుట్టుకతోనే షడంగసహిత వేదములు, ఇతిహాసములు, పరమాత్మ తత్త్వజ్ఞానము కలిగి యుండెను. ఆయన అపర విద్యలసారము నెరిగిన బ్రహ్మర్షి. ఆయన త్రికాలదర్శియగు కవీశ్వరుడు. ఆ మహాయశస్వి శాంతనుని సంతానపరంపరను విస్తార మొనర్చుటకై పాండురాజు, ధృతరాష్ట్రుడు, విదురుడు యనువారలకు జన్మనిచ్చెను. వేద వ్యాసమహర్షి ఆగమనమును జూచిన

జనమేజయ మహారాజు గొప్ప ఆనందముతో ఎదురేగి స్వాగతించి సువర్ణమయ సింహాసనాసీనుని చేసి శాస్త్రోక్త విధిననుసరించి పూజించి "బ్రహ్మన్! మీరు కౌరవ పాండవుల యుద్ధమును వీక్షించితిరి. వారు రాగద్వేషాది దోషరహితులై సత్కర్మలాచరించువారైననూ ఇరువురి నడుమ భేదబుద్ధి ఎటుల ఉత్పన్నమైనది. అటులనే ప్రాణాంతకమైన ఈ మహాయుద్ధము ఎటుల జరిగినది? పారబ్ధ ప్రేరితులగుట చేతనే నా ప్రపితామహులందరి యొక్క మనస్సు యుద్ధరూప అనిష్టకార్యమునందు లగ్నమైనదనుకొందును. వారి సంపూర్ణ వృత్తాంతమును మీరు యథాతథముగ వర్ణించుడు" అని ప్రార్థించెను. అపుడు వ్యాసమహర్షి తన శిష్యుడగు వైశంపాయనునితో "వైశంపాయనా! నీవు ఆ చరిత్రనంతయు నాద్వారా వినియుంటివి. ఆ వృత్తాంతమునంతయు జనమేజయ మహారాజునకు వినిపించుము" అనెను. గురుదేవుని ఆదేశము ననుసరించి వైశంపాయన మహర్షి అచటనున్న జనమేజయ మహారాజునకు, ఇతర భూపాలురకు, సభాసదులకు కౌరవపాండవుల భేద విద్వేష వృత్తాంతమును, సర్వవినాశమును చెప్పనారంభించెను.

కౌరవ పాండవ (సూత్రప్రాయ) విభేద వృత్తాంతము

మున్ముందుగా కౌరవపాండవులకు విభేదము లెటుల ఉత్పన్నమయినవో సూత్రప్రాయముగా చెప్పనారంభించెను. రాజ్యముకొరకు కౌరవులు కపటద్యూతమాడి పాండవులను వనవాసమునకు బంపుటచే వారిరువురి నడుమ స్పర్థ ఏర్పడినది. ఆ కారణమువలన భూమండలములోని వీరులెల్లరు మహాభారత యుద్ధములో పోరుసలిపి నశించిరి. పాండురాజు వనములందుండగనే స్వర్గస్థుడగుటచే ఆయన భార్య కుంతీదేవి పాండుపుత్రులలోబాటు హస్తినాపుర తమ రాజభవనమును చేరెను. పాండవులు స్వల్ప సమయములోనే వేదమునందు, ధనుర్విద్య యందు పండితులయ్యిరి. సత్త్వ వీర్య ఓజో సంపన్నులగుటచే పురవాసులకు ప్రేమాదర పాత్రులయ్యిరి. వారి వృద్ధిని ధార్తరాష్ట్రులు సహించ లేకపోయిరి. క్రూరుడగు దుర్యోధనుడు పాండవులను రాజ్యము నుండి వెడలగొట్టుటకు ప్రయత్నముల నారంభించెను. దుర్యోధనుడు రాజ్యార్థియై వివిధోపాయములతో శకుని ఆలోచనలతో పాండవులను పీడించసాగెను. లక్కయింటిలో పెట్టి దహించుటకు ప్రయత్నించెను. కాని పాండవులు సొరంగమార్గము ద్వారా తప్పించుకొని ఒక బ్రాహ్మణగృహములో తల్లితోపాటు కొంతకాలము నివసించిరి. ద్రౌపదీ స్వయంవరములో పాల్గొని ద్రుపద రాజకుమారి ద్రౌపదిని పాండవులు తమ పత్నిగా స్వీకరించిరి. పిమ్మట ధృతరాష్ట్రుడు, భీష్ముడు వారిని హస్తినాపురమునకు పిలిపించి ఖాండవ ప్రస్థమును రాజ్యముగా నిచ్చిరి. పాండవులచట అస్త్రశస్త్ర ప్రతాపముతో అన్యాన్య రాజులను తమ వశమొనర్చుకొని సుహృదులతో, తమ తల్లితో చాల సంవత్సరములుండిరి. పాండవులు ధర్మాత్ములు, సత్యవ్రత పాలకులు, ఏమరుపాటు లేనివారు, క్షమాశీలురు, శత్రుసంతాపకులగుటచే పృథివిలో అధికభాగమును వశమొనర్చుకొనిరి. ఖాండవవన దహన సమయమున అర్జునుడు అగ్నికీలల నుండి మయాసురుని కాపాడుటచే కృతజ్ఞతగా అతడు ఒక దివ్యసభను నిర్మించి యుధిష్ఠిరునకు యిచ్చెను. పిమ్మట యుధిష్ఠిరుడు రాజసూయయాగము చేసెను. అపుడు దుర్బుద్ధి యగు దుర్యోధనుడు యుధిష్ఠిరుని రాజ్యసంపద వైభవమును, మయసభను జూచి మాత్సర్యము చెందెను. ఆ సంపదనంతటిని స్వంతము చేసుకొనవలెనను దుర్బుద్ధితో దుర్యోధనుడు శకుని సహాయముతో కపట ద్యూతమాడి యుథిష్ఠిరుని ఓడించి, పాండవులకు పండ్రెండు సంవత్సరముల అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేయుటకు బంపెను. పదునాల్గవ సంవత్సరమున పాండవులు మరలి వచ్చి తమ రాజ్యము నీయమనిరి. కాని కౌరవులు అన్యాయముగ

సూదిమొన మోపిన భూమినైననూ యీయమని వచించిరి. పెద్దలెందరో సంధి ప్రయత్నములు చేసిననూ వానిని దుర్యోధనుడు నిరాకరించెను. అపుడు కౌరవ పాండవుల నడుమ యుద్ధము జరిగెను. ఆ యుద్ధములో ఎందరో నరేశ్వరులు నశించిరి. దుర్యోధనుడు కూడ వధించ బడెను. పాండవులు అధికాంశ రాజ్యమును సంపాదించిరి. ఇదియే పాండవుల యొక్క పురాతన ఇతిహాసము.

ఉపరిచర - సత్యవతి - వ్యాసమహర్షి మున్నగు వారి పరిచయము

పూర్వము ఉపరిచర వసుపు దేవేంద్రుని ఆదేశానుసారము చేదిదేశమును రాజ్యముగ స్వీకరించెను. ఉపరిచరవసువు యొక్క వీర్యమును ఒక మత్స్యము మ్రింగెను. ఆ మత్స్యము జాలరుల వలలో చిక్కెను. మత్స్యగర్భమును చీల్చగా ఒక స్త్రీ శిశువు, మగ శిశువు జన్మించిరి. ఆ మత్స్యము శాపవిముక్తి చెంది అద్రికయను అప్సరసగా స్వర్గమునకు వెడలిపోయెను. జాలరులు ఆ మత్స్యము యొక్క కవల సంతానమును ఉపరిచర మహారాజునకు సమర్పించిరి. మహారాజు మగశిశువును గైకొని పెంచి పెద్దవానిని చేసి మత్స్యదేశ మహారాజుగ చేసెను. స్త్రీ శిశువుని జాలరి (దానరాజు)కి యిచ్చివేసెను. ఆమెయే మత్స్యగంధి లేక సత్యవతిగా పేరొందెను. ఒకప్పుడు ఆ మత్స్యగంధి యమునా నదిలో పడవ నడుపుచుండెను. పరాశరమహర్షి ఆమెతో సంగమించి కృష్ణద్వైపాయన మహర్షికి జన్మనిచ్చెను. ఆయన పుట్టగనే పెద్దవాడై తల్లికి నమస్కరించి తపస్సుకు వెడలిపోవుచు ఆమె స్మరించినపుడు వచ్చెదనని పలికెను. కృష్ణద్వైపాయన మహర్షి వేదమును విస్తారమొనర్చుటచే వ్యాసుడను పేర ప్రసిద్ధి చెందెను. ఆయన చతుర్వేదములను, మహాభారతమును తన శిష్యులగు సుమంతుడు, జైమిని, పైలుడు, వైశంపాయనులకు తన పుత్రుడగు శుకదేవునకు మరియు సూతుడగు రోమహర్షణునకు అధ్యాపనము గావించెను. అమిత తేజస్వియగు భీష్ముడు (శాంతనునందనుడు) ఎనిమిదవ వసువు అంశగా గంగాదేవి గర్భనందు ఉత్పన్నమయ్యెను. పూర్వము బ్రహ్మర్షియగు అణిమాండవ్యునిపై అకారణ దొంగతన నేరము మోపబడుటచే శూలదండమునకు గురిఅయ్యెను. ఆయన పరలోకమున కేగిన పిమ్మట ధర్మదేవతతో "తాను చేసిన తపస్సు పాపములన్నిటిని తొలగించునదైనను తనకు శూలదండన శిక్షవేయబడుటచే బ్రాహ్మణవధ యగునని చెప్పి ధర్మదేవతను భూలోకములో శూద్రయోనియందు జన్మించునటుల శపించెను. ఆ ధర్మదేవతయే భూలోకమున విదురునిగా జన్మించెను. గవల్గణుని వలన సంజయుడను సూతుడు జన్మించెను. ఆయన మునులకువలె ధర్మాత్ముడగు మహాజ్ఞాని అయ్యెను. కుంతీదేవి కన్యగనున్నపుడు ఆమె గర్భమునుండి సూర్యాంశచే కర్ణుడు ఉద్భవించెను. ఆయనకు పుట్టుకతోనే సహజకవచ కుండలములున్నవి. ఆ రోజులలోనే విష్ణుభగవానుడు జగత్తులోని జీవులననుగ్రహించుటకై వసుదేవుని ద్వారా దేవకి గర్భమునుండి బలరామ శ్రీకృష్ణులుగ అవతరించెను. ఒకప్పుడు భరద్వాజమహర్షి యొక్క వీర్యము ద్రోణియందు స్ఖలితమై క్రమముగా వృద్ధిచెంది ద్రోణుడై జన్మించెను. గౌతమ గోత్రజుడగు శరద్వానుని వీర్యము రెల్లుపొదలలోపడి రెండు భాగములయ్యెను. ఆ రెండింటినుండి స్త్రీ పురుష శిశువులుత్పన్నమయ్యిరి. వారిలో స్త్రీ శిశువు పేరు కృపి. ఈమెయే ద్రోణుని భార్యయై అశ్వత్థామకు జన్మనిచ్చినది. మగశిశువు మహాబలవంతుడై కృపాచార్యునిగ ప్రసిద్ధికెక్కెను. పుత్రార్థియై యజ్ఞముచేసిన ద్రుపదునకు యజ్ఞాగ్నినుండి అగ్నితేజస్సంపన్నుడగు ధృష్టద్యుమ్నుడను పుత్రుడు ద్రోణాచార్యుని వినాశమునకై ఉద్భవించెను. అదే యజ్ఞాగ్నినుండి శుభస్వరూపిణి, తేజస్వినియగు ద్రౌపది ఉద్భవించెను. ప్రహ్లాదుని శిష్యుడగు నగ్నజిత్తు సుబలుడను పేర ఉద్భవించెను. దేవతలు కోపించుటచే ఆయన సంతతి (శకుని) ధర్మహాని కలిగించువాడయ్యెను. గాంధార రాజు సుబలుని

పుత్రుడే శకుని. సుబలుని పుత్రిక గాంధారి. వీరిరువురు గొప్ప అర్థశాస్త్రవేత్తలై యుండిరి. విచిత్రవీర్యుని క్షేత్రభూత అంబిక – అంబాలిక యను వారల గర్భమునుండి కృష్ణద్వైపాయన మహర్షిద్వారా ధృతరాష్ట్రుడు, బలవంతుడగు పాండురాజు జన్మించిరి. వ్యాసమహర్షివలన ఒక శూద్ర స్త్రీ గర్భమునుండి విదురుడు జన్మించెను. ఆయన ధర్మార్థజ్ఞాన నిపుణుడు, బుద్ధిమంతుడు, మేధావి, నిష్పాపి. పాండురాజునకు ఇరువురు భార్యల గర్భమునుండి అయిదుగురు పుత్రులు గలిగిరి. వీరందరూ దేవతుల్య తేజస్వంతులు. వీరిలో జ్యేష్ఠుడగు యుధిష్ఠిరుడు ధర్మదేవత అంశతో, వాయుదేవుని అంశతో భీమసేనుడు, ఇంద్రాంశతో అర్జునుడు, అశ్వనీదేవతల అంశతో నకులసహదేవులు జన్మించిరి. ధృతరాష్ట్రునకు దుర్యోధనాది వందమంది పుత్రులు గాంధారి గర్భమునుండి జన్మించిరి. వీరుగాక వైశ్య స్త్రీ గర్భమునుండి యుయుత్సుడను పుత్రుడుకూడ జన్మించెను. కుంతీ పుత్రుడగు అర్జునుని ద్వారా సుభద్రాదేవి గర్భమునందు అభిమన్యుడు జన్మించెను. అతడే శ్రీకృష్ణుని మేనల్లుడు. పాండవులద్వారా ద్రౌపదీదేవి గర్భమునందు అయిదుగురు పుత్రులు ఉద్భవించిరి. ద్రుపద మహారాజునకు శిఖండియను పుత్రికకూడ యుండెను. ఆమె కొంతకాలమునకు పుత్రునిగా మారెను. కౌరవ మహా సంగ్రామములో యుద్ధ మొనర్చుటకై రాజులయొక్క అనేక లక్షలమంది యోధులు వచ్చిరి. ఇంతవరకు కేవలము ముఖ్యమగు రాజులగురించి మాత్రమే చెప్పబడినది. ఏలననగా వీరి చరిత్రల వలననే మహాభారత కథ విస్తృతమైనది.

మరీచ్యాది మహర్షుల – దక్షకన్యల వంశవర్ణనము, మహర్షుల – కశ్యప పత్నుల సంతాన పరంపర, దేవతలు – దైత్యుల యొక్క అంశావతారములు, శకుంతలా దుష్యంతుల ఉపాఖ్యానము. విశదముగ వర్ణించబడినవి. దుష్యంత మహారాజునకు శకుంతల గర్భమునందు పుట్టినవాడే భరతుడు. మహాత్ముడగు భరతుని రాజశాసనము అన్నిదిశల వ్యాపించెను. ఆయన గొప్ప సామ్రాట్టుగ పేరొందెను. కణ్వమహర్షి ఆచార్యత్వముతో "గోవితత"యను అశ్వమేధయాగము ననుష్ఠించి ప్రచుర దక్షిణలతో బ్రాహ్మణులను సంతృప్తిపరిచెను. ఆ సమయమున భరతుడు ఒకవేయి పద్మసువర్ణముద్రలను కణ్వమహర్షికి దక్షిణగానిచ్చి యజ్ఞఫలమును పొందెను. భరతుని పేరుతోనే యీ భూభాగమునకు భారతదేశము లేక భారతి యనుపేరుగలిగెను. ఆయన వలననే కౌరవవంశము భరతవంశమను పేర ప్రసిద్ధిచెందెను. భరతవంశ రాజులందరు భారతులని పిలువబడిరి. భరతకులములో దేవతాసమానులైన పరాక్రమవంతులు, బ్రహ్మతేజ సంపన్నులునగు చాలమంది రాజర్షులు జన్మించిరి. వారందరి పేర్లు లెక్కించి చెప్పశక్యముగాదు. వారిలో ముఖ్యులగురించి మహాభారతము ప్రస్తావించినది.

భరతవంశములో జన్మించిన ముఖ్యరాజర్షులు

దక్షప్రజాపతి – వైవస్వతమనువు – భరతుడు – కురుమహారాజు – పురూరవుడు – అజామీఢుడు – యదువు – పూరువు – కౌరవులు – భరతవంశజుల కులపరంపర మున్నగునవి మహాభారతములో విస్తారముగ వర్ణించబడెను. వీరి కులములన్నియు పరమపవిత్రమైనవి. వీరి చరిత్రలు పఠించుటచే ఆయురారోగ్య ఐశ్వర్యములు కీర్తి ప్రాప్తించును. ప్రచేతసులను మహర్షులు గొప్ప తపస్వులు. పదిమంది ప్రచేతసులు వృక్షకన్య మారిషయందు ప్రాచేతస దక్షుడను వానికి జన్మనిచ్చిరి. ఆ దక్షునినుండియే సమస్త ప్రజావర్గము ఉత్పన్నమైనవి. అందుచే అతడు ఈ జగత్తునకు పితామహునిగ పిలువబడెను. దక్షుని పుత్రికలు మహర్షుల భార్యలై ప్రజావర్గమును ప్రసాదించిరి. కశ్యపుని భార్య అదితి ద్వాదశాదిత్యులకు జన్మనిచ్చెను. వారిలో వివస్వానునకు జేష్ఠపుత్రుడగు మనువు, కనిష్ఠపుత్రుడగు యముడు జన్మించిరి. బుద్ధిమంతుడగు మనువు గొప్ప ధర్మాత్ముడు. సూర్యవంశ

ప్రతిష్ఠను పెంచెను. మానవసంబంధ మనువంశము మనువునుండియే విఖ్యాతి చెందినది. మనువు నుండియే బ్రాహ్మణక్షత్రియాది మానవులు ఉత్పన్నమయ్యిరి. అప్పటినుండియే బ్రాహ్మణకులమునకు క్షత్రియులతో సంబంధ మేర్పడినది. మనువునకు వేనుడు - ధృష్ణుడు - నరిష్యంతుడు - నాభాగుడు - ఇక్ష్వాకు - కారూషుడు - శర్యాతి - ఇలా - వృషఘ్నుడు - నాభాగారిష్టడుయను పదిమంది పుత్రులు గలిగిరి. మనువు పుత్రుడగు ఇలుడు (స్త్రీగా మారినపుడు) గర్భము నుండి పురూరవుడు జన్మించెను. పురూరవుడే గంధర్వలోకమునుండి విధిపూర్వకముగ స్థాపించిన వివిధాగ్నులను ఊర్వశితోబాటు ధరాతలమునకు గొనితెచ్చెను. ఇలాపుత్రుడగు పురూరవునకు ఊర్వశి గర్భమునుండి ఆయువు మున్నగు ఆరుగురు పుత్రులు గలిగిరి. వారిలో ఆయువునకు స్వర్భానుకుమారి గర్భమునుండి నహుషుడు మున్నగు అయిదుగురు పుత్రులు జన్మించిరి. వారిలో నహుషుడు కొంతకాలము ఇంద్రపదవి నధింష్ఠించెను. ఋషుల శాపముచే స్వర్గభ్రష్టుడయ్యెను. నహుషునకు ఆరుగురు పుత్రులుగలిగిరి. వారిలో యయాతి సత్యపరాక్రముడగు సామ్రాట్టు అయ్యెను. ఆయనకు దేవయాని - శర్మిష్ఠయను భార్యలందు అయుదుగురు పుత్రులు గలిగిరి. వారిలో పూరువునకు తండ్రి వరముతో రాజ్యము ప్రాప్తించెను. ఆయన వంశమే యీ జగత్తులో పౌరవులనుపేర విఖ్యాతిచెందిరి. యయాతి స్వర్గపతనము చెందినపుడు ఆయన దౌహిత్రులు పునరుత్థానము గల్పించిరి. కచుడు, దేవయాని, శర్మిష్ఠ, యయాతికి సంబంధించిన ఉపాఖ్యానము ద్వారా మృతసంజీవిని విద్య తదితర విషయములు తెలియపరచబడెను. యయాతి పుత్రిక మాధవి గర్భమున జన్మించిన అష్టకుడు, శిబి, ప్రతర్దనుడు, వసుమానుడు యనువారు తమ పుణ్యబలముతో మాతామహుని ఉద్ధరించిరి. నాటినుండి దౌహిత్రుడు కూడ మాతామహుని ఉద్ధరించ సమర్థుడను ధర్మశాస్త్ర వాక్యమేర్పడెను.

కురువంశమూలము - పాండవులు

భరతవంశజుల మూలపురుషుడగు భరతునకు మువ్వురు భార్యలుండిరి. ఆయనకు ఆ ముప్వురి భార్యలందును తొమ్మిదిమంది పుత్రులు గలిగిరి. ఆ శిశువులెవ్వరికి తన రూపురేఖలు లేకుండుటచే భరతుడు వారిని త్యజించెను. అందులకు కుపితులైన రాణులు ఆ శిశువులను సంహరించిరి. తదనంతరము భరతుడు పెద్దపెద్ద యజ్ఞములు చేసి భరద్వాజ మహర్షి కృపవలన భుమన్యుడను పుత్రుని పొందెను. భుమన్యునకు పుష్కరిణియను భార్యయందు సుహోత్రుడు మొదలుగా ఆరుగురు పుత్రులు గలిగిరి. వారిలో సుహోత్రుడు రాజసూయ, అశ్వమేధాది అనేక యజ్ఞములుచేసి సముద్రపర్వత భూమండలమునంతయు భోగించెను. సుహోత్రునకు ఇక్ష్వకియను భార్యయందు అజమీఢుడు - సుమీఢుడు - పురుమీఢుడు యను ముప్వురు పుత్రులు గలిగిరి. వారిలో అజమీఢునకు ధూమిని యను భార్యయందు ఋక్షకుడు, నీలియను భార్యయందు దుష్యంతుడు - వరమేష్టియను పుత్రులు, కేశినియను భార్యయందు జహ్ను - వ్రజను - రూపిణి యను పుత్రులు జన్మించిరి. వీరిలో దుష్కంతుడు, పరమేష్ఠియనువారల సంతతి పాంచాలురనబడిరి. జహ్నువంశము వారు కౌశికులని ప్రసిద్ధిచెందిరి. ఋక్షకునకు సంవరణుడు జన్మించెను. సంవరణుడు అనేక యజ్ఞములతో భగవంతుని ఆరాధించి సూర్యకన్య తపతిని వివాహమాడి కురు యను పుత్రునకు జన్మనిచ్చెను. కురుమహారాజు ధర్మజ్ఞుడగుటచే ఆయన పేరనే కురుజంఘాల దేశమను నామమేర్పడెను. కురుమహారాజు తన తపస్సుతో కురుక్షేత్రమును పవిత్రమొనర్చెను. ఈ వంశములోనే ప్రతీపుడను ప్రసిద్ధరాజు జన్మించెను. ఆయనకు దేవాపి, శాంతనుడు, మహారథి బాహ్లీకుడను పుత్రులు గలిగిరి. దేవాపి ధర్మ మార్గనిరతుడై వానప్రస్థమునకు వెడలిపోయెను. అపుడు శాంతనుడు, బాహ్లీకుడు

రాజ్యాధికారమును చేపట్టిరి. శాంతనుడు భాగీరథి గంగను పత్నిగా జేసికొని దేవవ్రతుడను పుత్రునకు జన్మనిచ్చెను. ఈయన తన తండ్రి శాంతనుడు సత్యవతిని వివాహమాడుటకు దాశరాజు నియమించిన షరతులకొరకు తాను ఆజన్మ బ్రహ్మచారిగ నుండెదనని భీషణప్రతిజ్ఞ చేయుటచే భీష్ముడనబడెను. శాంతనునకు సత్యవతియందు విచిత్రవీర్యుడు – చిత్రాంగదుడు యను ఇరువురు పుత్రులు గలిగిరి. విచిత్రవీర్యుడు సంతానమును పొందకనే మృతిచెందెను. సత్యవతి కోరికపై విచిత్రవీర్యుని భార్యయందు ధృతరాష్ట్రుడు, పాండు, విదురుడు జన్మించిరి.

భీష్ముని పూర్వ వృత్తాంతమును వివరించుటకై మహాభిషోపాఖ్యానము, శాంతనుని ఉపాఖ్యానము, భీష్ముని జననము, వసువుల శాప వృత్తాంతము, భీష్మప్రతిజ్ఞ, చిత్రాంగదుని మరణము, విచిత్రవీర్యుని వివాహము, ధృతరాష్ట్ర – పాండు – విదురుల జననము, మాండవ్యమహర్షికి శూలదండనము, మాండవ్య మహర్షి శాపముచే యమధర్మరాజు విదురునిగా జన్మించుట మున్నగు వృత్తాంతములతో మహాభారత ఉపక్రమములనెడి ఏబది అధ్యాయములు పూర్తియగును. ఈ ప్రకారము మహాభారత కథకు నాందీప్రస్తావనగానున్న నూటఎనిమిది అధ్యాయములు చెప్పబడినవి.

కథాంశము: ఆదిపర్వములో నూట తొమ్మిదవ అధ్యాయము నుండి మహాభారత కథ ప్రారంభమగును. విచిత్రవీర్యుని పుత్రుడగు ధృతరాష్ట్రుడు జన్మాంధుడగుటచే పాండురాజునకు రాజ్యాభిషేకము జరిగెను. విదురుడు శూద్రదాసి పుత్రుడగుటచే పాండురాజునకు మంత్రిగా చేయబడెను. భీష్ముడు పాండురాజ్యమునకు రక్షకునిగా నుండెను. ధృతరాష్ట్రుని వివాహము కొరకు కాశీరాజు కన్యలను స్వయంవర వేదికనుండి భీష్ముడు తెచ్చి వివాహముగావించెను. శూరసేనుని ప్రథమ సంతానమగు కుంతీదేవిని శూరసేనుడు తన మిత్రుడగు కుంతిభోజునకు పెంపుగానిచ్చెను, కుంతిభోజుని ఆతిథ్యమును గోరివచ్చిన దుర్వాసముని సేవలకై కుంతి నియమించబడెను. ఆమె సేవలకు మెచ్చి దుర్వాసముని ఏదేవతనైనా ఆహ్వానించగల మంత్రమును కుంతికి ఉపదేశించెను. ఆమె బాల్యచాపల్యముతో సూర్యదేవుని రహస్యముగా పిలిచెను. ఆయన మంత్రమహిమకు కట్టుబడి వచ్చి కుంతీదేవిని ఒప్పించి ఆమె కన్యాత్వమునకు భంగముగాకుండునటుల సమాగమముచేసెను. ఆమె తన గర్భమునుండి పుట్టిన కర్ణుని జలప్రవాహములో విడిచిపెట్టెను. ఆ శిశువు అధిరథుడను సూత దంపతులకు లభించగా వారు “వసుషేణుడు”యను నామకరణము చేసిరి. కర్ణుడు సూర్యోపాసనా తత్పరుడై బ్రాహ్మణులకు దానములనొసంగు మహత్వమును పొందెను. తదనంతరము కుంతీదేవి స్వయంవర వేదికలో పాండురాజును వరించి వివాహమాడెను. పాండురాజునకు మరొక వివాహము కూడ చేయదలంచిన భీష్ముడు మద్రదేశాధిపతి శల్యరాజు సోదరిని నిర్ణయించెను. భీష్ముడు శల్యునకు కన్యాశుల్క ధనమునిచ్చి మాద్రితో పాండురాజునకు వివాహ మొనర్చెను. అటుపిమ్మట పాండురాజు దిగ్విజయ యాత్రచేసి అనేకమంది రాజులను సామంతులుగా జేసికొని అపార ధనరాశిని దెచ్చెను. ఆ ధనమును సత్యవతికి, అంబిక అంబాలికలకు, ధృతరాష్ట్రునకు, విదురునకు సమర్పించెను. సత్యవతి తనకు యిచ్చిన ధనమును భీష్మునకు సమర్పించెను. విదురుని వివాహమునకై భీష్ముడు యోచనచేసి దేవకరాజు కుమార్తెను నిర్ణయించెను. ఆమె శూద్రజాతి స్త్రీయందు బ్రాహ్మణుని వీర్యముతో జన్మించినది. విదురునకు ఆమె గర్భమునుండి తనతో సమానులగు గుణవంతులు, వినయశీలురునగు అనేకమంది పుత్రులుద్భవించిరి.

ఒకనాడు వ్యాసమహర్షి గాంధారీ ధృతరాష్ట్రుల వద్దకువెడలెను. గాంధారీదేవి ఆ మహర్షికి చక్కని ఆతిథ్యమునిచ్చి సంతృప్తిపరచెను. తదనంతరము ఆ దంపతులు వ్యాసమహర్షిని ప్రార్థించి ధృతరాష్ట్రుని వంటి బలవంతులగు వందమంది పుత్రులు గలుగవలెనని వరము కోరుకొనిరి. వ్యాసమహర్షి "తథాస్తు"యని ఆశీర్వదించెను. పాండురాజు కోరికపై కుంతీదేవి ధర్మదేవతను ఆహ్వానించి తేజస్వంతుడగు జ్యేష్ఠపుత్రుని గనెను. ఆ విషయము నెరిగిన గాంధారి గర్భమును కొట్టుకొని జారవిడిచెను. ఆ విషయమునెరిగిన వ్యాసమహర్షి వేవేగ గాంధారి కడకేగి లోహమువలె గట్టిగానున్న మాంస పిండమును పారవేయవలదని హెచ్చరించెను. తన వరదానము మిథ్యకాదని చెప్పి చల్లటినీటిలో మాంస పిండమునుంచమనెను. అపుడా మాంసపిండము వంద ముక్కలయ్యెను. అంగుష్ఠ పరిమాణముగనున్న ఆ ముక్కలను వంద నేతికుండలలో భద్రమొనర్చమనెను. రెండు సంవత్సరముల తరువాత ఆ కుండలపైనున్న మూతలు తెరువుమని గాంధారికి చెప్పి వ్యాసమహర్షి హిమాలయములకు వెడలెను. వ్యాసమహర్షి ఒక్కొక్క మాంసపిండభాగమును ఒక్కొక్క కుండలో పెట్టించగా, గాంధారి మనస్సులోనున్న కోరికగా ఒక పిండభాగము అధికమైయుండెను. దానిని కూడ కుండలో పెట్టించెను. ఆ పిండముచే గాంధారికి దుశ్శలయను కుమార్తె ఉద్భవించెను. నేతిభాండముల వరుసలో మొదటిదైన భాండమునుండి పుట్టినవాడే ధృతరాష్ట్రుని పుత్రుడగు దుర్యోధనుడు. అతడు పుట్టినపుడే పాండుపత్ని కుంతీదేవి కూడ భీమసేనునకు జన్మనిచ్చెను. కాని దుర్యోధనుడు జన్మించినంతనే గాడిదలు ఓండ్రపెట్టినవి. గ్రద్దలు, రాబందులు, కాకులు వాని అరుపులతో కోలాహలము చేసినవి. పెద్ద తుఫాను చెలరేగినది. దిశలన్నియు మండుచున్నట్లు అగుపడెను. అందులకు ధృతరాష్ట్రుడు భీతిల్లి బ్రాహ్మణులను, ధర్మజ్ఞాతలగు భీష్మ విదురులను, ఇతరసుహృదులను, కురువంశీయులను తన చెంతకు పిలిపించి యీ అపశకునములకు కారణమేమని అడిగెను. అపుడు విదురుడు ఆ బాలుని త్యజించుటచే ఉపద్రవములు శాంతించుననియు, ఆ బాలుడు కులాంగారకుడగుననియు, నీతిశాస్త్రము ప్రకారము పూర్తిగ కులహితమును కోరినచో ఒక వ్యక్తిని, ఒక గ్రామ హితముకొరకు ఒక కులమును, దేశహితము కొరకు ఒక గ్రామమును, ఆత్మకల్యాణము కొరకు సమస్త భూమండలమును త్యజించవలెనని హితవు చెప్పెను. బ్రాహ్మణులు, తదితరులుకూడ ఆ హితవును సమర్థించిరి. కాని పుత్రస్నేహముచే ధృతరాష్ట్రుడు ఆ హితమును త్రోసిపెట్టెను. ధృతరాష్ట్రునకు వైశ్యజాతి స్త్రీయందు యుయుత్సుడను పుత్రుడు జన్మించెను. పాండురాజునకు కిందముడను ఋషి ఎందులకు శాపమునిచ్చెనో వివరముగా చెప్పబడెను. అందుచే పాండురాజు దేవతలనాహ్వానించి తనకు పుత్రేచ్ఛ దీర్చమని కుంతిని కోరెను. కుంతి కూడ భర్త ఆజ్ఞను శిరసావహించి ఆయన కోరిన విధముగ ముందుగా ధర్మరాజును, తరువాత వాయుదేవుని, పిమ్మట ఇంద్రుని ఆహ్వానించి యుదిష్ఠిర – భీమసేన – అర్జునులనెడి పుత్రులను గనెను. ఆ సందర్భమున వ్యుషితాశ్వోపాఖ్యానము చెప్పెను. తదనంతరము పుత్రలాభకాంక్షతో పాండురాజు తన ధర్మపత్నిని ఏదో అడుగజూచెను. కాని కుంతీదేవి ఆయన కోర్కె గొంతులోనే నిలిచిపోవునటుల "ఆర్యపుత్రా! ఆపత్కాలములో ముగ్గురికిమించి నాల్గవ సంతానోత్పత్తి చేయుస్త్రీ స్వైరిణిగా వ్యవహరించబడును. అయిదవ పుత్రునికూడ ఉత్పన్నమొనర్చు స్త్రీని కులటగ వ్యవహరించెదరు" అనెను. పాండురాజు ఆమె పలికినది ధర్మవచనమని సమ్మతించి మిన్నకుండెను. కాని మాద్రీదేవి తాను కూడ సంతానవతి గావలెనను అభిలాషతో కుంతీదేవి మంత్ర ప్రయోగముతో తన గర్భమునందు పుత్రులుత్పన్నమగు విధముగ పాండురాజును కోరమనెను. పాండురాజు కుంతీదేవిని ఒప్పించెను. కుంతీదేవి ఒక్కమారు మాత్రమే మంత్రప్రయోగము చేసెదనని ఏ దేవత కావలెనో

మాద్రిని కోరుకొనమనెను. మాద్రీదేవి దీర్ఘముగ ఆలోచించి అశ్వనీదేవతలనాహ్వానించెను. ఆ ప్రకారము మాద్రికి కవలలు జన్మించి నకులసహదేవులుగా పిలువబడిరి. తరువాత పాండురాజు ఒకనాడు మాద్రితో సంగమించి ప్రాణములు కోల్పోయెను. మాద్రికూడ పాండురాజు మృతదేహముతో సహగమనము చేసెను. వనవాసమునందున్న ఋషులు పాండురాజుమృతిని, ఆయనకు పుట్టిన అయిదుగురు పుత్రుల యదార్ధవృత్తాంతమును స్వయముగా హస్తినాపురము నకు పోయి ధృతరాష్ట్ర, భీష్మ, విదురులకు వినిపించిరి. అపుడు ధృతరాష్ట్రుడు విదురుని పిలిచి మాద్రీ పాండురాజులకు రాజోచిత ప్రేతకార్యములను నిర్వహించమనెను. తదనంతరము పాండుసుతులకు ఆవాసము నేర్పరిచిరి. కాని ధృతరాష్ట్రుని పుత్రులు ఈర్ష్యాద్వేషములతో పలురీతుల పాండవులను పీడించసాగిరి. ఆయా విషయములన్నియు పూర్వమే సంక్షిప్తముగా చెప్పబడినవి. అనంతరము ద్రుపద ద్రోణుల వైరము, కౌరవపాండవులను ద్రోణుడు ధనుర్విద్యాసుశిక్షితులను చేయుట, అర్జునునకు బ్రహ్మశిరాస్త్రప్రాప్తి, కర్ణునకు రాజ్యాభిషేకము, ద్రుపదునిపై ద్రోణాచార్యుని ప్రతీకారము, యుధిష్ఠిరునకు యువరాజ పట్టాభిషేకము వివరించబడినవి. ధృతరాష్ట్రునకు కణికుడు కూటనీతిని వర్ణించుట, దుర్యోధనుడు పాండవులను వారణావతమునకు పంపించు ప్రణాళికకు తండ్రిని ఒప్పించుట, అచట లక్కఇంటిలో పాండవులకు వసతినేర్పాటు చేయుట, విదురుడు గుప్తముగ సొరంగమార్గమును నిర్మింపజేయుట, లక్కగృహ దహనము, పాండవులు సొరంగ మార్గముద్వారా తప్పించుకొనుట, పాండవుల వనప్రవేశము, హిడింబాసురవధ, ఘటోత్కచ ఉత్పత్తి, ఏకచక్రనగర ప్రవేశము, బకాసురవధ, ద్రౌపదీ ధృష్టద్యుమ్నుల ఉత్పత్తి, ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతము, చిత్రరథునితో అర్జునుని యుద్ధము, తపతీ సంవరణుల ప్రేమ వివాహము, వసిష్ఠ విశ్వామిత్రుల స్పర్ధ, వసిష్ఠుని క్షమాబలము, కల్మాషపాదుని శాపోద్ధరణ, ఔర్వోపాఖ్యానము, కల్మాషపాదునికి అంగిరసీ శాపము, పాండవులు ధౌమ్యుని పురోహితునిగ వరించుట, పాండవుల పాంచాలయాత్ర, ద్రౌపదీ స్వయంవర సభావర్ణన, అర్జునుడు లక్ష్యవేధన చేయుట, భీమార్జునుల పరాక్రమము, శ్రీకృష్ణుని ఆగమనము, పంచపాండవులతో ద్రౌపది వివాహము, ద్రుపదుడు ద్రౌపది వివాహముగురించి వ్యాసమహర్షితో చర్చించుట, ద్రౌపదీ పాండవుల పూర్వజన్మ వృత్తాంతము, ధృతరాష్ట్రుడు పాండవులపై ప్రేమను కనబరచుట. పాండవులకు అర్ధరాజ్యమునిమ్మని భీష్ముడు దుర్యోధనునకు సలహానిచ్చుట, హస్తినాపురమునకు పిలువమని ద్రోణుడు చెప్పుట, భీష్మద్రోణుల వచనములను విదురుడు సమర్ధించుట, పాండవులు హస్తినాపురమునకేగి తమకొరకు ఇంద్రప్రస్థనగరమును నిర్మించుకొనుట, ద్రౌపది విషయములో పాండవులకు దేవర్షి నారదుని హితవు, సుందోపసుందుల ఉపాఖ్యానము, అర్జునుడు నియమోల్లంఘన చేయుటచే వనవాసమునకేగుట, అర్జున ఉలూపి సమాగమము, అర్జునుడు చిత్రాంగదను వివాహమాడుట, వర్గయనెడి అప్సరసకు తదితరులకు అర్జునుని ద్వారా శాపోద్ధరణము, ప్రభాసతీర్థములో శ్రీకృష్ణార్జునుల కలయిక, సుభద్రా పరిణయము, అభిమన్యుని జన్మ, శ్రీకృష్ణార్జునులు అగ్నిదేవునకు ఖాండవవన దహనమునందు సహకరించుట, మయాసురుడు – మందపాలుని పుత్రులు రక్షించబడుట, మందపాలుని పక్షిపుత్రుల అగ్నిస్తుతి – అగ్నిస్తవము, దేవేంద్రుడు శ్రీకృష్ణార్జును లకు వరములనిచ్చుటయను కథాంశములు విస్తృతముగా వర్ణించబడినవి.

దేవతాస్తుతులు

ధౌమ్యుని శిష్యుడగు ఉపమన్యువు గురుసేవా తత్పరుడై ఒకపరి గురువుయొక్క గోవులను మేపుచు తాను ఆకలిబాధను తీర్చుకొనుటకు జిల్లేడు పాలుత్రాగి అంధత్వమును పొందెను. ఒక బావిలోపడి గురువును ప్రార్థించెను.

అపుడు గురువు ఉపదేశించిన ఋగ్వేదమంత్రములతో అశ్వనీ దేవతలను స్తుతించెను. ఈ స్తోత్రము గొప్ప ఆధ్యాత్మిక తత్త్వము గలది. ఈ స్తోత్రపారాయణచే రోగ నాశనము, ఆత్మశాంతి సిద్ధించును. ఉపమన్యుకృత **అశ్వినీదేవతా స్తుతి** మూడవ అధ్యాయములో పండ్రెండు శ్లోకములుగనున్నది.

వేదుని శిష్యుడగు ఉత్తంకుడు గురుదక్షిణార్థమై పౌష్యమహారాణి కుండలములనర్థించెను. ఆమె ఉత్తంకునకు కుండలములు సమర్పించి నాగరాజు తక్షకుడు వానిని అపహరించ దలంచుచుండెనని హెచ్చరించెను. ఉత్తంకుడు సంధ్యావందనాది కార్యములు చేయుచుండగా ఒడ్డునపెట్టిన కుండలములను తక్షకుడు దొంగిలించి పారిపోయెను. ఉత్తంకుడు ఇంద్రుని అనుగ్రహముతో నాగలోకమువరకు దారిచేసుకొని 134 - 143 శ్లోకములలో నాగులను స్తుతించెను. అటులనే 144 - 149 శ్లోకములతో దేవేంద్రుని స్తుతించెను. ఈ శ్లోకమంత్రములను నిత్యము పఠించువారలకు సకలకార్యములు సిద్ధించును. నాగులవలన భయముండదు. ఇది మూడవ అధ్యాయములోనున్నది.

సుపర్ణస్తుతి: గరుత్మంతుడు జన్మించినంతనే మహాతేజస్సంపన్నుడై అగ్నిదేవుని మరిపించెను. అపుడు దేవతలు అగ్నిదేవునితోగూడి గరుత్మంతుని పరమాత్మస్వరూపముగ భావించి స్తుతించిరి. ఇది ఇరువది మూడవ అధ్యాయములో 15 - 26 శ్లోకములుగనున్నది.

అగ్నిస్తుతి : ఖాండవవన దహనసమయమున మంద పాలుడను మహర్షి తనయొక్క పక్షిగర్భజనిత పుత్రుల రక్షణకై అగ్నిదేవుని ప్రార్థించిన స్తుతి 229 అధ్యాయమునందున్నది. ఆయన అగ్నిదేవుని ఈశ్వరస్వరూపునిగ భావించి చేసిన స్తుతి నిత్యపారాయణ యోగ్యమైనది. ఈ స్తుతి 23వ శ్లోకము నుండి 34వ శ్లోకమువరకు యున్నది. దీని పారాయణముచే అగ్నిదేవుడు సర్వాభీష్టములను దీర్చును. అదేసమయమున మందపాలుని పక్షిగర్భజనిత నలుగురు పుత్రులు కూడ అగ్నిదేవుని జ్వాలలు చేరకముందే 25 శ్లోకములతో (232వ అధ్యాయము) అగ్నిదేవుని స్తుతించిరి. ఆ స్తోత్రములో మందపాలుని పుత్రులలో కనిష్ఠుడగు ద్రోణుడు బ్రహ్మతత్త్వభావముతో అగ్నిదేవుని అద్భుతముగ స్తుతించెను. ఈ స్తుతికూడ అభీష్టసిద్ధి కలిగించును.

ధర్మములు - నీతులు

దుష్యంతోపాఖ్యానములో శకుంతల చెప్పిన ధర్మవిషయము .... కన్యలకు తండ్రియే ప్రభువు. స్త్రీలు ఎన్నడూ స్వతంత్రులుగారు. కౌమారదశలో తండ్రిచే, యౌవనములో భర్తచే, వార్ధక్యములో పుత్రునిచే రక్షించబడు స్త్రీలు ఎన్నడూ స్వతంత్రముగ వ్యవహరించరాదు.

దుష్యంతుడు శకుంతలతో "దేవీ! నా మనసు నీయందు లగ్నమైనది. మానవులకు ఆత్మయె తన బంధువు, ఆత్మయె ఆశ్రయము. ఆత్మయె మిత్రుడు. ఆత్మయె తండ్రి. కనుక స్వయముగ నీవే ధర్మపూర్వకముగ ఆత్మసమర్పణ చేసికొనుటకు యోగ్యురాలవు. వరారోహా! ధర్మశాస్త్రప్రకారము బ్రాహ్మము - దైవము - ప్రజాపత్యము - అసురము - ఆర్షము - గాంధర్వము - రాక్షసము - పైశాచికమను ఎనిమిది విధములగు వివాహ పద్ధతులు యున్నవి. సాలంకృత కన్యను యోగ్యవరునకు దానము చేయుట బ్రాహ్మము. తన గృహమునందు యజ్ఞమునాచరించి ఋత్విజునకు తన కన్యను దానమిచ్చుట దైవము. వధువు - వరుడు ధర్మమునాచరించవలెనని చెప్పి కన్యను దానమిచ్చుట ప్రాజాపత్యము, వరుని నుండి ఒక గోవును - ఎద్దును శుల్కముగా గైకొని కన్యాదానము చేయుట ఆర్షము. వరునినుండి ఇతోధిక ధనమును గ్రహించి కన్యను యిచ్చుట అసురము. వధూవరులు పెద్దలప్రమేయము లేకుండగనే తమంతతాము స్వేచ్ఛగా వివాహమాడుట గాంధర్వము, కన్య నిదురపోవుచుండగ లేక ఏమరుపాటుగ

నున్నపుడు హరించుకొనిపోయి వివాహమాడుట పైశాచికము, కన్య బంధువులతో పోరుసలిపి వారి కన్యను వివాహమాడుట రాక్షసము. స్వాయంభువ మనువు అభిప్రాయము ప్రకారము యీ వివాహములలో ఉత్తరోత్తరము అధమాతి అధమములు. బ్రాహ్మణ, దైవ, ఆర్ష, ప్రాజా పత్యములు నాలుగు బ్రాహ్మణజాతికి విహితములు. ఇవియేగాక ఆసుర – గాంధర్వములు కూడ క్షత్రియోచితములు. క్షత్రియులకు రాక్షస వివాహ విధానముకూడ సమ్మతమైయున్నది. వైశ్యశూద్ర జాతులకు ఆసుర వివాహము గ్రాహ్యమై యున్నది. ఏదిఏమైననూ చివరి అయిదు వివాహములలో మూడు ధర్మసమ్మతములైననూ పైశాచిక రాక్షస వివాహములు ఎన్నడూ ఎవరికీ యోగ్యములు గావు.

దుష్యంతుడు శకుంతలను భార్యగ గుర్తించ తిరస్కరించినపుడు ఆమె దుష్యంతుని రాజసభలో పురప్రముఖులు, విద్వాంసుల సమక్షమున పలికిన ధర్మవచనములు సర్వదా స్మరించదగినవి. "మహారాజా! సత్యాసత్యములు నీ హృదయమే ఎరుగును. హృదయమును సాక్షిగ చేసికొని యదార్థమును పలుకుటచే శుభముగలుగును. పరమాత్మ అందరి హృదయములో అంతర్యామి రూపముగ విరాజిల్లియుండును. ఆ పరమాత్మ అందరుచేయు పాపపుణ్యముల నెరుగును. ధర్మమొక్కటియే హితకరము. దేహస్థితులైన దేవతలు, అంతర్యామి పరమాత్మ, సూర్యచంద్రులు, వాయ్వగ్నులు, పృథివ్యంతరిక్షములు, జలములు, దివారాత్రములు, ఉభయ సంధ్యలు, యమధర్మరాజు, హృదయము, ధర్మదేవతయనువారలు మానవులు చేయు శుభాశుభకర్మలను, ఆచారవ్యవహారములను గమనించుచునే యుందురు. హృదయస్థిత పరమాత్మ ఎవనిపై సంతుష్టుడై యుండునో అట్టివాని యొక్క పాపములను సూర్యపుత్రుడగు యమరాజు స్వయముగ నశింపజేయును.

భార్యయే గృహకార్యములు చక్కబెట్టును. సంతానవతియై వంశమును నిలుపును. భర్తను ప్రాణసమానముగ చూచుకొనును. పతివ్రతయై సేవచేయును. పురుషునకు అర్ధాంగియై ఉత్తమ మిత్రునివలె వర్తించును. ధర్మార్థకామములకు భార్యయే మూలము. సంసార సాగరమును దాటుటకు భార్యయే ప్రధానసాధనము. భార్య యున్నవాడే యజ్ఞాదికర్మలు చేయుటకు అర్హుడు. భార్యగలవాడే నిజమైన గృహస్థు. భార్యగలవాడు సుఖవంతుడై ప్రసన్నముగనుండును. అతడే లక్ష్మీప్రసన్నుడై బ్రహ్మచారులకు, వానప్రస్థులకు, అతిథులకు, అభ్యాగతులకు, బంధుజన సేవకజనులకు ఆధారభూతుడగును. ఏకాంతములో మక్కువతో ప్రియభాషణము చేయు మిత్రస్వరూపము భార్యయే గదా. ధర్మకార్యములందు తండ్రివలె భర్తకు హితముగూర్చునదియు, దుఃఖాతురుడైన భర్తను తల్లివలె ఓదార్చునదియు భార్యయేగదా. భార్య తోడుగనున్నచో పురుషుడు ఘోరారణ్యములందున్నను బహువిశ్రాంతి పొందగలుగును. లోకవ్యవహారములందు సైతము జనులు పత్నీసమేతుడైన వానినే విశ్వసించుదురు. కనుక ఏ పురుషునకైననూ భార్యయే శ్రేష్ఠమైన గతి. భర్తను నిత్యము అనుసరించునది భార్యయే. తాను ముందుగ మరణించినను భర్తరాకకై పరలోకమునందు వేచియుండును. ఆత్మయే ఆత్మస్వరూప సంతానమై భార్య నుండి ఉత్పన్న మగుచున్నదని పండితులనుచున్నారు. అత్మ స్వరూపుడైన తన పుత్రునకు తల్లియైన భార్యను, తల్లివలె భర్తకూడ గౌరవించవలెను. చతుష్పాద పశువులలో గోవు, ద్విపాద మనుజులలో బ్రాహ్మణులు, గౌరవించి పూజించదగినవారిలో గురువు, స్పర్శానందము పొందదగినవారిలో పుత్రులు శ్రేష్ఠులు.

– యయాతి చరిత్ర (75 వ అధ్యాయము)లో యయాతి పాడిన గీత యిటులున్నది. విషయభోగేచ్ఛ విషయములను భోగించుటచే ఎన్నడూ శాంతించదు. అజ్యాహుతులు వేయుచున్నకొలది అధికముగ ప్రజ్వలించు అగ్నివలె విషయభోగ తృష్ణ భోగించిన కొలది పెరుగుచునేయుండును. రత్నభరితమైన పృథివిని, సంసారమునందున్న

సమస్త భోగసంపదలను, పశువులను, సుందర స్త్రీలను ఒక పురుషునకు లభింపచేసిననూ అతని తృష్ణ తీరదు. ఈ సత్యము నెరిగి భోగేచ్ఛను అణుచుకొని శాంతించుటయే శ్రేయస్కరము. మానవుడు మనోవాక్కాయ కర్మలతో ఏ ప్రాణియందును దుష్ట భావమును జూపక యున్నపుడే బ్రహ్మప్రాప్తియగును. సర్వత్రా పరబ్రహ్మమునే దర్శించువాడు (అద్వైతభావన) ఎవరికీ భయపడడు. అటులనే ఆ వ్యక్తిని జూచి ఏ ప్రాణియు ప్రాణభీతి చెందదు. అతడు దేనినీ వాంఛించక, ఎవరినీ ద్వేషించనపుడు తప్పక పరబ్రహ్మప్రాప్తిని పొందును.

కచోపాఖ్యానములో (70వ అధ్యాయము) కచుడు శుక్రాచార్యునివద్ద పలికిన ధర్మవచనము లిటులున్నవి. "గురుద్రోహము తలబెట్టకుండుటయే శిష్యుని ధర్మము. గురువునుండి విద్యలను గ్రహించినవాడు గురువును నిరాదరించినచో ప్రతిష్ఠా రహితుడగును. పాపపూర్ణ నరకగతులు పొందును" అనెను.

శుక్రాచార్యుడు శిష్యుని భస్మమునుకూడ మదిరాపాన మత్తులో తెలియక మ్రింగివేసెను. తదనంతరము ఆ విషయమును కూలంకషముగా ఆలోచించి "నేటినుండి యీ జగత్తులో మందబుద్ధి బ్రాహ్మణుడు అజ్ఞానముతోనైననూ మదిరాపానము చేసినచో ధర్మభ్రష్టుడై, బ్రహ్మహత్యాపాతకము చేసినటుల ఇహపరలోకములందు నిందితుడగును. ధర్మశాస్త్రములలో నేనిపుడు చేసిన శాసనము సమస్త లోకములలో పాటించబడుగాక"అని ఘోషించెను.

శుక్రాచార్యుడు – దేవయానికి జరిగిన సంభాషణలో ధర్మవచన ప్రస్తావన యిటులున్నది. తన గురించి శర్మిష్ఠ పలికిన నిష్ఠురవచనములకు దేవయాని బాధపడుచుండుట గమనించి "పుత్రీ! నేను స్తుతిపాఠములు చేయువాడను, భిక్షువును గాను. నిర్ద్వంద్వము – అచింత్యమునగు బ్రహ్మమే నా ఐశ్వర్యము, బ్రహ్మదేవుడు నా తపస్సుకు సంతుష్టుడై యీ భూలోకములో, దేవలోకములో, సమస్త ప్రాణులలో నున్న సంపదలన్నిటికి సర్వదా నేను ప్రభువునై యుండునటుల వరమునిచ్చెను. ప్రాణుల హితముకొరకు నేనే వర్షములు కురిపించుదును. సమస్త ఓషధులకు నేనే పోషకుడను. యీ సత్యము శర్మిష్ఠ తండ్రికికూడ తెలుసును" అనెను. దేవయాని శర్మిష్ఠపై క్రోధాగ్నితో రగిలిపోవుట చూచి శుక్రాచార్యులవారు యిటుల ఓదార్చసాగిరి. "పుత్రీ! నేను ద్వంద్వ రహితమగు ఆత్మవిద్యాసంపన్నుడను. పరమైశ్వర్యమే దాని ఫలము. కనుక నాలో దైన్యము, శఠము, కుటిలత, అధర్మవర్తనము మచ్చుకైననూ యుండవు. ఏ మనుజుడు ఇతరుల పరుషనిందావచనములను సహించియుండునో అతడు యీ జగత్తును జయించినటులగును. క్రోధమును వశమునందుంచుకొనువాడే సత్పురుషుడు. క్షమాభావముతో మనస్సునందే క్రోధమును తొలగించుకొనువాడు జగత్సర్వమును జయించును. పాము కుబుసమును విడిచిపోవునటుల పెల్లుబుకుచున్న క్రోధమును క్షమాభావముతో త్యాగమొనర్చువాడే శ్రేష్ఠపురుషుడు. క్రోధమును జయించినవాడే చతుర్విధ పురుషార్థములను పొందుటకు పాత్రుడగును. వందసంవత్సరములు ప్రతి మాసమునందు పితృయజ్ఞములు చేసి పుణ్యము సంపాదించిన వానికన్న ఎవరిపైనను క్రోధము చూపించనివాడే శ్రేష్ఠుడనబడును. కోపిష్టివాని యజ్ఞాచరణములు, దానములు, తపస్సు నిష్ఫలములగును. క్రోధవశుడు తపస్సు చేయజాలడు. పవిత్రుడు కాజాలడు. వానికి యజ్ఞములాచరించుట అసంభవమగును. కర్మరహస్యముల పరమార్థము కూడ తెలియకుండును. క్రోధస్వభావమున్నవానిని పుత్రులు, భృత్యులు, సుహృదులు, మిత్రులు, భార్య మున్నగువారు విడిచిపోవుదురు. కటువచనములనెడి తీక్షణ బాణములతో గాయపడినవారు రేయింబవళ్ళు శోకమగ్నులగుదురు. కటువచనము క్షణక్షణము బాధించుచునే యుండును. కావున ఇతరులపై వాగ్బాణములను విజ్ఞులెవ్వరూ ప్రయోగించరాదు. పరుషవచనముచే గాయపడిన హృదయము ఎన్నటికీ కుదుటపడదు.

ఇంద్ర – యయాతి సంవాదము (87 వ అధ్యాయము) నందు యయాతి మహారాజు తన పుత్రులకు ఏ ఉపదేశముచేసెనో ఇంద్రునకు యిటుల చెప్పెను. "మానవుడు దీనత్వమును, శఠమును, కోపమును జూపరాదు. కుటిలత, మాత్సర్యం, వైరము కూడదు. మాతాపితరులను, విద్వాంసులను, తపస్వులను, క్షమాశీలురగు పురుషులను ఎన్నడూ అవమానించవలదు. శక్తిమంతుడు ఎల్లవేళలా క్షమాగుణమును ప్రదర్శించవలెను. శక్తిహీనుడు సదా క్రోధమును త్యజించవలెను. దుష్టులు సాధుపురుషులను, దుర్బలురు బలవంతులను, కురూపులు రూపవంతులను, నిర్ధనులు ధనవంతులను, అకర్మణ్యులు కర్మనిష్ఠులను, అధార్మికులు ధర్మాత్ములను ద్వేషించుదురు. ఈ విధముగ గుణహీనులు గుణవంతులను ద్వేషించుట కలియొక్క లక్షణము. కోపిష్టివానికన్న సహనశీలుడే ఉత్తముడు. మాన్యులలో విద్వాంసుడు ఉత్తముడు. పరుషములాడినవానికి ప్రతిగా నిందావాక్యములు పలుకకున్నచో నిందలొనర్చినవానిని వాని దుర్భాషలే భస్మమొనర్చును. అంతేగాక పరుషములాడినవాని పుణ్యమునంతయు నిందలుభరించినవాడు స్వంతమొనర్చుకొనును. క్రోధావేశముతో ఎవని మనస్సునైనను నొప్పించు విధముగ పరుషము లాడరాదు. అనుచితరీతితో శత్రువును వశమొనర్చుకొను ఉపాయము నెన్నుకొనరాదు. ఎవని స్వభావము కఠోరమో, ఎవడు ఇతరుల మర్మస్థానములను పరుషవాక్కులతో గాయమొనర్చునో అతడు తప్పక దరిద్రుడేయగును. కటుభాషి నోటిలో దెయ్యము నివసించును. కావున కటుభాషణము, పరుషవాక్కు, కఠోరవచనములు సర్వదా విడువవలెను. సాధుపురుషులను గౌరవించి సత్కరించువానికి సర్వదా వారి రక్షణ అండగా నుండును. దుష్టుల అనుచిత దురుక్తులను సర్వదా సహించి మిన్నకుండుటయే ఉత్తమ ధర్మము. శ్రేష్ఠపురుష సదాచారము నాచరించుచు, సాధుపురుషులవలె వ్యవహరించుటయే జీవితకర్తవ్యముగ నెంచవలెను. సమస్త ప్రాణులయెడ దయ – మైత్రీభావములను జూపుచు శక్తికొలది దానములుచేయవలెను. అందరితో మధురసంభాషణ చేయుటకన్న మించిన వశీకరణవిద్య ముల్లోకములందును లేదు. ఇతరులకు దానము చేయమనియు, ఎవరివద్దను ఏదియు యాచించవలదనియు ఉపదేశించితిని".

అష్టక – యయాతి సంవాదములో (89 – 91 అధ్యాయము) మరికొన్ని ధర్మ విషయములు అష్టకుని ప్రశ్నలకు సమాధానముగ యయాతి యిటులచెప్పెను. ద్విజులందు విద్య – తపస్సు – వయస్సులను బట్టి పెద్దతనము నాపాదించుదురు. వారినే పూజనీయులుగ పరిగణించెదరు. ధీర పురుషులు ప్రారబ్ధమే ప్రబలమను సత్యము నెరిగి సుఖదుఃఖములు సంభవించినపుడు వికారమును చెందరాదు. అరణ్యములో నివసించునపుడు ఎవనికి గ్రామవిషయముల స్మరణలేకుండునో, గ్రామము నందున్నపుడు ఎవనికి వనవాస ఒంటరి జీవితము మరపురాకుండునో వాడే మునియనబడును.

శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక చిత్సుఖానంద వచన సుధా సహితము)

సభాపర్వము

సంపుటి : 2

ఓం మిత్రాయనమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

సభాపర్వము - సంగ్రహపరిచయము

మహాభారత గ్రంథము నందలి రెండవ పర్వముగా నున్న సభాపర్వమునందు ఎనుబదైదు అధ్యాయములు, రెండు వేల అయిదువందల పదునొకండు శ్లోకములున్నవని, ఆదిపర్వములోని పర్వసంగ్రహ అధ్యాయము నందు చెప్పబడినది. అధ్యాయములందు, శ్లోకములందు ఏర్పడిన భేదము పరిష్కర్తల సానుకూలత వలన, అధికాధిక శ్లోకములు యితర ప్రాంతములందు లభ్యమగు ప్రతులందుండుట వలన సంభవించినది. ఈ పర్వములో సభాక్రియ, లోకపాల సభాఖ్యాన, రాజసూయారంభ, జరాసంధ వధ, దిగ్విజయ, అర్ఘ్యాభిహరణ, శిశుపాలవధ, ద్యూత మున్నగు ఉపపర్వములున్నవి.

కథాంశము

ఖాండవవన దహనానంతరము మయాసురుడు శ్రీకృష్ణుని చెంతనే ఆసీనుడై యున్న అర్జునుని కడకేగి చేతులు జోడించి అగ్నిదేవుని భీకర జ్వాలలనుండి రక్షించినందులకు ప్రత్యుపకారముగ ఏ సేవ చేయవలెనో ఆదేశించమనెను. అపుడు శ్రీకృష్ణుని అజ్ఞానుసారము యుధిష్ఠిరుని కొరకు పదివేలు చేతుల పొడవు - వెడల్పుగల భూమియందు సభానిర్మాణము చేయమనెను. మయాసురుడు తాను నిర్మించబోవు సభాభవనములో దేవాసుర మనుష్యుల శిల్పనైపుణ్యమునంతయు ప్రస్ఫుట మొనర్చదలంచెను. సూర్యాగ్ని చంద్ర ప్రకాశమానమై మనోహర ఆకారములో సభ నిర్మించబడెను. అది ఆకాశములో మేఘములను తాకుచు సర్వోన్నతమై అలౌకిక తేజముతో విరాజిల్లుచున్నది. ఆ రమణీయసభ ఉత్తమోత్తమ ద్రవ్యములతో నిర్మితమై పాపతాప నాశకరముగ ఉన్నది. ఆ సభాభవనము నందలి కుడ్యములు, పైకప్పులు రత్నమయములై యున్నవి., గోడలపై అద్భుత చిత్రములు లిఖించబడి యున్నవి. మయాసురుని ఆజ్ఞానుసారము ఎనిమిది వేలమంది రాక్షస కింకరులు ఆ సభను రక్షించుచుండిరి. ఒకనాడు దేవర్షి నారదుడు యుధిష్ఠిరుని సభకేతెంచి ధర్మార్థ కుశలముల నడుగుచు అనేక రాజోచిత ధర్మములనుపదేశించెను. ఆయన ఉపదేశములను స్వీకరించిన యుధిష్ఠిరుడు శ్రద్ధాభక్తులతో దేవర్షినారదుని పూజించిన పిమ్మట "మునివరా! బ్రహ్మదేవుడు నిర్మించిన లోకాలోకములన్నిట మీరు అనేక సభామందిరములను దర్శించి యుందురు. వాని స్వరూప స్వభావము లెటులున్నవో తెలుసుకొనవలెనను ఉత్సుకతగా నున్నది" అనెను. అందుకు దేవర్షి మణిరత్నములతో నిర్మించబడిన మయసభ మనుష్యలోకములో ఎచటనూ కానరాదని శ్లాఘించెను. తదనంతరము యమ - వరుణ - కుబేర - ఇంద్ర - బ్రహ్మసభల వైభవమును, మహాత్మ్యమును వర్ణించెను. అటులనే దేవలోకమునందున్న పాండురాజు పంపించిన సందేశమును యుధిష్ఠిరునకు వినిపించెను. "యుధిష్ఠిరుడు రాజసూయయాగమును చేసినచో హరిశ్చంద్రునివలె తాను కూడా దీర్ఘకాలము ఇంద్రసభలో ఆనందమును భోగించెదనను ఇచ్ఛను వ్యక్తపరచెను". దేవర్షి ద్వారా పాండురాజు సందేశము నాలకించిన యుధిష్ఠిరుడు రాజసూయయాగము చేయు విషయమై తమ్ములతో, శ్రీకృష్ణునితో సంప్రదింపులు జరిపెను. అపుడు శ్రీకృష్ణుడు "యుధిష్ఠిరా! జగత్తులో జరాసంధుడు యిపుడు ప్రబలుడై పురూరవ, ఇక్ష్వాకు వంశజ క్షత్రియుల రాజ్యలక్ష్మిని వశమొనర్చుకొని సామ్రాట్టుగా వెలుగొందుచున్నాడు. ప్రతాపవంతుడగు శిశుపాలుడు అన్ని విధముల జరాసంధుని ఆశ్రయించి ఆయన ప్రధాన సేనాపతిగ వ్యవహరించుచున్నాడు. ఆయనకు మద్దతుగా అనేకమంది బలవంతులగు రాజులున్నారు. యుధిష్ఠిరా! నీవు సమ్రాట్ గుణయుక్తుడవైననూ మహాబలి జరాసంధుడు బ్రతికియుండగా రాజసూయ యాగమును పూర్తి చేయజాలవు. ఆయన గొప్ప గొప్ప రాజులందరిని గెలిచి పర్వత ప్రాంతములందున్న రాజులను సైతము గిరివ్రజమునందు బందీలుగా నుంచినాడు. కనుక జరాసంధుని జయించు ఆలోచన చేయుము" అనెను. తదనంతరము శ్రీకృష్ణ భీమార్జునులు ముగ్గురు కలిసి గిరవ్రజనగరమున కేగి తమలో ఒకరితో మల్లయుద్ధము

చేయమని కోరిరి. జరాసంధుడు భీమసేనునితో పోరాడి హతుడయ్యెను. అటుపిమ్మట భీమార్జున నకుల సహదేవులు నలుదిశలకు పోయి భూపాలురెల్లరిని జయించి అపార ధనరాశిని గొని తెచ్చి యుధిష్ఠిరునకు సమర్పించిరి. రాజసూయయాగ సందర్భమున యుధిష్ఠిరుడు ఆహూతులైన రాజ మహారాజు లెల్లరిలో శ్రీకృష్ణుని సర్వోత్కృష్ట పురుషోత్తమునిగ ఎన్నుకొని అగ్రపూజ యొనర్చెను. శ్రీకృష్ణ ద్వేషియగు శిశుపాలుడు ఆ సమయమున అనేక నిందావచనములు పలికి యుధిష్ఠిరుని అగ్రపూజను గర్హించెను. భీష్మాదులు శిశుపాలుని నిలువరించ ప్రయత్నించగా వారిని కూడ అతడు చులకన చేసి ధిక్కరించెను. శ్రీకృష్ణుడు శిశుపాలుని వందకు మించిన అపరాధములను స్మరించి సుదర్శన చక్రముతో వధించెను. తదనంతరము దుర్యోధనుడు మయసభను దర్శించి భ్రమతో మడుగులో పడి భీమసేనుడు నవ్వినందులకు పరాభవము చెంది తన మనఃతాపమును మేనమామ శకునికి చెప్పుకొనెను. శకుని రచించన ప్రణాళిక ప్రకారము ద్యూత క్రీడకై సభా నిర్మాణము గావించెను. ధృతరాష్ట్రుని అనుమతితో యుధిష్ఠిరుని ద్యూతక్రీడకు ఆహ్వానించెను. యుధిష్ఠిరుడు ద్యూతక్రీడ వలదనుచున్ననూ శకుని కవ్వింపు మాటలతో బలవంతంగా ద్యూతక్రీడకు కట్టుబడి చేసెను. మాయాజూదముతో యుధిష్ఠిరుని సర్వస్వమును ద్రౌపదితో గూడి అన్నదమ్ములు నలుగురిని గెలిచి దుర్యోధనుని వశముగావించెను. అపుడు ద్రౌపదిని దుశ్శాసనుని ద్వారా నిండుసభలోనికి దెచ్చి వివస్త్రను చేసి దుర్యోధనుడు పరాభవించ నెంచెను. కాని ఆమె భక్తిమీర తన మదిలో శ్రీకృష్ణుని భజించగా ఆమె మానము కాపాడబడెను. దుర్యోధనాదులు చేసిన దుష్టచేష్టలను విదురాదులు విమర్శించగా ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరముల నొసంగెను. అపుడు ద్రౌపది తన భర్తలకు తనకు దాసత్వమునుండి విముక్తి కలిగించమని కోరెను. ధృతరాష్ట్రుడు ఆ వరమునే గాక పాండవుల ధనమును, రాజ్యమును కూడ తిరిగి యిచ్చి వారిని వెడలి నంపెను. కాని దుర్యోధనుడు మరల ధృతరాష్ట్రుని ఒప్పించి రెండవసారి ద్యూతక్రీడకు యుధిష్ఠిరుని ఆహ్వానించెను. యుధిష్ఠిరుడు కాదనలేక ద్యూతములో ఒకే ఒక పందెమును ఒడ్డి శకుని మాయా పాచికల ప్రభావముతో ఓడిపోయెను. ఆ పందెము ప్రకారము పండ్రెండ్ల ఏండ్ల వనవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేయుటకు కట్టుబడి పాండవులు తమ పత్ని ద్రౌపదితో గూడి వనాంతరములోనికి వెడలిరి.

శ్రీవేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

వన పర్వము (పూర్వ) - 3









నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥



రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

వన పర్వము (పూర్వ భాగము) - సంగ్రహ పరిచయము

మహాభారత రెండవ అధ్యాయ పర్వసంగ్రహము ప్రకారము వనపర్వము రెండువందల ఆరువది తొమ్మిది అధ్యాయములతో పదునొకండువేల ఆరువందల అరువది నాలుగు శ్లోకములతో అలరారుచున్నది. ఈ పూర్వ భాగము నూట అరువదైదు అధ్యాయములతో నున్నది.

కథాంశము -

ద్యూతములో పరాజితులైన కుంతీకుమారులు హస్తినాపుర వర్ధమాన ద్వారమును దాటి శస్త్రధారులై ద్రౌపదితో గూడి ఉత్తరదిశగా వనవాసయాత్ర నారంభించిరి. పాండవుల వనవాసయానము నెరిగిన హస్తినాపుర ప్రజలు కొందరు శోకపీడితులై భీష్మ-విదుర-ద్రోణ-కృపాచార్యాది పెద్దలను పదేపదే తప్పుబట్టి నిందించుచు పరస్పరము సంభాషించుకొని పాండవుల చెంతకేగి చేతులెత్తి నమస్కరించి తాము కూడ పాండవులతోబాటు వనవాసమునకు సంసిద్ధమనిరి. "సాధుసత్పురుష సంగముతో ధర్మప్రాప్తి దినదిన ప్రవర్ధమానమగును. అందుచే మానవులు విద్వాంసులతోను, వృద్ధులతోను, ఉత్తమ స్వభావ సంపన్నులగు శాంతి పరాయణులలోను, తపస్వులతోను, సత్పురుషులతోను సత్సంగమును చేయవలెను. విద్య-జాతి-కర్మలను మూడింటితోను ఉజ్జ్వలురై ప్రకాశించువారిని సేవించవలెను. అట్టి మహాపురుషుల చెంతకూర్చుని వారి ప్రవచనములను వినుట శాస్త్ర స్వాధ్యాయము కన్న శ్రేష్ఠమైనది. దుర్యోధనాది పాపాత్ములను సేవించుటచే మేము కూడ పాపభాగులమయ్యెదము" అనిరి. కాని యుధిష్ఠిరుడు తమ మాత కుంతీదేవి, సమస్త అత్మీయ బంధుగణము హస్తినాపురమునందే యుండిరి కనుక మీరందరు వారిని రక్షించి మా వనవాసానంతరము మాకు అప్పగించుడని వారిని వెడలనంపెను. పాండవులు ప్రమాణకోటి తీర్థములో ఆ రాత్రికి విశ్రమించిరి. పాండవులను అనుసరించిన బ్రాహ్మణులలో కొందరు అగ్నిహోత్రులు-వేదస్వాధ్యాయపరులు యుండిరి. వారు యుధిష్ఠిరుని ఆశ్వాసన జేయుచు ఆ రాత్రియంతయు మనోరంజితముగావించిరి. మరునాడు యుధిష్ఠిరుడు ఆ బ్రాహ్మణశ్రేష్ఠులను కూడ హస్తినాపురమునకు మరలిపొమ్మని ప్రార్థించెను. ఆ సమయమున ఆధ్యాత్మిక విషయ విశారదుడు, పరమాత్మ చింతనా తత్పరుడు, కర్మయోగ-సాంఖ్య-యోగనిష్ఠ విచారణా ప్రవీణుడునగు శౌనకుడను బ్రాహ్మణవిద్వాంసుడు "రాజా! శోకమునకు వేలకొలది, భయమునకు వందలకొలది స్థానములున్నవి. అవి మూఢులపై తమ ప్రభావమును జూపును. కాని నీవంటి జ్ఞానులమై వాని ప్రభావముండదు. అష్టాంగ యోగము సమస్త అమంగళములను నాశన మొనర్చును. శ్రుతిస్మృతి స్వాధ్యాయములతో దృఢపడు ఉత్తమబుద్ధి కూడ శ్రేష్ఠమైనది. ఈ రెండును నీలో ప్రతిష్ఠితమైయున్నవి. నీవంటి జ్ఞానులు శారీరక మానసిక దుఃఖములకు లోనుగాకుందురు. అంతః కరణమునెటుల స్థిరముగా నుంచుకొనవలెనో జనకమహారాజు రెండు శ్లోకములలో చెప్పెను. జగత్తు సర్వము శారీరిక-మానసిక దుఃఖములతో పీడితమైయున్నది. ఆ రెండు విధములగు దుః ఖములను శాంతింపచేయు విధానమును సంక్షేపముగ - విస్తారణగ చెప్పెదను వినుము. ఆ తత్త్వమును యుధిష్ఠిరునకు ఉపదేశించిన శౌనకుడు తపస్సుతో యోగసిద్ధిని పొంది బ్రాహ్మణుల భరణ పోషణ కూడ

చేయమనెను. అపుడు యుధిష్ఠిరుడు సూర్యదేవుని ఉపాసన చేసి అక్షయపాత్రను పొందెను. ఆ పాత్రమహిమ వలన పండ్రెండు సంవత్సరముల పర్యంతము ప్రతిరోజు ద్రౌపది భుజించక వడ్డించుచున్నంతవరకు ఫలమూలాదులు, భోజన యోగ్య అన్య పదార్థములు, శాకాదులు, భక్ష్య-భోజ్య-లేహ్య-చోష్యమను చతుర్విధ పదార్థములు అక్షయముగ లభించును. ద్రౌపది భుజించిన తరువాత ఆ పాత్రమహిమ ఆ దినమునకు సమాప్తమగును. యుధిష్ఠిరుడు ఆ పాత్ర ద్వారా నియతపూర్వకముగ బ్రాహ్మణులకు నిత్యము అన్నదానము నొనర్చసాగెను. ధృతరాష్ట్రుడు తనకు హితకర కర్తవ్యమేదియో చెప్పమని విదురుని అడిగెను. అపుడాయన యుధిష్ఠిరుని సాంత్వన వచనములతో సన్మానపపూర్వకముగ మరల రాజ్యముపై ప్రతిష్ఠితుని చేయమనెను. ధృతరాష్ట్రుడు అందుకు రుసరుసలాడి విదురుని పాండవ పక్షపాతివని నిందించి తక్షణమే తన రాజసభ నుండి వెడలిపొమ్మనెను. విదురుడు కామ్యక వనమును చేరి పాండవులతో "యుధిష్ఠిరా! ఎవడు శత్రువుల ద్వారా దుస్సహ కష్టములపాలైననూ క్షమాభావము వహించి అనుకూల పరిస్థితికొరకు ప్రతీక్షించునో, ఎటులకొద్దిపాటి నిప్పురవ్వతో గడ్డిగాదరను చక్కగా ప్రజ్వలింపజేసి పెద్ద మంటగా చేయవచ్చునో, అదే ప్రకారము ఎవడు తన మనస్సును వశమునందుంచుకొని స్వశక్తిని-సహాయకులను పెంచుకొనునో, అతడే ఒంటరిగా యీ జగత్తునంతటిని భోగించ సమర్థుడగును. ఎవని ధనము తన సహాయకులకు కూడ అవసర సమయములందు వెచ్చింపబడునో, అట్టి సహాయకులతనికి కష్టములందు ఆదుకొని కష్టములను పంచుకొందురు. సహాయకులను సంగ్రహించు కొనుటకు యిదియే గొప్ప ఉపాయమని విదురుడు చెప్పెను. ఎల్లపుడు సత్యమును పలుకవలెను. బంధువుల సమక్షమున తన మానమర్యాదలు, సత్కారపూజలను ఎన్నడూ చెప్పుకొనరాదు. అటువంటివారే ఉన్నతిని సాధించెదరు" అనెను. తదనంతరము కొద్ది సమయమునకు ధృతరాష్ట్ర మహారాజు పశ్చాత్తాపము చెంది సంజయుని పంపించి విదురుని క్షమను ప్రార్థించి మరల వెనుకకు పిలిపించెను. పాండవుల వధకై దుర్యోధనుడు ప్రణాళిక వేసెనని తెలుసుకున్న వ్యాస మహర్షి ఆ కార్యమును నిరసించి తగిన హితవు చెప్పమని భీష్మ ద్రోణ కృపాచార్యాది పెద్దలకు చెప్పెను. అపుడే వచ్చిన మైత్రేయ మహర్షిని కూడ హితవు చెప్పమని ధృతరాష్ట్రుని మాటగా వ్యాస మహర్షి పలికెను. మైత్రేయ మహర్షి హితవు చెప్పుచుండగా దుర్యోధనుడు వెకిలిగ నవ్వుచు ఏనుగు తొండము వంటి తన తొడను చేతితో చరుచుకొనుచు పాదముతో నేలపై రాయుచుండెను. దుర్యోధనుడు తన చేష్టలచో నిస్సాకారము చేయుచుండెనని గ్రహించిన మైత్రేయ మహర్షి క్రోధవశుడై కౌరవపాండవ మహా సంగ్రామములో భీమసేనుని గదాఘాతముతో తొడలు విరుగునటుల శపించెను. ఆ సందర్భములో భీమసేనుని బలవిశేషము తెలుసుకొనదలంచిన ధృతరాష్ట్రునకు మైత్రేయ మహర్షి కిమ్మీరవధను గురించి వివరించెను. పాండవులు వనవాసమున కేగిరని తెలిసిన శ్రీకృష్ణభగవానుడు కామ్యక వనమునకు వెడలి వారిని కలిసెను. శ్రీకృష్ణుడు విషాదగ్రస్తుడైయున్న యుధిష్ఠిరునకు సాంత్వన గూర్చుచు దురాత్ములగు దుర్యోధన-దుశ్శాసన - శకుని-కర్ణుల రక్తమును పృథివి త్రాగునటుల చేయుదమని తనతో వచ్చిన అన్యనరేశ్వరులను ప్రోత్సహించెను. కాని అర్జునుడు సత్యకీర్తియగు శ్రీకృష్ణుని మహిమనుగానము చేసి శాంతింపజేసెను. ధృష్టద్యుమ్నాది తన అన్నదమ్ములలో పరివేష్టితుడైన శరణాగతవత్సలుడగు శ్రీకృష్ణుని

చెంతకేగిన ద్రౌపది తనకు నిండుసభలో కౌరవులుచేసిన పరాభవమును చెప్పుకొని భోరున విలపించెను. అప్పుడు శ్రీకృష్ణభగవానుడు పాండవుల హితము కొరకు సంభవమైనంతవరకు సమస్తము చేయుదునని పలికి ఆమెను ఓదార్చెను. శ్రీకృష్ణుడు ద్యూత దోషములను అచటనున్న సరేశ్వరులందరికి వినిపించెను. కౌరవపాండవులు ద్యూతమాడు సమయములో శ్రీకృష్ణుడున్నచో యిట్టి పరిణామము సంభవించెడిది గాదని చెప్పెను. ఆ సమయమున తాను శాళ్వునితో యుద్ధము చేయుచుంటినని శ్రీకృష్ణుడు చెప్పి తద్విషయమును సవివరముగ యుధిష్ఠిరునకు చెప్పెను. శాళ్వుని వధ వృత్తాంతము నాలపించిన పిమ్మట శ్రీకృష్ణాదులు తమతమ నెలవులకేగిరి. పాండవులు ద్వైతవనయానము చేసిరి. అపుడు పాండవులు క్రోధము-తేజస్సు-క్షమ గురించి విభిన్న అభిప్రాయములు వ్యక్తమొనర్చిరి. యుధిష్ఠిరుని మనస్సు వికలమై వ్యధపొందుచుండగా వ్యాసమహర్షి ప్రత్యక్షమై ప్రతిస్మృతి విద్యనుపదేశించెను. ఆ విద్యను అవసర సమయములో అర్జునునకు ఉపదేశించ మనెను. ఆ విద్యనెరిగిన వారికి సమస్త కార్యములలో కార్యసిద్ధి ప్రాప్తించును. కనుక అర్జునుడు దివ్యాస్త్రములు సంపాదించుటకొరకు ఇంద్ర - రుద్ర - వరుణ - కుబేర - యమధర్మరాజు వద్దకు పోదలంచెను. అందుచే తపస్సు - పరాక్రమములతో దేవతలను ప్రత్యక్షమొనర్చుకొను సమర్థుడగుటకు ఆ ప్రతిస్మృతి అవసరమగును.

అర్జునుడు యధా సమయమున యుధిష్ఠిరుని వద్ద ప్రతిస్మృతి విద్యను గ్రహించెను. ఉగ్రతపస్సు చేయుటకు ఉత్తరదిశా మార్గమున పయనించెను. వృత్రాసుర వధ సమయమున దేవతలు తమతమ దివ్యాస్త్రముల జ్ఞానమును ఇంద్రుని పరము చేసిరి. ఆ దివ్యాస్త్రముల జ్ఞానమును పొందుటకు అర్జునుడు ఇంద్రుని శరణుపొందుటకు బయలుదేరెను. అర్జునుని ఉగ్రతపస్సుని గురించి ఋషులు శివమహాదేవునితో ప్రస్తావించిరి. శివమహాదేవుడు అర్జునుని శక్తి పరీక్షించుటకు కిరాత వేషధారియై ఒక సూకరమును వేటాడు నెపముతో అర్జునునితో విభేదించి యుద్ధము చేసి మట్టి కరిపించెను. అర్జునుడు తక్షణమే శివమహాదేవునిని గుర్తించి స్తుతించెను. శంకర భగవానుడు ప్రీతిచెంది పాశుపతాస్త్ర విద్య నుపదేశించెను. శంకరభగవానుని అనుగ్రహము పొందిన అర్జునునివద్దకు దిక్పాలురు ఏతెంచి వారివారి అస్త్రముల విద్యనుపదేశించిరి. తదనంతరము స్వర్గలోకమునుండి దేవేంద్రుని రథసారథియగు మాతిలి వచ్చి అర్జునుని ఇంద్రలోకమునకు గొనిపోయెను. అర్జునునకు ఇంద్రసభలో ఘనస్వాగతము లభించెను. అచట అర్జునుడు అస్త్రవిద్యను-సంగీతవిద్యను నేర్చెను. ఇంద్రుని ప్రేరణపై చిత్రసేనుడను గంధర్వుడు ఊర్వశి చెందకుపోయి అర్జునునకు స్వర్గసుఖభోగము నందించమని ప్రోత్సహించెను. ఆమె అర్జునుని చెంతకేగి ఆ ప్రయత్నము నందు సఫలముగాక, రోషముతో అర్జునునకు నపుంసకత్వము ప్రాప్తించునని శపించెను. అపుడు ఇంద్రుడు ఆ శాపము అర్జునునకు అజ్ఞాతవాసములో అవసరమునకు వచ్చునటుల తీర్మానించెను. అర్జునుని కుశల సమాచారమును లోమశమహర్షి ఇంద్రలోకము నుండి వచ్చి యుధిష్ఠిరాదులకు దెలిపెను. శ్రీకృష్ణాదులు దుర్యోధనవధ గురించి వనములో పాండవుల సమక్షమున చేసిన ప్రతిజ్ఞలను సంజయుడు ధృతరాష్ట్రునకు దెలిపెను. ధృతరాష్ట్రుడు తన పుత్రుల గురించి చింతించి సంతాపము చెందసాగెను. అర్జునుడు దివ్యాస్త్రజ్ఞాన సముపార్జనకై వెడలి సుదీర్ఘసమయమగుటచే, ఆయన జ్ఞాపకములను

స్మరించుకొనుచు పాండవులు ఏకాంత ప్రదేశమునందుండిరి. అదే సమయమున బృహదశ్వ మహర్షి ఆగమనమును జూచి యుధిష్ఠిరాదులు ఎదురేగి స్వాగతించి ఆసనాదులిచ్చి పూజించి మధుపర్కాదులతో, ఫలమూలములతో సేవించి సుఖవిశ్రాంతి పొందునటులు చేసిరి. తదనంతరము యుధిష్ఠిరుడు తన ద్యూతవ్యసనమును, దుర్యోధనాదుల కపట ద్యూతమును, తన దైన్య పరిస్థితిని వివరించి, యిటువంటి కష్టమును యిదివరలో ఎవరైనా అనుభవించితిరా అని ప్రశ్నించెను. అందులకు మహర్షి నలదమయంతుల ఉపాఖ్యానమును చెప్పెను.

తదనంతరము ఒకనాడు దేవర్షి నారదుడు యుధిష్ఠిరాదుల ననుగ్రహించు బుద్ధితో వచ్చెను. ఆ సమయమున యుధిష్ఠిరుడు తీర్థయాత్రాతత్పరులకు లభించు పుణ్యఫలమేదియో దెలుపమని ప్రార్థించెను. అపుడు దేవర్షి పాండవులకు భీష్మ – పులస్త్య సంవాదమును వినిపించెను. అటులనే ధౌమ్యుడు, లోమశ మహర్షి కూడ తీర్థములు, పుణ్యక్షేత్రములు, తపోభూములు గురించి వర్ణించిరి. యుధిష్ఠిరాదులు లోమశ మహర్షి సహాయముతో తీర్థయాత్రలకు బయలుదేరిరి. అధిక తీర్థములు సందర్శించిన పిమ్మట గంధమాదన పర్వతములవైపు బయలుదేరిరి. ఆ ప్రయాణము దుర్గమమై యుండుట వలన ధౌమ్యముని, సారథి, వంటవారు, ఇతరసేవకజనులు, రథములు, గుఱ్ఱములు, మార్గాయాసప్రయాసను సహించలేని అన్య బ్రాహ్మణులను కుళిందరాజు సుబాహువు యొక్క విశాలరాజ్యములో సురక్షితులై యుండమని యుధిష్ఠిరుడు ఆదేశించెను. ఆ ప్రకారము పాండవులు ద్రౌపదితో బాటు మెల్లమెల్లగా పాదచారులై గంధమాదన యానము ప్రారంభించిరి. నరనారాయణులు తపస్సు చేసిన బదరికాశ్రమమున్న ప్రాంతమే గంధమాదన పర్వతము. ఆ పర్వతముపై సదా యక్షగణము నివాసముందును. అచటనే రాక్షసుల ద్వారా సేవితమైన కుబేరుని సురమ్య పుష్కరిణి యున్నది. గంధమాధన యాత్రలో పాండవులు పెద్దగాలివాన నెదుర్కొనిరి. ద్రౌపది యాత్రా శ్రమను భరించజాలక మూర్ఛిల్లుట గమనించిన భీమసేనుని స్మరణ మాత్రముచే ఘటోత్కచుడు తన అనుయాయులతో బయలుదేరి వచ్చెను. వారు యుధిష్ఠిరాదులను, ద్రౌపదిని, బ్రాహ్మణులను తమ పీఠములపై ఎక్కించుకొని బదరికాశ్రమమునకు చేర్చిరి. గంధమాదన పర్వత ప్రకృతిని దర్శించుటకై ద్రౌపదీభీమసేనులు కొంత విహారయాత్ర జేసిరి. ఆ సమయమున కుబేరుని పుష్కరిణి నుండి ఎగిరివచ్చిన సౌంగధిక కమలమును జూచి ద్రౌపది హర్షోల్లాసము చెంది అటువంటి మరికొన్ని పుష్పములు తెమ్మనికోరెను. భీమసేనుడు ద్రోపదిని బదరిక ఆశ్రమమునకు పంపించి తానొంటరిగా గర్జన చేయుచు, జబ్బలు చరుచుకొనుచు, శంఖనాదము చేయుచు ముందుకు కదిలెను. ఆ మహానాదముల నాలకించిన హనుమంతుడు భీమసేనుని ఆగమనము నెరిగెను. భీమసేనుడు స్వర్గమార్గమునకు పోరాదని, ఎవరి చేతను ఎట్టి శాపమును పొందరాదని తలంచి, విశాలకాయముతో అరటితోట నడుమ నిద్రకు ఉపక్రమించి నటుల సాగిలపడెను. పెద్దగా నోరు తెరిచి ఆవులించెను. ఇంద్రధనుస్సు వంటి తన తోకను గట్టిగానేలపై కొట్టి పిడుగుపాటి శబ్దమును చేసెను. ఆ శబ్దమునకు మహాగిరి కంపించెను. ఆ చప్పుడు విచిత్రముగ కొండచరియలందు ప్రతిధ్వనించసాగెను. ఆ ధ్వని నాలకించిన భీమసేనుని దేహము గగుర్పాటు చెందెను. భీమసేనునకు అరటితోట మధ్యలో పింగళవర్ణుడై పిడుగువలె ధ్వని చేయుచున్న వానర శ్రేష్ఠుడు అగుపడెను. భీమసేన హనుమంతులు వాగ్వివాదము జరిపిరి. పిమ్మట భీమసేనుడు

హనుమంతుని తోకను కదల్చలేక పరాభవము చెందెను. తక్షణమే ఆ మహాకాయుడు సామాన్యవానరము కాదనితలంచి హనుమంతునిగా స్మరించి స్తుతించెను. భీమసేనుడు హనుమంతుని ద్వారా రామకథ నాలకించెను. హనుమంతుడు చతుర్యుగముల ధర్మమును కూడ వర్ణించెను. భీమసేనుని కోరికమేర హనుమంతుడు విరాట స్వరూపమును ప్రదర్శించి ధర్మబోధ చేసి సౌగంధ వనమునకు పోవు మార్గమును జూపెను. తదనంతరము భీమసేనునిపై ప్రేమాదరములు ప్రదర్శించి "తమ్ముడా! నీవు నాకు సుహృదుడవు. అవశ్యము నీకు ప్రియము గూర్చెదను. నీవు బాణశక్త్యాయుధ ఆఘాతములతో వ్యాకులుడవై శత్రుసేనలో జొచ్చుకొని సింహనాదము చేయునపుడు నేను కూడ నీతో బాటు గొంతుకలిపి ఆ సింహ నాదమును మరింత ప్రభావితము చేసెదను. అంతేగాక అర్జునుని రథ ధ్వజముపై ఆసీనుడనై భీషణగర్జనలు చేయుచు శత్రువుల ప్రాణములను హరించెదను. ఆ ప్రకారము మీరు శత్రువులను సులభముగా వధించగలుగునటుల చేయుదును" అని పలికి అంతర్ధానమెందెను. తదనంతరము భీమసేనుడు సౌగంధిక వనమును చేరెను. అది బాలసూర్యుని కాంతితో అలరారుచున్నది. చాల మంది రాక్షసులు ఆ ప్రదేశమును రక్షించుచుండిరి. భీమసేనుడు తన వివరములను వారికెరిగించి సౌగంధిక కమలములను గైకొనదలించితినని పలికెను. కుబేరుని అనుమతి లేనిదే సౌగంధిక పుష్పములను గొనిపోవలదని రాక్షసులు వారించిరి. సమీపమునందు కుబేరుడు లేకుండుటచే ఆయన అనుజ్ఞ పొందలేకుంటినని బదులిడిన భీమసేనునితో ఆ రాక్షసులు యుద్ధమునకు దిగిరి. భీమసేనుని పరాక్రమముచే పీడితులైన రాక్షసులు వెంటనే తమ ప్రభువు చెంతకేగి విషయమును విన్నవించిరి. కుబేరుడు ఆ విషయము తనకు ముందే తెలుసునని పలికి సౌగంధిక పుష్పములను భీమసేనుడు గొనిపోవుటకు అనుమతించెను. తదనంతరము యుధిష్ఠిరాదులు గంధమాదన పర్వతముపై సౌగంధికావన సమీపమున నివసించిరి. కాని ఒకనాడు ఆకాశవాణి నిర్దేశానుసారము పాండవులు నారాయణాశ్రమ మునకు మరలి పోయిరి. అచట భీమసేనుడు లేని సమయము జూచుకొని బ్రాహ్మణ వేషధారణతోనున్న జటాసురుడను రాక్షసుడు యుధిష్ఠిర - నకుల - సహదేవులను - ద్రౌపదిని అపహరించు కొనపోదలంచెను. అంతలో ఆశ్రమమునకు తిరిగివచ్చిన భీమసేనుడు రాక్షసునితో తలబడి భీకరగదాయుద్ధము, మల్లయుద్ధము జరిపి జటాసురుని వధించెను. పిమ్మట యుధిష్ఠిరాదులు వృషపర్వ-రాజర్షి ఆర్ష్టిషేణుల ఆశ్రమముల కేగిరి. ఆర్ష్టిషేణుని కుశలప్రశ్నలతో బాటు ఉపదేశములను పొందిరి. ద్రౌపది కోరికపై భీమసేనుడు పర్వత శిఖరముల నధిరోహించి కుబేరుని యక్ష సైన్యముతో పోరుసలిపి మణిమానుడను కుబేరసఖుని వధించెను. కుబేరుడు గంధమాదన పర్వతమున కేతెంచి యుధిష్ఠిరాదులను కలిసి మణిమానుని మరణమునకు అగస్త్యమహర్షి శాపమున్నదని ఎరిగించెను. అటులనే అర్జునుని కుశలక్షేమములు దెలిపెను. పిమ్మట యుధిష్ఠిరునితో "యుధిష్ఠిరా! నీ తమ్ముడు భీమసేనునకు ధర్మము తెలియదు. తన బలముపై గొప్ప అభిమానమున్నది. ఇప్పటికి బాలుని వలె బుద్ధి ప్రదర్శించును. అతడు అత్యంత క్రోధము గలవాడు. నిర్భయుడై మెలగును. కనుక నీవు ఆయనకు సంయమన ఉపదేశము చేసి హద్దులలో నుండునటుల చేయుము. సరేశ్వరా! నీవు రాజర్షి ఆర్ష్టిషేణుని ఆశ్రమమునకు పోయి భయశోక రహితుడవై యుండుము. ఈ పర్వతముపై నుండు

గంధర్వులు, కిన్నెరులు, బ్రాహ్మణులు నిన్ను రక్షించెదరు" అనెను. భీమసేనుడు సవినయముగా కుబేరునకు నమస్కరించి శరణు పొందెను. అర్జునుని ఆగమనమునకై అచటనే నివసించుచున్న యుధిష్ఠిరాదులకు మేరుగిరిపైనున్న దేవతాస్థానములు గురించి ధౌమ్యముని వర్ణించెను. ఒకనాడు హరితాశ్వములుపూచిన ఇంద్రుని రథము మెరుపువలె ఆకాశములో అగుపడెను. ఆ దివ్య రథములో కూర్చొనియున్న కిరీటధారి అర్జునుడు. దివ్యకాంతితో ప్రకాశించుచు గంధమాదన పర్వతముపై దిగెను. అర్జునుడు మున్ముందుగా ధౌమ్యమహాముని చరణద్వయమునకు శిరసాభివందనము చేసెను. పిమ్మట యుధిష్ఠిరుడు, భీమసేనుల చరణములకు మ్రొక్కెను. అనంతరము నకుల సహాదేవులు నవినయముగ అర్జునునకు ప్రణమిల్లిరి. అర్జునుడు సరాసరి ద్రౌపదికడకేగి ఆమెను బహువిధముల ఓదార్చెను. అప్రమేయవీరుడగు అర్జునుని కలిసినందులకు పాండవులు హర్షాతిశయము పొందిరి. పాండవులు అమితానందముతో దేవేంద్ర రథసారథి మాతలిని కూడ దేవరాజు ఇంద్రునివలె సర్వోత్తమ విధితో సత్కరించిరి. మాతలి పాండవులను అభినందించి తండ్రివలె మంచి ఉపదేశములనిచ్చి, కర్తవ్యబోధ చేసి ఇంద్రునివద్దకు మరలిపోయెను. తదనంతరము పాండవులు తేజస్వంతులగు బ్రహ్మర్షులనడుమ కూర్చొనిరి. అర్జునుడు తన దేవేంద్రలోక నివాస సమాచారమును, తపస్సును, అస్త్ర విద్యను గురించి వివరించెను. తన శీల స్వభావములకు, ఏకాగ్రచిత్తమునకు దేవతలందరు ప్రసన్నులయ్యిరని దెలిపెను. నాటికి యాత్రా విశేషములు సంక్షిప్తముగ తెలిపె నకుల సహదేవులతో బాటు ఆశ్రమములో సుఖముగ శయనించెను. రాత్రి గడిచి ప్రాతఃకాలమైనంతనే అన్నదమ్ములతో గూడి యుధిష్ఠిరునకు ప్రణామమొనర్చెను. అదేసమయమున అంతరిక్షములో దేవతల వాద్యఘోష వినబడెను. రథచక్రముల దడదడ శబ్దములు, సర్పమృగ పక్షుల కోలాహలము అన్ని వైపుల వినిపించసాగెను. పాండవులు అంతరిక్షము వైపు కనులెత్తి జూచిరి. దేవరాజు ఇంద్రుడు మరుద్గణములతో బాటు ఆకాశమార్గమున వచ్చుచుండెను. గంధర్వులు - అప్సరసలు కూడ సూర్యసమాన తేజస్వంత విమానముల ద్వారా దేవేంద్రుని అనుసరించి వచ్చుచుండిరి. కొద్ది సమయములోనే పచ్చని గుఱ్ఱములతో పూచిన సువర్ణాలంకృత రథముపై దేవేంద్రుడు పాండవులచెంతకు విచ్చేసెను. యుధిష్ఠిరుడు ఎదురేగి శాస్త్రవిధి ననుసరించి దేవేంద్రుని స్వాగతించి సత్కరించెను. తేజస్వియగు అర్జునుడు కూడ దేవేంద్రునకు ప్రణమిల్లి వినీతభావముతో చెంతనే నిలిచెను. అపుడు దేవరాజు "యుధిష్ఠిరా! నీవు పృదివినంతటిని పాలించెదవు. నీవు నీ తమ్ములతో గూడి కామ్యకవనమునకు మరలిపొమ్ము. రాజా! అర్జునుడు ఏకాగ్రచిత్తముతో నా నుండి సంపూర్ణ దివ్యాస్త్రములను పొందెను. నాకు ప్రియమగు కార్యములు కూడ సంపన్నమొనర్చెను. ముల్లోకములలో ఎవరూ యితనిని జయించ జాలకుందురు" అని పలికి మహర్షుల ద్వారా స్తుతించబడిన దేవేంద్రుడు ఆనందముగ స్వర్గ లోకమునకు మరలిపోయెను.

పాండవులు ధర్మాధ్మక్షుడగు కుబేరుని గృహములో నివసించుట, ఇంద్రునితో సమాగమము యను యీ రెండు ప్రసంగములను ఏకాగ్రచిత్తముతో ప్రతిదినము పఠించు విద్వాంసుడు, సరియగు నియమములతో కఠోరవ్రతముల నాచరించుచు, ఒక సంవత్సరము బ్రాహ్మచర్యమును పాటించినచో, సర్వబాధా విముక్తుడై వంద సంవత్సరములు

సుఖపూర్వకముగ జీవనధారణ చేయును. దేవరాజు ఇంద్రుడు వెడలిన పిమ్మట యుధిష్ఠిరుడు ప్రీతితో అర్జునుని మస్తకమును ముద్దాడి హర్షగద్గదవాణితో "అర్జునా! నీవు దివ్యాస్త్ర సంపదనెటుల పొందితివి? ఏ ప్రకారము పినాకధారిని, దేవేంద్రుని దర్శించితివి? నీవతనికి ఏ ప్రియకార్యమొనర్చితివి? సమస్తమును విస్తారముగ వర్ణించుము" అనెను. అందులకు అర్జునుడు "రాజా! మీ ఆదేశానుసారము నేను తపస్సు చేయుటకు భృగుతుంగ పర్వతమును చేరితిని. ఆ రాత్రి అచట విశ్రమించగా ఒక బ్రాహ్మణుని దర్శనమయ్యెను. ఆయన నా తపః సంకల్పమును ప్రశంసించి నేనెటుల తపస్సు చేయవలెనో చెప్పెను. ఆయన ఆదేశానుసారము నేను హిమాలయ పర్వతమునకు పోయి తపస్సు నారంభించి ఒక మాసము కేవలము ఫలమూలాదులు, రెండవ మాసములో జలపానము, మూడవ మాసములో నిరాహారినై, నాల్గవ మాసములో ఊర్ధ్వబాహువునై తపస్సు చేసితిని. అయిదవ మాసములో ఒక సూకరము నా సమక్షమున ముట్టెతో పృథివిని దొలచసాగెను. ఆ సూకరమును వెంట దరుముచు కిరాత ఆకృతి ధరించిన ఒక మహా పురుషుడు అగుపడెను. అతడు ధనుర్బాణములు ధరించియుండెను. నేను కూడ అదే సమయమున ఒక బాణమును సంధించి సూకరముపై గురి పెట్టితిని. మా యిరువురి బాణములు ఒకేసారి సూకరమును గొట్టినవి. అవుడా కిరాతుడు తన బాణము ముందుగా విడువబడెనని చెప్పి, నేను వేట నియమము నుల్లంఘితినని పలికి నాతో పోరుకు సిద్ధపడెను. నేను కూడ శరవర్షముతో భిల్లుని ఆచ్ఛాదించితిని. భిల్లుడు వందల వేల రూపములు ధరించి అన్ని దిక్కుల అగుపడసాగెను. నేను ఆయారూపములన్నిటిపైన ప్రహారముల నొనర్చితిని, అంతలోనే ఆయా రూపములన్నియు ఒకటైనవి. ఆ కిరాతుడు ఒకప్పుడు చిన్నరూపమై - మరొకప్పుడు విశాలకాయముతో వ్యక్తమై నన్ను ఎదుర్కొనసాగెను. నేను దివ్యాస్త్రములన్నియు ప్రయోగించితిని గాని అవి యన్నియు ఆ భిల్లునిలో విలీనమైనవి. నేనప్పుడు ఆశ్చర్యము చెంది బ్రహ్మాస్త్రమును ప్రయోగించితిని. కాని మహాతేజస్వంతుడగు కిరాతుడు ఒక్క క్షణములో బ్రహ్మాస్త్రమును కూడ శాంతింపజేసెను. చివరగా నా ధనుర్బాణములు కూడ ఆయనలో విలీనమైనవి. నేను ఆయనతో మల్లయుద్ధము చేసితిని. కాని అతడు నా వశముగాకుండెను. నేను నిశ్చేష్టుడనై నేలకొరిగితిని. తదనంతరము ఆ కిరాతుడు ఉమాసహితముగ నా ఎదుట ప్రత్యక్షమై "వత్సా! నేను సంతుష్టుడనైతిని" - అని పలికి నా ధనుర్బాణములను తిరిగి యిచ్చి వేయుచు ఏదైనా వరము కోరుకొనమనెను. నేను దేవతల వద్దనున్న అస్త్రవిద్యలన్నియు నాకు లభించ వలెనని ప్రార్థించితిని. ఆయన "తథాస్తు"యని పలికి నాకు పాశుపతాస్త్రమును కూడ అనుగ్రహించెను. ఈ అస్త్రమును మనుష్యులపై ప్రయోగించవలదనియు, ఆత్మరక్షణ కొరకు మాత్రమే దానిని ప్రయోగించ మనియు శత్రువుల యొక్క అస్త్రములను వినాశ మొనర్చుటకు మాత్రమే ఉపయోగించమనియు ఆదేశించెను. ఇదియే యీ వనపర్వ పూర్వ భాగము లోని కథాంశము.

దేవతాస్తుతులు

పురుషశ్రేష్ఠుడగు యుధిష్ఠిరుడు బ్రాహ్మణుల భరణ పోషణకై సూర్యభగవానుని స్తుతించు విధానమును ధౌమ్య మహాముని ద్వారా ఉపదేశమును పొందెను. (సూర్యదేవుని అష్టోత్తర శతనామములు మూడవ అధ్యాయమునందున్నవి.) మానవులలో ఎవరు సూర్యోదయమునకు పూర్వమే చక్కగా ఏకాగ్రచిత్తముతో యీ అష్టోత్తర శతనామములను పఠించుదురో వారికి స్త్రీ పుత్ర-ధన- రత్నరాశి -

పూర్వజన్మస్మృతి - ధర్మము - ఉత్తమ బుద్ధి మున్నగునవి ప్రాప్తించును. దేవేశ్వరుడగు సూర్యభగవానుని యీ స్తోత్రముతో స్తుతించినచో శోకరూప దావానల యుక్త యీ సంసార సాగరమునుండి ముక్తులై తాముకోరిన వస్తువులను పొందగలరు. శివభగవానుని గూర్చి ముప్పది ఎనిమిదవ అధ్యాయములో 74 నుండి 83 శ్లోకముల వరకు అర్జునుడు స్తుతించెను.

నీతి ధర్మములు

వనవాసమునందున్న యుధిష్ఠిరునకు దల్భ మహర్షి పుత్రుడగు ఒక మహాముని బ్రాహ్మణ మహాత్త్వము నిటుల చెప్పెను. బ్రాహ్మణ సహాయములేని క్షత్రియుని యొక్క ఐశ్వర్యపూర్ణ భూమండల రాజ్యము దీర్ఘకాలము నిలువదు. నీతిజ్ఞుడగు రాజునకు నిత్యము బ్రాహ్మణోపదేశము యున్నచో అతనికి సముద్రపర్యంత భూమండల మంతయు నతమస్తకమైయుండును. సంగ్రామములో మావటిరహిత మదపుటేనుగు యొక్క శక్తి సామర్థ్యములు వ్యర్థములగునటుల బ్రాహ్మణ సహయోగములేని రాజు యొక్క బలము క్షయ మొందును. బ్రాహ్మణునకు అనుపమ విచారణశక్తి, క్షత్రియునకు అనుపమ బలముయుండును. రెండింటిని సమన్వయమొనర్చుకొని కార్యములు చేసినచో జగత్తంతయు సుఖించును. బుద్ధిమంతులు ఎల్లవేళలా అప్రాప్తమగుదానిని ప్రాప్తించుట కొరకు బ్రాహ్మణ బుద్ధిని గ్రహించవలెను. ఈ విషయములు ఇరువదారవ అధ్యాయమునందున్నవి. వనవాసము నందు యుధిష్ఠిరాదులు ఒకనాడు తమ వనవాస కష్టములకు దుర్యోధనుని కపటద్యూతమే కారణమని స్మరించిరి. ఆ సమయమున ద్రౌపది అట్టివారిపై క్రోధమును ప్రదర్శించమని ప్రహ్లాద-బలి సంవాదము నుదహరించి తేజస్సు-క్షమావసరములు ఉటంకించెను. రాజా! సంసారములో క్షత్రియుడు క్రోధరహితుడైయుండుట ఆశ్చర్యము. క్షరతే ఇతి క్షత్రమ్ - దుష్టులను నాశనమొనర్చువాడు క్షత్రియుడు. దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణులు నలుగురు దుష్టులు గదా! అటువంటి వారిపై క్షత్రియుడు సమయానుసారము తన ప్రభుతను చూపకున్నచో ప్రాణులన్నియు ఆ ప్రభువును తిరస్కరించును. కనుక మీరు శత్రువుల మీద ఏ విధముగను క్షమాభావమును జూపరాదు. మీ తేజస్సుతోనే వారిని వధించగల సమర్థులైయుండి కూడ క్షమాభావమును ప్రదర్శించరాదు. ఒకప్పుడు బలిచక్రవర్తి తన పితామహుడగు ప్రహ్లాదుని కలిసి క్షమ-తేజస్సు (క్రోధము)లలో ఏది శ్రేష్ఠమని అడిగెను. అపుడాయన క్రోధముగాని - క్షమగాని ఏదియునూ సదా శ్రేష్ఠములుగావు. ఎల్లపుడూ క్షమాభావమును ప్రదర్శించుటచే భృత్యులు, బంధువులు తిరస్కార భావము జూపుదురు. క్షమాశీలి యొక్క ధనమును, సంపదను హరించు ఉద్దేశము గలిగియుందురు. స్వేచ్ఛాభావ ప్రవృత్తులగుదురు. క్రోధ పురుషుడు రజోగుణావృతుడై యోగ్య-అయోగ్య అవసరములందు వివేచనారహితముగ ఉత్తేజిత స్వభావముతో నానాప్రకార దండనలనిచ్చును. మిత్రులతో విరోధించును. సాధారణ జనులకు, స్వజనులకు ద్వేషపాత్రుడగును. ఇతరుల ధిక్కారమునకు గురియగుచు నిరాదరణ పొందును. ద్వేషము, సంతాపము, మోహము మున్నగు ప్రక్రియల ద్వారా క్రొత్త క్రొత్త శత్రువులను పెంచుకొనును. క్రోదావేశము చెందినవాడు, ఇతరులను నానాప్రకార దండనలకు గురిచేసి ఉద్దండతతో ప్రవర్తించి ఐశ్వర్యమును, స్వజనులను, చివరకు తన ప్రాణములను సైతము కోల్పోవును. క్షమాతత్త్వము గురించి చెప్పెదను వినుము. పూర్వము ఎన్నడైనా ఉపకారము చేసినవాడు

గొప్ప అపరాధమును చేసినచో పూర్వ ఉపకారములు స్మరించి అతని అపరాధమును క్షమించవలెను. ఎవరైనా తెలియక అపరాధము చేసినచో క్షమించవలెను. ఏ ప్రాణికైననూ ఒక అపరాధమును క్షమించవలెను" అనెను. నాథా! దుర్యోధనుడు లోభి. మీకు సదా అపకారమునే తలబెట్టుచున్నాడు. కనుక వాని యెడల తేజస్సును (కోపముతో కూడిన ప్రతాపము) ప్రయోగించు అవసరము ఏర్పడినదని నా అభిప్రాయము. కౌరవుల ఎడ ఇపుడు క్షమాభావము చూపవలసిన అవసరములేదు. ఇపుడు మీ ప్రతాపమును జూపవలెను. ఉచితావసరములందు క్షమ–తేజములు రెండింటిని ప్రయోగించు భూపాలురే సఫలతనొందెదరు" అనెను. ద్రౌపది యొక్క సుదీర్ఘ భాషణము నాలకించిన యుధిష్ఠిరుడు క్రోధము కూడదని, క్షమ సర్వధా శ్రేయస్కరమని యిటుల చెప్పనారంభించెను. ద్రౌపదీ! క్రోధము మానవులను హతమార్చును. ఎవరికైననూ తమ ఉన్నతి–అవనతులు రెండును క్రోధమూలకములై యుండును. క్రోధమును జయించినవాడు ఉన్నతిని, క్రోధవశుడైనవాడు అవనతిని పొందును. బలవంతులకైననూ నిర్బలురకైననూ క్షమాభావము నాశ్రయించుటయే మేలు. సత్పురుషులు క్రోధమును జయించుటనే ప్రశంసించెదరు, సాధుసత్తముల అభిప్రాయము ప్రకారము జగత్తులో క్షమాశీలురకు మాత్రమే సదావిజయము ప్రాప్తించును. క్షమాగుణమే ధర్మము – యజ్ఞము – వేదము – భవిష్యత్తు – తపస్సు – శౌచమునైయున్నది. క్షమయే సంపూర్ణ జగత్తును ధారణ చేయుచున్నది. క్షమాశీలి యజ్ఞవేత్తల కన్న, బ్రహ్మవేత్తల కన్న, తపస్వుల కన్న ఉన్నత లోకములను పొందును. క్షమాశీలురు బ్రహ్మ లోకాంతర్గతిని పొంది అత్యంత పూజనీయలగుదురు. తేజస్వంతులకు క్షమమే తేజస్సు. తపస్వులకు క్షమయే పరబ్రహ్మము. సత్యవాదులకు క్షమయే సత్యము. క్షమయే యజ్ఞము. క్షమయే శమము, ద్రౌపదీ! దేనియందు బ్రహ్మము – సత్యము – యజ్ఞము – లోకము – సర్వము ప్రతిష్ఠితమైయున్నవని తన్మహాత్మ్యము శ్లాఘించబడినదో ఆ క్షమా గుణమును నా వంటి మనుష్యుడు ఎటుల పరిత్యజించును? లోకము క్షమాశీలురవశమైయున్నది. క్షమ–దయ యీ రెండును జితాత్మ పురుషుల యొక్క సదాచారము. సనాతన మార్గములో దూరదర్శి విద్వాంసులు దేనిని తేజస్సు (ప్రతాపము) అనెదరో అది క్రోధముగాదు. అది క్రోధము యొక్క అంతర్భాగము. తనలో పడగెత్తిన క్రోధమును సద్బుద్ధిద్వారా అణచునారే తేజస్వులని తత్త్వదర్శులనెదరు. దక్షత – శౌర్యము – శీఘ్రత – అమర్షము యనునవి తేజస్సు యొక్క గుణములు. క్రోధమును నియంత్రించువానికి మిగిలిన గుణములు సహజ వికాసము చెందును. క్రోధమును వశమొనర్చుకొను వ్యక్తికి తేజస్సు చక్కగా ప్రకాశించును. క్రోధపురుషులకు సమయోచిత పరాక్రమమును ప్రదర్శించుట కూడ దుస్సహమగును. మూర్ఖులు క్రోధమునే తేజస్సు అనుకొందురు. జగదములకు క్రోధమే మూలము." అనెను. అందులకు ద్రౌపది "నాథా! ఈ జగత్తులో ధర్మము, కోమలత్వము, క్షమ, వినయము, దయాభావములతో ఏ మనిషియూ ఎన్నడూ ధనమునుగాని, ఐశ్వర్యమునుగాని పొందలేదు" అనెను. తదనంతరము ఆమె అనేక విధముల యుధిష్ఠిరుని ఒప్పించుటకు ప్రయత్నించెను. యుధిష్ఠిరుడు ఆమె అభిప్రాయములను ఖండించెను. యుధిష్ఠిరుడు పురుషార్థతత్త్వమును మరింత విశదముగ వర్ణించెను. ద్రౌపది కూడ బృహస్పతి నీతిపాఠముల సారమును తన తండ్రిగారి ఒడిలో కూర్చుని ఒక విద్వాంసుని ద్వారా వినియుంటినని

విస్తృతముగా చెప్పెను. భీమసేనుడు కూడ పురుషార్థ ప్రసంగము తగురీతిలో చేసెను. కాని యుధిష్ఠిరుడు వారి వాదనలను ఖండించి "భీమసేనా! అమృతము కంటెను, జీవితము కంటెను నేను ధర్మమునే మేలుగ గ్రహించెదను. రాజ్యము, సంతానము, కీర్తి, ధనము, సర్వస్వము కూడ సత్యధర్మములో పదునారవ భాగమునకు కూడ సరిగావు" అనెను. ఈ ప్రకారము తేజము - క్షమ గురించి విస్తృతమైన చర్చ 27 నుండి 35 అధ్యాయముల వరకు యున్నది.

ఉపాఖ్యానములు

ధృతరాష్ట్ర మహారాజు కౌరవ పాండవుల పాచికలాడుట తనకు ఇష్టము లేకున్ననూ దుర్యోధనునిపై నున్న పుత్రప్రేమతో ఆమోదించితినని వ్యాసమహర్షికి చెప్పెను. ఆ సందర్భమున వ్యాసమహర్షి పుత్రుని మించిన ప్రియమైన వస్తువు సంసారములో యింకొకటి యుండదని పలుకుచు సురభి-ఇంద్రసంవాదమును తెలిపెను. ఒకప్పుడు సురభీదేది ఇంద్రునితో "దేవా! సమృద్ధి శీల పదార్థములెన్ని సంపన్నమైయున్నను పుత్రునికన్న అవిఏవియూ ఎక్కువకాదు. భూతలములో ఒక కర్షకుడు తన పొలము దున్నుచున్న ఎద్దును పదేపదే కొరడాతో కొట్టి పని చేయించుకొనుట జూచి తన శోక కారణమును చెప్పుకొన్నది. అపుడు దేవేంద్రుడు "సురభీ! వేలకొలది నీ పుత్రులు యిటులనే పీడించ బడుచున్ననూ నీవు యీ ఒక్క పుత్రుని గురించి కరుణాక్రందన చేయుచుంటివేమని పలికెను. అందులకు గోమాత "నాకు వేలకొలది పుత్రులున్నను దీనులు-దుఃఖితులైన పుత్రులపై అధిక దయ పొంగిపొరలును" అనెను. అదే విధముగా "ధృతరాష్ట్ర మహారాజా! నీకు పాండవులు కూడ పుత్ర సమానులేగదా. కాని పుత్రులందరిలో హీనులు, దీనులు, దయనీయస్థితిలోనున్నవారిపై నీకు అధిక కృప రావలెను గదా" అనెను. యుధిష్ఠిరుడు వనవాసమునందుండగా ఒకప్పుడు బృహదశ్వ మహర్షి పాండవులను దర్శించెను. అపుడు యుధిష్ఠిరుడు "మహర్షీ! నావంటి అత్యంత భాగ్యహీనుడగు రాజు యీ భూలోకములో ఎన్నడైనా యుండెనా?" అని ప్రశ్నించెను. అందులకు బృహదశ్వుడు నలదమయంతుల వృత్తాంతమును సుదీర్ఘముగా వినిపించెను. ఈ నలచరిత్ర 53వ అధ్యాయమునుండి 79వ అధ్యాయము వరకుయున్నది. కర్కోటకుడను నాగరాజు, దమయంతిదేవి, నలమహారాజు, ఋతువర్ణ మహారాజుల చర్చ జరిగినచోట కలియుగ దోషములు నశించును. ఈ కలినాశక ఇతిహాసము నాలకించినవారికి గొప్ప ఆశాస్వన-ఓదార్పు లభించును. అగస్త్య మహర్షి వివాహేచ్ఛకై ప్రకృతిలోని ఒక్కొక్క జంతువు యొక్క ఉత్తమోత్తమ అంగముల సారమును సంగ్రహించి ఒక సుందర బాలికను తయారు చేసెను. అగస్త్యమహర్షి ఆ బాలిక లోపాముద్రను విదర్భరాజు పాలనకై అప్పగించెను. ఆమె సుందర స్త్రీగా పెరిగినంతనే అగస్త్యమహర్షి విదర్భరాజు కడదేగి ఆమెను తన పత్నిగా వరించెను. లోపాముద్ర చాల ప్రసన్నతతో, ఆదరముతో పతిదేవుని సేవించెను. అగస్త్యమహర్షి ధనార్థియై ఇల్వలుని వద్దకేగెను. ఇల్వలుని తమ్ముడు వాతాపి శ్రాద్ధాన్నముగా అగస్త్యుని పొట్టలో చేరెను. అగస్త్యుడు వాతాపి జీర్ణమని పలికి అతడి ప్రాణములను హరించెను. ఇల్వలుని వద్ద ధనమును గైకొనిన పిమ్మట తన భార్య లోపాముద్రను చేరి గర్భాధానము చేసెను. ఆమె ఏడు సంవత్సరములు గర్భమును ధరించి దృఢస్యుడను పుత్రునకు జన్మనిచ్చెను. అతడు బాల్యావస్థయందు సమిధలు సంగ్రహించి తెచ్చుచుండుటచే ఇధ్మవాహుడని కూడ పిలువబడెను. ఆ రోజులలో కాలకేయులనెడి

భయంకర దైత్య దళము యుండెడిది. వారు వృత్రాసురుని పనువునచేరి దేవతలతో యుద్ధము చేసిరి. దేవేంద్రుడు వృత్రసంహారము కొరకు బ్రహ్మదేవుని ప్రార్థించెను. భృగువంశజుడగు దధీచిని ప్రార్థించి అతని అస్థికలతో వజ్రాయుధము వంటి ఆయుధమును నిర్మించుకొని వృత్రాసురుని హతమొనర్చమని బ్రహ్మదేవుడు హితవు బలికెను. అపుడు దేవతలకోరికపై దధీచి ప్రాణత్యాగము చేసి తన అస్థికలను సమర్పించెను. దేవేంద్రుడు విశ్వకర్మ ద్వారా దధీచి అస్థికలతో షట్కోణాకారముగనున్న వజ్రాయుధమును నిర్మింపజేసికొని వృత్రాసురుని హతమొనర్చెను. అపుడు కాలకేయులు సముద్రమునందు దాగి రాత్రి సమయములో ఋషివాటికలపై దాడి చేసి బ్రాహ్మణులను హతమార్చి యజ్ఞములకు విఘ్నము కలిగించసాగిరి. అపుడు దేవతలు అగస్త్యుని ప్రార్థించి సముద్రజలమును పానము చేయుమని ప్రార్థించిరి. సముద్ర శోషణయగుటచే కాలకేయులపై దేవతలు దాడి చేసి వారిని అతమొందించిరి. సూర్యదేవుడు సువర్ణమయ మేరుగిరికి ప్రదక్షిణ చేయుచు సూర్యోదయ సూర్యాస్తమయములు జరుపును. ఒకప్పుడు వింధ్యగిరి కూడ తనకు ప్రదక్షిణలు చేయమని సూర్యభగవానుని అడిగెను. కాని సూర్యదేవుడు తనకు విధాత నిశ్చిత మొనర్చిన మార్గమునందే తాను పరిభ్రమించగలనని పలికెను. అందులకు క్రోధితుడైన వింధ్యగిరి సూర్యచంద్రుల మార్గమునడ్డగించు విధముగ పైపైకి ఎదగసాగెను. అప్పుడు దేవతలందరు గలిసి అగస్త్యుని శరణుపొందిరి. అగస్త్యుడు లోపాముద్రను తోడ్కొని వింధ్యగిరి వద్దకు పోయి తాను దక్షిణ దిశగా పోవుచుంటినని పలికి తాను తిరిగి వచ్చువరకు వింధ్యగిరిని ఎదగవలదని శాసించెను. ఆ ప్రకారము అగస్త్యుడు మరల ఉత్తర దిశకు పోకుండుటచే దక్షిణదిశకు శాశ్వతముగ అగస్త్యదిశయను పేరు గలిగెను.

ఈ ప్రకారము 96వ అధ్యాయము నుండి 105వ అధ్యాయమువరకు అగస్త్య మహర్షి అద్భుత కర్మలు వర్ణించబడినవి. తదనంతరము 106 నుండి 109 అధ్యాయముల వరకు గంగావతరణము ఉపాఖ్యానము చెప్పబపడినది. అటుపిమ్మట 110 అధ్యాయము నుండి 114వ అధ్యాయము వరకు ఋష్యశృంగోపాఖ్యానము 115 నుండి 117 అధ్యాయములలో పరశురామోపాఖ్యానము చెప్పబపడినవి. చ్యవన మహర్షి ఉపాఖ్యానము, సతీసుకన్య ప్రభావము, అశ్వనీదేవతలకు యజ్ఞభాగములు కల్పించుట మున్నగునవి 122వ అధ్యాయము నుండి 125వ అధ్యామ వరకు యున్నవి. రాజా మాంధాత చరిత్ర 126వ అధ్యాయమునందును, సోమక-జంతు ఉపాఖ్యానము 127-128 అధ్యాయములందును చెప్పబడెను. ఉశీనరోపాఖ్యానము 131వ అధ్యాయములోను, అష్టావక్ర మునీంద్రుని ఉపాఖ్యానము 132-134 అధ్యాయములలోను వర్ణించబడినది. యవక్రీతో పాఖ్యానము 135-138 అధ్యాయములలో నున్నది. నరకాసుర వధ - వరాహవతార వృత్తాంతము 142వ అధ్యాయములో చెప్పబడినది.

తీర్థయాత్రలు

పూర్వము పులస్త్య మహర్షి బుద్ధిమంతుడగు భీష్మునకు వివరించిన తీర్థయాత్రా ఫలమును దేవర్షి నారదుడు యుధిష్ఠిరాదులకు వినిపించిన విషయము 81 నుండి 85 అధ్యాములలోనున్నది. ఋషులకు తీర్థములన్నియు గొప్ప ఆశ్రయ స్థానములు. ఎవని కరచరణములు - మనస్సు సంయమనమై యుండునో వానికి తీర్థయాత్రా ఫలము సంపూర్ణముగ లభించును. దాన పరిగ్రహణ బుద్ధి, అహంకారము లేకుండుట,

దంభము లేకుండుట, కర్తృత్వాభిమాన శూన్యత్వము, అల్పాహారి, జితేంద్రియుడు మున్నగువారు తీర్థముల యొక్క వాస్తవిక ఫలమును పొందెదరు. ప్రచుర దక్షణాయుక్త అగ్నిష్టోమాది యజ్ఞకర్మలతో లభించు ఫలము కేవలము తీర్థయాత్రా సేవనముతో పొందవచ్చును. పుష్కర తీర్థమును స్మరించువారికి సమస్త తీర్థములలో స్నానము, ఆచమనము చేసిన ఫలము లభించును. దేవతలలో విష్ణుభగవానుడు. ఆద్యుడైనటుల నదుల తీర్థములలో పుష్కరము ఆది తీర్థము. వంద సంవత్సరముల నిత్యాగ్నిహోత్రము చేసినవానికి లభించు పుణ్యము కేవలము కార్తీక పౌర్ణమినాడు పుష్కరములో స్నానము చేసినందువలన కలుగును. మూడు పర్వత శిఖరములు - మూడు స్రోతలు - మూడు పుష్కరములు అనాది సిద్ధ తీర్థములు. మూడు పుష్కరములనగా కాశీ-ప్రయాగ-పుష్కరములు. మూడింటియందును సరస్వతి ప్రవహించుటకే త్రిస్రోత లేదా మనోవాక్కాయ పాపములను పోగొట్టునది అని అర్థము. వేదశాస్త్ర పురాణములందు కాశీకి మూడు శృంగములున్నవని లేదా త్రికోణ స్థితమని చెప్పెదరు. వాస్తవముగా విద్యారణ్యము, పంచనదము, గౌరీమయూరము, అర్జునము, శ్రీవాంఛము, కుంభకోణముయను ఆరున్నూ కాశీ క్షేత్రముతో సమానమనెదరు. జంబూమార్గము, భద్రపటము, ప్రభాసము, శ్రీకుంతము, బడబా తీర్థము, మున్నగు అనేక తీర్థములు వర్ణించబడినవి. కురుక్షేత్రమునందున్న వంద తీర్థముల వర్ణన కూడ యున్నది. నానాప్రకార తీర్థముల మహిమ, గగంగాసాగరము - అయోధ్య - చక్రకూటము - ప్రయాగ మున్నగు తీర్థముల వర్ణన కూడ యున్నది. ధౌమ్యముని భారతదేశ నలుదిశ లందున్న తీర్థముల గురించి విస్తారము వర్ణించిన విషయము 86-99 అధ్యాయములలో నున్నది. లోమశ మహర్షి ఆగమనమును జూచి పాండవులు ధౌమ్యునితోగూడి తీర్థయాత్రలకు వెడలుటతో 91 అధ్యాయము నుండి ప్రారంభమగును. నైమిశము - ప్రయాగ - గయ మహాత్మ్యములు, ప్రభాస మహిమ, కురుక్షేత్ర ద్వారమగు ప్లక్ష ప్రస్రవణము, యమునా తీర్థము, సరస్వతీ తీర్థము, కర్ణమిల తీర్థము, ఉత్తరాఖండ యాత్ర, గంధమాదన యాత్ర, బదరీ క్షేత్రము మున్నగువాని వర్ణన 91 నుండి 145 అధ్యాయముల వరకు యున్నది.

- ० -



శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

వన పర్వము (ఉత్తరభాగము)

సంపుటి : 4

ఓం శక్రాయ నమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

వన పర్వము (ఉత్తర భాగము) - సంగ్రహ పరిచయము

కథాంశము

అర్జునుడు తన అస్త్రవిద్య ప్రాప్తికొరకు తపస్సుకు వెడలి శివమహాదేవుని ఆరాధించి పాశుపతాస్త్రమును సంపాదించిన పిమ్మట ఆయన వరము ప్రకారము దిక్పాలురు స్వయముగా వచ్చి తమ అస్త్ర విజ్ఞానమును అనుగ్రహించిరి. తదనంతరము అర్జునుడు పాతాళలోకమునకేగి నివాత కవచ దానవులతో యుద్ధమొనర్చుట, వారిని సంహరించుట. 169 నుండి 172 అధ్యాయములలో వర్ణించబడినది.

అర్జునుడు హిరణ్య పౌలోములను, కాలకేయులను ఎదుర్కొని వారందరిని వధించి దేవకార్యమును నిర్వహించెను. హిరణ్యపుర విధ్వంసము, దానవీ మాయ నివారణము, నివాత కవచులతో యుద్ధము మున్నగునవి ఆలకించిన మరుద్గణాది దేవతలు - దేవేంద్రుడు ప్రసన్ను లయ్యిరి. దేవేంద్రుడు అర్జునుని కొరకు అభేద్యం దివ్యకవచమును, సువర్ణమాలను, గొప్పగా నినదించు దేవదత్త శంఖమునిచ్చెను. అర్జునుని మస్తకముపై దివ్యకిరీటమును ధరింపజేసెను. అర్జునుని స్వర్గలోక యాత్రను, దివ్యాస్త్రప్రాప్తిని ఎరిగిన యుధిష్ఠిరుడు ఆయా దివ్యాస్త్రముల ప్రభావమును చూడదలంచెను. అర్జునుడు విధిపూర్వకముగ పరిశుద్ధుడై త్రినేత్రధారి శంకరునకు, దేవేంద్రునకు మ్రొక్కి, గాండీవమును ఒక చేతిలో, మరొక చేతిలో దేవదత్తమును ధరించెను. పిమ్మట దేవదత్తమైన దివ్యాస్త్రములనొక్కొకటి తన సోదరులకు పరిచయమొనర్చెను. పిమ్మట వానిని ప్రదర్శించుటకు ఉద్యుక్తుడయ్యెను. అపుడతని పాదములక్రిందనున్న భూమి కంపించెను. భూమి నావరించియున్న జలధి అల్లకల్లోలమై ఉత్తాల తరంగములతో ఉప్పొంగెను. భూకంపముతో పర్వతములు విదీర్ణముకాసాగెను. వాయువీచికలు స్తంభించెను. సూర్యప్రభ మందగించెను. అగ్ని హోత్రములు చల్లారెను. ద్విజులకు వేదమంత్రములు స్ఫురించకయుండెను. భూమ్యంతర్గత జీవులన్నియు గడగడవణుకుచు, ఆ దివ్యాస్త్రములను ప్రదర్శించ వలదని అర్జునుని ప్రార్థించసాగినవి. దేవర్షులు - దేవతలు - యక్ష రాక్షస గంధర్వులు - పక్షులు - ఇతర గగన చర ప్రాణులు అచటకువచ్చిరి. అటులనే బ్రహ్మదేవుడు, లోకపాలురు, రుద్రగణములతో గూడి మహాదేవుడు ఉపస్థితులయ్యిరి. అదే సమయమున దేవర్షి నారదుడు వచ్చి అర్జునునితో "పార్థా! నా మాట వినుము. దివ్యాస్త్రములను ఏ లక్ష్యము లేకుండగనే పొరపాటుగనైననూ ప్రయోగించరాదు. దివ్యాస్త్రములను అకారణముగ ప్రయోగించినచో ముల్లోకములు భస్మమగును. యుధిష్ఠిరా! నీ తమ్ముడు యీ దివ్యాస్త్రములను మీ శత్రువులపై ప్రయోగించినపుడు నీ దర్శనేచ్ఛ దీర్చు కొనుము" అనెను. ఆ విధముగా అర్జునుడు దివ్యాస్త్రప్రదర్శనను మానుకొనెను.

పాండవులు గంధమాదన పర్వతమును వీడి సరస్వతీ తీరమునందున్న ద్వైతవనమునకు చేరిరి. సరస్వతీనది సేవనము యక్ష గంధర్వులకు గాక మహర్షులకు కూడ అత్యంత ప్రియమైనది. పాండవు లచట సుఖసంతోషములతో నుండిరి. ద్వైతవనము నందు అనేక ఆశ్రమములున్నవి. పాండవులచట వృషపర్వుని ఆశ్రమము నందుండిరి. భీమసేను డొకనాడు వనవిహారము చేయుచు పరాక్రమమును

ప్రదర్శించుచు క్రూరమృగములను పరుగులెత్తించ సాగెను. ఆ వనములోనున్న ప్రాణులన్నిటిని భయపెట్టుచు భీకరముగ గర్జించ సాగెను. ఆయన గర్జనకు గుహలో విశ్రాంతిచెందుచున్న పెద్దపెద్ద పాములు పరుగులు తీసినవి. భీమసేనుడు వానిని వెంటదరుముచు ఒకచోట విశాలదేహమున్న రోమాంచక భయంకరమగు కొండచిలువను జూచెను. ఆ అజగరము అకస్మాత్తుగ భీమసేనుని సమీపించి ఆయన రెండు బాహువులను చుట్టివేసెను. కొండచిలువ స్పర్శతగిలినంతనే భీమసేనుడు అచేతనుడయ్యెను. కొండచిలువకు అటువంటి వరప్రభావమున్నది. పదివేల ఏనుగులు బలముగల భీమసేనుడు ఆ కొండచిలువ ఆక్రమణకు ఉక్కిరిబిక్కిరియై నిర్బలుడయ్యెను. తదనంతరము ఆ కొండచిలువ "భీమసేనా! నేను రాజర్షి నహుషుడను. నేను అగస్త్యమహర్షిని తిరస్కరించి శాపమునకు గురియైతిని. నీవు నా వంశజుడవు. నాకు అవధ్యుడవు. అయిననూ విధివ్రాత ప్రకారము నేడు నాకు ఆహారముగ లభించితివి. దినములో ఆరవభాగము నందు ఎంతబలవంతమైన జీవియైననూ నా బంధములో చిక్కుకున్నచో విడిపించుకొనజాలదు. నేను ఇంద్రపదవినుండి భ్రష్టుడనైనంతనే శ్రేష్ఠ విమానములో కొండచిలువ రూపమున భూతలముపై పడితిని. నాకు శాపపరిహారము ప్రసాదించమని అగస్త్యమహర్షిని ప్రార్థించితిని. అపుడా మహర్షి నాపై దయజూపి కొంతకాలము తరువాత శాపవిమోచనము ప్రాప్తించునని చెప్పెను. నేను అడిగిన ప్రశ్నలకు విభాగపూర్వకముగ ఎవరైనా సమాధానములను యిచ్చినపుడు నాకు శాపవిమోచనమగును. అంతలో భీమసేనుని అన్వేషణకై యుధిష్ఠిరుడు బయలుదేరెను. పూర్వదిశగా పోయి అచట వేలకొలది క్రూర మృగములు విగతజీవులై పడియుండుట జూచెను. భీమసేనుని అడుగుజాడలనుబట్టి పర్వత కందరములో ఒకచోట భీమసేనుని జూచెను. యుధిష్ఠిరుడు సర్పరాజుతో "ఆయుష్మాన్! మీ ఆకలిదీరుటకు వేరొక ఆహారము ఏర్పాటు చేయుదును. నా తమ్ముని విడిచిపెట్టుము"అనెను. అందులకు ఆ సర్పరాజు "నేను ప్రశ్నించు విషయములపై నీవు సరియగు సమాధానములు నిచ్చినచో భీమసేనుని విడిచిపెట్టెదను" అనెను. అపుడు యుధిష్ఠిరుడు "సర్పరాజా! బ్రాహ్మణుడు తన జీవనములో తెలుసుకొనవలసిన తత్త్వ మేదియో ఎరుగుదువా! దీని గురించి నీకు వివరించిన పిమ్మట నీ ప్రశ్నలకు సమాధానము నిచ్చెదను"అనెను. తదనంతరము సర్పరాజునకు యుధిష్ఠిరునకు గొప్ప ధర్మచర్చ జరిగెను. అందులకు సంతసించిన సర్పరాజు భీమసేనుని విడిచిపెట్టెను. అటులనే ధర్మజునివంటి ధర్మాత్మునితో సంభాషించుటచే ఆయనకు శాపవిమోచనమై స్వర్గగతిని పొందెను.

అర్జునుని స్వర్గలోక గమనము - దివ్యాస్త్ర సంపాదన విషయములనాలకించిన ధృతరాష్ట్ర మహారాజు పరిపరివిధముల జరుగబోవు కౌరవ వినాశనము గురించి చింతిల్లెను. ధృతరాష్ట్రుడు చింతామనస్కుడగుట గమనించిన దుర్యోధనుడు ఉదాసీనుడయ్యెను. అపుడు దుర్యోధనుని ఉత్సాహ పరచుటకై శకుని కర్ణులు ఘోషయాత్ర ప్రస్తావన చేసిరి. దుర్యోధనుడు మాయా ద్యూతములో పాండవుల ఐశ్వర్యమునంతటిని దోచుకొని వనాంతరవాసమునకు బంపెను. ఇపుడు సమృద్ధిశీలియై దర్పముతోనుండెను. శత్రువులగు పాండవుల సమక్షమున తన ఐశ్వర్య దర్పమును ప్రదర్శించి వారిని ఖిన్నులను చేయుటచే ఆనందముగలుగునని దుర్యోధనుని కర్ణాదులు ఉత్సాహపరచిరి. దుర్యోధనుడు తమ గోసంపదను లెక్కించు నెపమున (ఘోషయాత్ర) పాండవులున్న

ప్రదేశమునకు పోవుటకు ధృతరాష్ట్రుని అనుజ్ఞగైకొనెను. అచట దుర్యోధనుని యొక్క గోపాలురకు - గంధర్వులకు వివాదమేర్పడెను. కౌరవులకు - గంధర్వులకు యుద్ధము జరిగెను. కర్ణుడు పరాజయముపాలై పారిపోయెను. దుర్యోధనాదులు గంధర్వుల ద్వారా బందీలయ్యిరి. గంధర్వుల చెరనుండి కౌరవులను విడిపించమని యుధిష్ఠిరుడు భీమార్జునుల నాదేశించెను. పాండవులు గంధర్వులతో యుద్ధమొనర్చి ఓడించిరి. చిత్రసేన - అర్జున - యుధిష్ఠిరులు సంభాషించుకొని దుర్యోధనుని విడుదలచేసిరి. దుర్యోధనుడు అటుల విడుదలయి నంతనే హస్తినాపురమునకు మరలిపోవుచు ఒకచోట ఆగి తన పరాభవమునకు చింతిల్లుచు అనశన వ్రతముతో ప్రాణములను విడువదలంచెను. కర్ణుడు నచ్చజెప్పిననూ దుర్యోధనుడు ఆమరణదీక్ష మానకుండెను. అప్పుడు పాతాళములో దైత్యులు ఒక కృత్యను సృష్టించి దుర్యోధనుని రసాతలమునకు దెప్పించిరి. దానవులు దుర్యోధనునకు నచ్చచెప్పుటచే కర్ణుని ప్రోత్సాహముతో దుర్యోధనుడు మరల హస్తినా పురమును చేరెను, ఘోషయాత్రా రచన, గంధర్వులతో యుద్ధము మున్నగు విషయముల నాలకించిన భీష్ముడు అట్టి అనాలోచిత కర్మను ప్రోత్సహించిన కర్ణుని నిందించెను. అందులకు రోషముచెందిన కర్ణుడు దిగ్విజయ యాత్రకు బయలుదేరెను. అనేకమంది రాజులను జయించి దుర్యోధనుని వశము గావించెను. అందులకు పరమానందము చెందిన దుర్యోధనుడు ఘనముగా కర్ణుని సత్కరించెను. అపుడు కర్ణుని ప్రోత్సాహముతో దుర్యోధనుడు వైష్ణవ యజ్ఞమును చేసెను. ఆ సమయమున కర్ణుడు తాను యుద్ధములో అర్జునుని వధించెదనని ప్రతిజ్ఞచేసి దుర్యోధనునకు ధైర్యము కలిగించెను.

దుర్యోధనుడు ఒకప్పుడు దుర్వాసమహర్షికి గొప్ప ఆతిధ్యమునిచ్చి సంతృప్తిపరిచెను. దుర్వాసముని ఏదైనా కోరుకొనమని దుర్యోధనుని అనుగ్రహించెను. అందులకు దుర్యోధనుడు పాండవుల చెంతకుపోయి వారిని అతిథిసత్కార విషయములో పరీక్షించమని కోరెను. దుర్వాస మహాముని అందులకు అంగీకరించి సమయముగాని సమయములో పాండవులవద్దకు ఆతిథ్యము గోరి వెడలెను. అపుడు శ్రీకృష్ణుని అనుగ్రహముతో పాండవులు ఆ పరీక్షనుండి దాటగలిగిరి.

యుధిష్ఠిరాదులు కామ్యకవనము నందుండగా జయద్రథుడు తన మిత్రులతోగలిసి సౌవీర దేశమునకు పోవుచు మార్గమధ్యములో పాండవుల ఆవాసమును జూచెను. ఆ సమయమున పాండవులు ఆశ్రమమునకు దూరముగా వనవిహారమునకు పోయిరి. ద్రౌపది మాత్రమే ఆశ్రమ వాటికయందుండెను. జయద్రథుడు దూరమునుండి ఆమెను జూచి కోటికాస్యుడను తన మిత్రుని పంపి ఆమె వివరములు తెలుసుకొని రమ్మనెను. ద్రౌపదీదేవి వివరములను తెలుసుకొన్న జయద్రథుడు స్వయముగా ఆమె కడకేగి పాండవులను వదిలిపెట్టి తనవద్దకు వచ్చి సుఖభోగముల ననుభవించమని కోరెను. అందులకు ఆమె హతాశురాలై పరుషపద జాలముతో ఆయనను గద్దించుచు అటువంటి వచనములు పలికినందులకు సిగ్గుపడమని వివాదముతో కాలయాపన చేసెను, జయద్రథుడు ఆమె తిరస్కారమును పట్టించుకొనక అపహరించుటకు ఉద్యుక్తుడయ్యెను. ఆమె జయద్రథుని నిరసించుచు "అరే మూఢుడా! నీవు ధృతరాష్ట్రుని పుత్రులకు, పాండవులకు చెల్లెలగు దుశ్శల భర్తవుగావున నాకు అన్నవరుస అయ్యెదవు. కనుక నన్ను రక్షించవలసినవాడవు. ఏది ధర్మమో - ఏది న్యాయసంగతమో తెలియకుంటివా? నీ దృష్టి ధర్మమువైపు లేకున్నదేమి? నా పతులు మహా యశస్వంతులు, స్వధర్మపాలనాస్థిరులు, దేవరాజు ఇంద్రునివలె శక్తిశాలురని హెచ్చరించెను.

మహారథులగు పాండవులను జయించకనే వారి స్త్రీని గొనిపోవు అధికారము నీకులేదు. ఇపుడు నీవు చేయుచున్న అపహరణ దుష్కృత్యమునకు తగిన ఫలమును అనుభవించెదవు."అనెను. పాండవులు వనాంతరము నుండి మరలివచ్చి జయద్రథుని దుష్కృత్యమును సేవకులద్వారా తెలుసుకొని అతని మార్గమును అనుసరించి వెంబడించిరి. ఇంతలో ద్రౌపది తన భర్తల శౌర్యప్రతాపములను సవివరముగా జయద్రథునకు వినిపించ సాగెను.

పాండవులు తనను వెంబడించుట గమనించి నంతనే జయద్రథుడు భయపడి ద్రౌపదిని రథము నందే విడిచి శీఘ్రగామియగు అశ్వము నధిరోహించి పారిపోసాగెను. భీమార్జునులు అతనిని వెంబడించిరి. జయద్రథుడు తమ చెల్లెలు దుశ్శల భర్తయను విషయమును మరువక తగిన శాస్తిచేయమని యుధిష్ఠిరుడు భీమార్జునలకు పూర్వమే చెప్పెను. సింధురాజు అనుయాయులు భీమార్జునుల చేతిలో దారుణముగ పీడించబడిరి. వారి సైన్యము ఛిన్నాభిన్నమై నశించెను. గుఱ్ఱమునుకూడ వదిలి వేగముగ దౌడుతీసి పారి పోవుచున్న జయద్రథుని వెంబడించిన భీమసేనుడు వాని జుత్తుపట్టుకొని పదేపదే చెంపపెట్టులుపెట్టెను. జయద్రథుని తలపై కాలుతో తన్నెను. రెండు మోకాళ్ళతో త్రొక్కి పిడిగుద్దులతో పొడిచెను, పిమ్మట జయద్రథుని త్రాళ్ళతో బంధించి ఒక రథములో పడవైచి భీమార్జునులు ముందు వెనుకలుగా తమ రథములతో యుధిష్ఠిరుని చెంతకుగొనిపోయిరి. జయద్రథుడటుల బంధితుడగుట జూచిన యుధిష్ఠిరుడు పకపక నవ్వుచు వానిని యథేచ్ఛగా పోవునటుల విడువమనెను. అపుడు ద్రౌపది యుధిష్ఠిరుని వంకజూచి భీమసేనునితో "మహాభాగా! నీవితని శిరోముండనము గావించి ఐదుపిలకలు పెట్టితివి. ఇతడు యుధిష్ఠిర మహారాజునకు దాసుడనని కూడా అంగీకరించెను. కనుక యితనిని విడిచిపెట్టుము"అనెను. జయద్రథుడు భయ విహ్వలుడై మెల్లగా యుధిష్ఠిర మహారాజు చెంతకేగి ప్రణామ మొనర్చి, అచటనున్న ముని గణములకు శిరసాభివందనము చేసెను. అపుడు దయాళువగు యుధిష్ఠిరుడు "సింధురాజా! నీవిక దాసుడవుగాదు, నీకు విముక్తినిచ్చితిని. మరల ఎపుడూ యిటువంటి దుష్కర్మ చేయకుము. నీవు పరస్త్రీ నాశించితివి. ఇది నీ మర్యాదకు ధిక్కారము. నీవు చేసిన కర్మ లోకనిందితము. అశుభకర్మ చేయుటచే నీవు మృతప్రాయుడవు. నీ బుద్ధి ఉత్తరోత్తర ధర్మస్థిత మగునుగాక. నీ రథము - అశ్వములు - పదాతి సైనికులను తోడ్కొని కుశలపూర్వకముగ మరలిపొమ్ము"అనెను. జయద్రథుడు లజ్జితుడై తలవంచుకొని మౌనముగా వెడలిపోయెను. తాను పరాజితుడైనందులకు దుఃఖముతో కుమిలిపోయెను. గృహోన్ముఖుడుగాక సరాసరి హరిద్వారమునకు పోయి శివదీక్షాతత్పరుడై ఉమాపతిని గూర్చి గొప్ప తపస్సుచేసెను. శంకరభగవానుడు ప్రసన్నుడై దర్శనమిచ్చెను. జయద్రథుడు భగవానుని ప్రార్థించి తాను పంచపాండవులను యుద్ధములో జయించు నటుల వరముకోరెను. అందులకు శివమహాదేవుడు "జయద్రథా! పాండవులు అజేయులు - అవధ్యులు గావున నీ కోరిక సఫలముగాదు. నీవు కేవలము ఒకరోజు మాత్రము మహాబాహువు అర్జునుని తప్ప మిగిలిన నలుగురు పాండవుల పురోగతిని ఆపగలుగుదువు. ఏలననగా అర్జునుడు బదరిక ఆశ్రమములో నారాయణ మహర్షితో బాటు తపస్సుచేసిన సాక్షాత్తు నరమహర్షి. ఆయనను సంపూర్ణ లోకములు గలిసిననూ జయించలేరు. నేనతనికి పాశుపతాస్త్రమును కూడ ప్రసాదించితిని. దానికి సమానమగు అస్త్రములేదు. అంతేగాక ఆయనకు ఇతర

లోకపాలురు కూడ దివ్యాస్త్రములనిచ్చిరి''అని అంతర్ధానమొందెను.

ధర్మములు

పాండవులు వనవాసమునందుండగా శ్రీకృష్ణభగవానుడు వారి కుశలము దెలుసుకొనుటకు సత్యభామా సమేతుడై వెడలెను. యుధిష్ఠిరాదులు ఆయనను స్వాగతించి పూజించిరి. పాండవులు తమ పండ్రెండు సంవత్సరముల వనవాస ప్రతిజ్ఞను పూర్తిచేసిరి. తమ అజ్ఞాతవాస అవధిని కూడ పూర్తిచేసి శ్రీకృష్ణుని ఆజ్ఞానుధీనులమై వర్తించెదమనిరి. అదే సమయమున వేలసంవత్సరముల చిరంజీవియగు తపోవృద్ధుడగు మార్కండేయ మహాముని వచ్చుట పాండవులు గమనించిరి. తక్షణమే వారు ఎదురేగి విధిపూర్వకముగ అర్ఘ్యపాద్యాదులతో పూజించి స్వాగతించిరి. దేవర్షి నారదుడు కూడ పాండవులను కలియుటకు వచ్చెను. ప్రాచీనగాథలను వినుటయందు ఆసక్తితోనున్న అచటవారిని గమనించిన దేవర్షి నారదుడు "మార్కండేయ మునివర్యా! మీరు పాండవులకు ఏ విషయమును గురించి చెప్పదలంచితిరో వానిని దయతో ఉపదేశించుము" అనెను. అపుడు మార్కండేయ మహర్షి శుభా శుభకర్మల వివేచనము గురించి ఉపదేశించెను. యుధిష్ఠిరా! జీవులగతి తమతమ కర్మలననుసరించి యుండును. మనుష్యులు భగవంతుడు ఏర్పరిచిన పూర్వశరీరము ద్వారా అంతఃకరణములో శుభాశుభకర్మల అనంతరాశిని సంచిత మొనర్చెదరు. విధాత నిర్ణయించిన ఆయువు పూర్తయినంతనే యీ జరావిదీర్ణమైన స్థూల శరీరమును త్యాగమొనర్చి అదే క్షణములో వేరొక యోనిలో శరీరధారణార్థమై ప్రవేశించుటకు ఉద్యమించుదురు. ఒక శరీరమును విడిచి వేరొక శరీరమును ధరించు మధ్యకాలములో కూడ అతడు అసంసారిగ ఒక్కక్షణమైననూ యుండడు. జీవుడు వేరొక స్థూల శరీరమును ధరించ ప్రయత్నించు చున్నను అతడు చేసిన కర్మ ఛాయవలె జీవుని అనుసరించియుండి యథాసమయమున ఫలములను అందించును. అందుచే జీవుడు సుఖదుఃఖములను భోగించుటకు యోగ్యతను పొంది మరొక జన్మను గ్రహించును. శుభాశుభ లక్షణముల ద్వారా ఏ జీవునకు ఏఏ సుఖదుఃఖములు వర్తించునో వానిని నివారించుటలో జీవుడు అనమర్థుడగును. జ్ఞానదృష్టిగల మహాత్ములు యీ విషయమును దర్శించుదురు. వివేకవంతులకు కర్మఫలము కొంత ప్రారబ్ధవశమున, కొంత ఆకస్మికముగ, కొంత ఆచరణవలన లభించును. ఇందులో సందేహమెంత మాత్రము లేదు. ఈ కర్మ వివేచన సిద్ధాంతము విపులముగా 183వ అధ్యాయములోనున్నది.

మార్కండేయమహర్షి తపస్వీ స్వాధ్యాయ బ్రాహ్మణుల మాహాత్మ్యమును వర్ణించుచు పూర్వ సంఘటన యిటులవర్ణించెను. హైహయవంశ క్షత్రియులలో వరపురంజయుడను రాజకుమారుడు వేటకై వెడలెను. అచట – ఒక హింసక పశువు యొక్క నల్లని చర్మమును కప్పుకొని దూరముగ ఒక ముని కూర్చునియుండెను. రాజకుమారుడు ఆ మునిని జూచి హింసక పశువుగా దలంచి తన బాణము లతో వధించెను. అజ్ఞానవశముచే అట్టి పావకర్మ చేసినందులకు వ్యధితుడై శోక మూర్ఛితుడయ్యెను. తదనంతరము చేతనత్వము పొంది శీఘ్రమే హైహయవంశ పెద్దలకడకేగి జరిగిన దుర్ఘటనను యథాతథముగ చెప్పెను. అపుడా రాజులందరు మునిపుత్రుడు ఎవరైయుండునని విచారణజరిపి కశ్యపనందను డగు అరిష్టనేమి ఆశ్రమమునకు వెడలిరి. తాము బ్రాహ్మణహత్య జరిగిన ప్రదేశమునకు గొనిపోయిరి. కాని అచట బ్రాహ్మణమృతదేహము

లేకుండెను. అరిష్టనేమి తన పుత్రుని చూపించి యితడేనా మీచే వధించబడిన వ్యక్తి అని యడిగెను. వారు ఆ వ్యక్తిని జూచి విస్మయముచెందిరి. అపుడు అరిష్టనేమి వారితో "రాజులారా! మేము శుద్ధ ఆచార విచారములు గలవారము. ఎన్నడూ ఏ విషయము నందు ఆలస్యము చేయము. సంధ్యోపాసన పరాయణులమై యుందుము. శుద్ధ సాత్విక ఆహారమునే భుజించెదము. శుద్ధరీతిలో న్యాయోపార్జన చేయుదుము. సదా బ్రహ్మచర్యమును పాటించెదము. సత్యమునే పాలించుదుము. అసత్యమును మనస్సునందు పెట్టకయుందుము. బ్రాహ్మణులకు ఏవేవి శుభకర్మలగునో వానిని గురించి మాత్రమే చర్చించెదము. ఒకరి దోషముల గురించి సంభాషించము. అతిథులను అన్నపానీయములతో సంతృప్తి పరచెదము. మాపై భరణపోషణ బాధ్యత నున్నవారి బాగోగులు చూచుకొనెదము. సదా శమము - దమము - క్షమ - తీర్థ సేవనము - దానతత్పరులమై యుందుము. పవిత్రదేశము లందు మాత్రమే నివసించెదము. అందుచే మృత్యుభయము చెందకుందుము"అనెను.

పృథు చక్రవర్తిని అత్రిమహర్షి విధాతయని వర్ణించెను. అది యజ్ఞమంటపములో సదస్యుల నడుమ వివాదకారణమయ్యెను. అపుడు ధర్మజ్ఞుడగు సనత్కుమార బ్రహ్మర్షి అర్థయుక్తముగ యిటుల తీర్మానము చేసెను. బ్రాహ్మణుడు క్షత్రియునితో, క్షత్రియుడు బ్రాహ్మణునితో సంయుక్తమైనచో వారిరువురు కలిసి అగ్నివాయువులవలె పరస్పరము తోడై తమ శత్రువును నశింపచేయగలరు. రాజు ధర్మస్వరూపుడైనపుడు విఖ్యాతిచెందును. ప్రజాపతి - ఇంద్రుడు - శుక్రాచార్యుడు - భూపతి - నృపుడు శబ్దములతో స్తుతించబడు రాజును ఎవరైనా పూజించక యుందురా! రాజును పురాయోని (ప్రథమకారణముగ) - యుధాజిత్ (సంగ్రామవిజయీ) - అభయ (రక్షించుటకొరకు సర్వత్రా గమనము చేయువాడు) - ముదిత (ప్రసన్నుడు) - భవ (ఈశ్వరుడు) - స్వర్ణేతా (స్వర్గప్రాప్తి చేయించువాడు) - సహజిత్ (తత్కాలమునందే విజయమును ప్రాప్తింపజేయు వాడు) - బభ్రు (విష్ణువు) మున్నగు నామములతో వర్ణించెదరు. రాజు మాత్రమే సత్యమునకు కారణము - ప్రాచీన విషయములు నెరిగినవాడు - సత్యధర్మమునందు ప్రవృత్తి చెందునటుల చేయువాడు యగును. అధర్మమునకు భయపడిన ఋషులు తమ బ్రహ్మబలమును క్షత్రియులందు స్థాపితమొనర్చిరి. దేవలోకమునందున్న సూర్యుడు ద్యులోకమునుండి తన సంపూర్ణ తేజస్సుతో అంధకారమును పోగొట్టునటుల యీ పృథివినేలు రాజు అధర్మమును సర్వదా దూరమొనర్చును. అందుచే రాజును ప్రజాపతిగ - విధాతగ స్తుతించిన వాదన ఉత్కృష్టమని ధర్మ నిర్ణయము చేయబడినది.

ఒకప్పుడు తార్క్ష్య మహాముని గొప్ప తపస్సుచేయగా సరస్వతీదేవి సాక్షాత్కరించెను. అపుడు తార్క్ష్యమహాముని ఆమెతో "భద్రా! ఈ సంసారములో మానవులకు శుభము గలిగించు వస్తువేది? ఎటువంటి ఆచార వ్యవహారములు పాలించుటచే మానవులు ధర్మభ్రష్టులు గాకుందురు? నేను ఎటుల - ఏ సమయములో అగ్న్యారాధన - హవనములు చేయవలెను? ఏది చేయుట వలన ధర్మనాశము గాకుండును? దేనిచే నేను రజోగుణరహితుడనై లోకములందంతట సంచరించగలుగుదును?"అని అడిగెను. ఇందులకు సంబంధించిన రహస్యము లన్నియు నూటఎనభై యారవ అధ్యాయము నందున్నవి. అసత్యవాదిని సత్యభాషణముతోను, క్రూరుని క్షమా భావముతోను, దుష్టులను శుద్ధ వ్యవహారముతోను, నీచ ప్రకృతిగలవారిని

దానాదులతోను జయించి వశమొనర్చుకొనవలెను. యుధిష్ఠిరా! పుత్రహీనుడు, ధర్మ బహిష్కృతుడు, పరులపంచన బ్రతుకు గడుపువాడు, కేవలము తన కొరకు వండుకొని భుజించువాడు యను నలుగురి జన్మ వ్యర్థము. దేవతలకు, అతిథులకు నివేదనము చేయక ఒంటరిగా భుజించు పదార్థములు అసత్ భోజనమనబడును. ఆరూఢ పతితునకు (సన్యాసాశ్రమము నుండి మరల గృహస్థుడైన వానికి) చేసిన దానము వ్యర్థము. అన్యాయార్జనతో చేసిన దానము కూడ ఫలించదు. పతిత బ్రాహ్మణునకు - దొంగకు చేసిన దానముకూడ వ్యర్థమే. తండ్రికి - గురుజనులకు - సేవకులకు యిచ్చిన దానములు కర్తవ్య పాలనగ పరిగణించ బడును. కావున అవి ఫలకారకములు గావు. పాపాత్ములకు - కృతఘ్నులకు - గ్రామ పురోహితుడు - వేదవిక్రయము చేయువానికి - శూద్రునిచే యజ్ఞము చేయించిన బ్రాహ్మణునకు - నీచవృత్తి లేదా దుష్టబుద్ధిగల బ్రాహ్మణునకు - శూద్ర స్త్రీని వివాహమాడిన బ్రాహ్మణునకు - పాములుపట్టి జీవించువానికి - స్త్రీ సమూహము నకు యిచ్చిన దానములు ఫలప్రదములు గావు. ఇటులనే అనేక ధర్మములు మార్కండేయ మహర్షి రెండువందల అధ్యాయములో యుధిష్ఠిరునకు ఉపదేశించెను.

పాండవులు వనవాసము నందుండగా శ్రీకృష్ణుడు సత్యభామా సమేతముగ వారిని జూచుటకు వెడలెను. ఆ సమయమున ద్రౌపదీ సత్యభామలు సుఖపూర్వకముగ ఒకచోట ఆసీనులై పరస్పర హాస్యవినోద సంభాషణలు జరుపుచుండిరి. ఆ సమయమున ద్రౌపదీదేవి తాను పతిసేవా ధర్మమునెటుల ఆచరించుచుండెనో సత్యభామాదేవికి వివరించిన విధానము 233వ అధ్యాయము నందున్నది. అహంకార కామ క్రోధములను వదిలిపెట్టి సంపూర్ణ సావధానముతో భర్తను సేవించవలెను. కోర్కెలను అణుచుకొని మనస్సును సమస్థితిలో పెట్టుకొని పతిసేవా నిమగ్నమై యుండవలెను. ఎన్నడూ పరుష పదజాలమును దుర్వచనములను పలుకరాదు. అసభ్యముగా ఎచటనూ నిలువరాదు. నిర్లజ్జగా దిక్కులు చూడరాదు. దుష్టప్రదేశములో కూర్చొనరాదు. పతి కార్యార్థమై బయటకుపోయి మరలివచ్చినంతనే ఆసన జలాదులతో సత్కరించవలెను. స్వాదిష్ట వంటకము తయారుచేసి సమయానుసారము పతికి సమర్పించవలెను. భర్త పరిహాసవచనములు పలికినపుడు తప్ప మరెన్నడూ ఊరకనే నవ్వరాదు. పదేపదే వీధి ద్వారమునందు నిలబడరాదు. ఒంటరిగా గృహము ముంగిట లేదా పెరటిలో యుండరాదు. నీచ పురుషులతో సంభాషించరాదు. సదా సత్యభాషిణియై యుండవలెను. అత్తమామ లను నిందించరాదు. భర్త పరదేశమేగినచో శృంగారవేషము ధరించరాదు. పతిదేవునికన్న ముందుగా శయనించరాదు. క్రమము తప్పక ప్రొద్దుననే లేచి సముచిత సేవాకర్తవ్యములు నిర్వహించవలెను.

వ్యాసమహర్షి పాండవులచెంతకు వచ్చి సమయోచితముగ చేసిన ఉపదేశములు 250వ అధ్యాయములో వివరించబడినవి. ఆయన పాండవులతో "మానవులు తమ జీవనములో పదేపదే సుఖదుఃఖములు రెండిటిని భోగించుదురు. జగత్తులో ఏ ఒక్కరూ అంతులేని సుఖమును పొందజాలరు. ఉత్తమబుద్ధిగల జ్ఞానిమాత్రమే సృష్టిస్థితి లయకారుడగు పరమాత్మనెరిగి హర్షశోకములందు సమభావము గలిగి యుండును. వివేకవంతులు తమకు ప్రాప్తించిన సుఖమును త్యాగపూర్వకముగ, దానంతటదియే వచ్చిన దుఃఖమును ధైర్యపూర్వకముగ స్వీకరించవలెను.

మానవులు కాలానుగుణ్యముగ దైవవశముచే ప్రాప్తించు సుఖదుఃఖములను గ్రహించవలెను. తపస్సుకన్న మించిన సాధనము మరొకటిలేదు. తపస్సుతో ఏదైననూ సాధించవచ్చును. యుధిష్ఠిరా! సత్యము - సరళవ్యవహారము - అక్రోధము - దేవతలకు అతిథులకు నివేదించిన పిమ్మట భుజించుట - ఇంద్రియసంయమనము - మనోనిగ్రహము - ఇతరులకును ద్వేషించకయుండుట - అహింస - బాహ్యాభ్యంతర శుచి గలిగి యుండుట - ఇంద్రియములను సంయమనమునందుంచుకొనుట యను సద్గుణములు పుణ్యాత్మ పురుషులను పవిత్ర మొనర్చును. అధర్మమునందాసక్తి చెందు మూఢ మానవులు పశుపక్ష్యాది తిర్యగ్యోనులందు జన్మించుదురు. మానవులు తమ శరీరమును తపింపజేయుచు నియమవ్రతపాలకులై యుండ వలెను. సత్యవాదికి దీర్ఘాయువు, క్లేశరహిత జీవనము, సరళభావము ప్రాప్తించును. ఎవరిపైనను క్రోధము జూపక, ఇతరులందు దోషములనెన్నక యుండువానికి పరమానంద ప్రాప్తియగును. తన మనస్సును వశమునందుంచు కొనువాడు ఇతరుల సంపత్తిని జూచి సంతప్తము చెందకయుండును. దేవతలకు, అతిథులకు వారివారి భాగములను నివేదన పూర్వకముగ సమర్పించువాడు భోగసామగ్రి సంపన్నుడగును. ప్రాణిహింస చేయనివానికి ఉత్తమ ఆరోగ్యము ప్రాప్తించును. మాననీయ పురుషులను సన్మానించువానికి గొప్పకులములో జన్మించు భాగ్యము కలుగును. జితేంద్రియ పురుషులు ఎన్నడూ దుర్వ్యసనములబారిన పడకుందురు. దానమును మించిన దుష్కరకార్యము యీ పృథివిలో లేదు. న్యాయార్జిత ధనసంపదను ఉత్తమదేశము - కాలము - పాత్రతనెరిగి శ్రేష్ఠపురుషులకు దానము నీయవలెను.

యక్షప్రశ్నలు గుహ్యాతి గుహ్యమగు ధర్మ జ్ఞానమును వ్యక్తమొనర్చినవి. యుధిష్ఠిరుడు తన సమాధానములతో ధర్మదేవతను ప్రసన్నము గావించెను. ఈ ప్రసంగము 311 నుండి 315 అధ్యాయము లందున్నది. పాండవులు వనవాసము నందుండగా ఒకనాడు బ్రాహ్మణుడొకడువచ్చి తన అరణికాష్ఠములు వృక్షశాఖకు వ్రేలాడదీసి అన్యకార్యమునందుండగా ఒక మృగము తీటదీరుటకు వృక్షమునకు తన శరీరమును రాపిడిచేసెను. అపుడా వృక్షశాఖనుండి వ్రేలాడుచున్న అరణిమంథన కాష్ఠములు జారిపడి మృగముయొక్క శృంగములకు చిక్కుకున్నవి. ఆ మృగము భయపడి ఎగురుచు గెంతుచు శీఘ్రమే పరుగుదీసి అడవిలోనికి పోయెను. బ్రాహ్మణుడు పాండవులవద్దకు పోయి తన అగ్నిహోత్ర కార్యము సుసంపన్నమొనర్చుటకు అరణికాష్ఠములు తెమ్మని అడిగెను. యుధిష్ఠిరుడు తక్షణమే తన తమ్ములతో గలిసి మృగముయొక్క పాదచిహ్నములను పరీక్షించుచు వనములోనికి పోయెను. మృగము గురించి అన్వేషించుచూ అలసిపోయిరిగాని సఫలీకృతము గాకుండిరి. వారొక వృక్షమూలము నందు కూర్చొని దాహార్తితో దగ్గరలో జలాశయమును కనుగొనిరి. నకులుడు శీఘ్రమే ఒక పాత్రతో నీరు దెచ్చుటకుపోయెను.

కాని అచట కొంగరూపమునందున్న యక్షుడొకడు తన ప్రశ్నలకు సమాధానము నీయనిదే జలాశయమునందలి జలమును గొనిపోవరాదని శాసించెను. కాని నకులుడు అతని ఆజ్ఞను తిరస్కరించి జలపానము చేసి అచేతనుడై పడిపోయెను. అటులనే వరుసగా భీమార్జున సహదేవులు కూడ యక్షుని తిరస్కరించి అచేతనులై పడిపోయిరి. తన తమ్ములు ఎవరూ తిరిగిరాకుండుటచే యుధిష్ఠిరుడు స్వయముగా జలాశయము చెంతకేగి కొంగరూపముతోనున్న యక్షుని

ప్రశ్నలకు సమాధానమునీయ సంసిద్ధు డయ్యెను. యుధిష్ఠిర - యక్ష సంవాదము నందు అనేక గుప్తవిషయములు చర్చించబడినవి. అందులకు సంతృప్తిచెందిన యక్షుడు నలుగురు పాండవులను సజీవులను గావించెను. ధర్మదేవత ప్రత్యక్షమై యుధిష్ఠిరుడు కోరిన విధముగ లోభమోహ క్రోధములపై విజయము ప్రాప్తించునటుల, ఆయన మనస్సు ఎల్లవేళలా ధర్మలగ్నమై యుండునటుల ఆశీర్వదించెను.

ఉపాఖ్యానములు

వైవస్వత మనువు చరిత్ర 187వ అధ్యాయములో నున్నది. వైవస్వతుడు తనతండ్రి సూర్యునికన్న, తాత కశ్యపుని కంటె ఘనుడయ్యెను. ఆయన బదరికాశ్రమమునకు పోయి ఊర్ధ్వబాహువై ఒంటికాలిపై నిలిచి పదివేల సంవత్సరములు గొప్ప తపస్సుచేసెను. అతడొకనాడు తడి బట్టలతో చీరిణీ నదీతీరమునందుండగా ఒక చేపపిల్లవచ్చి రక్షించమని కోరెను. మనువుకూడ పుత్రవాత్సల్య భావమును జూపి ఒక ఘటపాత్ర జలములో పెంచెను. ఆ మత్స్యము క్రమక్రమముగా పెరుగజొచ్చుటచే ఘటమునుండి బావిలోనికి, బావినుండి గంగానదిలోనికి, మరికొంత కాలమునకు సముద్రములోను వదిలి పెట్టెను. అపుడా మత్స్యము "రాజా! నీకు పరమహితముగూర్చు విషయమునొకటి చెప్పెదను. నీవు ఒక దృఢమగు నౌకను నిర్మింపజేయుము. ఆ నౌకను లాగుటకు బలమగు త్రాడునుకూడ తయారుచేయించుము. పూర్వము బ్రాహ్మణులు వేనిని వివిధ బీజములుగ వర్ణించిరో, వానినన్నిటిని సంగ్రహించి ఆ నౌకలో నిక్షప్త మొనర్చుము. సప్తర్షులను ఆ నావలో సురక్షితముగ ఆసీనులను చేయుము. నీవు కూడ ఆ నౌకలో కూర్చుని నా కొరకు నిరీక్షించుము. నేను నా శిరస్సుపై పెద్ద శృంగమును ధరించి నీ చెంతకు వచ్చెదను. ఆ విధముగ నీవు నన్ను గుర్తించగలవు. ఏకార్ణవ జలరాశి ఏర్పడినపుడు నీవు నా సహాయముతోనే దాటెదవు. మనువు అటులనే చేసి మహామీనము గురించి నిరీక్షించెను. ఒకనాడు కొమ్ముధరించిన విశాలకాయముగల మహామీనము వచ్చినంతనే మనువు మత్స్యశృంగమునకు త్రాడును దృఢముగా కట్టెను. లోకములన్నియు ఏకార్ణవ జలమునందు మునిగిపోగా కేవలము సప్తర్షులు - వైవస్వత మనువు - మత్స్య భగవానుడు మాత్రమే అపుడు అగుపడుచుండిరి. ఆ సమయమున సముద్రము గంభీర ఘోషతో గర్జించుచు ఉత్తాల తరంగములతో చంచలమైయుండెను. ప్రచండ వాయువులతో మహాసాగరము విక్షుబ్ధమగుచుండెను. అపుడా నౌక చంచల చిత్తముగల స్త్రీవలె వయ్యారముగ కదలుచుండెను. మహామీనము ఆ నౌకను ఏకార్ణవ జలములో అనేక సంవత్సరములు సురక్షితముగ లాగుచు ఒకానొక సమయమున హిమాలయ పర్వత సర్వోత్తమ శిఖరము చెంతకు చేర్చిన పిమ్మట సప్త ఋషులతో ఆ నౌకను హిమాలయ శిఖరమునకు బంధించమని ఆదేశించెను. మత్స్యభగవానుని వచనానుసారము ఋషులటుల చేయుటచే నాటినుండి ఆ ప్రదేశమునకు "నౌకాబంధనము"యను నామము సిద్ధించెను. తదనంతరము మత్స్యభగవానుడు మన్వాది ఋషులతో ఋషులారా! నేను ప్రజాపతి బ్రహ్మను. నాకన్న వేరుగా ఏ వస్తువులేదు. పరబ్రహ్మమునగు నేనే మత్స్యరూపము ధరించి మిమ్ములను యీ మహాప్రళయ భయమునుండి రక్షించితిని. మీరిపుడు చరాచర సృష్టిని గావించవలెను. మీరు తపస్సు ద్వారా యీ కార్యమును చేయగలరు. నా కృపవలన మీరు యీ ప్రజాసృష్టి చేయు సమయమున మోహితులు గాకుందురు"అని పలికి అంతర్ధానమొందెను.

తదనంతరము వినయశీలియగు యుధిష్ఠిరుడు "మహామునీ! మీరు వేలకువేలు యుగాంతము లందు జరిగిన అనేక ప్రళయములను దర్శించి యుండవచ్చును. ఈ సంసారములో మీవంటి దీర్ఘజీవి యింకొకరు లేరు. అంతరిక్షాది లోకములు శూన్యములైనపుడు కేవలము మీరు ఒక్కరే బ్రహ్మదేవుని చెంతనిలిచి ఉపాసనచేయుదురు. దయతో మీరు ప్రళయ దర్శన వృత్తాంతమును వర్ణించుడు"అనెను. అపుడు మార్కండేయమహర్షి "యుధిష్ఠిరా! మన చెంతనే యున్న యీ జనార్దన భగవానునకు ఆద్యంతములు లేవు. శ్రీకృష్ణ భగవానుడే సర్వభూతస్వరూపుడు - అవ్యయుడు - అక్షయుడు. ఆయనే సర్వమునకు కర్త. ఆయనకు ఎవరూ కర్తలేదు. అంతర్యామి ఆత్మయగుటచే ఆయన అందరినీ ఎరుగును. కాని ఆయనను ఎవరూ ఎరుగరు. పురుషార్థ ప్రాప్తికి ఆయనే కారణమగును. సంపూర్ణ జగత్తు ప్రళయములో లయముచెందగా ఆదిభూతమగు పరమేశ్వరుడు మాత్రమే మిగిలియుండును. మరల సంపూర్ణ ఆశ్చర్యకరమగు యీ జగత్తు ఆయన నుండి ఉత్పన్నమగును. ఈ సందర్భమున యుగ పరివర్తనము, యుగధర్మములు, యుగలక్షణములు సంపూర్ణముగ వివరించబడెను. ఏకార్ణవ జలము ఏర్పడుట, విశాల వటవృక్ష శాఖనుండి ఉయ్యాల మంచము వ్రేలాడుట, అద్భుత బాలుడు అగుపడుట, మార్కండేయ మహర్షి బాలముకుందుని గర్భములో చేరుట, పదునాలుగు భువనములను దర్శించుట, బాలముకుందుడు తన పరిచయ మొనర్చుట, వర్ణించబడినవి. అపుడు బాలముకుందుడు "మార్కండేయా! నేను ముల్లోకములందు వ్యాప్తమైయుంటిని. సంపూర్ణ విశ్వమునకు నేనే ఆత్మను. ప్రాణులన్నిటికి సుఖము నేనే గూర్చెదను. సమస్త ఉత్పత్తికి నేనే కారణమును, సర్వవ్యాపి అనంతుడను. నేనే ఇంద్రియ నియంతను. నేనే మహా విక్రమశాలిని, నేనే సమస్తభూత సంహారకుడను. నేనే అందరినీ ఉద్యోగశీలురను చేయుదును. కాలచక్రమును నేనే త్రిప్పెదను. ఈ ప్రకారముగ నా స్వరూపభూత ఆత్మయే సమస్త ప్రాణుల అంతరంగములో చక్కగా స్థితమైయున్నది. అయిననూ జనులు నన్ను తెలియకున్నారు"అని తన తత్త్వమును చెప్పెను.

కలియుగ వర్తనము గురించి నూటతొంబదివ అధ్యాయము చక్కగా వర్ణించినది. దీర్ఘజీవులు అనుభవించు సుఖదుఃఖములగురించి 193వ అధ్యాయము నందున్నది. దల్భ్యమహర్షి పుత్రుడగు ఒక మహర్షికి దేవరాజు ఇంద్రునకు జరిగిన సంవాదములో ఒకప్పుడు దేవేంద్రుడు చిరాయువుగా నున్న బకమహర్షిని "మహర్షీ! ఇప్పటికి మీ ఆయుష్షు లక్ష సంత్సరములు పైబడినది. మీ అనుభవము ప్రకారము చిరాయువులగు మానవులకు ఎట్టి దుఃఖపరిస్థితులేర్పడును' అని అడిగెను. అందులకు బక మహర్షి "దేవేంద్రా! తన కనుల ఎదుటనే దారాపుత్రుల మృత్యువు సంభవించును. అన్నదమ్ములు, స్నేహితులు, జాతిబంధువులు, సుహృదుల వియోగముతో తన జీవన నిర్వాహమునకై ఇతరులపై ఆధారపడి దూషణ తిరస్కారములను అనుభవించు పరిస్థితి ఏర్పడును. ఇంతకన్న దుఃఖమేదైనా యుండునా! ధనహీనుడు ఇతరుల ద్వారా పొందు తిరస్కార భావమునకు మించిన గొప్ప కష్టము యీ సంసారములో మరొకటి యుండదని తలంచెదను. కులీనుల కులసంహారము, సంయోగ వియోగములను చిరాయువులు దర్శించెదరు. దేవతలు, దానవులు, గంధర్వులు, మనుష్యులు, నాగులు, రాక్షసులకైనా యీ విపరీత అవస్థలు సంభవించుట మీకు విదితమే. జ్ఞానహీన మూఢులు సుఖభోగములందు తేలియాడుట, జ్ఞానులు క్లేశములు పొందుట చిరాయువులు చూచెదరు. దేవరాజా! దినములో ఆరవ

లేదా ఎనిమిదవ భాగములో తన గృహము నందు శాకము వండుకుని భుజించుటయే గాని ఎవరిపైననూ ఆధారపడక యుండువానికి లభించు సుఖము చాలా గొప్పది. పరాన్నభుక్కులుగా జీవించు ఇచ్ఛగలవారిని ఎంగిలి కూడు నాకు కుక్కలుగా లోకులు పరిగణించెదరు. అట్టి దురాత్ముల లేదా కృసణుల భోజనమునకు ధిక్కారము. శ్రేష్ఠద్విజులు తాము వండుకున్న భోజనమును అతిథి అభ్యాగతులకు, భూతప్రాణులకు, పితరులకు సమర్పించిన పిమ్మట అనగా బలివైశ్వదేవాదుల అనంతరము శేషాన్నమును భుజించు వానికి వేయిగోదానములు చేసిన పుణ్యము ప్రాప్తించును. ఆ పుణ్యము తాను యౌవనావస్థలో చేసిన పాపములను పోగొట్టును" అనెను.

శరణాగత రక్షణకై శిబిచక్రవర్తి తన ప్రాణములను సైతము సమర్పించుటకై సిద్ధమైన ఉపాఖ్యానము 197, 198 అధ్యాయము లందున్నది. అటులనే శిబిచక్రవర్తి అతిథి సేవా వ్రతములో తన పుత్రుని సైతము నధించి దహన సంస్కారము లొనర్చి బ్రాహ్మణుని కొరకు భోజనము గైకొని వెడలెను. పిమ్మట బ్రాహ్మణ అతిథి ఆ భోజనమును శిబినే స్వయముగా భుజించు మనెను. శిబి ఏ మాత్రము వికారములు పొందక శాంతభావముతో నుండెను. అపుడు ధర్మదేవత ప్రత్యక్షమై అనంతలోకములు ప్రాప్తించు నటుల ఆశీర్వదించెను. ఇక్ష్వాకు వంశములో కువలాశ్వుడను రాజునకు ధుంధుమారుడను నామ మెటుల సిద్ధించెనో మార్కండేయ మహర్షి 201 నుండి 204 అధ్యాయములలో చెప్పెను. ఉత్తంక మహర్షి గొప్ప తపస్సు చేయగా శ్రీహరి ప్రత్యక్షమై ఉత్తంకుని హృదయములో యోగవిద్య ప్రకాశించునటుల వరము నిచ్చెను. దాని ద్వారా దేవతలకు ముల్లోకములకు మేలు గలుగు మహత్కార్యము చేయమనెను. ధుంధువను రాక్షసుని వధించునటుల కార్యనిర్వహణ గావించ మనెను. అపుడు ఉత్తంకుడు కువలాశ్వునిలో యోగవిద్యను ప్రవేశింపచేసి ధుంధువను రాక్షసుని హతమార్చెను. నాటి నుండి కువలాశ్వునకు ధుంధుకుమారుడను పేరు గలిగెను.

మార్కండేయమహర్షి పతివ్రతాస్త్రీ – మాతా పితృసేవాధర్మము యొక్క మాహాత్మ్యమును గురించి యిటుల చెప్పెను. "యుధిష్ఠిరా! కొందరు మాతృమూర్తులను గౌరవదృష్టితో చూడవలె ననెదరు. కొందరు తండ్రి యొక్క మహాత్మ్యమును గొప్పదనెదరు. కాని తల్లి తన సంతానమును పాలించి పోషించి పెద్దవారిని చేయుట కఠిన కార్యము గదా! మాతా పితరులు తపస్సుతో, దేవతలను పూజించుట ద్వారా, తీర్థసేవనము, పుణ్యవ్రతాచరణము, దేవతలకు వందనము చేయుట, తితిక్ష, అన్యశ్రేష్ఠ ఉపాయములతో పుత్ర ప్రాప్తికై ప్రయత్నించుదురు. ఆ ప్రకారము పుత్రుని పొందిన మాతాపితరులు తమ ఆశలు సఫలమగు నని కాంక్షించెదరు. పుత్రధర్మమును పాలించు పుత్రుడే ధర్మజ్ఞుడు. స్త్రీలకు ఉపవాసములు – యజ్ఞకర్మలు – శ్రాద్ధ కర్మలు చేయు ఆవశ్యకత లేదు. పతిసేవయే స్త్రీలకు పరమార్థ సాధనము. మాతాపితర సేవ చేయువాడు స్వర్గలోకముపై విజయమును సాధించును" అనెను. ఆ సందర్భమున ధర్మ వ్యాధోపాఖ్యానమును 206 నుండి 216 అధ్యాయములలో చెప్పెను. ఇందులో పతివ్రతా మహాత్యము – మాతాపితర సేవా మహాత్మ్యము చెప్పబడెను. కౌశికుడను బ్రాహ్మణుడు వేదాధ్యయన సంపన్నుడై గొప్ప తపస్విగా ద్విజశ్రేష్ఠునిగా పేరొందెను. అతడొక వృక్షఛాయలో కూర్చుని వేదమును వల్లెవేయుచుండెను. ఆ సమయమున అదే వృక్షముపై నున్న కొంగ బ్రాహ్మణునిపై రెట్టవేసెను. బ్రాహ్మణుడందులకు క్రోధించి తీక్షణముగ దృష్టి సారించెను. అపుడా కొంగ నేలపై బడి అచేతనమై

వడుట గని ఆ బ్రాహ్మణుని హృదయము దయాభావములో ద్రవించెను. తాను చేసిన పనికి పశ్చాత్తాపము చెంది సమీపమునందున్న గ్రామమునకు పోయి భిక్షకొరకు ఒక గృహము చెంత నిలిచి "భిక్షాందేహి మాతాన్నపూర్ణేశ్వరీ" అని అడిగెను. ఆ గృహిణి లోపల నుండి "ఆగుము" అనెను. అంతలో ఆమె పతిగృహమునకు వచ్చెను. ఆమె పతిసేవలో నిమగ్నమై బ్రాహ్మణభిక్షువు గురించి కొంత ఆలస్యము చేసెను, అందులకు సంతప్తుడగుచున్న బ్రాహ్మణునితో "విద్వాంసుడా ! క్షమించుము. నాకు పతియే ప్రత్యక్షదైవము. ఆయన సేవలో లగ్నమై యుంటి"ననెను. అపుడా బ్రాహ్మణుడు "అరీ! నీవు పతియే ప్రత్యక్ష దైవమనుచుంటివి. బ్రాహ్మణుడు పెద్ద దైవము గదా. బ్రాహ్మణుడు అగ్ని సమాన తేజస్వంతుడు. బ్రాహ్మణ ప్రభావము నీకు తెలియ దనుకొందును" అనెను. అందులకు ఆ సాధ్వి "బ్రహ్మన్! నీ క్రోధదృష్టికి భస్మమగుటకు నేను కొంగవంటి పక్షిని గాను. నా పతివ్రతా ధర్మములో నేనుంటిని. మనస్వులగు బ్రాహ్మణులు దేవతా సమానులు. నేను బ్రాహ్మణులను అవమానించను. నా అపరాధమును క్షమించుము. విప్రోత్తమా! క్రోధ మోహములను త్యజించిన వానిని బ్రాహ్మణుడని దేవగణములు గుర్తించెదరు. ద్విజశ్రేష్ఠా! స్వాధ్యాయము, మనో నిగ్రహము యనునవి బ్రాహ్మణునకు సనాతన ధర్మములు. సరళ స్వభావము సర్వోత్తమ ధర్మమని ధర్మజ్ఞులు వచించెదరు. సనాతన ధర్మ స్వరూపము నెరుగుట అత్యంత కఠినమైనదైననూ అది సత్యమునందు ప్రతిష్ఠితమని తెలుసుకొనుము. వేద ప్రమాణితమైనదే ధర్మమని వృద్ధపురుషులు ఉపదేశించెదరు. విప్రవరా! నీవు స్వాధ్యాయ పరాయణుడవు. శౌచాచారము గల పవిత్రుడవు. అయిననూ నా అభిప్రాయము ప్రకారము నీకు ధర్మము యొక్క యదార్థ జ్ఞానము లేకున్నది. నీకు పరమధర్మము ఏదియో తెలియకున్నచో మిథిలాపురములో ధర్మవ్యాధుడను వాని వద్దకు పోయి అడిగి తెలుసుకొనుము. అతడొక బోయవాడు, మాతాపితర సేవాతత్పరుడై యున్నాడు. అతడు సత్యవాది -జితేంద్రియుడు, నీకు ధర్మోపదేశము చేయగల సమర్థుడు" అనెను. ఆ పతివ్రతా సాధ్వి పలికిన వచనములను విశ్లేషించుకొనుచు ఆ కౌశిక బ్రాహ్మణుడు మహాదాశ్చర్యము చెందెను. ధర్మసూక్ష్మగతి ఎట్లుండునని విచారణ చేసి తాను పతివ్రత సూచించిన విషయముపై శ్రద్ధా-విశ్వాసము పెంచుకొని అవశ్యము మిథిలానగరమునకు పోయి పుణ్యాత్ముడు ధర్మజ్ఞుడునగు బోయవానితో ధర్మవిషయములు చర్చించనిశ్చయించు కొనెను. ఆయన మిథిలానగర పురవీధులలో తిరుగుచు ధర్మవ్యాధుని గురించి ప్రశ్నించుచు ఎట్టకేలకు అతనిని కనుగొనెను. ధర్మవ్యాధుడు వేవేగ ఎదురేగి "భగవన్! మీ చరణములకు ప్రణామములు. మీరు శ్రమించి వెదుకుచున్న వ్యాధుడను నేనే. మిమ్ములను ఏ విధముగ సేవించవలెనో ఆజ్ఞాపించుము. మిమ్ములను మిథిలాపురమునకు వెడలమని పతివ్రతా స్త్రీ చెప్పిన విషయము నేనెరిగితిని. మీరు ఏ ఉద్దేశ్యముతో యిచటకు వచ్చితిరో నాకు తెలుసును" అనెను. భగవన్! ఈ స్థానము మీరు నిలిచి యుండుటకు యోగ్యమైనది గాదు. మన మిరువురము మా గృహమునకు పోయెదము" అనెను.ఆ ప్రకారము ధర్మవ్యాధుడు తన గృహమునకు బ్రాహ్మణుని గొనిపోయి తన వృద్ధమాతాపితరులను చూపించెను. తాను మాతా పితర సేవతోనే ఆ పతివ్రతా స్త్రీ యొక్క హితవచనమును తెలుసు కొనగలిగితినని చెప్పెను. పిమ్మట ధర్మవ్యాధుడు అహింసాతత్త్వము - సత్యభాషణము గురించి తదితర అనేక ధర్మముల గురించి విస్తృతముగా వర్ణించెను. హింస అహింసల వివేచనము - ధర్మసూక్ష్మము - శుభాశుభకర్మల

ఫలము - విషయసేవనము వలన సంభవించు హాని - సత్సంగము వలన లాభము - బ్రాహ్మీ విద్యవర్ణనము - పంచభూతముల గుణములు- ఇంద్రియ నిగ్రహము - త్రిగుణస్వరూప ఫల వర్ణన - ప్రాణవాయువు స్థితి - పరమాత్మ సాక్షాత్కార ఉపాయము - మాతాపితృసేవన మాహాత్మ్యము - ధర్మవ్యాధుని పూర్వజన్మ వృత్తాంతము - బ్రాహ్మణునకు సదుపదేశము మున్నగునవి పలికెను.

తదనంతరము మార్కండేయ మహర్షి అగ్నివంశము గురించి వర్ణించెను. అగ్నిదేవుడు అంగిరామహర్షిని ప్రథమపుత్రునిగా స్వీకరించుట - అగ్నిదేవుని ప్రథమ పుత్రుడైన అంగిరాముని సంతతి - బృహస్పతి సంతాన వర్ణనము - పాంచజన్య అగ్ని ఉత్పత్తి - తత్సంతతి వర్ణనము - అగ్నిస్వరూప భాను సంతతి వర్ణన 217 నుండి 227 అధ్యాయము లందున్నది.

మార్కండేయ మహర్షి స్కందోపాఖ్యానమును 223 నుండి 232 అధ్యాయములందు విస్తారముగ వర్ణించెను. ఇంద్రుడు దేవసేనను రక్షించుట - దేవసేనకు యోగ్యుడగు పతినీయమని దేవేంద్రుడు బ్రహ్మదేవుని ప్రార్థించుట - స్వాహాదేవి ఋషిపత్నుల రూపములతో అగ్నిదేవుని గలసి స్కందోత్పత్తి గావించుట - బాలుడగు స్కందుని అగ్న్యాది దేవతలు రక్షించి పాలించుట - దేవేంద్రాది దేవతలకు స్కందుని అభయ ప్రదానము - స్కందానుచరుల సృష్టి - దేవసేనాధిపత్యము - దేవసేనతో వివాహము - కృత్తికలకు నక్షత్ర మండలప్రాప్తి - మనుష్యులను పీడించు గ్రహములు- స్కందుడు స్వాహాదేవిని సత్కరించుట యను విషయములు కూలంకషముగా వర్ణించ బడినవి. రుద్ర భగవానుడు అగ్నిదేవునిలో ప్రవేశించి, పార్వతీదేవి స్వాహాదేవి యందు ప్రవేశించుటచే స్కందోత్పత్తి జరిగెనని బ్రహ్మదేవుని వచనముల నాలకించిన స్కందుడు తన నిజ మాతాపితరులను సందర్శించుటకు బయలుదేరెను. స్కందభగవానుడు దేవసేనాపతిగా అభిషిక్తుడైన పిమ్మట శివపార్వతులు భద్రపట ప్రాంతము నుండి బయలుదేరిరి. శివుని ఆదేశము ప్రకారము మారుతస్కంద నామాంకితులైన దేవగణములు సప్తమ వ్యూహమును రక్షించుచు పదే పదే మహాదేవుని ఆజ్ఞానువర్తులై అసురులతో యుద్ధము జరిపిరి. దేవేంద్రునితో బాటు దేవతలందరు స్కందునకు బాసటగ నిలిచిరి. దేవాసుర సంగ్రామము భయంకరముగా జరిగెను. స్కందుడు తన పరాక్రమము ద్వారా శత్రువులను సంపూర్ణముగా సంహరించి విజయమును సాధించెను. ఆ సమయమున దేవతలు, ఋషులు, స్కందుని అనేక నామములతో స్తుతించిరి. ఏకాగ్ర చిత్తముతో స్కందోపాఖ్యానము పఠించువారు, శ్రవణము చేయువారు ధనము - ఐశ్వర్యము- దీర్ఘాయువు - ఉజ్జ్వల యశస్సు - పుత్రసంతతి - శత్రువిజయము - పుష్టి తుష్టి గలవారై వర్ధిల్లుదురు. దేహాంతమున స్వర్గసుఖప్రాప్తి గలవారగుదురు.

ముద్గలుని దానధర్మ ధైర్యములను దుర్వాస మహర్షి పరీక్షించుట, స్వర్గవాసమును నిరాకరించుట 260-261 అధ్యాయములందున్నది. ముద్గలుడను ఋషి కురుక్షేత్రములో శిలోంఛిత వృత్తి నాచరించుచు అతిథిసేవావ్రతమును చేయుచుండెను. ఆయన కపోత వృత్తితో తన వద్ద నున్న ద్రోణి (పదునారు శేరుల ప్రమాణము) యను పాత్ర యందు ధాన్యము నిలువ నుంచుకొని ప్రతిదినము అతిథి అభ్యాగతులను ఆదరించి అన్నదానము చేయుచుండెను. ఆయన తపస్వి కూడ యగుటచే ద్రోణిలో ఉన్న ధాన్యము తరుగకయుండెను. దుర్వాసమహర్షి ఆయన అన్నదాన నిష్ఠను పరీక్షించుటకు వరుసగా ఆరుసార్లు భిక్షకేగి ధాన్యము నంతటిని భుజించినను ముద్గలుడు తన కపోత వృత్తితో సంపాదించిన ధాన్యముతో అతిథి

సేవాతత్పరుడై యుండెను. అందులకు దుర్వాసమహర్షి సంతుష్టుడై ముద్గలుడు సశరీరముగ స్వర్గమునకు పోయెదవని ఆశీర్వదించెను. తక్షణమే ఒక దేవదూత స్వర్గమునుండి విమానమును దెచ్చెను. ముద్గలుడు దేవదూతతో "దేవదూతా! స్వర్గవాసుల గుణములను గురించి వినదలంచితిని. అచట నున్నవారు ఎట్టి తపస్సంపన్నులో తెలియచేయుము" అని అడిగెను. అందులకు దేవదూత "మునీ! స్వర్గలోకములు యిచటకు చాలా దూరములో ఊర్ధ్వముగా నున్నవి. తపస్సు- యజ్ఞములు చేయనివారు, అసత్యవాదులు, నాస్తికులు స్వర్గలోకములకు పోజాలరు. స్వర్గలోకములు అనేకమున్నవి. అచట నున్న వారికి ఇచ్ఛానుసారము భోగములు ప్రాప్తించును. స్వర్గలోకములో ముప్పది మూడువేల యోజనములు ఎత్తుగానున్న సువర్ణమయ మేరుగిరి యున్నది. స్వర్గలోకవాసులకు ఆకలిదప్పిక లుండవు. మునిశ్రేష్ఠా! దేవలోకములన్నియు వివిధ గుణసంపన్నములై యుండును. ఆ లోకములకు పైన బ్రహ్మలోకమున్నది. అది తేజస్వంతము, మంగళమయమై యుండును. శుభకర్మలతో పవిత్రులైన ఋషులు-మునులు అచటకు పోయెదరు. సకామనతో చేసిన శుభకర్మల ఫలమునే స్వర్గములో భోగించెదరు. అచట కొత్త కర్మలు ఏవియూ చేయబడవు. తమ పుణ్యరూప మూలధనమును మాత్రమే అచట భోగించెదరు.

కర్మఫలభోగము సమాప్తమైనంతనే స్వర్గము నుండి పతనము చెందవలసి యుండును. స్వర్గములో కూడా సుఖభోగములలో నీచ-ఉన్నత భేదము లుండును. ఈ ప్రకారము స్వర్గలోకమునందలి అనేక దోషములను కూడ ఎరిగిన ముద్గలుడు తనకు స్వర్గేచ్ఛ లేకున్నదని దేవదూతను వెడల నంపెను. తాను శిలోంఛిత వృత్తికి అంకితమై శమదమాది నియమములను పాలించెను. విశుద్ధ జ్ఞాన యోగము ద్వారా ధ్యానతత్పరుడై వైరాగ్య బలమును పొంది ఉత్తమబోధతో మోక్షస్వరూప పరమసిద్ధిని సాధించెను.

తదనంతరము మార్కండేయ మహర్షి 274 నుండి 291 అధ్యాయముల ద్వారా యుధిష్ఠిరునకు శ్రీరామకథను వినిపించి ఉపశమనము కలిగించెను. వాల్మీకి మహర్షి చెప్పిన ఇరువది నాలుగువేల శ్లోకముల సంగ్రథితమైన రామకథను తెలియని వారుండరు. ధర్మస్వరూపుడగు శ్రీరామచంద్రుడు మానవాళికి ఆరాధ్యదైవమై భూమండలమును పదునొకండువేల సంవత్సరములు పాలించి ధర్మవ్యవస్థను నెలకొల్పెను.

పిమ్మట మార్కండేయ మహర్షి యుధిష్ఠిరునకు సావిత్ర్యుపాఖ్యానమును 293 నుండి 299 అధ్యాయములలో చెప్పెను. పాండవులను ద్యూత సమయమున బానిసత్వము నుండి ద్రౌపది కాపాడుటను స్మరించిన యధిష్ఠరుడు అటువంటి పతివ్రతలు పూర్వము ఎవరైనా యుండిరా యని మార్కండేయ మహర్షిని అడిగెను. అప్పుడా మహర్షి రాజా! అశ్వపతియను మహారాజు సంతానప్రాప్తికై గాయత్రీ జపతత్పరుడై తపస్సు చేసెను. గాయత్రీదేవి ప్రత్యక్షమై బ్రహ్మదేవుని కృపాప్రసాదముచే ప్రసిద్ధురాలగు తేజస్విని కన్య పుత్రికగా ప్రాప్తించునని పలికెను. నియమిత కాలము గడిచినంతనే అశ్వపతి మహారాజునకు ఒక కన్య ప్రాప్తించెను. సావిత్రీదేవి అనుగ్రహముతో జన్మించుటచే ఆ కన్యకు సావిత్రి నామకరణము చేసి సంస్కారములు జరిపించిరి. ఆమె తేజస్సు అప్రతిహతమగుటచే రాజకుమారులెవ్వరూ ఆమెను వరించ సాహసించక యుండిరి. సావిత్రి స్వయముగా సరిజోడగు వరుని అన్వేషించుటకు అశ్వపతి మహారాజు అనుజ్ఞనిచ్చెను. సావిత్రీదేవి తపోవనములు - తీర్థములు సేవించుచు తనకు సరిజోడగు వరుని అన్వేషించి మరలి వచ్చి తన తండ్రికి శాల్వదేశములో ద్యుమత్సేనుడను ధర్మాత్ముడగు క్షత్రియుని కుమారుడగు సత్యవంతుని వరించితినని

చెప్పెను. ద్యుమత్సేనుని నేత్ర దృష్టి క్రమముగా క్షీణించి అంధుడగుటచే రాజ్యమును కోల్పోయి వనవాసమున కేగెను. సత్యవంతుడు తల్లిదండ్రుల సేవలో వనవాసియై యుండెను. ఆ సమయమున దేవర్షి నారదుడు విషయములన్నియు కూలంకషముగ ఎరిగిన వాడగుటచే సత్యవంతునకు అన్ని శుభలక్షణము లున్ననూ అల్పాయువు గలవాడనెను. అందులకు అశ్వపతి హతాశుడై సావిత్రిని అతనితో వివాహము వలదని వారించెను. కాని సావిత్రి తాను పతిగా వరించెను గావున యింకొక పురుషుని వరించ జాలనని చెప్పెను. సావిత్రి కోర్కె ప్రకారము సత్యవంతునితో వివాహము జరిగెను. ఆమె అత్తమామల సేవలో పతి శుశ్రూషతో వనము నందుండెను. సత్యవంతునకు ఒక నాలుగు రోజులలో మరణము సంభవించునని దేవర్షి నారదుని వచనములను స్మరించిన సావిత్రి మూడురాత్రుల వ్రతదీక్షను గైకొనెను. నాల్గవరోజున సావిత్రి అత్తమామల అనుజ్ఞపొంది సత్యవంతునితో పాటు వనమునకు పోయెను. ఆరోజు మధ్యాహ్నము సత్యవంతునకు శిరోవేదన గలిగి సావిత్రి ఒడిలో తలబెట్టుకొని శయనించెను. ఆ సమయమున యమధర్మరాజు వచ్చి సత్యవంతుని ప్రాణములను గైకొని అంగుష్ఠమాత్ర సత్యవంతుని జీవాత్మను గొని పోవుచుండెను. అపుడు సావిత్రి దుఃఖాతురయై యమధర్మరాజు ననునరించి యోగశక్తితో వెంబడించెను. తదనంతరముల సావిత్రి – యమధర్మరాజు నడుమ ధర్మసంబంధ సుదీర్ఘ చర్చ జరిగెను. యమధర్మరాజు ఆమె ధర్మ వివేచనకు సంతసించి మూడు వరముల నిచ్చి సత్యవంతునకు జీవనము నొసంగి అంతర్ధాన మొందెను. ఇందులో నున్న ధర్మ చర్చ జ్ఞానేచ్ఛ గలవారందరికిని గొప్పగా ఉపకరించును.

కర్ణునకు స్వప్నములో సూర్యదేవుడు అగుపడి జన్మవృత్తాంతమును దెలిపి, ఇంద్రుడు ఛద్మ వేషములో వచ్చి కవచ కుండలములు దానము చేయమని అడుగుననియు, దానవ్రత నిష్ఠగలవాడ వగుటచే కవచ కుండలములు దాన మొనర్చిననూ అందులకు బదులుగా పాండవులలో ఒకరిని వధించు శక్త్యాయుధము నడుగమని హితబోధ చేసెను. ఆ సందర్భమున కర్ణుని జన్మవృత్తాంతము 301 నుండి 310 అధ్యాయముల వరకు యున్నది.

శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

మూలశ్లోక చిత్సుఖానంద వచన సహితము

విరాట – ఉద్యోగ పర్వములు

5

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

విరాటపర్వము - పర్వ సంగ్రహము

కథాంశము : పాండవులు తమ పండ్రెండు సంవత్సరముల వనవాసమును పూర్తి చేసిన పిమ్మట తమ అజ్ఞాతవాస వ్యవధినొక సంవత్సరము గడుపుటకై విరాటరాజునాశ్రయించ నిశ్చయించుకొనిరి. పాండవులు విరాటనగర పొలిమేరలకు పోయి శ్మశానమునకు చెంతనున్న విశాలమైన శమీవృక్షముపై తమ అస్త్ర శస్త్రముల నుంచి అజ్ఞాత రూపములో నగర ప్రవేశము చేసిరి. మున్ముందుగా యుధిష్ఠిరుడు విరాట మహారాజు దర్బారుకేగి తాను సర్వస్వము కోల్పోయిన ద్విజునిగా జీవన నిర్వాహమునకై మహారాజు కొలువులో యుండదలంచితినని విన్నవించెను. ఇది వరలో తాను యుధిష్ఠిరుని సఖునిగా నుంటిననియు, పాచికలాటలో నైపుణ్యము గలవాడననియు, కంకుభట్టు యను పేర విఖ్యాతి చెందితిననియు పరిచయమొనర్చుకొనెను. విరాట మహారాజు కూడ తనకు ప్రియ సఖునిగా నుండమనియు, బాహ్య రాజ్యకోశ వ్యవహారమును, ఉద్యాన వనములను, ఆంతరంగిక ధనదారాదుల వ్యవహారములను పర్యవేక్షించు పనులను అప్పగించెను. యుధిష్ఠిరుడు తనకు హీనవర్ణులతో ఎట్టి సంబంధములు, వివాదములకు ఆస్కారమునీయరాదని కోరెను. పాచికలాటలో పరాజితుడైన వ్యక్తి యొక్క ఒడ్డిన ధనము తనకు సమర్పించెవలెననియు కోరెను. విరాట మహారాజు ఆ షరతులను అంగీకరించెను. తదనంతరము భీమసేనుడు పాకశాస్త్ర ప్రావీణునిగ, అర్జునుడు సంగీత నాట్యశాస్త్ర విశారదునిగ, నకులుడు అశ్వవిద్య నెరిగినవానిగ, సహదేవుడు గోసంరక్షణ నిపుణునిగా పరిచయమొనర్చుకొని విరాటుని కొలువులో చేరిరి. ద్రౌపది తానొక సైరంధ్రిననియు కేశాలంకరణ, పూలమాలలు అల్లుట, సుగంధలేపనము వేయుట మున్నగు వాని యందు నేర్పరినని పరిచయమొనర్చుకొని విరాటుని రాణివాసములో కొలువుకు చేరెను. ఈ ప్రకారము విరాట పర్వములో పాండవ ప్రవేశమనెడి ఉపపర్వము సమాప్తమైనది.

తరువాత పాండవులు తమ అజ్ఞాతవాసములో వారి వారి బాధ్యతలు రాజకొలువులో నిర్వహించుచు మూడు నెలలు గడిపిరి. నాల్గవ నెలలో విరాటుని రాజధానిలో బ్రహ్మదేవుని బ్రహ్మోత్సవములు జరిగినవి. ఆ సందర్భమున వివిధ దేశముల నుండి మల్లయోధులు వచ్చి తమ మల్లయుద్ధ కళను ప్రదర్శించిరి. జీమూతుడను మల్లయోధుడు అందరిని జయించి విజయఘోష చేయగా, విరాట మహారాజు తన వద్ద వంటవానిగ మారురూపమునందున్న భీమసేనుని మల్లునితో యుద్ధము చేయమని ఆదేశించెను. భీమసేనుడు మల్లయుద్ధ కౌశలముతో జీమూతమల్లుని మట్టికరిపించెను. ఈ ఒక్క అధ్యాయముతో విరాట పర్వాంతర్గత సమయపాలన ఉపపర్వము సమాప్తమైనది. పాండవులు తమ అజ్ఞాతవాసమును పది మాసములు గడిపిన పిమ్మట విరాటుని బావమరిదియు, సైన్యాధక్షుడగు కీచకుడు రాజాంతఃపురములో సైరంధ్రిగనున్న ద్రౌపదిని దర్శించి కామవివశుడై ఆమెను బలాత్కరించ ప్రయత్నించెను. అందులకామె పరాభవము చెంది ఏకాంతములో భీమసేనుని దర్శించి కీచకుని బారి నుండి రక్షించమని కోరెను. భీమసేనుడు రహస్యముగా కీచకుని రాత్రి సమయమున ఏకాంత ప్రదేశమగు నర్తనశాలకు వచ్చు ప్రణాళిక వేసి, అచట ద్వంద్వ యుద్ధముతో కీచకుని హతమార్చెను. సైరంధ్రి యొక్క గంధర్వపతులు యీ హత్యచేసి యుందురని అంతఃపుర స్త్రీలు అనుకొనిరి. అందుకు కినుక వహించిన వంద అయిదుగురు కీచకుని సోదరులు ద్రౌపది (సైరంధ్రి)ని దోషిగా చేసి, ఆమెను సజీవముగా కీచకుని దహన క్రియలో దగ్ధమొనర్చదలంచిరి. సైరంధ్రి ఆర్త నాదముల నాలకించిన భీమసేనుడు చాటుమాటుగా మారువేషముతో శ్మశాన వాటికకు పోయి నూటయైదుగురు ఉప కీచకులను ఒక వృక్షముతో చావబాదెను. ఈ ప్రకారము విరాట పర్వాంతర్గత కీచకవధ పర్వము పరిసమాప్తమైనది. కీచకుని వధానంతరము మత్స్యదేశము బలవంతుడగు సైన్యాధ్యక్షుని కోల్పోవుటచే పొరుగు దేశమగు త్రిగర్తాధీశుడు మత్స్యదేశమునాక్రమించ దలంచెను. అతడు మిత్ర రాజ్యమగు కౌరవులతో గోధనమును సమర్పించు

ఒడంబడిక చేసుకొని, మత్స్యరాజ్య ఉత్తర దక్షిణ దిశలను చెరొకరు ఒకే సమయమును ముట్టడించి గోవులను తోలుకుపోవుటకు నిర్ణయించిరి. త్రిగర్తాధీశుడు దక్షిణ దిశను ముట్టడించి విరాటరాజును కలవరపరచెను. విరాటుడు తన సైన్యముతో బాటు మారువేషము నందున్న యుధిష్ఠిర భీమనకుల సహదేవులను కూడ యుద్ధ రంగమునకు గొనిపోయెను. అచట యుద్ధములో విరాటరాజు త్రిగర్తాధీశునకు బందీ అయ్యెను. అపుడు యుధిష్ఠిరుని సంజ్ఞతో భీమసేనుడు యుద్ధము చేసి విరాట మహారాజును విడిపించి, త్రిగర్తాధీశుని బంధితుని గావించెను. యుధిష్ఠిరుడు దయజూపి త్రిగర్తాధీశుని హెచ్చరించి ప్రాణ భిక్షతో వదిలిపెట్టెను. ఇచట ఉత్తరదిశ యందు కౌరవ సైన్యము విరాటుని గోవుల మందను అపహరించి హస్తినాపురమునకు గొనిపోవు ప్రయత్నము చేసిరి. నపుంసక వేషము నందున్న అర్జునుడు విరాట రాజకుమారునకు ధైర్యము చెప్పి కౌరవులతో యుద్ధమునకు తలపడెను. విరాట కుమారుడగు ఉత్తరుని రథ సారథ్యములో అర్జునుడొక్కడే ఆరుగురు మహారథులతో గూడిన విశాల కౌరవ సైన్యమును నిర్జించి గోవుల మందలను తిరిగి తెచ్చెను. ఈ ప్రకారము విరాట పర్వాంతర్గత గోహరణ ఉపపర్వము పరిసమాప్తమైనది.

అజ్ఞాతవాస సమయము పూర్తియగుటచే పాండవులు విరాటరాజు దర్బారులో అకస్మాత్తుగా తమ నిజరూపములతో ఉచితాసనములందు ఆసీనులై బహిర్గతమయిరి. అర్జునుడు యుధిష్ఠిరాది సోదరులందరిని విరాటరాజునకు పరిచయమొనర్చెను. కౌరవులతో యుద్ధమొనర్చి అద్భుత పరాక్రమమును ప్రదర్శించి గోవులమందను దెచ్చిన అర్జునుని గురించి విరాటరాకుమారుడగు ఉత్తరుడు పరిచయముగావించెను. విరాటరాజు సంభ్రమాశ్చర్యములు చెంది తన కుమార్తెను అర్జునునకు కోడలుగా సమర్పించు విషయము ప్రస్తావించెను. ఉత్తరాభిమన్యుల వివాహముతో విరాట పర్వాంతర్గత వైవాహికపర్వము సమాప్తమైనది. ఈ ప్రకారము విరాట పర్వములో పాండవప్రవేశ – సమయపాలన – కీచకవధ – గోహరణ – వైవాహికమను అయిదు ఉపపర్వములు, అరువదేడు అధ్యాయములు, రెండువేల ఏబది శ్లోకములున్నవి. అధ్యాయములు, శ్లోకముల సంఖ్య వివిధ ప్రతులలో హెచ్చుతగ్గులతో నున్నవి. కొన్ని ప్రతులలో అధ్యాయములు కలుపుట లేక విభజించుట వలన, కొన్ని ప్రతులలో అధిక శ్లోకములు చేర్చుట వలన మహాభారత మూలగ్రంథ పర్వసంగ్రహపర్వ సంఖ్యతో సరిపోల్చలేకున్నవి.

దేవతాస్తుతులు : విరాటపర్వము ఆరవ అధ్యాయములో దుర్గాస్తవమున్నది. యుధిష్ఠిరుడు తమ అజ్ఞాతవాసారంభమున విరాట నగరములో ప్రవేశించుటకు ముందు దుర్గాదేవిని ప్రార్థించెను. ఈ స్తుతి ఇరువదైదు శ్లోకములతో నున్నది. అందుకు దుర్గాదేవి సంప్రీతి చెంది యుధిష్ఠిరాదులకు సర్వత్రా విజయము, సుఖశాంతులు, ఆరోగ్యము ప్రాప్తించునటుల వరమునిచ్చెను. అంతేగాక యీ స్తోత్ర పారాయణము చేయు మానవులకు పాప విముక్తి – రాజైశ్వర్య ప్రదానము – దీర్ఘాయువు – రోగ నాశనము – పుత్రప్రాప్తి – శత్రు భయనివారణము – సుఖ ప్రయాణము – కార్యసిద్ధి కలిగించెదనని దుర్గాదేవి స్వయముగా చెప్పెను.

ధర్మ విషయములు : దానము చేసినవాడు ఒకప్పుడు యాచన చేయవలసి వచ్చును. ఒకరిని చంపినవాడు ఒకప్పుడు తానే యితరులతో చంపబడును. ఒకరిని నీచస్థితికి దిగజార్చినవాడు ఒకప్పుడు ప్రతిపక్షమువారిచే నీచస్థితికి త్రోయబడును. దైవమునకు ఏదియూ దుష్కరముగాదు. దైవవిధానమునుల్లంఘించుట అసంభవము. ఉత్తమ నియమములతో సురక్షితమైన వస్తువు కూడ దైవము ప్రతికూలమైనచో నశించును. కనుక విజ్ఞులు సర్వదా దైవమును తమకు అనుకూల మొనర్చుటకు ప్రయత్నించవలెను. (విరాట 20:6–9) : ద్రౌపదీ వచనము.

విరాటపర్వశ్రవణ మహిమ : ఆధివ్యాధులుండవు, గొప్ప సంకటముల నుండి విడివడుదురు. వారికి సుభిక్షము, క్షేమము, ఆరోగ్యము, పుణ్యవృద్ధి గలుగును. పాపములు నశించును. శత్రు విజయము సాధించగలరు. అతివృష్టాది ఈతిబాధలు తొలగును. ప్రియజనులతో ఎన్నడూ వియోగము సంభవించదు.

ఉద్యోగపర్వము - సంగ్రహ పరిచయము

మహాభారత వృక్షమునకు విరాట ఉద్యోగపర్వములు సారభాగమని చెప్పబడెను. మాహాభారత గ్రంథములో అయిదవదగు ఉద్యోగ పర్వము నూటఎనుబదియారు అధ్యాయములతో ఆరువేల ఆరువందల తొంబది ఎనిమిది శ్లోకములతో నున్నది.

కథాంశము : ఉత్తరా అభిమన్యుల వివాహము పూర్తయినపిమ్మట పాండవులు తమ వనవాస అజ్ఞాతవాస అవధిని పరిపూర్ణమొనర్చితిమని తమ ఉపప్లవనగరము నందు నివసించసాగిరి. కౌరవపాండవ యిరువక్షములు సైన్యసమీకరణ ప్రయత్నములు నారంభించిరి, దుర్యోధనార్జునులు శ్రీకృష్ణుని సహాయమునకై ప్రార్థించగా తాను యుద్ధమును చేయక మంత్రాంగమును మాత్రమే నెరపుదుననియు, రెండవవారికి ఒక అక్షౌహిణీ సైన్యము నిచ్చెదననియు – ఎవరికి ఏది కావలెనో కోరుకొనమనెను. దుర్యోధనుడు అక్షౌహిణీ సైన్యమును కోరుకొనెను. అర్జునుడు రణతంత్రమంత్రిగానుండమని శ్రీకృష్ణుని కోరెను. మద్రదేశ భూపతి శల్యుడు పాండవపక్షము వహించుటకు ప్రయాణమై వచ్చుచుండగా మార్గమధ్యములో దుర్యోధనుని మర్యాదాపూర్వక సన్మానములకు వశుడై కౌరవపక్షము వహించు వరమును దుర్యోధనునకు యిచ్చెను. పాండవులు ఒక పురోహితునిద్వారా శాంతి సందేశమును ధృతరాష్ట్రునకు పంపించిరి. ధృతరాష్ట్రుడు వెనువెంటనే సంజయునిద్వారా పాండవుల చెంతకు రాయబారముగావించెను. పాండవులు శ్రీకృష్ణుని తమనేతగా నెన్నుకొని యుద్ధసన్నద్ధులగుచుండిరని తెలిసి ధృతరాష్ట్రునకు నిదురపట్ట కుండెను. ఆ సమయమున విదురుడు నీతిశాస్త్ర విషయములు వివరించెను. అదే సందర్భమున చింతాక్రాంతుడైన ధృతరాష్ట్రునకు సనత్సుజాత మహర్షి ఆధ్యాత్మ శాస్త్రమును వినిపించెను. సంజయుడు తన రాయబార విషయములు కౌరవ సభలో నివేదించి ధృతరాష్ట్రునకు శ్రీకృష్ణార్జునుల దృఢమైత్రీ సంబంధమునుకూడ వివరించెను. కౌరవపాండవుల నడుమ సంధిగూర్చుటకై శ్రీకృష్ణుడు హస్తినాపురమునకు వెడలెను. దుర్యోధనుడు శ్రీకృష్ణుని శాంతి ప్రయత్నమును విరోధించెను. అంతేగాక శ్రీకృష్ణుని బంధించు ప్రయత్నముచేయగా ఆయన విశ్వరూప సందర్శనముగావించి అందరిని మోహపరచెను. శ్రీకృష్ణుడు ఏకాంతములో కర్ణుని తన రథముపై కూర్చుండబెట్టి అనేక యుక్తులతో సమాధానపరచెను. కుంతీదేవికూడ కర్ణుని గలిసి తన మాతృత్వ రహస్యమును తెలియబరచి పాండవ పక్షములో చేరమని అర్థించెను. కర్ణుడు ఆమె విన్నపమును నిరాకరించి అర్జునుని తప్ప పాండవులలో ఎవరికీ హానితలబెట్టనని వాగ్దానము చేసెను. శ్రీకృష్ణుడు తన రాయబార పర్యవసానమును పాండవులకు ఎరిగించెను. పాండవులు స్వహిత కర్తవ్యమును శ్రీకృష్ణునితో సంప్రదించి యుద్ధసామగ్రిని సమకూర్చు కొనసాగిరి. హస్తినాపురములో దుర్యోధనుడు కూడ కౌరవ సైన్య సమీకరణ చేసెను. పిమ్మట ఉలూకుడను దూతను పాండవుల వద్దకు పంపించెను. కురు క్షేత్రములో కౌరవ పాండవసేనలు యుద్ధము చేయుటకు వచ్చినిలిచిరి. ఆ సేనావాహినిలో మహారథ అతిరథుల వర్ణనము, చతురంగ సేన సంఖ్యాబలము వివరించబడినది.

ఉపాఖ్యానములు : దేవేంద్రునికైననూ పత్నితోగూడి కష్టములననుభవించక తప్పలేదని శల్యుడు పలుకుచూ యుధిష్ఠిరునకు దెలిపిన వృత్రాసురవధ, నహుషుని స్వర్గపతనముయను ఉపాఖ్యానములు వర్ణించబడినవి. సుధన్వా ఉపాఖ్యానముతో సమస్త ప్రాణులతో సమానముగా వర్తించుట సమస్త తీర్థములలో స్నానము చేసినంత ఫలమునిచ్చునని విదురుడు ధృతరాష్ట్రునకు హితవు బలికెను. ఆ సందర్భమున అనేక నీతియుక్త ధర్మవచనములు చెప్పెను. అటుపిమ్మట కణ్వమహర్షి దుర్యోధనుని హితబోధకై మాతలి ఉపాఖ్యానమును చెప్పెను. మాతలి తన కుమార్తెకొరకు యోగ్యుడగు వరునికై దేవ మనుష్యలోకములందు రెండింటా అన్వేషించి సఫలుడు గాకుండెను, మాతలి వరుణ లోకమును, పాతాళలోకమును, హిరణ్యపురమును, గరుడలోకమును, రసాతలమును, నాగలోకమును దర్శించెను. ఆయాలోకముల

విశేషములు వర్ణించబడినవి. దేవర్షి నారదుడు నాగరాజు అర్యముని కడకేగి మాతలికన్యను అర్యముని పుత్రునితో వివాహము గావించెను. విష్ణుభగవానుని ఆజ్ఞానుసారము దేవేంద్రుడు అర్యముని కుమారుడగు సుముఖునకు అమృతమునిచ్చి దీర్ఘాయువునుగా చేసెను. అందులకు కినుక వహించిన గరుడుడు విష్ణువుతో స్పర్ధవహించి తన బలము ఎంతటిదో ఆత్మప్రశంస చేసికొనెను. అందుకు శ్రీమహావిష్ణువు గరుడునికి గర్వభంగమొనర్చుటకై కేవలము తన కుడిచేతిని గరుడుని వృష్ఠముపైనుంచెను. అపుడు గరుడునకు పర్వతసహిత భూభారము పడినంత అనుభవమయ్యెను. అదే విధముగ బలవంతులగు పాండవులకు శ్రీహరి తోడుగనుండెనను విషయము గుర్తుంచుకొని సంధి ప్రయత్నము చేసుకొనమని కణ్వమహర్షి దుర్యోధనునకు హితవు బలికెను. గాలవోపాఖ్యానము ద్వారా హఠముగ వ్యవహరించినచో ఎటుల బహు యిక్కటుల పాలయ్యెదరో దుర్యోధనునకు దేవర్షి నారదుడు హితవు బలికెను. ఈ సందర్భములో పూర్వదక్షిణ పశ్చిమోత్తర దిశలందున్న విశేషములు వర్ణించబడినవి. ఋషభ పర్వతము పైనున్న యోగిని శాండిలిని మహాత్మ్యము చెప్పబడెను. రాజర్షియయాతి యొక్క దౌహిత్రులగు వసుమానుడు, శిబి, అష్టకుడు, ప్రతర్దనుల జన్మవృత్తాంతమున్నది. రాజర్షి యయాతి పుణ్యక్షయమగుటచే స్వర్గమునుండి పతనము చెందెను. సత్సంగమునందున్న నలుగురు దౌహిత్రుల ద్వారా యయాతి మరల పునరుత్థానము చెందుట వర్ణించబడినది. దురభిమానము స్వర్గభ్రష్ట హేతువను ఉపదేశము గావించబడెను. కుంతీదేవి పాండవులకు విదులా వృత్తాంతముద్వారా శత్రువశీకరణ ఉపాయములు, శౌర్యప్రతాపములు ప్రదర్శించుట మున్నగు ఉపదేశములు శ్రీకృష్ణునితో సందేశము పంపించెను. ఈ వృత్తాంతములో రాజనీతి ధర్మములెన్నియోయున్నవి. అంబోపాఖ్యానములో కాశీరాజకన్య తపస్సుచేసి భీష్మునిపై పగదీర్చుకొనుటకై శిఖండిగా పునర్జన్మ పొందిన విధానము చెప్పబడినది. ఈ సందర్భములో భీష్మపరశురాముల యుద్ధము, పరశురాముని పరాజయము వర్ణించబడినవి. ద్రుపదుని కుమార్తెగా జన్మించిన శిఖండి ఒక యక్షుని కృపవలన పురుషత్వము పొందుట వివరించబడినది.

నీతి – ధధర్మబోధలు : సంజయుడు రాయబార విషయములు చెప్పినంతనే ధృతరాష్ట్ర మహారాజు కలతచెందెను. విదురమహాశయమునకు తన మనస్సులోనున్న అశాంతికి ఉపశమనము గలిగించు విధానము గావించమని అడిగెను. అందుకు విదురుడు చెప్పిన అనేక నీతి–ధర్మవిషయములు ప్రతి మానవుడు తెలుసుకొనవలసియున్నది. ధర్మస్థితుడైన రాజు ఎన్నడూ పురుషార్ధచ్యుతుడు గాకుండును. దుష్కర్మలకు దూరముగానుండు ఆస్తికుడు, శ్రద్ధాళువు, సద్గుణయుక్తుడు పండితుడనబడును. శీతోష్ణములు, భక్త్యానురాగములు, సంపత్తి దారిద్ర్యము మున్నగు ద్వంద్వములు సంభవించినను ఎవని కార్యములకు విఘ్నముకలుగదో అతడే పండితుడు, ఏ విషయములైననూ ఓపికతో విని శీఘ్రమే అవగాహన చేసుకొని, తదనంతరము కర్తవ్యబుద్ధితో పురుషార్థ దిశగా ప్రవృత్తి చెందుటయే విద్వాంసుని లక్షణము. పండితుడు దుర్లభవస్తువు నెన్నడూ కోరుకొనడు. పోయిన వస్తువు గురించి శోకించి విచారించడు. విపత్తులందు ఆరాటము చెందడు. పండితుడు ఆదరసత్కారములందు హర్షోల్లాసము చెందడు. నిరాదర అవమానములందు సంతాపము చెందడు. ఎవని వాగ్ధాటికి అడ్డుకట్టయుండదో, ఎవనికి సంభాషణా చాతుర్యముండునో, ఎవడు తర్కవితర్కము లందు చతురుడో, ఎవడు ప్రతిభాపాటవ ప్రావీణ్యుడో, ఎవడు తాను చదివిన గ్రంథములయొక్క సారమును శీఘ్రమే గ్రహించి వివరించగలడో అతడే పండితుడు. ఎవని విద్య బుద్ధ్యానుసారమై – విద్యానుసారమై యుండునో, ఎవడు శిష్టాచారమునతిక్రమించక వర్తించునో అతడే పండితుడనబడును. విద్యలు నేర్వనిదే గర్వించురాజు, దరిద్రుడై యుండియు గొప్ప మనోరథములున్నవాడు, ఏ పనియు చేయకనే ధనేచ్ఛగలవాడు, తన కర్తవ్యమును విస్మరించి ఇతరుల కర్తవ్యములను నిర్వహించువాడు, మిత్రులతో మిథ్యాచరణము సలుపువాడు, కోరకూడనిది కోరుకొనువాడు, కోరదగినది త్యజించువాడు, బలవంతులతో వైరము బూనువాడు మూఢుడనబడును. అమితమైన ధనము – విద్య – ఐశ్వర్యము ప్రాప్తించిననూ పండితుడెన్నడు గర్వముచెందక నిశ్చలుడై యుండును. రుచికర భోజనమును తానొక్కడే భుజించుటకన్న తన

చెంతనున్నవారికి కూడ పంచి పెట్టితినవలెను. సముద్రమును దాటుటకు నావమాత్రమే సాధనమైనటుల ఊర్ధ్వలోక గమనమునకు సత్యమొక్కటే సోపానమార్గము. ఇంకొకవిధమగు మార్గములేదు. క్షమాగుణము గొప్పబలము. క్షమా గుణమొక్కటే గొప్ప వశీకరణ విద్య. విద్య మాత్రమే పరమ సంతోషదాయకమగు సాధనము. అహింసామార్గమొక్కటే పరమ సుఖదాయకము. విదురుని వచనములలో మహాకులీనుల లక్షణములు, హితోపదేశములు కోకొల్లలు, 33 నుండి 39 అధ్యాయములలో దర్శనమిచ్చును.

అధ్యాత్మగీతలు : ఈ పర్వములో విదుర మహాశయుడు ధృతరాష్ట్రుని కోరికమేర సనత్సుజాత మహర్షిని స్మరించి ఆత్మబోధచేయమనెను. అందుకు సనత్సుజాత మహర్షి ప్రత్యక్షమై 40-45 అధ్యాయము లలో చెప్పిన గీతాబోధ సనత్సుజాతీయమను పేర ప్రసిద్ధిచెందెను. దీనికి ఆదిశంకరులు భాష్యము రచించిరి. సనత్సుజాత మహర్షి ధృతరాష్ట్రునితో "రాజా! అవిద్యావశులు మృత్యువు యున్నదని తలంచి వేదవిహిత కర్మానుష్ఠానమువలన అమృతత్త్వము సిద్ధించునని ఆయా కర్మలు చేయుదురు, మరికొందరు విషయవ్యతిరిక్తమైన నిర్విషయక మోక్షము నంగీకరింపక కర్మ చేతనే అమృతత్త్వమును సాధించ గలమని చెప్పుదురు, కాని అద్వితీయ ఆత్మదర్శనులు ఆత్మకన్న భిన్నమైన వస్తువు వేరొకటి లేదని చెప్పి మృత్యువు అసలు లేదని యందురు. రాజా! నేను యీ రెండు పక్షములకు అవిరోధముగ సమరస సమన్వితమగు వచనము చెప్పెదనాలకించుము. రాజా! మృత్యువు గలదు - మృత్యువు లేదను రెండు వాదములును సృష్ట్యాదినుండి ప్రవర్తిల్లుచున్నవి. కాని యీ రెండింటికి సత్యత్వమెటుల పొసగును. మోహము - మిథ్యా జ్ఞానము - అనాత్మయందు ఆత్మభావము మృత్యువని కొందరి అభిప్రాయము. కాని నేను మాత్రము ప్రమాదమే మృత్యువని యనెదను. స్వాభావికమైన బ్రహ్మాత్మ భావమునుండి జారిపోవుట లేదా విడిపోవుటయే ప్రమాదము. అదియే మిథ్యా జ్ఞానమునకు సైతము కారణము. ఆత్మస్వరూపము నెరుగక పోవుటయే మరణము. అదియే జనన మరణాది సర్వ అనర్థములకు బీజము. స్వస్వరూప స్థాన లక్షణము గలది మోక్షము. అమృతత్త్వము కర్మసాధ్యముగాదు. జ్ఞాన కర్మ సముచ్ఛ యముచే కూడ ప్రాప్యముగాదు. కర్మఫలము నందాసక్తి గలవారు కర్మానుష్ఠానమును చేయుచు, జననమరణ రూప ప్రవాహమునందు పడుదురేగాని మృత్యువు నధిగమించలేరు. జ్ఞాననిష్ఠుడైనవాడు నిత్యము - శాశ్వతమునైన బ్రహ్మతేజమును పొందును. సనత్సుజాత మహర్షి యీ ఆత్మతత్త్వమును అనేక యుక్తులతో విచారణతో ధృతరాష్ట్రునకు బోధించెను.

సంజయరాయబారము : పాండవుల సందేశమును కౌరవసభలో వినిపించు సందర్భమున శ్రీకృష్ణార్జునుల మహిమను వర్ణించెను. (48వ అధ్యాయము). శ్రీకృష్ణార్జునుల సందేశము (38వ అధ్యాయము)ను కూడ వినిపించెను. శ్రీకృష్ణ ప్రాప్తికి తత్త్వజ్ఞాన సాధనను, శ్రీకృష్ణ భగవానుని వివిధ నామములు వ్యుత్పత్తిని వర్ణించెను. ఆ సమయమున ధృతరాష్ట్రుడు భగవద్గుణము గానము కూడ (70వ అధ్యాయము) ప్రసిద్ధిచెందినది.

శ్రీకృష్ణరాయబారము : శ్రీకృష్ణుడు పాండవ దూతగ ఉద్యుక్తుడగుటకు ముందు పాండవులందరితో వరుసగా చర్చించి, ద్రౌపదితోగూడ సంభాషించెను. (71-81 అధ్యాయములు). పిమ్మట హస్తినాపురమునకు పోయి సంధివచనములు పలికెను. ఆయన ప్రభావశీల భాషణము (94వ అధ్యాయము) అత్యంత మనోహరము. ఆ సమయమున పరశు రాముడు ధృతరాష్ట్రునితో నరనారాయణుల అవతారమే శ్రీకృష్ణార్జునులని (95వ అధ్యాయము) ఎరుకపరచెను. అటులనే కణ్వమహర్షి, దేవర్షినారదుడు, శ్రీకృష్ణుడు, భీష్మద్రోణ విదుర ధృతరాష్ట్రాదులు, గాంధారి మున్నగువారు పలురీతుల దుర్యోధనుని సంధి ప్రస్తావనతో ఒప్పించుటకు ప్రయత్నించిరి. దుర్యో ధనుడు చేసిన కుట్రను సాత్యకి భంగమొనర్చెను. ఆ సందర్భమును శ్రీకృష్ణుడు విశ్వరూప సందర్శనము గావించెను.

శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక చిత్సుఖానంద వచన సుధా సహితము)

భీష్మ పర్వము

సంపుటి : 6

ఓం అంశాయనమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

భీష్మపర్వము - సంగ్రహ పరిచయము

మహాభారతములో ఆరవదియగు భీష్మ పర్వములో నూట పదిహేడు అధ్యాయములందు అయిదు వేల ఎనభైనాలుగు శ్లోకములున్నవి. జంబూఖండ నిర్మాణము, భగవద్గీతా, భీష్మవధయను మూడు ఉపపర్వములున్నవి.

కథాంశము: కౌరవ పాండవులు యుద్ధ నియమములు నిశ్చయించుట, వేదవ్యాసమహర్షి సంజయునకు దివ్యదృష్టినిచ్చుట, ఉత్పాత - విజయ సూచక లక్షణములు, భూమహాత్మ్యవర్ణనము, ద్వీపములు - వర్షముల వర్ణనము, సూర్యచంద్ర రాహువులు ప్రమాణము మొదటి పండ్రెండు అధ్యాయములలో వర్ణించబడినది. సంజయుడు భీష్మ పర్వమునుండి మహాభారత యుద్ధమును ఆసాంతము ధృతరాష్ట్రునకు వర్ణించనారంభించెను. కౌరవ పాండవుల సేనావర్ణనము, ప్రథమ దినమున ఉభయ సేనలు రచించిన వ్యూహమును, యుధిష్ఠిరుని విషాద స్థితి, యుధిష్ఠిరుని రణయాత్ర వర్ణించబడెను. ఇరు పక్షములు హర్షాతిరేకముతో కోలాహలము చేయసాగిరి. ప్రథమదిన యుద్ధములో ఉత్తర కుమారుడు, శ్వేతుడు వీరమరణము పొందిరి. రెండవరోజు యుద్ధములో భీష్మార్జునుల యుద్ధము, ధృష్టద్యుమ్న ద్రోణాచార్యుల యుద్ధము భీకరముగా జరిగెను. భీమసేనుని ద్వారా కళింగయోధులు వధించబడిరి. మూడవ రోజు యుద్ధములో కౌరవపాండవ సేనల భీకర సంగ్రామము జరిగినది. దుర్యోధనుడు భీష్ముని మందగొడి యుద్ధమునకు సంతృప్తిచెందక నిష్ఠుర వచనములు పలికెను. భీష్ముడందులకు సంతాపము చెంది విజృంభించి పాండవసేనను మర్దించసాగెను. అందులకు కుపితుడైన శ్రీకృష్ణుడు స్వయముగా భీష్ముని వధించనుద్యుక్తుడయ్యెను. కాని అర్జునుడు ఆయన ప్రయత్నమును ఆపి భీష్మునితో ద్వైరథ యుద్ధము జరిపెను. శకుని పుత్రుడు మూడవరోజు యుద్ధములో వధించబడెను. నాల్గవరోజు యుద్ధములో భీమసేనుని గజసేన సంహారమొక అద్భుతకర్మ. భీమసేన - సాత్యకి - ఘటోత్కచుల వీరపరాక్రమ ప్రదర్శనము ప్రాముఖ్యము పొందెను. అయిదవ దినమునందు భీష్మ భీమసేనుల భీకర పరాక్రమములు విశేషమైయుండెను. సాత్యకి భూరిశ్రవుల యుద్ధము, కౌరవపాండవ మహారథుల ద్వంద్వ యుద్ధము ప్రాధాన్యత వహించెను. ఆరవరోజు యుద్ధములో ద్రోణాచార్యులు అలౌకిక పరాక్రమమును ప్రదర్శించెను. ఏడవరోజు యుద్ధములో ఉభయ పక్షములు మండల - వజ్ర వ్యూహములతో పోరుసలిపిరి. శంఖుడు వధించబడెను. అలంబుషుడు, విందానువిందులు, ఘటోత్కచులు పరాజయము పొందినవైనము, శృతాయు, కృపాచార్య, ధృష్టకేతుల పరాజయము, భీమార్జునుల పరాక్రమము వర్ణించబడినది. ఎనిమిదవరోజు యుద్ధములో భీమసేనుడు ఎనిమిదిమంది ధృతరాష్ట్ర కుమారులను వధించెను. ఇరుపక్షములందును భయంకర సైన్యసంహారము జరిగెను. శకుని తమ్ములు కృత ప్రయత్నముతో పాండవ పక్ష మహారథి ఇరావానుని హతమొనర్చిరి. ఘటోత్కచ - దుర్యోధనుల యుద్ధము అద్భుతముగ జరిగెను. భీమసేనాదుల యుద్ధప్రభావముచే కౌరవసేన పలాయనము చేసిరి. అపుడు భగదత్తుడు యుద్ధమునకు పూనుకొనెను. భీమసేనుడు మరొక తొమ్మిదిమంది ధృతరాష్ట్ర పుత్రులను వధించెను. కర్ణుని యుద్ధరంగమునకు

ఆహ్వానించమని దుర్యోధనుడు భీష్ముని నిర్బంధించెను. అపుడు భీష్ముడు భయంకరమగు యుద్ధ ప్రతిజ్ఞ చేసెను. తదనంతరము తొమ్మిదవరోజు యుద్ధము ఆరంభమయ్యెను. అలంబుషుడు అభిమన్యుని చేతిలో పరాజయము పొందెను. కౌరవసైన్యముతో భయంకరముగా పోరు సలుపుచున్న అభిమన్యుని ఎదుర్కొనుటకు భీష్ముడు సిద్ధమయ్యెను. ధృతరాష్ట్రుని మహారథి పుత్రులు కూడ వీరాభిమన్యుని నలుప్రక్కల చుట్టుముట్టిరి. అపుడు అభిమన్యుని రక్షణకై అర్జునుడు భీష్మునితో తలపడెను. ఆ సమయమున దుర్యోధనుడు రథాశ్వగజ సేనా సమేతుడై భీష్మునకు రక్షణవలయముగా నిలిచెను. కృపాచార్యుడు ఇరువదైదు బాణములతో అర్జునునిపై ప్రహారము చేసెను. సాత్యకి ముందుకు వచ్చి కృపాచార్యుని బాణములను అడ్డుకొనెను. కృపాచార్యుడందులకు కోపించి తొమ్మిది కంకపత్ర బాణములతో సాత్యకి ఛాతిపై గొట్టెను. సాత్యకి కూడ కృపాచార్యుని అంతమొందించు బాణమువేసెను. ఆ బాణము ఇంద్రుని వజ్రాయుధమువలె ప్రకాశించెను. ఆ బాణము కృపాచార్యునిపై విడువగనే అశ్వత్థామ కుపితుడై దానిని ఖండములు గావించెను. అపుడు రథికులలో శ్రేష్ఠుడగు సాత్యకి కృపాచార్యుని విడిచి అశ్వత్థామపై దాడిచేసెను. వారిరువురి యుద్ధము భయంకరముగ సాగెను. సాత్యకి విజృంభించుట జూచి ద్రోణాచార్యులు సాత్యకిని నిలువరించెను. అపుడు గాండీవ ధనుర్ధారి అర్జునుడు కలుగజేసుకొని ద్రోణునిపై శరసంధానము చేసెను. వారిరువురు పోరు సలుపుచు బుధ శుక్ర గ్రహములవలె అగుపడిరి. ద్రోణాచార్యునకు పృష్ఠరక్షకునిగ దుర్యోధనుని ఆదేశానుసారము త్రిగర్తరాజు సుశర్మ చేరెను. అర్జునుని ధాటికి త్రిగర్త సైనికులు యుద్ధవిముఖులయ్యిరి. అపుడు కృపాచార్య, దుర్యోధన, అశ్వత్థామ, శల్య, సుదక్షిణ, విందానువింద, బాహ్లీకాదులు తమ విశాల రథసైన్యముతో అర్జునుని అన్నివైపులనుండి ఆక్రమించి మార్గములన్నియు మూసివేసిరి. భగదత్త శ్రుతాయువులు గజసేనతో భీమసేనుని అన్ని దిశలనుండి అడ్డగించిరి. భీమసేనుడు మృగరాజు సింహమువలె దవడలను కదిలించి గదను చేతబట్టి గజరాజులన్నిటిని ఛిన్నాభిన్నమొనర్చెను. ఆయన గదాఘాతములతో వ్యథితమైన దంతి ఏనుగులు ఘీంకరించుచు ఆర్తనాదములు చేసినవి. నలువైపుల దౌడు తీయుచున్న గజసైన్యముతోబాటు దుర్యోధనుని సైన్యము యుద్ధవిముఖమయ్యెను. తదనంతరము కౌరవ పాండవ యుద్ధము తీవ్ర భయంకరముగ సాగెను. త్రిగర్త బాహ్లీకులు పరాజయము పాలయ్యిరి. శకుని అశ్వసైన్యము కూడ పరాజయము పొందెను. అపుడు భీష్ముడు కుపితుడై తీక్షణమగు బాణములతో కుంతీకుమారులను అన్నివైపులనుండి గాయపరచెను. భీష్ముడు అగ్నిహోత్రునివలె వెలుగొందుచు క్షత్రియ శిరోమణులను దగ్ధమొనర్చు చుండెను. భీష్మరూప అగ్నిహోత్రునకు సమరాంగణములో చేది – కాశీ – కరూష దేశ పదునాలుగు వేలమంది మహారథులు బలి అయ్యిరి. పాండవసైనికులు భీష్ముని ధాటికి తట్టుకొనజాలక గోవులమందవలె కకావికలమయ్యిరి. అనేకమంది సైనికులు ఆర్తనాదములు చేయుచుండిరి. భీష్ముడు మధ్యాహ్న మార్తాండునివలె అగుపడుచు పాండవసేనలోని ఉత్తమోత్తమ వీరులనెన్నుకొని వధించుచుండెను. అర్జునుడు మనఃపూర్వకముగ భీష్మునితో యుద్ధము చేయకుండెనని శ్రీకృష్ణభగవానుడు గ్రహించెను. అపుడాయన అర్జునుని శ్వేతవాహన రథమునుండి క్రిందకు దూకెను. కేవలము తన భుజములనే ఆయుధములుగా జేసి గుఱ్ఱములను తోలు కొరడాను పైకెత్తి పదేపదే సింహనాదము చేయుచు భీష్మునివైపు పరుగుదీసెను. అపుడాయన కనులు క్రోధముతో ఎరుపెక్కినవి. ఆయన భీష్ముని వధించు కోర్కెతో భూమిని విదీర్ణమొనర్చునటుల పాదఘట్టనలతో

పరుగులిడెను. మాధవుడు కౌరవసైన్యమును మ్రింగునటుల జూచుచు భీష్మునివైపు పరుగులిడుట గమనించిన సైనికులెల్లరు "భీష్ముడు మృత్యు వశుడగునని" కోలాహల ధ్వని చేసిరి. కమలాక్షుడగు శ్రీకృష్ణుడు తనవైపు పరుగులిడుచు దూసుకు వచ్చునపుడు భీష్ముడు కించిత్తైనను వెరుగొందక "కమలనయినా! రమ్మురమ్ము. నీకు వందనములు, సాత్వత శిరోమణీ! నన్ను యీ మహా సంగ్రామములో సంహరించుము. లోకములో నాకు ఆ ప్రకారము సర్వత్రా శుభమే కలుగును. గోవిందా! నేనటుల ముల్లోకములలో సన్మానితుడనగుదును. నేను నీ దాసుడను. నీవు ఇచ్ఛానుసారము నాపై ప్రహారము చేయుము"అనెను. అంతలో మహాబాహువగు అర్జునుడు వేవేగ శ్రీకృష్ణుని వెన్నంటి పరుగులిడెను. శ్రీకృష్ణుని వేగమును నిరోధించుటకు శ్రీకృష్ణుని చరణద్వయమును గట్టిగ పట్టుకొనెను. అయినను శ్రీకృష్ణభగవానుడు పది అడుగులు ముందుకు అర్జునుని లాగుకొనిపోయెను. అర్జునుడు ఆర్తభావముతో ప్రేమపూర్వక గద్గదస్వరముతో "మాధవా! నీవు యుద్ధముచేయనని పలికిన పూర్వప్రతిజ్ఞకు భంగము రానీయవలదు. నా అస్త్రశస్త్రములపై - సత్యముపై - సుకృతముపై ఆనబెట్టి చెప్పుచున్నాను. నేను అవశ్యము పితామహుడగు భీష్ముని యీ మహా సంగ్రామములో వధించెదను."అనెను. అపుడు శ్రీకృష్ణుడు మౌనమువహించి క్రోధపూర్వక గాంభీర్యమును ప్రదర్శించుచు అర్జునుని రథ సారథ్యమును మరల చేపట్టెను. భీష్ముడు తన శరవర్షముతో పాండవ యోధుల ప్రాణములను హరించసాగెను. పాండవ సైన్యము ఉత్సాహశూన్యమై భీష్మునివంక కన్నెత్తి చూడజాలకుండిరి. భీష్ముడిటుల మర్దించుచుండగా సహస్రకిరణుడగు సూర్యుడు అస్తాద్రికి చేరుకొనెను. యుధిష్ఠిరుడు తన సైన్యమును శిబిరములకు మరలించెను. తొమ్మిదవ రోజు సంగ్రామములో క్షతవిక్షతులైన పాండవ యోధులందరు చికిత్స చేసికొనుచు విశ్రాంతిచెందిరి. భీష్ముడు సమరభూమిలో ఆనాడు సృంజయులపై పాండవులపై విజయమును సాధించుటచే హర్షభరితులైన ధార్తరాష్ట్రులు భీష్ముని దుష్కరకర్మను కొనియాడుచు తమతమ శిబిరములకు మరలిరి. ఆనాటి భయంకర రాత్రి సమయారంభములో వృష్ణివంశ వీరులు- సృంజయులు - పాండవులు గుప్తమంత్రణకై ఒకచోట కొలువుదీరిరి. ఆ మహావీరులందరు తమకు ఏ విధముగా మంచి జరుగునను విషయమై స్వస్థ చిత్తముతో విచారణ జరిపిరి. భీష్మునెటుల వధించి యీ పృథివిపై విజయమును సాధించవలెనను ఒకేఒక్క ఆలోచన వారందరి మదిలో ప్రధానాంశమై యున్నది. ఆ సమయమున యుధిష్ఠిర మహారాజు దీర్ఘకాలము గుప్తమంత్రాంగము జరిపిన పిమ్మట స్వధర్మాను కూలమగు హితకర సలహానీయమని శ్రీకృష్ణుని ప్రార్థించెను. యుధిష్ఠిరుని కరుణాపూరిత విస్తృత వచనముల నాలకించిన శ్రీకృష్ణుడు "ధర్మపుత్రా! నీవు విషాదము చెందవలదు. నీ అన్నదమ్ములందరు శూరులు - వీరులు - దుర్జయులు - శత్రుసంహార సమర్థులు. నీవు ఆజ్ఞాపించినచో నేను కూడ తక్షణమే భీష్మునితో యుద్ధము చేసెదను. నీ అనుజ్ఞలభించినచో నేను యీ మహాసమరములో ఏ కార్యమునైనా చేసి చూపించెదను. భీష్మ వధకు అర్జునుడు పూనుకొనక యున్నచో నేనే సమరాంగణములో ఆ పురుషప్రవరుడగు భీష్ముని కవ్వించి ధృతరాష్ట్రపుత్రుల సమక్షమునందే వధించెదను. మీకు శత్రువులైనవారు నాకు కూడ శత్రువులగుదురు. నీ తమ్ముడగు అర్జునుడు నాకు ప్రియసఖుడు - బంధువు - శిష్యుడు. నేను అర్జునుని కొరకు నా మాంసఖండములైనను బలిగా సమర్పించెదను. అటులనే అర్జునుడు కూడ నా కొరకు ప్రాణములైననూ అర్పించును. మా యిరువురిలో ఎవరు సంకట

పరిస్థితిలో పడిననూ పరస్పరము ఆదుకొందుమని ప్రతిజ్ఞ చేసికొనియింటిమి. పూర్వము ఉపప్లవ నగరములో సమస్త రాజుల సమక్షమున అర్జునుడు ఒక ప్రతిజ్ఞచేసెను. యుద్ధములో తాను భీష్ముని వధించెదనని శపథము చేసెను. ఇపుడెందులకో ఆ కార్యమును చేయలేక పోవుచుండెను. మా యిరువురి ప్రతిజ్ఞ ప్రకారము నేను అర్జునుని యిట్టి సంకటమునుండి ఉద్ధరించవలసియున్నది"అనెను. శ్రీకృష్ణుని సాంత్వన వచనముల నాలకించిన యుధిష్ఠిరుడు "మాధవా! నీవు చెప్పినదంతయు యదార్థము. కౌరవులందరు ఏకమైవచ్చినను నీ వేగమును తట్టుకొన సమర్థులుగారు. గోవిందా! నీవు మాకు రక్షకుడవై యుండగా మేము యుద్ధములో ఇంద్ర సహిత సంపూర్ణ దేవతలను జయింపగలము. అటువంటపుడు యీ భీష్మునిపై విజయమును సాధించుట పెద్ద విషయముగాదు. నేను నీ గురుత్వముపై ప్రభావితుడనై యుండియు నిన్నొక అసత్యవాదిగ చేయజాలను. నీవు యుద్ధము చేయకనే పూర్వమువలె మాకు సహాయమొనర్చుము. గోవిందా! పూర్వమే నాకు భీష్మునితో ఒప్పందము జరిగినది. ఆయన యుద్ధములో మా హితము కొరకు ఏదైనా సలహానిచ్చుటకు సమ్మతించెను. కాని మా తరపున యుద్ధము చేయననియు, కేవలము దుర్యోధనుని కొరకు చేయుదుననియు చెప్పెను. కనుక భీష్ముడు నాకు రాజ్యమును, మంత్రాంగమును తప్పక యిచ్చును. అందుచే మనందరము గలిసి భీష్ముని కడకేగి ఆయనను నిరోధించు ఉపాయము నడిగెదము"అనెను. అందులకు శ్రీకృష్ణుడు సమ్మతించెను. పాండవవీరులందరు యిటుల పరస్పరము చర్చించుకొని భీష్ముని చెంతకేగి ఆయన చరణములు పట్టి పూజించి శరణార్థులుగనుండిరి. భీష్ముడు వారు కోరినదేదైననూ యిచ్చెదనని పదేపదే ప్రేరేపించెను. అపుడు యుధిష్ఠిరుడు "వీరుడా! సమరభూమిలో నీ వేగమునెటుల నిరోధించగలమో, మీ వధకు ఏదైనా ఉపాయమున్నచో వివరించుము"అని ప్రార్థించెను. అందులకు భీష్ముడు "యుధిష్ఠిరా! శస్త్రము నా చేతిలోనున్నంతకాలము, శ్రేష్ఠధనుస్సు నున్నంత తడవు, దేవేంద్రసహిత దేవాసురులెవ్వరూ నన్ను గెలువజాలరు. నేను అస్త్రశస్త్రములు జారవిడిచినపుడు మాత్రమే నన్ను ఏ మహారథియైనా మట్టుబెట్టగలడు. రాజేంద్రా! పూర్వమే నేనొక సంకల్పము చేసికొనియుంటిని. ఎవని ధ్వజముపై అమంగళ సూచక చిహ్నమున్నదో అట్టివానితో యుద్ధము చేయను. ధర్మరాజా! నీ సేనలో ద్రుపదపుత్రుడగు శిఖండి యున్నాడు. అతడు ముందుగా స్త్రీయై జన్మించి తరువాత పురుషత్వమును పొందెను. అతడొక మహారథియైననూ వానితో యుద్ధము చేయను. శిఖండిపై ప్రహారము చేయను. ఈ అవకాశమును వినియోగించుకొని అర్జునుడు నన్ను నాలుగువైపుల నుండి శీఘ్రతాపూర్వకముగ బాణములతో కొట్టుటకు ప్రయత్నించవచ్చును. శ్రీకృష్ణుడు, ధనుంజయుడు తప్ప యీ జగత్తులో యింకెవరూ నన్ను యుద్ధములో వధించజాలరు. శిఖండిని ముందుంచుకొని యిటుల అర్జునుడు చేసినచో మీకు నిశ్చితముగ విజయము ప్రాప్తించును. యుధిష్ఠిరా! నేను చెప్పిన నీతి నుపయోగించి నాపై విజయమును సాధించి ధృతరాష్ట్ర పుత్రులను ఓడించుము"అనెను.

పదియవ రోజు యుద్ధారంభమున పాండవులు శిఖండిని ముందిడుకొని యుద్ధసన్నద్ధులై శిబిరముల నుండి బయల్వెడలిరి. ఆ రోజు శిఖండి శత్రు సంహారక వ్యూహమును రచించి స్వయముగా పాండవసేనకు అగ్రభాగమున నిలిచెను. ఆ సమయమున భీమార్జునులు శిఖండి రథమునకు రథచక్ర రక్షకులుగా నుండిరి. అదే ప్రకారము కౌరవసైన్యము కూడ మహారథి భీష్ముని ముందిడుకొని పాండవులపై దాడికి పూనుకొనెను.

భీష్ముని విశాల ధనుస్సు ఇంద్రధనుస్సు సదృశమై మండలాకారముగ అగుపడజొచ్చెను. దావానలము వనమును దహించునటుల భీష్ముడు పదియవరోజు యుద్ధమునందు శిఖండి రథసేనను భస్మ మొనర్చ సాగెను. శిఖండి మూడు బాణములతో భీష్ముని ఛాతిపై గొట్టెను. ఆ శరాఘాతములచే పీడితుడైన భీష్ముడు అత్యంత కుపితుడైనను నవ్వుదెచ్చుకొని "శిఖండీ! విధాత నిన్ను శిఖండిని యను స్త్రీగా ఉత్పన్నము చేసెను. అందుచే నిన్ను గొట్టను"అనెను. ఆ పలుకులు విని శిఖండి క్రోధమూర్ఛితుడయ్యెను. నేడు భీష్ముని తప్పక వధించెదనని సత్య శపథము చేసెను. అర్జునుడు సమయోచిత అవసరమును గ్రహించి శిఖండితో "వీరవరా! నేను శరవర్షముతో శత్రువులను వెంటదరుముచు నీకు అండగా నుండెదను. నీవు భీష్మునిపై రోషపూర్వకముగ నీ పరాక్రమమును ప్రదర్శించుము. మహాబాహూ! భీష్ముడు నీపై ప్రహారము చేయుటకు ఉద్యమించడు. అందుచే నీవు యత్న పూర్వకముగ ఆయనపై దాడిచేయుము. నీవు సమరభూమిలో భీష్ముని వధించకనే మరలిపోయినచో నాతోగూడి నీవు యీ లోకములో అపహాస్యమునకు గురియగుదువు. అవశ్యము భీష్మపితామహుని వధించుము. నేను రథికులందరిని నిరోధించి నీకు రక్షగా నిలిచెదను. నేను ద్రోణాచార్యుని, అశ్వత్థామను, కృపాచార్యుని, దుర్యోధనుని, చిత్రసేన వికర్ణులను, సింధురాజు జయద్రథుని, అవంతీ రాజకుమారులను, కాంబోజరాజు సుదక్షిణుని, శూరవీరుడగు భగదత్తుని, మహాబలి మగధరాజును, సోమదత్తుని పుత్రుడగు భూరిశ్రవుని, అలంబుషుడను రాక్షసుని, త్రిగర్తరాజు సుశర్మను, తదితర మహారథులను సముద్రము చెలియలి కట్ట దాటనటుల నిరోధించెదను. నీవు మాత్రము భీష్మపితామహుని వధయనెడి కార్యసిద్ధిని సంపన్నము చేయుము"అనెను. తదనంతరము కౌరవపాండవ ప్రముఖ మహారథుల నడుమ సంకులిత ద్వంద్వ యుద్ధము జరిగెను. నాటి సమరములో ద్రోణాచార్యుడు అనేక అశుభసూచక శకునములు దర్శించెను. నాడు భీమార్జునులు ఆ రణక్షేత్రములో వందలవేల కౌరవ శూరవీరుల ధనుర్బాణములను ఛిన్నాభిన్నమొనర్చి వారి మస్తకములను ఖండించిరి. ఆ మహా సమరములో అర్జునుడు బాణపంజరముతో అనేకమంది కౌరవ యోధులను మృత్యులోకమునకు బంపెను. పదియవ దినమున భీష్మార్జునులిరువురు పరస్పరము సన్ముఖులై యుండగ భీష్ముడు తన వధకోరుకొనెను. ఆయన యుద్ధములో బహుసంఖ్యాక జన సంహారము చేయుటకు ఇష్టపడక నవిూపమునందున్న యుధిష్ఠిరునితో "రాజా! నీవు మహా జ్ఞానివి, శాస్త్రవిజ్ఞాతవు. నా వచనముల నొకింత ఆలకించుము. భరతనందనా! నేను నా దేహముపై విసుగెత్తి వ్యామోహమును కోల్పోయితిని. రణభూమిలో అనేకమందిని వధించుచు నా యావజ్జీవితము గడిచిపోయినది. కనుక నాకు ప్రియము గూర్చదలంచినచో నీవు అర్జునుని ముందిడుకొని నన్ను వధించుటకు ప్రయత్నము చేయుము"అనెను. భీష్ముని అభిప్రాయము నెరిగిన సత్త్వబుద్ధి యుధిష్ఠిరుడు రణభూమిలో భీష్మునెదుర్కొనుటకు పురోగమించెను. కౌరవ పాండవ యోధులు, ఇరుపక్షములందున్న వీరులు అత్యంత భయానక పరాక్రమమును ప్రదర్శించి పోరాడసాగిరి. శిఖండిని ముందిడుకొని అర్జునుడు గొప్పవేగముతో భీష్మునిపై దాడి చేసెను. అపుడు గొప్ప యుద్ధము ప్రారంభమయ్యెను. శిఖండి భీష్ముని సమీపమునకేగి స్వస్థ చిత్తముతో అనేక బాణములతో భీష్మునిపై దాడిచేసెను. భీష్ముడు పదునైన బాణములతో శత్రుమూకలను సంహరించుచు దశదిశలను కూడ శబ్దాయమానముగావించెను. ఆ సమయమున శ్రీకృష్ణార్జునులు, శిఖండి తప్ప ఇతరులెవరూ భీష్ముని

ఎదురుగా నిలుచుటకు సాహసించక యుండిరి. శిఖండి పురుషప్రవరుడగు భీష్ముని ఛాతిపై పది భల్లబాణములతో గొట్టెను. కాని గంగానందనుడు శిఖండియొక్క పూర్వ అడతనమును స్మరించి ప్రతీకార యత్నము చేయకుండెను. ఆ విషయమును అర్థముచేసుకొన్న అర్జునుడు తక్షణమే శిఖండితో "వీరవరా! నీవు వడివడిగా ముందుకుపోయి భీష్మపితామహుని వధించుము"అని ప్రోత్సహించెను. కాని భీష్ముడు తన బాణములతో అర్జునుని పీడించసాగెను. పాండవ యోధులెవరెవరు తన ముందుకు వచ్చినను వారిని పరలోకమునకు పంపించనారంభించెను. ఆ సమయమున దుశ్శాసనుడు కూడ ఒకప్రక్క అర్జునునితో యుద్ధము చేయుచు, వేరొక ప్రక్క భీష్మ రక్షణ తత్పరుడైయుండెను. దుశ్శాసనుని పరాక్రమమును మహాధనుర్ధరులందరు కొనియాడిరి. శిఖండి వజ్రసమాన బాణములద్వారా భీష్ముని గాయపరచుచునే యుండెను. అవి భీష్ముని దేహముపై ఎట్టి ప్రభావమును జూపక వేధించక యుండెను. భీష్ముడు దివ్యాస్త్రములను ప్రదర్శించుచు అర్జునునిపై దాడిచేసెను. ఆ సమయమున కవచధారి శిఖండి పురోగమించి భీష్మునిపై ఆక్రమణచేసెను. శిఖండిని చూచినంతనే భీష్ముడు తన దివ్యాస్త్రములను ప్రయోగించక ఆపివేసెను. అంతలో అర్జునుడు ఒక బాణమును వదిలి భీష్ముని మూర్ఛితమొనర్చి మరల కౌరవసేనా సంహారమునకు పూనుకొనెను. ఆ మహాసంగ్రామములో ఒక ప్రక్క భీష్ముడు వేరొక ప్రక్క ధనుంజయుడు సంహారక్రియ జరుపుచుండిరి.

భారతయుద్ధ పదియవదినమున భీష్ముడొక్కడే మత్స్యపాంచాలదేశ అగణిత గజాశ్వములను, మహారథులను వధించెను. ఐదువేల రథికులను సంహరించెను. పదునాలుగువేలమంది కాల్బల సైనికులను హతమార్చెను. ఒక వేయి ఏనుగులను, పదివేల అశ్వములను మట్టుబెట్టెను. తదనంతరము సమస్తభూపాలుర సైన్యమును ఉచ్ఛేదన మొనర్చి విరాటరాజు తమ్ముడగు శతానీకుని వధించెను. పిమ్మట భల్లబాణములతో ఒక వేయిమంది నరేశ్వరులను నేలగూల్చెను. అపుడా రణక్షేత్రములో భీష్మునకు భయముచెంది ఉద్విగ్నులైన పాండవ పక్ష యోధులు అర్జునుని ఎలుగెత్తి పిలువసాగిరి. యుద్ధనీతి దెలిసిన అర్జునుడు తక్షణమే భీష్మునకు రక్షగానున్న అనేకమంది కౌరవయోధులను చిత్తుగాగొట్టి భీష్మునిపై దాడిచేసెను. పాండవులు శిఖండిని ముందిడుకొని సమరభూమిలో భీష్ముని అన్నివైపుల చుట్టుముట్టి అస్త్రశస్త్రములతో గాయపరచనారంభించిరి. భీష్ముని కవచము ఛిన్నాభిన్నమయ్యెను. ఆయన మర్మస్థానములు విదీర్ణము కాజొచ్చెను. అయిననూ మనోవ్యథచెందక ఆ శత్రుమూకను ప్రళయకాలీన అగ్నివలె అద్భుత తేజోమూర్తిగ ప్రజ్వరిల్లి భయమును కలిగించెను. కాని అర్జునుడు కుపితుడై శిఖండిని ముందిడుకొని భీష్మునిపై దండెత్తి ఆయన ధనుస్సును ఖండించెను. భీష్ముడు పదేపదే ధనుస్సులు గ్రహించిననూ అర్జునుడు వానిని వెనువెంటనే ఖండించసాగెను. భీష్ముడు కోపముతో పర్వతములను సైతము విదీర్ణమొనర్చు శక్త్యాయుధమును అర్జునుని రథముపై ప్రయోగించెను. కాని అర్జునుడు ఐదు భల్లబాణములతో ఆ శక్త్యాయుధమును ఐదు ముక్కలుగ చేసెను. భీష్ముడందులకు దిగులుచెంది "శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు రక్షకునిగా లేకున్నచో నేను పాండవపక్ష మహారథులందరిని సంహరించి యుందును. శ్రీకృష్ణుడు సమస్త లోకములకు అజేయుడని నా విశ్వాసము. నేను యీ సమయమున రెండు కారణములనాశ్రయించి పాండవులతో యుద్ధమును చేయకుందును. పాండవులు నా మనుమలగుటచే అవధ్యులు. రెండవది నా ఎదురుగా శిఖండియుండుటచే యుద్ధము చేయను.

పూర్వము మా తండ్రిగారు నాకు రెండు వరములనిచ్చిరి. ఒకటి నాకు స్వచ్ఛందమరణము - రెండవది యుద్ధములో నన్నెవరూ వధించలేకుందురు. కనుక యీ దశలో నేను స్వేచ్ఛగా మృత్యువును స్వీకరించుటయే సముచితమనిపించుచున్నది."అనుకొనెను. భీష్ముడిటుల ఒక నిశ్చయమునకు వచ్చినంతనే అంబరవీధినుండి యుద్ధమును వీక్షించుచున్న మహర్షులు భీష్మునితో "నాయనా! నీ నిశ్చయము మాకు కూడ ప్రీతి గలిగించినది. యుద్ధమునుండి నీ చిత్తవృత్తిని మరల్చుము."అనిరి. ఋషులు పలికిన ఆ వచనములు భీష్మునకు, వ్యాసమహర్షి అనుగ్రహమువలన సంజయునకు మాత్రమే వినబడెను. ఆ ప్రకారము భీష్ముడు అర్జునుని జయించు ప్రయత్నమును చేయకుండెను. అర్జునుడు శిఖండిని ముందిడుకొని అనేక బాణములతో భీష్ముని క్షతవిక్షతుని గావించెను. ఆ బాణముల స్పర్శ భీష్మునకు వజ్రతుల్యములై యున్నవి. యమదూతలవలె ఆయన ప్రాణములను లాగుచున్నవి. అవి శిఖండి బాణప్రహారములు గావని భీష్ముడు దుశ్శాసనునకు చెప్పెను. ఆ పదియవ దినమున భీష్మార్జునుల నడుమ రెండు ఘడియలు గొప్ప సంఘర్షణ జరిగెను. ఆ సమయమున భీష్ముడు పదివేలమంది పాండవయోధులను హతమార్చెను. పాండపక్ష యోధులు భీష్ముని చుట్టుముట్టి కౌరవయోధులను ముందుకు కదలనీయక బాణవర్షముతో నిరోధించసాగిరి. భీష్ముని దేహముపై రెండు అంగుళములైననూ ఖాళీలేక సర్వత్రా బాణములు గ్రుచ్చుకొనియున్నవి. అర్జునుని బాణములద్వారా విద్ధుడైన భీష్ముడు ఎటుప్రక్కకు తిరుగలేక నానా అవస్థలు పడుచుండెను. ఇక పగటిభాగము కొంతమిగిలి యుండగా భీష్ముడు ధార్తరాష్ట్రుల సమక్షముననే తూర్పుదిశగా శిరస్సునుంచి రథమునుండి క్రిందకు పడిపోయెను. భీష్ముడు రథమునుండి పతనము చెందుట జూచిన అంబర స్థిత దేవతలు, రణభూమియందున్న భూపాలురు బిగ్గరగా హాహాకారములు చేసిరి. ఆయన విరిగిన రథధ్వజమువలె పృథివిని కంపింపజేయుచు నేలపై బడెను. ఆయన సర్వాంగములపై అన్నివైపుల బాణములు గ్రుచ్చుకొనియున్నవి. అందుచే ఆయన రథమునుండి క్రిందపడిననూ భూమిని స్పృశించక బాణాశ్రయుడైయుండెను. రథమునుండి పతనము చెందిన భీష్ముడు శరశయ్యపై పరుండినటులుండెను. భీష్ముని అంతరంగములో దివ్యభావావేశము గలిగెను. ఉత్తరాయన అర్చిరాది మార్గమునసనుసరించ దలంచిన భీష్ముడు తన ప్రాణములను ఉగ్గబెట్టి దక్షిణాయన కాలముదాటువరకు ఆగదలంచెను. ఆ సమయమున కౌరవులపై భయంకర మోహము ఆవహించెను. కృపాచార్య దుర్యోధనాదులందరు వెక్కివెక్కి రోదించసాగిరి. పాండవపక్ష యోధులు విజయోత్సాహ చిహ్నముగ పెద్దగా శంఖముల నూదిరి, పరమ పరాక్రమశాలి భీష్ముడు మాత్రము ఉపనిషత్ సారభూతమగు యోగము నాశ్రయించి ప్రణవ జపము చేయుచు బాణశయ్యపై పరుండి ఉత్తరాయణ కాలమునకై ప్రతీక్షించసాగెను. భీష్ముని పతన సమాచారమును దుశ్శాసనుడు దీనముగా ద్రోణాచార్యునకు ఎరిగించెను. అప్రియమగు వార్తవినినంతనే ద్రోణాచార్యుడు మూర్ఛిల్లెను. కొంతతడవునకు సచేతనుడై శీఘ్రమే కౌరవసేనను యుద్ధవిరమణ చేయమని ఆదేశించెను. ఇరుపక్ష సేనలు యుద్ధవిరమణ చేసినంతనే రాజులందరు కవచములు విడిచి భీష్ముని కడకేగిరి. లక్షలకొలది యోధులు యుద్ధమునాపి, దేవతలు ప్రజాపతిని సేవించుటకు వెడలునటుల మహాత్ముడగు భీష్ముని సందర్శనార్థమై మౌనముగా వెడలిరి. కౌరవ పాండవులు బాణశయ్యపై శయనించియున్న భీష్ముని చెంతకేగి ప్రణామమొనర్చి నిలిచిరి. ధర్మాత్ముడగు భీష్మపితామహుడు వారందరిని

స్వాగతమొనర్చి శరశయ్యనుండి వ్రేలాడుచున్న తన శిరస్సుతో "రాజులారా! నా శిరస్సు ఆధారరహితమై వ్రేలాడుచున్నది. నాకు తలగడనీయుడు"అనెను. అపుడు రాజులందరు తక్షణవే అందమైన మెత్తని పట్టుతలగడలు అనేకము దెచ్చిరి. కాని భీష్ముడు ఆ తలగడలు వీరశయ్యకు తగురీతిలో లేవని అర్జునుని వంకజూచి "పుత్రా! నా శరశయ్యకు తగిన తలగడ ఏది సముచితమనుకొందువో దానిని తెమ్ము"అనెను. అపుడు అర్జునుడు గాండీవ ధనుస్సుపై మూడు బాణములను అభిమంత్రితమొనరించి సంధించెను. పిమ్మట మహాత్ముడగు భీష్ముని అనుమతిగైకొని అత్యంతవేగముతో ఆ మూడు బాణములు ప్రయోగించి భీష్ముని శిరస్సును కొంచెము ఎత్తుగా, స్థిరముగా నుండునటుల చేసెను. అందులకు ధర్మార్థతత్త్వ విదుడగు భీష్ముడు పరమ సంతుష్టిచెందెను. తదనంతరము అచటనున్న రాజులతో "రాజులారా! నేను యీ శరశయ్యపై సూర్యుడు ఉత్తరాయన సంచారమును ప్రారంభించువరకు నుండెదను, నేనపుడు ప్రియప్రాణములను త్యాగమొనర్చి ఊర్ధ్వగతిపొందుట మీరు తిలకించెదరు. నా యొక్క శరశయ్యా స్థానమునకు నాలుగు ప్రక్కల కందకమును త్రవ్వించుడు. నేనిచ్చటనే వందలవేల బాణములతో పరివ్యాప్తమైన దేహముతో గూడి సూర్యోపాసన చేయుచుందును."అనెను. ఆయన తన దేహమునుండి బాణములను తొలగించుకొను చికిత్స క్షత్రియ ధర్మము గాదని నిరాకరించెను. తన శరీరమును యీ బాణములతోబాటు దగ్ధమొనర్చుటయే ధర్మమనెను. అపుడు నరేశ్వరులు అమిత తేజస్వియగు భీష్ముని ధర్మ నిష్ఠను గమనించి విస్మితులయ్యిరి. తదనంతరము కౌరవపాండవులు భీష్మునకు ప్రదక్షిణ ప్రణామములు చేసి రక్షావ్యవస్థ నేర్పరచి తమతమ శిబిరములకు మరలిరి.

రాత్రి గడచి తెల్లవారినంతనే కౌరవ పాండవులు అన్యాన్య రాజశ్రేష్ఠులు మరల భీష్మ పితామహుని వీరవరశయ్యకడకేగి పాదాభివందనము చేసిరి. బాణాఘాతములచే పీడితుడగుచున్న భీష్ముడు సర్పమువలె దీర్ఘశ్వాసలు దీయుచుండెను. ఆయన వారివంక జూచుచు కేవలము నీరు - దాహము అని పలికెను. అపుడా నరేశులు నలుదిశలకు పోయి ఉత్తమోత్తమ భోజనమును, శీతల జలపానీయాదులను తెచ్చిరి. కాని శాంతనునందనుడు తాను మానవలోక భోగములను, భూమిని స్పృశించక అంతరిక్ష స్థితుడనై యుంటిననెను. తక్షణమే మహాబాహువగు అర్జునుని పిలిచి "అర్జునా! నీ బాణములతో నా అంగములన్నియు విద్ధమైనవి. నా శరీరము దగ్ధమగుచున్నటులున్నది. మర్మస్థానములన్నియు పీడించబడుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. వేదనా భరితమైన దేహముతోనున్న యీ వృద్ధునకు నీవు జలమును తెచ్చియిమ్ము. నీవు విధిపూర్వకముగ దివ్య జలములను తెచ్చి యీయగల సమర్థుడవు"అనెను. తక్షణమే అర్జునుడు రథారూఢుడై గాండీవ ధనుస్సునెత్తి బలపూర్వకముగ నారిని బిగించి ఆ కర్ణాంతములాగి ఒక తేజస్వంతమగు శరమును సంధానముచేసి అందరు చూచుచుండగనే మంత్రోచ్చారణ పూర్వకముగా పర్జన్యాస్త్రమును సంయుక్తమొనర్చెను. పిమ్మట భీష్మునకు కుడిభాగము నందున్న పృథివిపై బలముగా వేసెను. ఆ బాణము పృథివిలో జొచ్చుకున్నంతనే శీతల అమృతమయ మధుర దివ్య సుగంధ రసయుక్త సుందర స్వచ్ఛ జలధార పైకి ఉబికెను. ఆ శీతల జలధారతో కురుశ్రేష్ఠుడగు భీష్ముడు దాహార్తిని దీర్చుకొని సంతృప్తి చెందెను. అర్జునుని పరిపరి విధముల ప్రశంసించెను. పాండుపుత్రులతో సంధిగూర్చుకొని శాంతిస్థాపించమని దుర్యోధనునకు హితము చెప్పెను. భీష్ముని రథ పతన సమాచారము నాలకించిన కర్ణుని మనస్సులో భయమునెలకొనెను.

అతడు హడావుడిగ ఏకాంతములో భీష్ముని దర్శించవెడలెను. ఆ సమయమున భీష్ముడు శరశయ్యపై నిదురించుచుండెను. శరశయ్యపైనున్న ఆయన పరిస్థితిని జూచి మహా తేజస్వి కర్ణుని నేత్రములనుండి అశ్రుధారలు ఉబికివచ్చెను. ఆయన గద్గద కంఠముతో "కురుశ్రేష్ఠా! నేను రాధాపుత్రుడగు కర్ణుడను. సర్వదా మీచే ద్వేషించబడెడివాడను"అని పలికెను. అపుడా కురువృద్ధుడు మెల్లగా కనులు తెరిచి కర్ణుని జూచెను. ఆ సమయము ఏకాంతముగ నుండుటచే భీష్ముడు తనవద్దనున్న కావలివారిని దూరముగా తొలగిపొమ్మని చెప్పి, కర్ణుని దగ్గరగా రమ్మని రెండు చేతులతో తండ్రివలె ఆలింగన మొనర్చుకొనెను. వత్సా! నీవు రాధానందనుడవు గాదు. యదార్ధముగ నీవు కుంతీపుత్రుడవు. సాక్షాత్తు నీవు సూర్యదేవుని పుత్రుడవు. నీవు కుంతీదేవి కన్యావస్థలో నుండగ ఆమె గర్భమునందు జన్మించుటచే ధర్మలోపము జరిగినది. అందుచే నీవు నీచపురుషుల నాశ్రయించితివి. నీ బుద్ధి ఆ ప్రకారము ఈర్ష్యావశమై పాండవులను ద్వేషించినదయినది. ఆ కారణముచే నిన్ను కౌరవ సభలో అనేకమార్లు కటువచనములతో అడ్డుకొన ప్రయత్నము చేసితిని. నీ జన్మ వృత్తాంతమును దేవర్షి నారదుడు, శ్రీకృష్ణద్వైపాయన మహర్షి ద్వారా వినియుంటిని. సమర భూమిలో నీ పరాక్రమము దుస్సహమని నేనెరుగుదును. నీవు బ్రాహ్మణ భక్తుడవు – శూరవీరుడవు – దానము చేయు ఉత్తమ నిష్ఠగలవాడవు. మనుష్యులలో నీకు సమానమైన వాడు లేడు. పూర్వము నీపై నాకు క్రోధభావముండెడిది. కాని అది యిపుడు దూరమైనది. శత్రుసూదనా! వీరులగు పాండవులు నీకు తోడబుట్టిన వారు. మహాబాహూ! నీవు నాకు ప్రియముగూర్చ దలంచినచో నీకు తోడబుట్టినవారగు పాండవులతో కలిసిపొమ్ము. నా మృత్యువుతో యీ కౌరవపాండవ వైరాగ్ని కూడ ఆరిపోవలెను. భూమండలములో రాజులెల్లరు దుఃఖశోకరహితులై నిర్భయులు గావలెను."

అనెను. అపుడు కర్ణుడు సవినయముగా భీష్మునితో "మహాబాహూ! మీరు చెప్పిన నా జన్మవృత్తాంతమును నేనెరుగుదును. అది యదార్థమే. సంశయమెంత మాత్రము లేదు. వాస్తవముగ నేను కుంతీపుత్రుడను. కుంతీమాత నన్ను జలప్రవాహము పాల్జేయుటచే సూతుడు నన్ను పాలించి పోషించి పెద్ద చేసెను. నేను దుర్యోధనునితో స్నేహముచేసి ఆనందముగా జీవనము గడిపితిని. దుర్యోధనునకు దుష్కర కార్యములన్నింటిని చేయుదునని ఆయనకు ప్రతిజ్ఞ చేసితిని. దుర్యోధనుని ఐశ్వర్యము ననుభవించి ఆ ప్రతిజ్ఞను నిష్ఫలమొనర్చి వంచించజాలను. శ్రీకృష్ణుడెటుల అర్జునునకు సహాయమొనర్చెదనని దృఢ ప్రతిజ్ఞ చేసెనో అదేవిధముగా నా ధనము – దేహము – స్త్రీ పుత్రులు – యశస్సు దుర్యోధనుని పరము చేసితిని. నేను దుర్యోధనుని ఆశ్రయించి పాండవులపై క్రోధమును పెంపొందింప జేసితిని. క్షత్రియ జాతి రోగముల బారిన పడి మరణించుటకన్న యుద్ధములో వీరగతిని పొందుటయే శ్రేయస్కరమని యిటుల చేసి యీ మహాసంగ్రామమునకు కారకుడనైతిని. నేను శ్రీకృష్ణుని మహత్తును, పాండవుల ప్రభావమును ఎరుగుదును. ఆ మహాత్ములు అజేయులు. అయిననూ వారితో యుద్ధమును చేయు ఉత్సుకత జూపుచున్నాను. నేను పాండవులను జయించెదనను నిశ్చిత విశ్వాసమును నా మనస్సులో పెంచుకొంటిని. పాండవులతో వైరము అత్యంత భయంకరముగ పరిణమించినది. నేను నా ధర్మానుసారము ప్రసన్న చిత్తముతో అర్జునునితో యుద్ధమును చేయుదును. పితామహా! నేను యుద్ధము చేయు నిర్ణయమును తీసుకొనియుంటిని. మీ ఆజ్ఞనుగైకొని యుద్ధమును చేయదలంచితిని. కనుక మీరు దయతో నాకు అనుజ్ఞనీయుడు. నేను ఎన్నడైనా క్రోధావేశముతో గాని, చపలత్వముతో గాని మీ ఎడల

కటువచనములు పలికిననూ లేదా ప్రతికూలముగా వ్యవహరించినను మీరు కృపాపూర్వకముగ నన్ను క్షమించుడు" అనెను. అపుడు భీష్ముడు "కర్ణా! ఈ భయంకర వైరము త్యజించ శక్యముగాదనినచో నీవు స్వర్గప్రాప్తి ఇచ్ఛతో యుద్ధము చేయుటకు అనుజ్ఞ నిచ్చుచున్నాను. నీ శక్త్యానుసారము ఉత్సాహముతో సత్పురుషాచార స్థితుడవై యుద్ధమును చేయుము. నీవు యుద్ధ ఆచారములు తెలిసినవాడవు కర్ణా! నీకు అనుజ్ఞనిచ్చుచున్నాను. విజయమో – వీరస్వర్గమో ఏది కోరుకొందువో దానిని పొందుము. ధనంజయుని చేతిలో మరణించినచో క్షత్రియ ధర్మపాలనచే లభించు లోకములు సంప్రాప్తమగును. నీవు అభిమానశూన్యుడవై బలపరాక్రమముల నాశ్రయించి యుద్ధము చేయుము. క్షత్రియులకు ధర్మానుకూల యుద్ధముకన్న వేరొక శ్రేయోమార్గము లేదు."అనెను. కర్ణుడు ఆయనకు ప్రణామమొనర్చి అనుజ్ఞగైకొని రథారూఢుడై దుర్యోధనుని చెంతకు వెడలిపోయెను.

దేవతా స్తుతులు

కౌరవ పాండవులు కురుక్షేత్రములో యుద్ధస్థితులైనంతనే శ్రీకృష్ణుడు అర్జునునితో "నీవు పవిత్రుడవై శత్రువులను పరాజితమొనర్చుటకై దుర్గాదేవిని స్తుతించుము"అనెను. అపుడు అర్జునుడు 23వ అధ్యాయములో 4–19 వరకునున్న శ్లోకములతో దుర్గాదేవిని స్తుతించెను. అర్జునకృత యీ దుర్గాస్తుతిని ప్రాతఃకాలమునందు చదువువానికి యక్షరాక్షస బాధలుండవు. శత్రువులుగాని, సర్పాది విష జంతువులుగాని ఎట్టి హానిని కలిగించవు. రాజువలన కూడ భయముండదు. ఈ స్తోత్రమును పారాయణము చేయువానికి వివాదములలో విజయము ప్రాప్తించును. బంధనములనుండి విముక్తి లభించును. దుర్గమ సంకటముల నధిగమించెదరు. చోరబాధలు తొలగిపోవును. సంగ్రామములో సదా విజయమే ప్రాప్తించును. విశుద్ధ ఐశ్వర్యము లభించును. స్తోత్రమును పఠించువాడు ఆరోగ్యముతో బలసంపన్నుడై వంద సంవత్సరములు ఆయుష్మంతుడై జీవించును.

పాండవులు అవధ్యులగుటకు, తన పుత్రులు మృత్యువశులగుటకు కారణమేమని ధృతరాష్ట్రుడు సంజయుని అడిగెను. సంజయుడందులకు భీష్మ దుర్యోధనులకు జరిగిన సంవాదము నెరిగించెను. కౌరవ మహారథులెల్లరు యుద్ధములో పాండవుల చేతిలో పరాజితులగుట గమనించి దుర్యోధనుని హృదయము కకావికలమయ్యెను. అతడు భీష్ముని చెంతకేగి వినయముగా "పితామహా! పాండవుల పరాక్రమము సమక్షమున ద్రోణాచార్యాది మీ అందరి శక్తియుక్తులు కొరగాకున్నవి. ఇందులకు కారణమేమి? ఎవరి ఆశ్రయముతో పాండవులకు నిరంతరము విజయము సిద్ధించుచున్నదో తెలియజేయుము"అని ప్రార్థించెను. అందులకు భీష్మపితామహుడు పూర్వవిషయము నిటులు చెప్పెను. ఒకప్పుడు సమస్తదేవతలు, మహర్షులు కలిసి గంధమాదన పర్వతముపై బ్రహ్మదేవుని చెంత కూర్చునియుండిరి. ఆ సమయమున ఆకాశమునందొక తేజస్వంతమైన దివ్యమానమును ప్రజాపతి బ్రహ్మ జూచెను. ఆయన తన మనస్సును సంయమన మొనర్చుకొని ధ్యానస్థితుడై ప్రసన్న చిత్తముతో చేతులు జోడించి పరమపురుష పరమేశ్వరునకు నమస్కారము చేసెను. పిమ్మట భగవత్ స్తుతి చేసెను. ఇది అరువదిమూడవ అధ్యాయము నలుబది ఏడవ శ్లోకమునుండి డెబ్బది అయిదవ శ్లోకము వరకు యున్నది. ఈ స్తోత్రము మహిమాన్వితమైనది. స్తుతించిన వాని అభీష్టములు సిద్ధింపజేయును. అటులనే భీష్ముడు అరువదేడవ అధ్యాయములోని మొత్తము ఇరువది మూడు శ్లోకములతో శ్రీకృష్ణుని మహిమను గానము చేసి దుర్యోధనునకు వినిపించెను. ఈ స్తోత్రము పురుషసూక్త తాత్పర్యమును కొంత వివరిస్తున్నది.

అరువదెనిమిదవ అధ్యాయములో పూర్వము బ్రహ్మర్షులు - దేవతలు చెప్పిన బ్రహ్మ కృత స్తోత్రమును భీష్ముడు దుర్యోధనునకు వినిపించెను. ఇందులో పరమాత్మ తత్త్వము పది శ్లోకములలో చెప్పబడెను.

శ్రీమద్భగవద్గీతా అవతారిక

భీష్మపర్వములో ఉపనిషత్సారమైన భగవద్గీతను శ్రీకృష్ణభగవానుడు చెప్పుట విశేషము. భగవద్గీతను వేదవిజ్ఞాన ప్రస్థానత్రయ గ్రంథములలో ఒకటిగా బ్రహ్మవాదులు పేర్కొందురు. దీనినే భగవద్గీతయనియు, ఉపనిషత్తుయనియు, బ్రహ్మవిద్యయనియు, యోగశాస్త్రమనియు, శ్రీకృష్ణార్జున సంవాదమనియు బుధులు వచించిరి. పైన చెప్పిన ప్రతినామము ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకొన్నది. గీతమనగా గానవిశేషము. ఇందులో ఒక అక్షరము పొల్లుపోయినను, ఒక అక్షరము ప్రక్షిప్తమొనర్చిననూ గానము లయతప్పును. క్రియాభేదము మానసిక, వాచక, కాయకమని మూడు విధములు. "యన్మనసా మనుతే తద్వాచావదతి తత్కర్మణా కరోతి"యని క్రియా భేదమును శ్రుతి నిర్వచించినది. మానసిక క్రియ మతియనియు, వాచక క్రియ గీతయనియు, కాయక క్రియ నీతి యనియు పిలువబడుచున్నవి. ఇష్టానిష్ట పరిజ్ఞానమును దెలుపునది మతికాగా ఆ జ్ఞానమును వెలిబుచ్చు శబ్దజాలము గీత యగును. నీతి యనగా ఆహారవిహారములు. భగవానునిచే వచింపబడిన శబ్దజాలమగుటచే దీనిని భగవద్గీతయనిరి. వేద శిరోమణులగు ఉపనిషత్తుల సారతత్త్వమగుటచే భగవద్గీత ఉపనిషత్ సమానమైనది. నిర్గుణ నిరాకార పరమాత్మ యొక్క పరమ సాక్షాత్కారమును కలిగించునదగుటచే ఇది బ్రహ్మవిద్య యగుచున్నది. శ్రీకృష్ణభగవానులు "ఇమం యోగం ప్రోక్తవాన్" - "న ఏవాయం మయాతేఽస్మిన్" - "ద్వివిధా నిష్ఠా" - జ్ఞానకర్మ యోగములను ద్వైవిధనిష్ఠను సూచించెను. కనుక ఇది పతంజలి సూత్రముచే చెప్పబడిన యోగముగాదు. అదే విధముగా కపిల సాంఖ్య శాస్త్రముకూడ గాదు. శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన గీతలు నిష్ఠారూపమగు యోగమును శాసించుచున్నవి. శ్రుతులు అపౌరుషేయములు. శ్రుతుల విషయములను స్మరించి చెప్పినవి శాస్త్రములు. ఇచట వక్తయగు శ్రీకృష్ణుడు శ్రోతయగు అర్జునునకు ద్వివిధ నిష్ఠయగు యోగమును చెప్పుటచే దీనికి యోగశాస్త్రమనెడి నామము సిద్ధమైనది. భగవద్గీత యందలి పదునెనిమిదవ అధ్యాయములో "అధేవ్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః "అని శ్రీకృష్ణభగవానులు చెప్పిరి. తదనంతరము "ఇత్యహం వాసుదేవస్య పార్థస్య మహాత్మనః సంవాద మిమం"యని సంజయుడు పలుకుటచే భగవద్గీతా గ్రంథమునకు శ్రీకృష్ణార్జున సంవాదమను వ్యవహారము కూడ గలిగినది.

భగవద్గీతయందు ఉపదేశించబడిన యోగవిశేషములన్నియు రహస్యములు. అందువలనే శ్రీకృష్ణభగవానుడు నాల్గవ అధ్యాయము మూడవ శ్లోకములో "రహస్యం హ్యేతదుత్తమమ్"అని చెప్పిరి. విద్యారహస్యములు గురుముఖతః తెలుకుకొనవలెను. సామాన్య విషయము నందెల్లరకు అధికారముండును. కాని విశేష విషయములో ఎవరికి అధికారముగలదో వారికే చెప్పవలెను. దీనిని నిర్ణయించు అధికారము గురువునకు యీయబడెను. అందుచేతనే శ్రీకృష్ణభగవానులు పదునెనిమిదవ అధ్యాయము అరువది ఏడవ శ్లోకమునిటుల చెప్పిరి.

ఇదంతే న తపస్కాయ నా భక్తాయ కదాచన
నచా శుశ్రూషవే వాచ్యం నచమాం
యోఽభ్యసూయతి"

ఈ గీతాశాస్త్రమును తపస్వి (జ్ఞానార్థి) గానివానికి, భక్తి (శ్రద్ధాసక్తులు) లేనివానికి, గురుశుశ్రూష

చేయనివానికి , నాస్తికునకు చెప్పరాదు.

శోకమోహ సాగరమునందు మునిగియున్న అర్జునుని కొరకు శ్రీకృష్ణభగవానుడు వేదవిహిత ధర్మద్వయమును (ప్రవృత్తి - నివృత్తి) ఉపదేశించెను. శ్రీ వేదవ్యాస భగవానులు ఆ ధర్మామృతమును గీతలను పేర గ్రంథస్తము చేసెను. ప్రవృత్తి రూప ధర్మము అభ్యుదయ హేతువై దేవాదిస్థానములకు గొనిపోవు సాధనమగుచున్నది. అయిననూ ప్రవృత్తిధర్మము కూడ ఈశ్వరార్పణ బుద్ధితో ఫలాభినంధి రహితముగ ఆచరించినచో సత్త్వశుద్ధి ప్రాప్తించును. ప్రవృత్తి - నివృత్తి ద్వివిధ ధర్మములను భగవద్గీతలోని ప్రథమాధ్యాయము నలుబది ఏడు శ్లోకములు, రెండవ అధ్యాములోని పదిశ్లోకములు వెరసి ఏబది ఏడు శ్లోకములు ప్రస్తావనా గ్రంథముగా నున్నది. రెండవ అధ్యాయము పదునొకండవ శ్లోకము మొదలు మూడవ అధ్యాయము చివరవరకు యున్న శ్లోకములన్నియు మూలభూతమగు ఉపదేశ గ్రంథము. నాల్గవ అధ్యాయము మొదలు పదునెనిమిదవ అధ్యాయము చివరవరకు గల గీతములన్నియు విశేషప్రతిపత్తి హేతుభూతమగు వ్యాఖ్యానముగా నలరారుచున్నది. పైన చెప్పిన మూల భూతమగు ఉపదేశ గ్రంథములోనున్న "నాసతో విద్యతే భావో"యను శ్లోకము యీ గీతా శ్లోక రత్నములకు మేరుపు వంటిది. ఈ శ్లోకముయొక్క వివరణ ఉపదేశ గ్రంథమునందున్న సుమారు వందకు పైచిలుకు శ్లోకములందున్నది కావున ప్రకరణ సందర్భమును బట్టి గీతార్థమును గ్రహించుటచే గీతాతత్త్వము కరతలామలకమగును.

సాంఖ్యయోగములో శ్రీకృష్ణభగవానులు ఆత్మస్వరూపము, దేహముల తత్త్వము, ఆత్మజ్ఞాన ఫలము, శాంతిసాధనము, శాంతియే ముక్తి, కర్మయోగ సిద్ధాన్తము, నిష్కాస్వరూపము, బ్రహ్మనిష్ఠ, వర్ణవ్యవస్థ, ఆశ్రమధర్మములు మున్నగు విశేష ధర్మములు వర్ణించెను. శ్రీకృష్ణభగవానుడు జ్ఞానమార్గము నుపదేశించుచు అర్జునుని స్థిర ప్రజ్ఞుని గమ్మనెను. నిష్కామకర్మయోగి లక్షణములను కూడ చెప్పెను. సాంఖ్యులకు జ్ఞానయోగము, యోగులకు కర్మయోగమను రెండు వ్యవస్థలేర్పడినవి. సాంఖ్యులనగా యీ జన్మలోగాని, జన్మాంతరమునందుగాని కర్మయోగము నాచరించి చిత్తశుద్ధి పొందినవారు. చిత్తశుద్ధి యనగా నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముతార్థ భోగవిరాగము, శమాది షట్కసంపత్తి, ముముక్షుత్వము యనునవి పుష్కలముగానుండుట. యోగులనగా యథోచిత విధిగ గురుశుశ్రూష పూర్వక అధ్యయనాభ్యాసములు చేసి, రాగముమీద గార్హస్థ్యము నిర్వహించువారు. కర్మయోగమునందు కామ్య - నిష్కామ - లోక సంగ్రహమను త్రివిధములగు కర్మానుష్ఠానములున్నవి. ఐహికాముష్మిక ఫలాభిలాషచే శాస్త్రచోదిత కర్మలనాచరించుట కామ్యకర్మానుష్ఠానము, కర్మ ఫలాభిలాష రహితముగ చిత్తశుద్ధికొరకు ఈశ్వరార్పణ బుద్ధితో నిత్యనైమిత్తికాదికమును ఆచరించుట నిష్కామకర్మానుష్ఠానము. సంపూర్ణ జ్ఞానమును పొందియున్నను అజ్ఞులకు మార్గనిర్దేశకుడై యుండుటకుగాను యథోచిత శాస్త్రీయ కర్మలు లోక సంగ్రహ కర్మానుష్ఠానమగును. కర్మయోగమను మూడవ అధ్యాయము అర్జునుని సందేహ నివృత్తికై శ్రీకృష్ణుని ప్రశ్నించుటతో ప్రారంభమగును. ఈ ప్రశ్నయే లేకున్నచో అపూర్వ జ్ఞానమును వ్యక్తీకరించు పదునారు అధ్యాయములు భగవంతునియందే అంతర్హితమై యుండెడివి. కర్మకంటె బుద్ధి శ్రేష్ఠమని అభిప్రాయ మైనచో భయంకరమగు యుద్ధ కర్మయందు నన్నెందులకు నియోగించుచుంటివి? సంధిగ్ధార్థము లతో గూడిన వాక్యములతో నా అంతఃకరణము నెందులకు మోహింప జేయుచుంటివి? దేనిచే నేను శ్రేయస్సును పొందెదనో అట్టిదాని నొకటి మాత్రమే

నిశ్చయముగా చెప్పుము"అని అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని అడిగెను.

నాల్గవ అధ్యాయమునందు జ్ఞానస్వరూపము, జ్ఞానాధిక్యత, జ్ఞాన సాధనలు మున్నగునవి పుష్కలముగా వర్ణించుటచే జ్ఞానకర్మసన్యాస యోగమని పేరుయున్నది. ఇందులో వర్ణించబడిన జ్ఞాన సంప్రదాయము రాజర్షి సంప్రదాయమని బుధులు పరిగణించిరి. జ్ఞానము గలుగువరకు జీవులు జననమరణ ప్రవాహరూప సంసారమున ఒక జన్మనుండి మరియొక జన్మను పొందుచుందురను సిద్ధాంతము ఇందులో ప్రదర్శించబడినది. "కర్మణ్యః కర్మయః పశ్యేత్"యను శ్లోకము మొదలుకొని "సంయుక్తః కృత్స్నకర్మకృత్"యను శ్లోకము వరకును భగవానుడు సర్వకర్మ సంన్యాసమును యీ అధ్యాయములో ఉపదేశించెను. అయిదవ అధ్యాయము కర్మ సంన్యాస యోగమును గురించి చెప్పినది. చిత్తశుద్ధిని కలిగించుచు క్రమముగా మోక్షసాధన మగునది కర్మయోగము. శాస్త్ర విహితములైన నిత్యనైమిత్తిక కామ్యకర్మల పరిత్యాగమే కర్మ సంన్యాసము. అవశ్య కర్తవ్యముల ననుష్ఠించుటయె యోగము. కర్మయోగము, కర్మసంన్యాస యోగము రెండును శ్రేయస్కరములు. కాని కర్మ సంన్యాసము సాక్షాత్తు మోక్షసాధనము. దీనిని అనుష్ఠించుట దుష్కరము గావున సుకరమగు కర్మయోగవే ఉత్కృష్టము. తదనంతరము ఆత్మసంయమ (ధ్యాన) యోగము నందు ధ్యాన యోగ స్వరూపము వర్ణించబడెను. ధ్యానయోగము పొందదలంచిన వాడు మున్ముందుగా చిత్తశుద్ధికొరకు కర్మ యోగము నాచరించవలెను. అతడే యోగా రూఢుడనబుడును. ధ్యానయోగము నాశ్రయించుటకు సర్వకర్మ సంన్యాసమును చేయవలెను. ఇదియే ధ్యానయోగమునకు ద్వారము, ధ్యానయోగము వలన బ్రహ్మ భావాపత్తి రూపమగు ఉత్తమశాంతి గలుగును. ధ్యానయోగమునకు మనోనిగ్రహము అత్యావశ్యకము. మనోనిగ్రహము లభించుట దుర్ఘటము. ఇది కేవలము అభ్యాస వైరాగ్యములచే పొందవచ్చునని ఉపదేశించబడినది.

ఏడవ అధ్యాయమగు జ్ఞాన విజ్ఞాన యోగములో జ్ఞానము - ధ్యానము గురించి ఉపదేశించబడినది. భగవంతుని యొక్క పరమార్థ స్వరూపమును గుర్తించుటకు మున్ముందుగా పరిదృశ్యమానమగు జగత్తు జగత్తునకు కారణ భూతమగు ప్రకృతి గురించి తెలుసుకొనవలెను. ప్రకృతికంటె విలక్షణము, నిర్దోషము, సమమునగు పరబ్రహ్మ స్వరూపము పారమార్థిక బ్రహ్మ స్వరూపమని గీతాశాస్త్రము చెప్పుచున్నది. అర్జునుడు సప్తమాధ్యాయమునందలి విషయముల నాకర్ణించి విశేష జిజ్ఞాస చెంది ఏడు ప్రశ్నలు వేసెను. ఆ ప్రశ్నలకు సమాధానముగ యీ ఎనిమిదవ అధ్యాయము ప్రవర్తిల్లుచున్నది. అక్షర బ్రహ్మముయొక్క స్వరూపము సంగ్రహముగా ప్రదర్శించబడుటచే యీ అధ్యాయమునకు బ్రహ్మాక్షర నిర్దేశయోగమని పేరుగలిగెను. "యదక్షరం వేదవిదో వదన్తి" "ఓమత్యేకాక్షరం బ్రహ్మ''యను గీతములచే అక్షరబ్రహ్మమును సంక్షేపముగా ఉపదేశించి బ్రహ్మావాచకమగు ఓంకారమును నిరంతరాభ్యాస పాటవముచే జనించిన సంస్కారమువలన దేహమును విడిచిన తరువాత జ్ఞాననిష్ఠుడు ఉత్కృష్ట గతిని పొందునని చెప్పబడినది. తొమ్మిదవ అధ్యాయము రాజ విద్యా రాజగుహ్య యోగము. కేవలము ఏడవ అధ్యాయమునకు విస్తృత వివరణము. అవాఙ్మానస గోచరము, సకలభూత కల్పనాధిష్ఠానమును, సర్వవ్యాపకమును, అహం శబ్దోపలక్షితమునగు చిన్మాత్రయే పరమాత్మ స్వరూపమని యీ అధ్యాయమునందు తెలియవచ్చుచున్నది. ఈశ్వరాధిష్ఠితమగు ప్రకృతివలన జగత్తుయొక్క సృష్టి

స్థితి లయములు జరుగుచున్నవని ఉపదేశించబడినది. కావున కేవల ప్రకృతియే జగత్కారణమను కపిల సాంఖ్యవాదము నిరసించబడినది. ఏడవ తొమ్మిదవ అధ్యాయములందు పరమాత్మ యొక్క స్వరూపము అవాఙ్మానస గోచర మనియు, అట్టి ఉత్తమస్వరూపము పరమాత్మయందు రజ్జుసర్పమనునటుల బయలువెడలిన భూతభావముల ద్వారా తెలిసికొనవలయుననియు చెప్పబడెను. తదనంతరము యీ అధ్యాయములో సకల భావములును పరమేశ్వరుని వికృతులేయని సూచించబడెను.

నాల్గవ అధ్యాయము మొదలు పదియవ అధ్యాయాంతము వరకునున్న గ్రంథమును వినుటచే శ్రీకృష్ణుడు ప్రాకృత పురుషుడు గాదని అర్జునునకు విదితమైనది. సకల జగన్నియంతయగు పరమేశ్వరుని పరాత్పరత్వము గ్రహించు విధానమునకై "విష్టభ్యాహమిదం"యను ఉపదేశము నాధారముగా చేసికొని శ్రీకృష్ణుని పరాత్పరరూపమును ప్రదర్శించమని కోరెను. అపుడు భగవానుడు తన విశ్వరూపమును ప్రదర్శించెను. ఇతరులు యీ విశ్వరూపమును దర్శించదలంచినచో అనన్యభక్తియను సాధనచేయవలెను. పండ్రెండవ అధ్యాయము భక్తియోగమును వివరించెను. కర్మయోగము – జ్ఞానయోగములను ద్వివిధ నిష్ఠయే భక్తియోగము. ఇందు అధికారభేదమును బట్టి అనుష్ఠాన భేదము తెలియబడుచున్నది. క్షేత్రమను విషయము, క్షేత్రజ్ఞుడగు విషయి గురించి వివరించుటచే పదమూడవ అధ్యాయమునకు క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగమను వ్యవహారము గలిగినది. పరిదృశ్యమానమగు దేహమే క్షేత్రము, శరీరము సప్తధాతుమయమగు పిండమేగాక స్థూల – సూక్ష్మ – కారణములనెడి మూడు దేహముల యొక్క సమహారము, సూక్ష్మశరీరము ఇంద్రియములకు తెలియబడని కార్యమేయగుచున్నది. జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము, ప్రాణము, అంతఃకరణముయనెడి పండ్రెండు అవయవములతో కూడినదియే సూక్ష్మశరీరము. కొందరు కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములు పది, ప్రాణవృత్తులైదు, అంతఃకరణవృత్తులను నాలుగుగా లెక్కించి పందొమ్మిది అవయవములందురు. కారణ శరీరమనగా ప్రకృతియనియు, అజ్ఞానమనియు, అవిద్యయనియు, స్వభావమనియు పలువిధముల చెప్పబడుచు జడచిత్తులను రెండు అంశములతో గూడినటుల కోవిదులు గ్రహించుచున్నారు. అందులో అచిద్భాగము సత్త్వరజస్తమో గుణములతో నొప్పుచు తరతమ భావముల ననుసరించి ఆయా వ్యక్తుల యొక్క తరతమ భావమునకు హేతువగుచున్నది. ఈ అచిద్భాగముయొక్క విమర్శ దర్పణతుల్యమై పరమాత్మయొక్క ప్రతిబింబమును గ్రహించు చుండును. ఈ ప్రతిబింబమే చిదా భాసుడను చిద్భావము. ఆ ప్రతిబింబమునకే జీవుడని వ్యవహారము, స్థూలసూక్ష్మ కారణ శరీరములు మూడింటికి సాక్షియగు పరమాత్మయే క్షేత్రజ్ఞుడు. సకల శరీరములకు క్షేత్రజ్ఞుడు ఒకడే. అతడే పరబ్రహ్మము. క్షేత్ర క్షేత్రజ్ఞులయొక్క విభాగమును తెలుసుకొనుటయే ఉత్తమజ్ఞానమని చెప్పబడుచ్నుది. ఈ అధ్యాయములో పండ్రెండవ గీతము మొదలు పదునేడవ గీతమువరకు గల ఆరు గీతములచే బ్రహ్మస్వరూపము స్పష్టమొనర్చ బడుచున్నది. ఈ గీతములు ప్రసిద్ధమగు పురుషసూక్తము యొక్క అర్థమును సంక్షేపముగా బోధించుచు క్షేత్రక్షేత్రజ్ఞ భావములు తెలియవచ్చుచున్నవని యీ అధ్యాయము వివరించినది.

పదునాల్గవ అధ్యాయము సకల ప్రాణులును ప్రకృతి గుణములగు సత్త్వరజస్తమస్సుల యొక్క వికారములతో ఒప్పుచున్నవనియు,అందుచే సకల ప్రాణులును సాత్త్విక రాజస తామస భావములచే భేదమునొందుచున్నవనియు నిరూపించబడుటవలన దీనికి గుణత్రయ విభాగయోగమను నామమేర్పడినది.

ప్రకృతి గుణముల నతిక్రమించిన గుణాతీతుడు జనన మరణ ప్రవాహరూపమగు సంసారమునుండి విముక్తుడై బ్రహ్మభావమును పొందునని చెప్పబడినది. ఇట్టి గుణాతీతుడే ప్రకరణాంతరమునందు స్థితప్రజ్ఞుడనియు, జ్ఞాని యనియు, భక్తుడనియు, సంన్యాసియనియు, యోగియనియు వేర్వేరు నామములతో పేర్కొనబడుచున్నాడు. గుణములనతిక్రమించుటకు భక్తియోగమే ఉత్తమ సాధనమని ఉపదేశించబడినది. పదునైదవ అధ్యాయములో పరమాత్మ స్వరూపమును సంపూర్ణముగ నిరూపించుటచే పురుషోత్తమ యోగమన బడినది. ఈ అధ్యాయములో సర్వకర్మసంన్యాసము, పరమాత్మాన్వేషణకు ప్రధాన ద్వారముగ ఉపదేశించ బడుచున్నది. అటులనే క్షరుడు – అక్షరుడు యను యిరువురు పురుషులు ఉన్నారనియు, అట్టి క్షర – అక్షరులకంటె పరమాత్మ పురుషోత్తముడని ఉపదేశించ బడినది. మానవకోటి యందున్న వ్యక్తులు దైవాసుర సంపత్తులను ద్వివిధ భావములతో నొప్పుచున్నవని ప్రతిపాదించి, ఆయావ్యక్తుల తత్త్వమెట్టిదో తెలుసుకొనుటకు కొన్ని చిహ్నములు పదునారవ అధ్యాయములో చెప్పబడెను. సకల ప్రాణులకు శ్రద్ధయనునది ఆయా ప్రాణులయొక్క అంతఃకరణము నందు ప్రాక్తనజన్మ సంస్కారము ననుసరించి యుండును. ఏ వ్యక్తి ఎట్టి విధమగు శ్రద్ధతోనుండునో ఆ రీతిగనే లోకములో గుర్తించబడును. అటులనే ఆ వ్యక్తులయొక్క మానసిక వాచక, కాయక వ్యవహారములు యుండును. ఆయా వ్యక్తులయందుండు శ్రద్ధకూడ సాత్త్విక రాజస తామస రీతులుగ యుండునని యీ పదునేడవ అధ్యాయమగు శ్రద్ధాత్రయ విభాగయోగము వర్ణించినది. పదునెనిమిదవ అధ్యాయము పూర్వ అధ్యాయముల సారమై "సర్వకర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ"యను చరమ శ్లోకముగ నుండుటవలన మోక్ష సన్యాస యోగముగ చెప్పబడినది. గీతాశాస్త్రము నభ్యసించువారు భగవంతునియెడ అనన్య భక్తులై యుండవలెను. గురుశుశ్రూషా తత్పరులై సాంప్రదాయ ప్రవర్తకులగు గురువులనుండి ఉపదేశమును పొందవలెను. ప్రస్థానత్రయ కోవిదులగు బ్రాహ్మణుల ద్వారా గీతాశాస్త్రము నభ్యసించవలెను. అటులనే యజ్ఞ దాన తపస్సులనెడి త్రివిధ కర్మలనాచరించవలెనని భగవానుడు ఉపదేశించెను.

శ్రీకృష్ణభగవానుడు ఈ గీతాశాస్త్రము ద్వారా కొన్ని విధులను అర్జునుని ప్రధాన శ్రోతగా చేసుకొని సుమారు ఏబది శ్లోకములు పదునెనిమిది అధ్యాయములలో ఉపదేశించెను. వేదార్థ సంగ్రహమగు ఈ గీతాశాస్త్రము యొక్క అర్థము దుర్విజ్ఞేయము. పలువిధములగు వ్యాఖ్యానములు రచించబడి యున్ననూ అవి అనేకములగు విరుద్ధార్థములతో నుండుట గమనించిన ఆదిశంకరులు సంక్షేపముగ వివరణను రచించిరి.

శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

ద్రోణపర్వము

సంపుటి : 7

ఓం భగాయ నమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

ద్రోణ పర్వము - సంగ్రహ పరిచయము

మహాభారతములో ఏడవదగు ద్రోణ పర్వము రెండువందల మూడు అధ్యాయములతో అలరారు చున్నది. ద్రోణాచార్యుని సేనాధిపత్యము, దుర్యోధనుని సంతోషబెట్టుటకు యుధిష్ఠిరుని పట్టితెచ్చెదనని ద్రోణాచార్యుడు ప్రతిజ్ఞ చేయుటతో యీ పర్వము ప్రారంభమగును. ఈ పర్వములో ద్రోణాభిషేకము, సంశప్తకవధ, అభిమన్యునివధ, అర్జునుని ప్రతిజ్ఞ, జయద్రథ వధ, ఘటోత్కచ వధ, ద్రోణవధ, నారాయణాస్త్ర మోక్షమనెడి ఎనిమిది ఉప పర్వములున్నవి.

కథాంశము:

మహాధనుర్ధారి భీష్ముడు అర్జునుని దివ్యాస్త్ర ప్రయోగముల ద్వారా పతనము చెందెను. శరశయ్యపై శయనించియున్న ఆయన అవస్థను జూచిన దుర్యోధనాదులకు తమ విజయముపై ఆశలు నీరుగారినవి. కర్ణుడు భీష్మపతనము నాలకించి ఆర్తిచెంది భీష్ముని కడకేగి అంజలి ఘటించి అభివాదపూర్వకముగ తన పరిచయమొనర్చుకొనెను. భీష్ముని పరాక్రమమును పరిపరి విధముల ప్రశంసించుచు శ్రీకృష్ణార్జునుల అద్భుత కర్మలను వర్ణించెను. భీష్ముడు వంటివారే అర్జునుని జయించలేక పోయినచో ఇతరులెవరూ ఆయనతో పోరాడ సాహసించలేరని పలికి తనకు అనుజ్ఞనిచ్చినచో తన అస్త్రములసంపదతో అర్జునుని నిలువరించి వధించ ప్రయత్నించెదనని విన్నవించెను. అపుడు భీష్ముడు అనుమతినీయగా కర్ణుడు ఉత్సాహభరితుడై ఆయన చరణములకు మ్రొక్కి కౌరవసేనను చేరెను. పిమ్మట దుర్యోధనుని కోరికపై ద్రోణాచార్యుని ప్రధాన సేనాపతిగ నియమించుట యోగ్యమని సలహానిచ్చెను. దుర్యోధనుడు తక్షణమే ద్రోణాచార్యుని సముచిత రీతిలో అర్చించి కౌరవసేనాపతిగ అభిషిక్తుని గావించెను. కర్ణుడు కూడ యుద్ధరంగములో చేరుటజూచి కౌరవసైన్యములోని రాజులెల్లరు శోకరహితులయ్యిరి. సేనాపతి ద్రోణాచార్యులు యుద్ధ రంగమును ప్రవేశించినంతనే సూర్యుని చుట్టూ నాలుగు వలయములేర్పడినవి. అనేక భయంకర ఉత్పాతములు అగుపడినవి. అవియన్నియు యుద్ధమునందున్న అనేకమంది వీరుల జీవనలీల వినాశమగునని సూచించినవి. ద్రోణాచార్యుడు వృద్ధుడైనను తరుణవయస్కునివలె స్ఫూర్తిజూపుచు యుధిష్ఠిరుని సైన్యమునకు కాలునివలె భయసదృశుడై సంచరించసాగెను. ద్రోణాచార్యులు సేనాపతిగ అభిషిక్తుడైనంతనే సంతోషముతో దుర్యోధనుని ఏదైనా వరము కోరుకొనమనెను. అపుడు దుర్యోధనుడు తనకు యుధిష్ఠిరుని బందీగాచేసి తెచ్చియిమ్మని కోరెను. ఏదైనా ఉపాయముతో అర్జునుడు కొద్దికాలము రణక్షేత్రము నందు లేకుండచేసినచో అవశ్యము ధర్మరాజును బందీగా తెచ్చెదనని ద్రోణాచార్యులు సత్యప్రతిజ్ఞచేసెను. కౌరవపాండవుల ద్వంద్వయుద్ధము భీకరముగా సాగెను. అర్జునుని రణరంగమునుండి దూరముగా గొనిపోవుటకు సుశర్మాది సంశప్తకవీరులు తలపడిరి. కపిధ్వజుడగు అర్జునుడు మున్ముందుగా సుధన్వాయనువానిని వధించెను. సంశప్తక గణము మూకుమ్మడిగ అర్జునునిపై దాడిచేయగా వారిలో లలిత్థ - మాళవ -మావేల్లక - త్రిగర్త - యౌధేయ సైనికులందరిని అర్జునుడు నష్టమొనర్చెను. అర్జునుడిటుల

యుద్ధభూమిలో మహత్కర్మ చేయుచుండగా ద్రోణాచార్యులు వ్యూహప్రకారము యుధిష్ఠిరుని బందీగ చేయుతలంపుతో ఆక్రమణచేసెను. కాని ధృష్టద్యుమ్నుడు బాణముల వలవేసినటుల ద్రోణాచార్యునిపై దాడిచేసెను. ఇంతలో దుర్ముఖుడు ఎదురుపడి ధృష్టద్యుమ్నుని నిలువరించెను. అంతలో ద్రోణుడు తన చెంతకు వచ్చుట జూచిన నిర్భయుడగు యుధిష్ఠిరుడు శరవర్షముతో నిరోధించెను. యుధిష్ఠిరుని రక్షణకై పాంచాల రాజకుమారుడు సత్యజిత్ అడ్డుకొని ద్రోణాచార్యునితో ఘోర యుద్ధము జరిపెను. సత్యజిత్తుకు సహాయముగ వృకుడు వచ్చెను. ద్రోణాచార్యుడు కనులెర్రజేసి శరవర్షముతో వృకుని వధించెను.

ద్రోణాచార్యుడు పాండవసేనను దగ్ధమొనర్చుట జూచి యుధిష్ఠిరుదాదిగాగల వీరులందరు జగత్తును తపింపజేయు సూర్యభగవానుని కిరణములవలె అన్నివైపులనుండి ద్రోణాచార్యుని ఆక్రమించిరి. ఐనను సత్యప్రతిజ్ఞుడగు ద్రోణా చార్యుడు రథసేనను దాటి దృఢసేనుడను యోధాగ్రేసరుని వధించెను. భల్లబాణముతో క్షత్రదేవుని గాయమొనర్చి రథమునుండి కిందపడునటుల చేసెను. భీమసేనుడు రణరంగమునందొకచోట భగదత్తునితో తలపడెను. భగదత్తునకు వేయి ఏనుగుల బలమున్న గజరాజమున్నది. ఆయన ఆ గజేంద్రముపై స్వారి చేయుచు పాండవ యోధులను పరుగులెత్తించసాగెను. భీమసేనుడు అంజలికావేధమను విద్యతో ఆ ఏనుగును సంతోషబెట్టుచు తనను రక్షించుకొని సంచరించసాగెను. గజస్వారిలో కుశులుడైన భగదత్తుడు సమరాంగణములో ఇంద్రునకు తక్కువగాడు. గజారోహయోధులలో యీ భూమండలములో ప్రధానుడు. ఆయన సుప్రతీకమను గజరాజము పాండవ సేనను ఛిన్నాభిన్నమొనర్చుట జూచిన అర్జునుడు తక్షణమే రథమును ఆ ప్రదేశమునకు పోనీయమని శ్రీకృష్ణుని కోరెను. అంతలో పదునాలుగువేలమంది సంశప్తకయోధులు అర్జునుని అడ్డుకొనిరి. ఆయన వారందరిని మట్టుబెట్టగా అర్జునుడు శీఘ్రమే కౌరవసేనను ఆక్రమించెను. అర్జునునిద్వారా మదగజసహిత భగదత్తుడు వధించబడెను. నీలుడు వీరశౌర్య పరాక్రమములతో కౌరవసేనను నశింపజేయుట గమనించిన అశ్వత్థామ ఎదుర్కొని నీలుని మస్తకమును ఒక భల్లబాణముతో తెగగొట్టెను. ద్రోణాచార్యులు రణక్షేత్రములో యుధిష్ఠిరుని పట్టుకొనలేకపోవుటను ఎత్తిపొడుచుచు దుర్యోధనుడు నిష్ఠురములాడుట సహింపనోపకుండెను. అర్జునుడు రక్షణగానుండగ యుధిష్ఠిరుని తానేగాక ఇంద్రాది దేవతలుసైతము బందీగా చేయజాలరని ద్రోణుడు పలికెను. పిమ్మట రోషముతో "దుర్యోధనా! నేడు పాండవ పక్షమునందున్న ఒక శ్రేష్ఠమహారథుని అవశ్యము వధించెదను"అని ప్రతిజ్ఞచేసెను. అంతలో సంశప్తక గణములు దక్షిణదిశ స్థితులై అర్జునుని మరల యుద్ధమునకు కవ్వించిరి. అర్జునుడు వారితో ఘోర సంగ్రామము చేయు సమయమున ద్రోణాచార్యు డొక వ్యూహమును రచించెను. శత్రుదుర్భేధ్యమగు చక్రవ్యూహమును ఛేదించుట అత్యంత కఠిన మయ్యెను. అపుడు అభిమన్యుడు తన పెదతండ్రి అనుజ్ఞతో శత్రువ్యూహమును ఛేదించుటకు ప్రయత్నించెను. పిమ్మట వ్యూహములో చొచ్చుకొని వేలకొలది కౌరవవీరులను వధించెను. చివరకు ఆరుగురు వీరులతో ఒంటరిగా పోరాడుచు దుశ్శాసనుని పుత్రునిచే సంహరించబడెను. అభిమన్యుని మరణమును జూచిన కౌరవ మహారథులు హర్షోత్సాహభరితులయ్యిరి. కాని పాండవ వీరుల నేత్రములు అశ్రుపూరితములైనవి. శోకవ్యాకుల చిత్తముతో విలపించుచున్న యుధిష్ఠిరునకు సాంత్వన గూర్చుటకై వేదవ్యాసమహర్షి

మృత్యువు ఉత్పత్తి గురించి పూర్వ ఉపాఖ్యానమును చెప్పెను. అటులనే షోడశమహారాజుల చరిత్రను వివరించెను. అభిమన్యుని ఒంటరిగా చేసి ఆరుగురు మహారథులు వధించిరని తెలిసిన అర్జునుడు పుత్రశోక పరితప్తుడై ఆక్రోశించెను. శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు ధైర్యముచెప్పి కర్తవ్యబోధచేసెను. అపుడు అర్జునుడు జయద్రథుని వధకై శపథపూర్ణ ప్రతిజ్ఞ చేసెను. జయద్రథుని భయపడవలదని దుర్యోధనుడు, ద్రోణాచార్యులు ఓదార్పు వచనములతో తగురక్షణతో యుద్ధస్థితుని చేసిరి. శ్రీకృష్ణుని ఉపదేశానుసారము అర్జునుడు శివపూజచేసెను. ఆయనకు స్వప్నములో శివుడు ప్రత్యక్షమై మరల పాశుపతాస్త్రమును, యుద్ధవిజయమును అనుగ్రహించెను. స్వప్నములో శ్రీకృష్ణార్జునులు చేసిన శివస్తుతి అద్భుతము. (ఇది ఎనుబదవ అధ్యాయములో 55 నుండి 65 శ్లోకములుగ నున్నది), మరునాడు ప్రభాత సమయమున యుధిష్ఠిరుడు సభదీర్చి అర్జునుని ప్రతిజ్ఞ సఫలతకై శ్రీకృష్ణుని ప్రార్థించెను. అటులనే జయద్రథ వధకై బయలుదేరిన అర్జునుని ఆశీర్వదించెను. ద్రోణాచార్యులు మరల చక్రవ్యూహమును రచించెను. అర్జునుడు శంఖారావము చేసి ఆ చక్రవ్యూహమును ఛేదించుకొని పోయి దుర్మర్షణుని గజసైన్యమును సంహరించెను. అర్జునుని శరవేగమునకు దుశ్శాసనుడు విలవిలలాడి పారిపోయెను. అర్జునుడు కౌరవసేనలో ప్రవేశించి శ్రుతాయుధ – సుదక్షిణులను వధించెను. అటులనే శ్రుతాయు, అచ్యుతాయు, నియతాయు, దీర్ఘాయు, అంబష్ఠాదులను వధించెను. అర్జునుడటుల కౌరవసేనను విధ్వంసమొనర్చుట జూచిన దుర్యోధనుడు ద్రోణాచార్యుని నిష్ఠుర వచనములతో బాధించెను. అందులకు ఆయన దుర్యోధనునితో "రాజా! నేను యుధిష్ఠిరుని బందీగాజేసి తెచ్చెదనని క్షత్రియుల నడుమ ప్రతిజ్ఞచేసి యుంటిని. ఇపుడు అర్జునుడు దూరముగ జయద్రథ వధకై పోవుచుండెను. నేనిపుడు యీ చక్రవ్యూహములో అర్జునరహిత యుధిష్ఠిరుని బంధించుటకు సిద్ధపడి యుంటిని. కావున అర్జునునితో యుద్ధమునకు ఇచ్చగించక యుంటిని. జయద్రథ రక్షణకై నిన్ను సమర్థునిగా చేయు ఉపాయమునొకటి చేసెదను. నేడు సంగ్రామములో శ్రీకృష్ణభగవానుని సమక్షమునందే మహాధనుర్ధరుడగు అర్జునుడు నీతో యుద్ధము చేయుచు తడబడు చుండు అద్భుతమును అందరు జూచెదరు. నేను నీ కొక సువర్ణమయ కవచమును తొడిగెదను. యుద్ధ స్థలములో విడిచిన బాణములుగాని, అస్త్రములుగాని నిన్ను గాయపరచజాలవు. ముల్లోకములందు ప్రాణులెల్లరు నీతో యుద్ధముచేసిననూ నీకు భయము కలుగదు. కనుక నీవు యీ కవచమును ధరించి శీఘ్రమే రణక్షేత్రమునకేగి అర్జునుని ఎదుర్కొనుము. అతడు నీ వేగమును సహించజాలకుండును."అనెను. ద్రోణాచార్యు లిటులపలికి విధిపూర్వకముగ మంత్రజపముతో తేజస్వితమైన అద్భుత కవచమును గట్టెను. దేవతలకు హితము గూర్చుటకై ఒకప్పుడు శంకర మహాదేవుడు తన శరీరమునుండి తేజస్వంతమగు కవచమునుత్పన్నము చేసి, ఇంద్రునకు సమర్పించి మానసిక మంత్రజపముతో ఆ కవచమును బంధించుకొని వృత్రాసురుని వధించు ప్రయత్నము చేయమనెను. శంకర భగవానుడు ఇంద్రునకు ఉపదేశించిన ఆ మంత్రము తరువాత కాలములో అంగిరామునికి దేవేంద్రుని ద్వారా లభించెను. అంగిరాముని తన పుత్రుడగు బృహస్పతికి, బృహస్పతి అగ్నివేశ్యునకు, అగ్నివేశ్యుడు ద్రోణునకు ఉపదేశించిరి, ద్రోణాచార్యులు ఆ మంత్రముతోనే దుర్యోధనుని శరీరముపై రక్షా కవచమును బంధించెను. పిమ్మట దుర్యోధనుని అర్జునునితో యుద్ధమునకు బంపెను. అర్జునుడు విందాను విందులను వధించి జయద్రథునివైపు కదిలెను.

దుర్యోధనుడు ఎదుర్కొని అర్జునుని కవ్వించెను. దుర్యోధనుడు కవచముతో సురక్షితుడైననూ తాను పాటించవలసిన కర్తవ్యముల నెరుగకుండుటచే అర్జునుని చేతిలో పరాజితుడయ్యెను. కౌరవసేనలోని క్షేమధూర్తి, వీరధన్వుడు, నిరమిత్రుడు, వ్యాఘ్రదత్తుడు పాండవ మహారథుల చేతిలో హతులయ్యిరి. ద్రౌపదేయులు సోమదత్తుని కుమారుడగు శలుని వధించిరి. తరువాత ఘటోత్కచుడు విజృంభించి అలంబుషుని వధించెను. సాత్యకి ద్వారా జలసంధుడు వధించబడెను. సాత్యకి తన పరాక్రమముతో ద్రోణుని - దుర్యోధనుని పరాజితులను గావించి అర్జునునకు సహాయ మొనర్చుటకు ముందుకు కదిలెను. సుదర్శనుని వధించెను. పాషాణయోధ మ్లేచ్ఛులను సంహరించెను. భీమసేనుడు కూడ అర్జునుని సహాయార్థమై కౌరవసేనలో ప్రవేశించి పదునొకండు మంది ధార్తరాష్ట్రులను వధించెను. అటులనే ధృతరాష్ట్రుని పుత్రులగు దుర్జయుని, దుర్ముఖుని, దుర్మర్షణాది మరొక వందొమ్మిదిమంది అన్నదమ్ములను కూడ సంహరించెను. సాత్యకి భూరిశ్రవుల యుద్ధము భీకరముగ జరిగినది. వరప్రభావముచే భూరిశ్రవుడు సాత్యకిని ఆక్రమించి కాలితో తన్ని నేలపై పడద్రోసి పాదములతో తొక్కసాగెను. ఆ సమయమున శ్రీకృష్ణుని ప్రేరణతో అర్జునుడు తన శిష్యుడగు సాత్యకిని రక్షించుటకై రెండు పదునైన బాణములతో భూరిశ్రవుని భుజములను తెగగొట్టెను. భూరిశ్రవుడు ప్రాణోత్క్రమణ చేయుటకు యోగాశ్రితుడై యుండగా సాత్యకి తన పూర్వ ప్రతిజ్ఞ ప్రకారము అతని మస్తకమును ఖడ్గముతో నరికెను.

అర్జునుడు జయద్రథుని ఆక్రమించి ఘోర యుద్ధము జరుపసాగెను. కర్ణుడు తన శక్తివంచనలేక జయద్రథుని రక్షణకు ప్రయత్నించెను. కాని అర్జునుడు అద్భుత పరాక్రమమును ప్రదర్శించెను. విపక్షశూరుల పాలిట రుద్రునివలె అగుపడెను. కౌరవపక్ష యోధులు జయద్రథుని జీవనముపై నిరాశచెంది యుద్ధ నివృత్తులయ్యిరి. అయినను జయద్రథుని రక్షణకై ఆరుగురు మహారథులుండిరి. వారిని పరాజితులను గావించనిదే, సింధురాజుపై ఏ మాయను ప్రయోగించనిదే అర్జునునకు విజయము సిద్ధించదని శ్రీకృష్ణుడు తలంచెను. మహాయోగి శ్రీకృష్ణభగవానుడు అర్జునుని అంగీకారముతో సూర్యదేవుని గప్పి వేయుటకు అంధకారమును సృజించెను. జయద్రథుడు పదేపదే శిరస్సును ఎత్తి సూర్యాస్తమైనదా లేదా యని పరిశీలనామగ్నుడై సూర్యబింబమును వెదుకుచుండెను. అర్జునుడు తక్షణమే వజ్రసమాన బాణముతో అతని శిరస్సును తెగగొట్టి అంబరయానము చేయించి సమంతపంచక క్షేత్రమున కావల సంధ్యావందన మొనర్చుచున్న బృహత్క్షత్రుని ఒడిలో పడునటుల చేసెను. బృహత్క్షత్రుడు కోరినవిధముగ ఆ శిరస్సు నేలపై పడినంతనే (చివరగా తన ఒడినుండి జారిపడుటచే) తండ్రీ తనయుల శిరస్సులు వేయి ప్రక్కలయినవి. ఆ విధముగ కిరీటధారి వీరార్జునుడు తన ప్రతిజ్ఞను సఫలమొనర్చుకొని కౌరవసేనా సంహారమునకు పూనుకొనెను. ఆనాడు సమరమును చాలించి శ్రీకృష్ణార్జునులు యుధిష్ఠిరుని కడకేగిరి. ఆ సందర్భమున యుధిష్ఠిరుడు చేసిన శ్రీకృష్ణస్తుతి 149వ అధ్యాయములో 4 నుండి 34 వరకున్న శ్లోకములందున్నది.

అర్జునుడొక్కడే కౌరవసేనలో ఏడు అక్షౌహిణుల సైన్యమును సంహరించెను. జయద్రథుని మరణానంతరము దుర్యోధనుడు అత్యంత ఖేదమును పొంది నిష్ఠుర వచనములతో ద్రోణాచార్యుని ఆక్షేపించెను. ద్రోణాచార్యుడు అందులకు విదురాది మహాశయులు చెప్పిన హితవులను పెడచెవిని పెట్టినందులకు దుర్యోధనునకు యిట్టి దుస్థితి కలిగెనని చెప్పెను. తాను పాంచాలురను వధించువరకు కవచమును విడువనని శపథము

చేసెను. అటులనే అశ్వత్థామకు కొన్ని హితవచనములు చెప్పమని కురురాజుని ఆదేశించి తాను యుద్ధ స్థితుడయ్యెను. కురుక్షేత్ర సంగ్రామములో అధర్మముగా ఆ రోజు రాత్రి కూడ యుద్ధము జరిగెను. ద్రోణచార్యుని ద్వారా పాండవసైన్య సంహారము జరిగెను. భీమసేనుని ద్వారా కళింగరాజ కుమారుడు, ధ్రువుడు, జయరాతుడు, ధార్తరాష్ట్రులగు దుష్కర దుర్మధులు వధించబడిరి. బాహ్లీకుడు, ధృతరాష్ట్రుని మరొక పదిమంది పుత్రులను కూడ భీమసేనుడు వధించెను. ద్రోణునకు దూరముగా నుండునటుల శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునకు హెచ్చరిక చేసెను. బకాసురుని తమ్ముడగు అలంబుషుని పూర్వమే ఘటోత్కచుడు వధించెను. ఇపుడు జటాసురుని పుత్రుడగు అలంబుషుని ఎదుర్కొని హతమార్చెను. ఇదివరలో అలంబుషుడను రాజశ్రేష్ఠుని సాత్యకి వధించెను. అటులనే యింకొక రాక్షసరాజు అలాయుధుని కూడ ఘటోత్కచుడు వధించెను. ఘటోత్కచుని వీరవిహారమునకు భయభీతులు చెందిన దుర్యోధనుడు ఘటోత్కచుని వధకై కర్ణునివద్ద ఇంద్రప్రద శక్త్యాయుధమును ప్రయోగించమని కోరెను. ఆ విధముగ అర్జునునిపై విజయము సాధించుటకు కర్ణుడు దాచుకున్న శక్త్యాయుధము ఘటోత్కచ వధకు ప్రయోగించబడెను. అందులకు శ్రీకృష్ణుడు హర్షాతిశయముచెంది అర్జునుని ప్రాణములకు రక్షణ కలిగెనని యుధిష్ఠిరునకు దెలిపెను. వ్యాసమహర్షికూడ యుధిష్ఠిరుని అట్టి సాంత్వన వచనములతో ఓదార్చెను. కాని దుర్యోధనుడు క్రోధావేశముతో ద్రోణాచార్యుని కడకేగి ఆయనకు హర్షోత్సాహ ఉత్తేజములు కల్పించనెంచి అనేక దెప్పిపొడుపులతో బాధించెను. దుర్యోధనుడు అటుల నిష్ఠురవచనములు పలుకగా ద్రోణాచార్యుని కోపము జివ్వున పైకెగెసెను. తాను ముదుసలి యైననూ యుద్ధములో పూర్తి శక్తి నుపయోగించి విజయముకొరకు శ్రమించు చుంటినని పలికెను. పిమ్మట అనేక వ్యంగ్య వచనములతో, పాండవుల యొక్క బలసామర్థ్యములు చెప్పి, దుర్యోధనుని స్వయముగా తన మిత్రబృందముతో అర్జునుని ఎదుర్కొని పోరాడమని చెప్పి మరల యుద్ధము నారంభించెను. ఆయన పాండవ సైన్యమును విక్షుబ్ధమొనర్చ దలంచెను. ద్రుపదుడు, ద్రుపద పుత్రులు, విరాటుని మున్నగు వారిని వధించెను. భీమసేనుడు ఆ పరిస్థితిని జూచి ధృష్టద్యుమ్నుని పరిపరివిధముల ఆక్షేపణలతో పౌరుష ప్రేరణచేసెను. ఆ సమయమున దుశ్శాసన సహదేవులు, కర్ణ భీమసేనులు, అర్జున ద్రోణుల ద్వంద్వయుద్ధము ప్రారంభమయ్యెను. అటులనే ధృష్టద్యుమ్న దుర్యోధనులు, దుర్యోధన సాత్యకిలు, భీమసేన కర్ణుల యుద్ధము భయంకరముగ జరిగెను. ద్రోణాచార్యుడు బ్రహ్మాస్త్రప్రయోగముతో ఇరువదివేలమంది పాంచాల యోధులను సంహరించి ధూమరహిత ప్రజ్వలితాగ్ని వలె ప్రకాశించసాగెను. ఈ ప్రకారము ద్రోణాచార్యుడు క్షత్రియ వినాశమునకు ఉద్యుక్తుడగుట జూచిన మహర్షి సంఘములు అగ్నిదేవుని ముందిడుకొని రణరంగమునకు సూక్ష్మరూపమున వచ్చి "ద్రోణా! నీవు ఆయుధమును వదిలిపెట్టుము. నీవు అధర్మ యుద్ధమునకు పాల్పడుచుంటివి. నీకు మృత్యు .సమయము కూడ ఆసన్నమైనది. క్రూరకర్మలు నీకు శోభనీయంజాలవు. నీవిక అస్త్రశస్త్రములు పరిత్యజించుము. నీవు బ్రహ్మాస్త్ర ప్రభావము తెలియని వారిపై ప్రయోగించి వారందరిని దగ్ధమొనర్చితివి. ఇది బ్రహ్మాస్త్ర ప్రయోగ విధులకు విరుద్ధము. నీవు అస్త్రశస్త్రములు పరిత్యజించుము. మరల యిట్టి పాపకర్మను చేయకుము"అని హితవుబలికిరి. అదే సమయమున భీమసేనుడు ఘోషించిన "అశ్వత్థామ హతః" యను వాక్యమునాలకించెను. అటులనే తనకు ఎదురుగా యజ్ఞాగ్నినుండి ఉద్భవించిన ధృష్టద్యుమ్నుని

జూచెను. ఆ ప్రకారము అన్నివిధముల ఉదాసీనత చెందెను. అయిననూ అశ్వత్థామ మరణవార్త ఆయనకు సందేహాస్పదమై యుండెను. ఈ పృథివిపై పాండవులు లేకుండునటుల చేయుటకు ద్రోణాచార్యుడు ఉద్యుక్తుడైయుండెనని శ్రీకృష్ణ భగవానుడెరిగి యుధిష్ఠిరునితో యిట్లనెను. "యుధిష్ఠిరా! ఈ ద్రోణాచార్యుడు క్రోధవశుడై నేడు దినములో అర్థభాగము గడువకముందే నీ సైన్యమునంతటిని సర్వనాశనమొనర్చనున్నాడు. నీవు మమ్ములనందరిని రక్షించవలసిన రాజధర్మమున్నది, రాజధర్మమును పాలించుట అసత్యభాషణకన్న మహత్తరమైనది. ఎవరికైనా ప్రాణరక్షణ కల్పించుటలో ఎప్పుడో ఒకప్పుడు అసత్యము పలుకవలసివచ్చినచో అట్టివానికి అసత్యవచన పాపము సంభవించదని సనాతన ధర్మము చెప్పినది"అనెను. శ్రీకృష్ణుని భాషణకు ప్రభావితుడైన యుధిష్ఠిరుడు, రణరంగములో భీమసేనుడు మాళవనరేశుని అశ్వత్థామయను గజరాజును సంహరించుట నాలకించి, ద్రోణాచార్యుని కడకేగి ''అశ్వత్థామహతః కుంజరః''అని పలికెను. ద్రోణాచార్యునకు "అశ్వత్థామహతః"యను వచనములు బిగ్గరగా వినబడెను. ద్రోణాచార్యులు పుత్రశోకముతో సంతప్తుడై జీవనముపై నిరాశచెందెను. అందుచే పూర్వమువలె యుద్ధోత్సాహమును కనబరచకయుండెను. అయిననూ ధృష్టద్యుమ్నునితో యుద్ధము చేయనారంభించెను. అది దేవాసుర సంగ్రామమువలె నుండెను. శత్రుమర్దనుడగు ద్రోణాచార్యుడు ఇరువదివేలమంది క్షత్రియులను, లక్ష ఏనుగులను సంహరించి నిశ్చలుడై యుద్ధభూమిలో నిలిచెను. భీమసేనుని ప్రేరణతో ధృష్టద్యుమ్నుడు మరల ద్రోణచార్యుని ఎదుర్కొనెను. కాని ద్రోణుని పరాక్రమము ముందు నిలువలేకపోయెను. అపుడు భీమసేనుడు ద్రోణాచార్యుని సమీపమున కేగి "విప్రవరా! నీవు స్వధర్మస్థితుడవై పరధర్మము నాశ్రయించక యున్నచో యింతటి క్షత్రియ వినాశము జరిగెడిదిగాదు. నీవు బ్రాహ్మణుడవగుటయే గాక అందరిలో ఉత్తమ బ్రహ్మవేత్తవు. కాని స్త్రీ - ధన - పుత్ర లిప్సతో చండాలునివలె ఎందరో మ్లేచ్ఛులను, క్షత్రియులను సంహరించితివి. మీరు యుధిష్ఠిరుని వచనములు నమ్మలేదా"అనెను. భీమసేనుడుటుల పలికినంతనే ధర్మాత్ముడగు ద్రోణాచార్యుడు తన ధనుస్సును పారవైచెను. అస్త్ర శస్త్రములను త్యజించెను. ఆయన యోగాశ్రితుడై జ్యోతిస్వరూప పరబ్రహ్మతో అభిన్నత అనుభవమునుపొంది మనస్సులోనే సర్వోత్కృష్ట పురాణపురుషుడగు విష్ణుభగవానుని ధ్యానించెను. ప్రణవాక్షరమును జపించుచు జ్యోతిస్స్వరూపు డయ్యెను. ద్రోణాచార్యుడు ప్రాణోత్క్రమణ చేయుటచే ఆకాశమునందపుడు ఇరువురు సూర్యులుదయించి నటులుండెను. ద్రోణాచార్యుని దివ్యతేజస్సు సూర్యజ్యోతిస్సులో కలిసిపోయెను. అయినను ధృష్టద్యుమ్నుడు ఆ తేజః పుంజము వెడలిపోయిన విషయము నెరుగక ద్రోణాచార్యుని శిరస్సును తన ఖడ్గముతో తెగనరికెను. ద్రోణవధ నెరిగిన అశ్వత్థామ క్రోధావేశముచెందెను. పాండవ సైన్యమును విధ్వంసమొనర్చెదనని ప్రతిన బూనెను. అశ్వత్థామ రణరంగములో పాండవ సైన్యముపై నారాయణాస్త్రమును ప్రయోగించెను. యుధిష్ఠిరుని సైన్యము నారాయణాస్త్ర అగ్నిజ్వాలలో చిక్కుకొనెను. అపుడు శ్రీకృష్ణభగవానుడు తన రెండుచేతులను పైకెత్తి సంకేతపూర్వకముగ పాండవసైన్యమును యుద్ధముచేయుట ఆపమనెను. నేలపై నిలిచినవారిని యీ అస్త్రము వధించదు. వాహనములనుండి నేలపైదిగి అస్త్రశస్త్రములను దించి, రెండు చేతులు జోడించి నమస్కరించువారిని వధించదు. ఈ అస్త్రము నెదిరించెదనని మనస్సులో సంకల్పించు వారందరిని హతమార్చును" అనెను. ఆ ప్రకారము పాండవసైన్యము నారాయణాస్త్ర

ప్రభావమునుండి తప్పించుకొనిరి. పిమ్మట ధృష్టద్యుమ్న సాత్యకి భీమసేనులతో అశ్వత్థామ యుద్ధము భీకరముగ జరుగుసాగెను. పాండవ సైనికులు పారిపోవుట జూచిన అర్జునుడు కొందరిని ధైర్యస్థితులను చేసి అశ్వత్థామ నెదుర్కొనెను. అశ్వత్థామ క్రోధభరితుడై శ్రీకృష్ణార్జునులపై ఆగ్నేయాస్త్ర ప్రయోగమును చేసెను. అర్జునుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించి ఆగ్నేయాస్త్ర ప్రభావమును శాంతింప జేసెను. పాండవుల ఒక అక్షౌహిణీ సైన్యము ఆగ్నేయాస్త్రమునకు బలి అయ్యెను. కాని ఆగ్నేయాస్త్ర కీలలనుండి ముక్తులైన శ్రీకృష్ణార్జునులు మాత్రము ఆకాశములో సూర్యచంద్రులవలె అగుపడిరి. వారి శరీరములపై మచ్చుకైననూ మచ్చలేకుండెను. వారి రథముకూడ ధ్వజపతాక అశ్వసహితముగ ఆయుధములతో బాటు మిలమిల మెరియు చుండెను. వాస్తవముగ ఇరుపక్ష సైన్యములో ఆగ్నేయాస్త్ర ప్రభావముతో శ్రీకృష్ణార్జునులు మృతిచెందిరని విశ్వసించిరి. కాని శ్రీకృష్ణార్జునులు యుద్ధరంగములో తాము యిదివరలో నిలిచిన స్థలమునందే అవిచలురై ప్రత్యక్షమగుట జూచి అందరూ మహదానందము చెందిరి. కాని అశ్వత్థామ వారు ఆగ్నేయాస్త్రమునుండి విముక్తులగుట జూచి వేడివేడి శ్వాసలు దీయుచు ఉదాసీనుడయ్యెను. తన ధనస్సును రథము నందేయుంచి క్రిందకుదూకి రణభూమినుండి పారిపోయెను. అపుడు వ్యాసమహర్షి అశ్వత్థామ సందేహము దీరుటకై శ్రీకృష్ణార్జునుల శివభక్తిని, శివమహాదేవుని మహత్తును బోధించెను.



శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వములు

సంపుటి : 8



ఓం వివస్వంతాయ నమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

కర్ణ పర్వము - సంగ్రహ పరిచయము

కౌరవ పాండవ యుద్ధముతో పాల్గొన్న అనేకమంది శూరవీర శ్రేష్ఠులలో అధికాంశము మృతి చెందుట ద్రోణ పర్వమునందు వర్ణించ బడెను. తరువాత కర్ణపర్వము ప్రారంభమయ్యెను. ఇందులో తొంబది యేడు అధ్యాయములలో నాలుగువేల తొమ్మిది వందల అరువది నాలుగు శ్లోకములున్నవి. మహారథులగు కర్ణార్జునుల యుద్ధ యజ్ఞమును గురించి పఠన - శ్రవణముల నొనర్చు వానికి విధి పూర్వకముగా యజ్ఞానుష్ఠానము చేసిన ఫలము లభించును. ఈ పర్వములో సనాతన యజ్ఞ స్వరూపుడగు విష్ణుభగవానుని మహిమ వర్ణించబడుటచే నిత్యస్వాధ్యాయ మొనర్చువారు సుఖభోగ సమృద్ధి గలవారై సంపూర్ణ మనో వాంఛితములు తీర్చుకొనగలరు. ఒక సంవత్సరము పాటు కర్ణపర్వస్వాధ్యాయము చేసిన వారికి ఒక కపిల ధేనువును సవత్సముగ ప్రతిరోజు సంవత్సరముపాటు దానము చేసిన ఫలము లభించుట తథ్యము. అటులనే వారికి సమస్త లోకములను దర్శించు పుణ్యప్రాప్తి, త్రిమూర్తుల కృపాదృష్టి సిద్ధించును. కర్ణపర్వ పఠనముచే బ్రాహ్మణులకు వేదజ్ఞానము, క్షత్రియులకు యుద్ధ విజయము, వైశ్యులకు గొప్ప ధనప్రాప్తి, శూద్రులకు ఆరోగ్యము గలుగును. మహాముని వేదవ్యాసుని వాక్సుధామృతమునకు అంతటి ప్రభావమున్నదని పండితులు చెప్పిరి. కర్ణపర్వాంతమున పఠన - శ్రవణ మాహాత్మ్యము పై విధముగ చెప్పబడెను.

కథాంశము

దేవతలలో ఇంద్రునకు "వృష" (జలవర్షము కురిపించువాడు) యనునామమున్నది. అటులనే మానవులలో కర్ణునకు ''వృష''(యాచకులకు ధనవర్షము కురిపించువాడు) యను నామము సహజ గుణసిద్ధమైనది. వీరిరువురికి తప్ప ముల్లోకములలో ఎవరికి వృషనామమున్నటుల వినియుండలేదు. యోధులలో కర్ణునకు ఉన్నత స్థానమున్నది. పరాక్రమవంతులు, సమర్థులు శూరవీరులగు నరేశ్వరు లెవ్వరు కర్ణుని జయించలేకపోయిరి. అతడు దుర్యోధనుని వృద్ధి కొరకు భూమండలముపై విజయకేతనము నెగురవేసెను. కర్ణుడు దుర్యోధనునకు సహాయకుడుగ నుండుట చేతనే మగధరాజు జరాసంధుడు సౌహార్దతతో కౌరవుల జోలికి పోకుండెను. అటువంటి కర్ణుని ద్వైరథయుద్ధములో అర్జునుడు పడగొట్టెనా? ఈ వార్త నాలకించి ధృతరాష్ట్రుడు శోకసముద్రములో మునిగి కర్ణవధ వృత్తాంతమును విస్తృతముగా తెలియజేయమని సంజయు నడిగెను. ద్రోణాచార్యుని మరణానంతరము కౌరవపక్ష నరేశ్వరులెల్లరు తమ సేనాపతిగ కర్ణుడు యుండవలెనని తమ నిశ్చితాభిప్రాయమును దుర్యోధనునకు దెలిపిరి. తక్షణమే దుర్యోధనుడు అవసర ద్రవ్యసామాగ్రిని దెప్పించి కర్ణుని సేనాపతిగ అభిషేకించెను. మరునాడు అనగా కురుక్షేత్ర సంగ్రామము పదునారవరోజున కౌరవ పాండవ సేనలు మహావ్యూహములతో యుద్ధము నందు మనస్సు నిలిపి రణరంగ ప్రవేశము చేసిరి. దేవాసురులవలె ఇరుపక్ష విశాలసేనలు కలియబడి అస్త్రశస్త్ర ప్రహారములు ప్రారంభించిరి. సింహపరాక్రమ వీరులు గర్జనలు చేయుచు విపక్ష యోధుల మస్తకములను నరుకుచు రణభూమి బీటలు వారుచుండెను. భీమసేనుడు ఒక గజరాజము నధిష్ఠించి కౌరవసైన్యములో జొచ్చెను. అపుడు

క్షేమధూర్తియను మహామనస్వి తోమరముతో భీమసేను నెదుర్కొనెను. వారిరువురు బాణములతో - తోమరములతో భీకర సంగ్రామము చేసి ఒకరి ఏనుగును యింకొకరు పడగొట్టి నేలపైకి దూకి గదాయుద్ధము చేసిరి. భీమసేనుని గదాఘాతము నకు క్షేమధూర్తి ధరాశాయి అయ్యెను. మరొక ప్రక్క సాత్యకి విందానువిందులతో తలపడెను. సాత్యకి రోషముతో ముందుగా అనువిందుని కుండలమండిత శిరస్సును తెగగొట్టెను. పిమ్మట ఖడ్గ విద్యాప్రదర్శనతో విందుని శరీరమును రెండు ఖండములుగ చేసెను. అటులనే ప్రతివింధ్య శ్రుతకర్మల ద్వారా చిత్ర చిత్రసేనులు వధించబడిరి. అశ్వత్థామ భీమసేనులు అద్భుత యుద్ధము చేసిరి. అర్జునుడు యిటు అశ్వత్థామ తోను అటు సంశప్తక యోధులతోను ఒకేసారి భీకర సంగ్రామము జరిపెను. అశ్వత్థామ పరాజితు డయ్యెను. తదనంతరము పాండవసేన ఉత్తర భాగమును దండధారుడు ముట్టడించి సుశిక్షిత భయంకర గజరాజునెక్కి సైన్యసంహారము చేయసాగెను. అర్జునుడు భల్లబాణములతో దండధారుని ధనుస్సు ఖండించి మరొక బాణముతో అతని మస్తకమును మొండెము నుండి వేరుచేసెను. అంతలో దండుడు కూడ శ్వేతవర్ణ విశాల గజరాజము నెక్కి మూడు పదునైదు బాణములతో శ్రీకృష్ణుని, ఐదుతోమరములతో అర్జునుని గాయపరచి గర్జించెను. అర్జునుడు తక్షణమే దండుని రెండు బాహువులను ఖండించెను. పిమ్మట ఒక అర్ధచంద్రాకార బాణముతో దండుని శిరస్సును ఖండించి నేలపై పడగొట్టెను. పాండవపక్ష నరేశ్వరుడగు పాండ్యునితో అశ్వత్థామ పోరు సలిపెను. అగ్నిశిఖ సమానమగు తేజస్వంత బాణములను దశవిధగతులలో ప్రయోగించెను. పాండ్య నరేశుడు వానిని తుత్తునియలు చేసి అశ్వత్థామ రథాశ్వములను సంహరించెను. పిమ్మట అశ్వత్థామ తోకత్రొక్కిన త్రాచువలె క్రోధితుడై పదునాలుగు బాణములతో పాండ్యరాజును, ఆయన అధిష్ఠించిన ఏనుగును సంహరించెను. ధృష్టద్యుమ్నుని వధించుటకై కౌరవసేనలోనున్న గజదళము మూకుమ్మడిగా దాడిచేసిరి. అంగవంగ పుండ్ర మగధ తామ్రలిప్త మేఖల కోసల మద్ర దశార్ణ నిషధదేశ సమస్త గజయోధ నిపుణులు వీర కళింగులతో గలిసి వర్షించు మేఘములవలె సమరాంగణములో పాంచాల సేనపై బాణ - తోమర - నారాచ వృష్టిని కురిపించిరి. పాంచాల సైన్యము పదునైన ఆయుధములు చేతబట్టి గర్జించుచు ముందుకు కదిలిరి. నకుల సహదేవులు, ద్రౌపదేయులు, ప్రభద్రకగణము, సాత్యకి, శిఖండి, చేకితానుడు మున్నగు పాండవపక్ష వీరులెల్లరు క్రోధముతో అల్లకల్లోలము చేయుచున్న ఏనుగుల మందను విధ్వంసము గావించిరి. అంగవంగ రాజులను వధించిరి. కౌరవసేనను తన పరాక్రమముతో నశింపజేయుచున్న సహదేవునిపై క్రోధము చెంది దుశ్శాసనుడు ఎదుర్కొనెను. వారిరువురి నడుమ భీకరముగ పోరు జరిగెను. సహదేవుడు సంధించిన మృత్యుస్వరూప యమదండ బాణమునకు దుశ్శాసనుని ఛాతిగాయపడి అతడు మూర్ఛిల్లెను. తక్షణము ఆయన రథసారథి రథమును రణభూమి నుండి దూరముగ గొనిపోయెను. దుశ్శాసనుడు పరాజితుడైనంతనే సహదేవుడు మరల కౌరవసేనను మర్దించసాగెను. నకులుడు కౌరవ సేనను మర్దించుట జూచి కర్ణుడతనిని నిలువరించెను. వారిరువురి నడుమ భీకరసంగ్రామము జరిగెను. కర్ణుడు మందహాసము చేయుచు నకులుని ధనుస్సును ఖండించి రథసారథిని వధించి పైకి పడగొట్టెను. నాలుగు తీక్షణమైన బాణములతో నకులుని రథాశ్వములు నాలుగింటిని యమసదనమునకు బంపెను. నకులుని దివ్య రథమును తన బాణములతో

తుత్తునియలు గావించెను. చక్ర రక్షకులను గదాఖడ్గములను ఛిన్నాభిన్న మొనర్చెను. డాలును ఇతర ఉపకరణములను ధ్వంస మొనర్చెను. అతడు చేతబట్టిన పరిఘను కూడా ఖండము లొనర్చెను. పిమ్మట బహు సంఖ్యాక ములకు బాణములతో గాయపరచినే గాని కుంతీదేవికి యిచ్చిన వాగ్దానమును స్మరించి ప్రాణములతో వదిలిపెట్టి పాండవసైన్య సంహారమును చేయుటకు వెడలిపోయెను. తదనంతరము శకుని సుతసోమల యుద్ధము గగుర్పాటు కలిగించు విధముగ సాగెను. సుతసోముడు తన ఖడ్గ విద్యానైపుణ్యముతో శకుని శరపరంపరను అడ్డుకొనెను. కాని చివరగా ఖడ్గము రెండు ముక్కలయ్యెను. తన చేతిలో నున్న ముక్కను విసిరి శకుని ధభస్సు యొక్క నారిని ఖండించి వేవేగ శ్రుతకీర్తి రథము నాశ్రయించెను. వేరొక ప్రక్క కృపాచార్య ధృష్టద్యుమ్నుల, కృతవర్మ శిఖండిల యుద్ధము జరిగెను. ధృష్టద్యుమ్న, శిఖండి లిరువురు కూడ వారి ప్రత్యర్థులతో యుద్ధము చేయజాలక వేరొక దిశగా పారిపోయిరి. అర్జునుడు తనపై దాడిచేసిన త్రిగర్త, శిబి, శల్య, సంశప్తక, నారాయణీ సేనను ఎదుర్కొన సన్నద్ధుడై యుండగా త్రిగర్త రాజు సుశర్మ యొక్క ఏడుగురు పుత్రులు శ్రీకృష్ణార్జునుల నెదుర్కొని శరపరంపరతో గాయపరచసాగిరి. సత్యసేనుడు ఒక విశాల తోమరమును శ్రీకృష్ణునిపై విసిరి పెద్దగా గర్జించెను. ఆ తోమరాఘాతమునకు శ్రీకృష్ణుడు రథపగ్గములను, కొరడాను చేజార్చెను. అందులకు కుపితుడైన అర్జునుడు తమ రథమును వేవేగ సత్యసేనుని చెంతకు పోనీయమనెను. ఒక భల్ల బాణముతో సత్యసేనుని శిరస్సును మొండెము నుండి వేరు చేసెను. తదనంతరము వత్సదంత బాణములతో మిత్రవర్మను, క్షురప్రబాణముతో మిత్రదేవుని వధించెను. సుశర్మ యొక్క మెడపై తీవ్రగాయ మొనర్చెను. ఐంద్రాస్త్ర ప్రయోగముతో సంశప్తక యోధులు అనేకమందిని మట్టి గరిపించెను. దుర్యోధనుడొక నిర్భయుడగు వీరునివలె ఎదుర్కొనెను. యుధిష్ఠిరుడు నాలుగు బాణములతో రథాశ్వములను వధించి, ఐదవబాణముతో రథసారధి మస్తకమును ఎగురగొట్టెను. ఆరవ బాణములో దుర్యోధనుని రథధ్వజమును పడగొట్టెను. మిగిలిన ఐదు బాణములతో దుర్యోధనుని లోతుగా గాయపరచెను. దుర్యోధనుడు వెంటనే అశ్వహీన రథము నుండి దూకి నేలపై నిలిచెను. దుర్యోధనుడటుల సంకటపరిస్థితిలో పడియుండుట జూచి కర్ణ - అశ్వత్థామ - కృపాచార్యులు తమ ప్రభువును రక్షించుకొనుటకై యుధిష్ఠిరుని ఎదుర్కొనిరి. అదే సమయమున సమస్త పాండవులు యుధిష్ఠిరునకు రక్షణ వలయముగ నిలిచిరి. అపుడు ఇరుదళము లందు గొప్ప యుద్ధము ఆరంభ మయ్యెను. సూర్యుడు అపరాహ్ణకాలము చేరుసరికి కౌరవ పాండవ సేనలు యశస్సు నభిలషించి ఇరుపక్ష వీరుల వినాశకార్యమును సుసంపన్న మొనర్చిరి. దుర్యోధనుడు తొమ్మిది భల్ల బాణములతో యుధిష్ఠిరుని లోతుగా గాయపరిచెను. యుధిష్ఠిరుడు అత్యంత వేగవంతమగు శక్త్యాయుధమును దుర్యోధనునిపై ప్రయోగించెను. అది ప్రజ్వరిల్లు ఉల్కవలె దుర్యోధనునిపై బడి కవచమును చీల్చుకొని ఛాతిలో చొరబడెను. అందుకు అత్యంత చిత్త క్షోభపొందిన దుర్యోధనుడు రథముపై చతికిలబడి మూర్ఛిల్లెను. ఆ సమయమున భీమసేనుడు తన ప్రతిజ్ఞను స్మరించి దుర్యోధన వధ యుధిష్ఠిరుడు చేయకుండునటుల వారించెను. విపత్తులో చిక్కుకున్న దుర్యోధనుని రక్షించుటకు వేవేగ కృతవర్మ ఏతెంచెను. భీమసేనుడు వెంటనే గదను చేతబట్టి కృతవర్మపై విరుచుకుపడెను. తదనంతరము రణదుర్మదుడగు కర్ణుని ముందిడుకొని దుర్యోధనుడు

మరల పాండవ సైన్యము నెదుర్కొనెను. అది దేవాసుర సంగ్రామము వలె జరిగెను. ముందుగా సాత్యకి – కర్ణుడు భీకరముగ పోరు సలిపిరి. తదనంతరము శ్రీకృష్ణార్జునులు కూడ అపరాహ్ణ కృత్యములు ముగించుకొని విధిపూర్వకముగ శంకరుని ఆరాధించి రణరంగమునకు పోయి కౌరవసేనను ఎదుర్కొనిరి. కౌరవసేన విధ్వంసమును గమనించిన దుర్యోధనుడు శీఘ్రగతిని అర్జునుని ఎదుర్కొనెను. అర్జునుడు ఏడు బాణములలో దుర్యోధనుని, ఒక బాణముతో అశ్వత్థామను, పిమ్మట కృపాచార్యుని ధనుస్సును, అటుపిమ్మట దుశ్శాసనుని ధనుస్సును ఖండించి నిశ్చేష్టులను చేసెను. అపుడు కర్ణుడు సాత్యకిని విడిచి అర్జునుని మూడుబాణములతో గాయపరిచెను. మరొక ఇరువది బాణములతో శ్రీకృష్ణుని కూడ గాయపరిచెను. అపుడు సాత్యకి వచ్చి తొంభై తొమ్మిది బాణములతో కర్ణుని గాయపరిచెను. ప్రధాన పాండవ పక్ష వీరులందరు కర్ణుని చుట్టుముట్టి పీడించసాగిరి. కర్ణుడు తన అస్త్రబలముతో వారందరిని దూరముగ నెట్టివేసెను. క్రోధభరితుడై గజ, అశ్వదళ యోధులను యథేచ్ఛగా సంహరించ నారంభించెను. అపుడు అర్జునుడు తన అస్త్ర శస్త్రకౌశల్యములో కౌరవ సైన్యమును నిస్తేజ మొనర్చసాగెను. అంతలో సూర్యదేవుడు అస్తాచలమున మునిగిపోవుటచే ఆ నాటియుద్ధమును ముగించి యిరుపక్షములు తమ శిబిరములకు మరిచిపోయిరి. కౌరవులు పునః సమీక్ష చేసుకొనుటకై గుప్త మంత్రాంగము నెరపిరి. అపుడు కర్ణుడు మరునాటి యుద్ధములో అర్జునుని ఆత్మస్థైర్యమును వమ్ము చేసెదనని పలికెను. ఆరోజు రాత్రి కర్ణుడు ఏకాగ్ర చిత్తముతో ఆలోచించి అర్జునునితో ద్వైరథయుద్ధము చేయు ప్రస్తావన దెచ్చి దుర్యోధనునితో యిట్లనెను. పరశురామునకు ఇంద్రునిద్వారా ప్రాప్తించిన విజయమనెడి ధనుస్సు ఆయన నాకు ప్రీతితో యిచ్చెను. నేను ఇంద్రుడిచ్చిన శక్త్యాయుధమును ఘటోత్కచ వధలో కోల్పోయినను దివ్యాస్త్ర సంపదతో అర్జునునితో సమానుడను. శీఘ్రముగా అస్త్రములు ప్రయోగించుట, సుదూర లక్ష్యములను ఛేదించుట, సుందరరీతిలో యుద్ధమును చేయుట, దివ్యాస్త్ర ప్రయోగముల నైపుణ్యం యనువానిలో అర్జునుడు నాతో సమానుడు గాడు. దేహదారుఢ్యము, శౌర్యము, అస్త్రవిజ్ఞానము, పరాక్రమము, శత్రువులను జయించుటకై ఉపాయములను వెదుకుట మున్నగువానిలో అర్జునుడు నా కన్న వెనుకబడియున్నాడు. పరశురాముడిచ్చిన నా ధనుస్సు గాండీవ ధనస్సు కన్న శ్రేష్ఠమైనది. ఈ ధనస్సుతోనే పరశురాముడు ఇరువదొక్క మారులు పృథివి నంతటిని జయించెను. కనుక యుద్ధములో శ్రేష్ఠుడగు అర్జునుని వధించి బంధు సహితముగ నిన్ను ఆనందపరచెదను. విజయీవీరులలో శ్రేష్ఠుడగు అర్జునుడు మృతిచెందినంతనే పర్వత వన ద్వీప సముద్రసహిత భూమండలమంతయు నీ పుత్రపౌత్ర పరంపరలో ప్రతిష్ఠితమగును. నీకు ప్రియము గూర్చుట కన్న నాకు ఏదియూ ముఖ్యము గాదు. కాని ఏవిషయములో నేను అర్జునుని కన్న తక్కువ యను విషయము చెప్పవలసియున్నది. ఆయన ధనుస్సు అల్లెత్రాడు దివ్యమైనది. ఆయన వద్ద అక్షయ తూణీరముల నిచ్చు రెండు అమ్ముల పొదులున్నవి. శ్రీకృష్ణునివంటి రథసారథియున్నాడు. అర్జునుని యొక్క అసమానబలమునకు తోడుగ సర్వలోక వందితుడగు శ్రీకృష్ణుని అండ యున్నది. అర్జునునకు అగ్నిదేవు డిచ్చిన దివ్యరథమున్నది. వానిని ఏ విధముగను ఎవరూ నష్టపరచజాలరు. ఆయన రథాశ్వములు కూడా మనోవేగము గలవి. ఆయన కపిధ్వజము కూడ దివ్యమైనది. అయిననూ నేను అర్జునునితో యుద్ధము చేయుటకు ఉత్సాహముతో నుంటిని. యుద్ధములో

ఆవశ్యము శల్యమహారాజు శ్రీకృష్ణునితో సమానముగా శోభిల్లను. ఆయన నాకు రథసారథిగ వ్యవహరించినచో నీకు యుద్ధ విజయము నిశ్చితము. అటులనే నాకు అధికాధిక నారాచములు, జాతి అశ్వములు ఎప్పటికప్పుడు యుద్ధావసరమును దీర్చు ఏర్పాటు చేయవలెను. శ్రీకృష్ణుడు అశ్వ విద్యా రహస్యముల నెరిగినటులే శల్యుడు కూడ అశ్వవిద్యా విశేషజ్ఞుడు. బాహుబలములో శల్యునకు సమానమైన వారు లేరు. శల్యుడు నా రథమునకు సారథ్యము వహించినచో అర్జునుని కన్న శ్రేష్ఠమైనది యగును అని దుర్యోధనునకు చెప్పెను. దుర్యోధనుడు తక్షణమే శల్యుని పలురీతుల స్తుతించెను. త్రిపురాసుర నగర నిర్మాణము గురించి వర్ణించెను. పిమ్మట త్రిపురాసుర వధకై మహాదేవుని రథసారథ్యము వహించిన బ్రహ్మదేవునితో శల్యుని సరిపోల్చి రథసారథ్యము చేయు సమయములో ఇచ్ఛానుసారము మాటలాడు స్వాతంత్ర్యమును యిచ్చెను. శల్యుడు కర్ణరథసారథ్యమునకు ఒప్పుకొనెను. మరునాడు కర్ణుడు కోరిన విధముగ సమస్తము ఏర్పాటు చేయబడినవి. కర్ణుడు శల్య సారథ్యములో యుద్ధప్రస్థానము నారంభించెను.

కర్ణపర్వము ముప్పది ఏడవ అధ్యాయము నుండి కురుక్షేత్ర సంగ్రామ పదునేడవదిన చరిత్ర ప్రారంభమగును. శల్యుని రథసారథ్యములో కర్ణుడు రణరంగమునకు పోవుచు కిరణ సమూహముతో ప్రకాశించుచు దేదీప్యమానుడై యున్న సూర్యుని వలె నుండెను. వేలకొలది తూర్య నాదములు రణభేరీలు మ్రోగినవి. దుర్యోధనుని ఆదేశమును కర్ణుడు శిరోధార్యముగ స్వీకరించి యుద్ధ కుశలురగు పాండవులను వధించి దుర్యోధనునకు విజయము సిద్ధించు నటుల చేయుదునని పలికెను. శల్యుడు ఆ పలుకులను విని కర్ణునితో "సూతపుత్రా! నీవు పాండవులను అవహేళన చేయకుము. పాండవులు అజేయులు, సత్యపరాక్రములు. ఇంద్రునకైనను మనస్సులో భయోత్పన్నము గావించగలరు" అనెను. తదనంతరము కర్ణశల్యుల నడుమ వాగ్వివాదము పెరిగెను. వారు పరస్పరము పరుష పదజాలముతో విమర్శించుకొనుచుండిరి. దుర్యోధనుడు వారిరువురి నడుమ సంధిని గూర్చి తన కార్యమును చక్కదిద్దమని కోరెను. కర్ణుడు తనకు పరశురాముని ద్వారా, ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుని ద్వారా ప్రాప్తించిన శాపములు గురించి వివరించెను. శల్యుడు పదే పదే అర్జునుని శ్లాఘించుచు కర్ణుని ఉత్సాహమును క్రుంగదీసెను. అయినను కర్ణుడు, స్వమహిమతో పాండవసేన సంహారమును చేయనారంభించెను. పాండవసేన చేతిలో కర్ణుని పుత్రుడు సుషేణుడు నిహతుడయ్యెను, కర్ణుని చేతిలో యుధిష్ఠిరుడు పరాజయము పొంది శిబిరమునకు మరలిపోయెను. కర్ణునితో భీమసేనుడు తలబడి బాణప్రహరముతో మూర్ఛిల్లునటుల చేసెను. భీమసేనుడు ఆరుగురు ధార్తారాష్ట్రులను వధించెను. కౌరవ పాండవసేనలు భీకర సంగ్రామము జరిపిరి. పాండవ పక్ష వీరుల ధాటికి తల్లడిల్లిన కౌరవసేన వ్యధితమయ్యెను. ఆ రోజు అర్జునుడు పదివేలమంది సంశప్తక యోధులను సంహరించెను. శిఖండి - కృతవర్మ లిరువును తమ శత్రువుల చేతిలో పరాజయము పొందిరి. కృపాచార్యుడు యుద్ధ తత్పరుడై సుకేతుని ఎదుర్కొను సమయమున శిఖండి అటనుండి తప్పుకొనెను. కృపాచార్యుడు మాత్రము సుకేతు కుండలమండిత మస్తకమును ఖండించెను. ధృష్టద్యుమ్నుడు క్రోధావేశముతో కృతవర్మ నెదుర్కొని పరాజయము గావించెను. మరొక ప్రక్క సాత్యకి - అశ్వత్థామల నడుమ భీకరయుద్ధము జరిగెను. అర్జునుడు సంశప్తక సేనలోనికి, భీమసేనుడు కౌరవసేనలోనికి, కర్ణుడు పాంచాలుర సేనలోనికి

చొరబడి శత్రుసంహారము గావించదొడంగిరి. అగ్ని సమాన తేజస్వంతులగు యీ ముప్వరు వీరాగ్రేసురు లచే సమరాంగణము నందు అనేకమంది క్షత్రియులు వినాశమును పొందుచుండిరి. దుర్యోధనుడు మాద్రీతనయులతో తలపడి బాణవర్షము కురిపించి వారి పురోగమనమును నిలువరించెను. ఆ సమయమున దుర్యోధనుని మండలాకార ధనుస్సు మాత్రమే అగుపడజొచ్చెను. ఆయన ప్రయోగించు బాణములు నలుదిశలను సూర్యకిరణముల వలె ఆకాశము నాచ్ఛాదించు నటులుండెను. దుర్యోధనుడు మాత్రము అపుడు కాలుడు - అంతకుడు - యమరాజులకు వలె భయానకముగ నుండెను. దుర్యోధనుని పరాక్రమమును దర్శించిన ఇతర మహారథులెల్లరు మాద్రి తనయులు మృత్యు ముఖమున పడిరని తలంచిరి. అపుడు పాండవ సేనాపతి వేర్వేరుగా నకుల సహదేవులను వెనుకకు నెట్టి తాను దుర్యోధనుని వేగమును నిరోధించెను. దుర్యోధనుడు చిరునగవుతో ధృష్టద్యుమ్నుని ఇరువదైదు బాణములతో గాయపరచి అతని బాణసహిత ధనస్సును - చేతి తొడుగును ఖండించెను. ఆరువదైదు బాణములతో ధృష్టద్యుమ్నుని గాయపరచి పెద్దగ గర్జించెను. ధృష్టద్యుమ్నుని కనుబొమల మధ్య భాగములో పదిబాణములతో గొట్టెను. ధృష్టద్యుమ్నుడపుడు మధుపములు మధువు నాస్వాదించు ప్రఫుల్ల కమలము వంటి ముఖము గలవానిగ శోభిల్లెను. కాని మహాసాహసి ధృష్టద్యుమ్నుడు విరిగిన ధనుస్సును పారవైచి వేరొక ధనుస్సు, పదునారు భల్లబాణములను చేతబట్టెను. వానిలో ఐదుభల్లబాణములతో దుర్యోధనుని రథసారథిని, అశ్వములను వధించెను. ఒక భల్లబాణములో దుర్యోధనుని వింటిని విరిచెను. పదిభల్ల బాణము లతో దుర్యోధనుని యుద్ధసామాగ్రి సహిత రథమును - ఛత్రమును - శక్తాయుధమును - ఖడ్గమును - గదను - ధ్వజమును ఖండించెను. రణభూమిలో ఆ ప్రకారము రథరహితుడై కవచరహితుడై యున్న దుర్యోధనుని రక్షణను అతని తమ్ములు చూచుకొనసాగిరి. ఆ సమయమున దండధారి యను తమ్ముడు తన అన్నగారైన దుర్యోధనుని రథములో కూర్చుండ బెట్టుకొని కంగారుగా రణస్థలము నుండి దూరముగా గొనిపోయెను. తదనంతరము కర్ణుడు - ధృష్టద్యుమ్నుడు ఘోరసంగ్రామము జరిపిరి. కౌరవపాండవయోధులు మొక్కవోని ధైర్యముతో యుద్ధస్థితులై భీకరముగ పోరుచు యుద్ధాగ్నిలో హోమ మగుచుండిరి. కర్ణుడు విజయాభిలాషులైన పాంచాల యోధులలో ఒక్కొక్కరిని ఎన్నుకొని బాణ సమూహములతో సంహరించ సాగెను. పదునొకండుగురు మహారథులను, కొన్నివేల మంది యోధులను కర్ణుడు హత మార్చెను. కర్ణుడు గజాశ్వరథ పదాతి దళములలో చొరబడి గొప్ప సంహా రక్రియ నొనరించెను. పాంచాల రథసేనను పారద్రోలెను. కర్ణుడు యుద్ధభూమిలో చేది - కేకయ - పాంచాలయోధులలో చాలామంది రథికులను పదే పదే పేరు చెప్పి వధించెను. కర్ణుడు తానొక్కడైననూ సర్పసమూహముపై దాడిచేయు గరుడుని వలె ఒంటరిగా వారందరిని ఆక్రమించెను. అదే సమయమున భీమసేనుడు క్రోధభరితుడై యమదండ సమాన బాణములతో బాహ్లీక - కేకయ - మత్స్య - వసాతేయ - మద్ర - సింధుదేశ సైనికులను సంహరించుచుండెను. ఆ సమయమున కౌరవ సైన్యమును సంహరించుచు విజయీ వీరులలో శ్రేష్ఠుడగు అర్జునుడు సేనామధ్యభాగములో అనేక మంది సంశప్తకయోధులను సంహార మొనర్చి తన దృష్టిని కర్ణుని వైపు సారించెను. అపుడు శ్రీకృష్ణుడు అర్జునునితో "నీవు కౌరవసైన్య సంహారమును

చేయుము. అవుడు కర్ణుని శ్రద్ధ తన సైన్యమును రక్షించుకొనుటలో నిమగ్నమై పాండవసేనా సంహారమును మానుకొనును" అనెను. అమేయ ఆత్మ బలసంపన్నుడగు అర్జునుని రథము కౌరవ సైన్యములోనికి జొచ్చి దిశలన్నిట సువర్ణమయ పంఖయుక్త, స్వచ్ఛధారయుత, పంగినములుకు బాణములను వర్షించ నారంభించెను. సవ్యసాచి అర్జునుడు శత్రుపక్షము వారిని ఘోర మారణకాండకు గురిచేసెను. ధృష్టద్యుమ్నుని రక్షించుటకై అర్జునుడు అశ్వత్థామను ఓడించెను. కర్ణుని చండ ప్రచండ వేగమునకు యుధిష్ఠిరుడు, ఆయనకు అండగా నున్న పాండవ పక్షయోధులు కకావికల మగుట గమనించిన శ్రీకృష్ణుడు సత్వరమే కర్ణవధకు పూనుకొనమని అర్జునుని ప్రోత్సహించెను. యుధిష్ఠిరుడు శరాఘాతపీడితుడై యుద్ధరంగము నుండి శిబిరమునకు మరలెను. అపుడు భీమసేనుడు తదితర పాండవపక్షయోధులు కర్ణుని ఎదుర్కొను చుండిరి. అంతలో అశ్వత్థామ అనుపమ పరాక్రమమును అర్జునునిపై ప్రదర్శించెను. పాండవసేన ధాటిని తట్టుకొనజాలని కౌరవసైన్యము పారిపోవుచుండగా కర్ణుడు భార్గవాస్త్రమును ప్రయోగించెను. భార్గవాస్త్ర ప్రభావముచే వేల - లక్షలు - కోట్ల - అర్బుద సంఖ్యలో బాణములు ప్రకటమై పాండవసేనను ఆచ్ఛాదించినవి. శత్రు సంతాపక యోధశ్రేష్ఠుడగు కర్ణుడు ఒక్కడే ధూమరహిత అగ్నివలె శత్రువులను దగ్ధమొనర్చుచు సమరాంగణములో శోభిల్లసాగెను. కర్ణుని దారుణకర్మను సహింపనోపని అర్జునుడు తక్షణమే వానిని వధించ నిశ్చయించుకొనెను. కర్ణునిచే పీడించబడిన యుధిష్ఠిరుడు శిబిరములో విశ్రాంతిచెందుట ఎరిగిన శ్రీకృష్ణుడు ముందుగా యుధిష్ఠిరునకు ధైర్యము చెప్పి మరలివచ్చి కర్ణుని సంగతి చూడమని హితవుచెప్పెను. శ్రీకృష్ణార్జునులు యుధిష్ఠిరుని దర్శించుటకై వెడలిరి. వారిరువురు గలిసివచ్చుట చూచిన యుధిష్ఠిరుడు కర్ణుని వధను గురించి శుభవార్త దెచ్చిరని విశ్వసించి మధుర వచనములతో అర్జునుని ప్రశంసించ సాగెను. కర్ణునివధ గాకుండుటకు కారణములను అర్జునుడు వివరించ సాగెను. అందులకు యుధిష్ఠిరుడు క్రోధముచెంది వ్యంగ్యాస్త్ర పదజాలముతో అర్జునుని అవమానించెను. రణభూమిలో కర్ణుని ఎదుర్కొను సమర్థతలేకున్నచో గాండీవ ధనుస్సును అస్త్ర శస్త్ర విశారదుడగు వేరొక రాజునకు సమర్పించమని దెప్పిపొడిచెను. అర్జునుడు రణరంగమునుండి పారిపోయి వచ్చెనని తలంచి అతని గాండీవ ధనుర్ధారణకు, అక్షయ తూణీర అమ్ములపొదిని, అగ్నిదేవ సమర్పితమైన రథమునధిరోహించుటకు, హనుమంతునిచే ఉపలక్షితమైన ధ్వజపతాకమునకు ధిక్కారముయని పలురీతుల విమర్శించెను. అర్జునుడందులకు క్రోధితుడై తన మనస్సులో ఎన్నడో చేసిన ప్రతిజ్ఞను స్మరించి గాండీవమును ఎవరికైన సమర్పించమని నిందించిన యుధిష్ఠిరుని వధించుటకు సంసిద్ధుడయ్యెను. ఆ సమయమున శ్రీకృష్ణుడు ధర్మతత్త్వోపదేశముచేసి పూర్వ ఉపాఖ్యానమునొకటి వివరించెను. యుధిష్ఠిర - అర్జును లిరువురిని ధర్మసంకటమునుండి రక్షించెను. తదనంతరము కర్ణవధకై అర్జునుని బల ప్రశంసచేయుచు ఉత్సాహపరచెను. శ్రీకృష్ణార్జునులు రణక్షేత్రమునకు చేరినంతనే కర్ణునిచే పీడితులైన పాంచాలుర దుర్దశను గాంచిన అర్జునుడు తక్షణమే శ్రీకృష్ణునితో వీరోచిత ప్రసంగము చేసెను. పిమ్మట పాండవ కౌరవ సేనలనడుమ ఘోరసంగ్రామము జరిగెను. పాండవపక్ష వీరుడగు ఉత్తమౌజుడు హఠపూర్వకముగ కర్ణుని పుత్రుడగు సుషేణునిపై దాడిచేసి వాని మస్తకమును తెగగొట్టెను. అపుడా మస్తకము యొక్క

ఆర్తనాదము భూమ్యాకాశము లను ప్రతిధ్వనింపజేసి నేలపై బడెను. అది జూచిన కర్ణుడు శోకాతురుడయ్యెను. అటు భీమార్జునులు కౌరవసేనను, ఇటు కర్ణుడు పాండవసేనను భీకరముగ సంహరించ నారంభించిరి. సాత్యకితో యుద్ధము చేయుచు కర్ణుని పుత్రుడగు ప్రసేనుడు అసువులుబాసెను. సాత్యకి - కర్ణుల నడుమ భీషణ సమరము జరిగెను. కర్ణుడు వీరవిహారముతో పాంచాలురను వధించుట జూచిన శ్రీకృష్ణుడు సత్వరమే కర్ణవధ గావించమని అర్జునుని ప్రోత్సహించెను. సాత్యకి కర్ణులనడుమ ప్రచండయుద్ధము జరుగుచుండగా కృపాచార్యుడు, కృతవర్మ, దుర్యోధనుడు కర్ణునకు అండగా నిలిచిరి. కౌరవ పాండవ యోధులటుల ద్వంద్వయుద్ధములు జరుపుచుండగా దుశ్శాసనుడు భీమసేనుని ఎదుర్కొనెను. కౌరవ సభలో ద్రౌపదిని స్పృశించిన దుష్కర్మకు తగిన ప్రతీకారము దీర్చుకొను అవకాశము దీర్ఘకాలము తరువాత వచ్చినదని భీమసేనుడు సంతసించెను. దుశ్శాసనుడు పాత విషయములను ఏకరువుపెట్టుచు భీమసేనుని ఎగతాళిచేయసాగెను. ఆ ప్రకారము వారిరువురి నడుమ వాగ్యుద్ధముతోబాటు భయంకరమగు పోరు ఆరంభమయ్యెను. దుశ్శాసనుడు వజ్రాయుధ సమాన బాణములతో భీమసేనుని అంగములు విదీర్ణమగునటుల చేసెను. ఒక బాణముతో భీమసేనుని ధనుస్సు ఖండించెను. అరువది బాణములతో భీమసేనుని రథసారథిని గాయపరచెను. అందులకు క్రోధితుడైన భీమసేనుడు భయంకర శక్త్యాయుధమును ప్రయోగించెను. దుశ్శాసనుడు ఒక తీవ్ర బాణముతో దానిని ఖండించివేసెను. భీమసేనుడు రౌద్రరూపముదాల్చి భయంకరమగు గదనొకటి చేతబట్టి "దురాత్మా! నేను సంగ్రామములో నీ రక్తమును పానమొనర్చెదను"అని బిగ్గరగా గర్జించెను. దుశ్శాసనుడు ప్రయోగించిన శక్త్యా యుధమును ఆ గదను విసిరి అడ్డుకొనెను. బలపూర్వకముగ విసిరిన గద సరాసరి దుశ్శాసనుని మస్తకముపై బడి నలభైమూరల వెనుకకు నెట్టివేసెను. ఆ గదాఘాతముచే దుశ్శాసనుడు తక్షణమే నేలపై గూలి కంపించుచు అత్యంత వేదనతో వ్యాకులుడై చటపటమని కొట్టుకొనసాగెను. అతని కవచము చీరుకొన్నది. స్వర్ణాభరణములు చెల్లాచెదరైనవి. కట్టుపుట్టములు పిగిలిపోయి చిరిగినవి. దుశ్శాసనుని రథము వ్రక్కలై చూర్ణమైనది. సారధి సహిత రథాశ్వములు కూడ ప్రాణశూన్యులయ్యిరి. భీమసేనుడు రథమునుండి క్రిందకు దూకి నాడు కౌరవసభలో ద్రౌపదిని పరాభవించినపుడు తాను చేసిన ప్రతిజ్ఞను స్మరించెను. భీమసేనుడు వేవేగ దుశ్శాసనుని చెంతకుచేరి దుర్యోధన - కర్ణుల సమక్షమునందే సింహము ఒక విశాలమైన ఏనుగుపై లంఘించి నటుల దుశ్శాసనుని త్రొక్కిపెట్టెను. శ్వేతవర్ణ ఖడ్గమును పైకెత్తి దుశ్శాసనుని కంఠముపై ఒక తన్నుతన్నెను. ఆ సమయమున దుశ్శాసనుడు గజగజవణికెను. పిమ్మట భీమసేనుడు కనులెర్రజేసి "ఓరీ దురాత్మ దుశ్శాసనా! ఆ రోజు నీవు దుర్యోధన కర్ణులతోగూడి నన్ను "ఎద్దు ఎద్దు"అని గేలిచేయుచు గొప్ప ఆనందముతో గెంతులిడితివి. ద్రౌపదీదేవి కేశపాశములను పట్టి ఈడ్చుకొని దెచ్చిన దుస్సాహసమును యీ చేతితోనే చేసితివి గుర్తున్నదా!' 'అని ప్రశ్నించెను. దుశ్శాసనుడు పొగరుమోతుగ "ఔనౌను, ఏనుగు తొండమువంటి నా లావైన చేతులే రమణుల రమణీయ ఉన్నత కుచములను మర్దన చేసినవి. వేలకొలది గోవులను దానము చేసినవి. అనేకమంది క్షత్రియయోధులను వినాశనమొనర్చినవి. భీమసేనా! ఈ హస్తముల తోనే నిండు కౌరవసభలోనికి కురుకుల శ్రేష్ఠులు - మీ అన్నదమ్ములు చూచుచుండగా ద్రౌపదీదేవిని కేశములు పట్టి యీడ్చుకొని

దెచ్చితిని"అని కౌరవులు – సోమకులు వినుచుండగా పలికెను. దుశ్శాసనుని యధేచ్ఛ భాషణకు క్రోధావేశము చెందిన భీమసేనుడు దుశ్శాసనుని ఛాతిపైకి ఎగిరి కూర్చుని వాని రెండు చేతులను బలపూర్వకముగ గుంజి పెద్దగా సింహనాదము చేయుచు సమస్త యోధుల సమక్షమున "యోధులారా! నేడు యీ దుశ్శాసనుని బాహువులను దేహమునుండి పెరికివేయుచుంటిని. ఇతడిపుడు ప్రాణ త్యాగమునకు సిద్ధపడియున్ననూ పశ్చాత్తాపము నించుకైననూ చెందకున్నాడు. మీలో బలవంతు లెవరైనా యున్నచో నా చేతులనుండి వీనిని రక్షించుటకు రావచ్చును." అని సమస్తయోధులను కవ్వించి పిలిచెను. తదనంతరము భీమసేనుడు కుపితుడై వేగపూర్వకము ఒక చేతితో దుశ్శాసనుని రెండుబాహువులు ఊడబెరికెను. ఆ రెండు బాహువు వజ్రసమానములై కఠోరముగనున్నవి. భీమసేనుడు ఆ రెండు బాహువులతోనే దుశ్శాసనుని చిత్తుగా కొట్టెను. తదనంతరము నేలపైపడియున్న దుశ్శాసనుని ఛాతిని చీల్చి వాని రక్తమును దోసిలితో పట్టిత్రాగెను. తన ప్రతిజ్ఞను సత్యమొనర్చుటకై ఖడ్గముతో దుశ్శాసనుని మస్తకమును తెగగొట్టెను.

భీమసేనుడు భయంకర రూప సదృశుడై రక్తపానము చేయుట జూచిన కొందరు యోధులు భీతిల్లి భీమసేనుడొక రాక్షసుడని కేకలు పెట్టుచు కర్ణుని తమ్ముడగు చిత్ర సేనునితోబాటు పరుగుతీసిరి. యుధామన్యుడు చిత్రసేనుని వెంబడించి పదునైన బాణముతో మస్తకమును ఖండించెను. భీమసేనుడు పదిమంది ధార్తరాష్ట్రులను కూడ వధించెను. తదనంతరము నకుల వృషసేనుల నడుమ భీకర యుద్ధము జరిగెను. వృషసేనుని పరాక్రమమునకు నకులుడు నిలువలేక భీమసేనుని రథమునాశ్రయించెను. అర్జునుడు సత్వరమే వృషసేనునివైపు రథమును పోనిచ్చెను. వృషసేనుడు అర్జునుని మూడు బాణములతోను, భీమసేనుని మూడు బాణముల తోను, నకులుని ఏడుబాణములతోను, శ్రీకృష్ణుని పండ్రెండు బాణములతోను బాధించెను. ఆ సమయమున అర్జునుని నేత్రములు ఎరుపెక్కెను. ఆయన చిరునగవుతో దుర్యోధన అశ్వత్థామాది మహావీరులతోబాటు కర్ణునికూడ సంబోధించుచు "కర్ణా! నేడు యుద్ధభూమిలో నీ సమక్షమునందే ఉగ్రపరాక్రమియగు వీర వృషసేనుని నా పదునైన బాణములతో యమలోకమునకు బంపెదను. వేగవంతుడగు నా మహారథిపుత్రుడు అభిమన్యుడు ఒంటరివాడైయుండెను. నేనా సమయమున వానికి తోడుగాలేకుంటిని. అట్టి అవస్థలో మీరందరు కలిసి నా పుత్రుని వధించితిరి. మీరు చేసిన ఆ దుష్టకర్మను అందరూ ఖండించిరి. కాని నేడు మీ అందరి సమక్షమున వృషసేనుని వధించెదను. రథాసీనులైన కౌరవ మహారథులారా! మీకు చేతనైతే యీ కర్ణకుమారుడు వృషసేనుని రక్షించుకొనుడు. పిమ్మట వివేక శూన్యుడగు సూతపుత్రుని వధించెదను. కర్ణా! నీవే కౌరవ – పాండవ కలహామునకు మూలకారకుడవు. నేను యీ రణక్షేత్రములో నిన్ను హతపూర్వకముగ వధించెదను. ఎవని అన్యాయ వర్తనచే యీ మహా సంగ్రామము తటస్థించెనో ఆ దుర్యోధనుని భీమసేనుడు తప్పక వధించును" అనెను. అర్జునుడిటుల పలికి గాండీవము నెక్కుబెట్టి పదిబాణములతో వృషసేనుని మర్మస్థానములను గాయపరచెను. పిమ్మట నాలుగు చురకత్తివంటి బాణములతో వృషసేనుని ధనుస్సును, రెండు భుజములను, మస్తకమును తెగగొట్టెను. తన పుత్రుడటుల బాణ విద్ధుడై పడుటజూచిన కర్ణుడు సంతాపముచెంది రోషముతో వేవేగ అర్జునుని

రథమువైపు తీవ్రవేగముతో కదిలెను. శ్రీకృష్ణుడు కూడ అర్జునుని ఉత్సాహపరచి తమ రథమును కర్ణునకు ఎదురుగా నిలిపెను. గోశాలలో పోరాడుకొను ఆబోతులవలె వారిరువురు ఒకరిపైనొకరు దాడిచేసుకొనుటకు సంసిద్ధులైయుండిరి. మదధారలు గార్చు మదోన్మత్త మత్తేభములవలె యిరువురును రోషావేశభరితులై యుండిరి. పర్వతముల వలె అవిచలురైయుండిరి. తరుణ వయస్సు విషసర్పముల వలె నుండిరి. యముడు – కాలుడు – అంతకులవలె మహాభయంకర సదృశులై యుండిరి. ఇంద్ర – వృత్రాసురులవలె ఒకరిపై నొకరు కుపితులైయుండిరి. సూర్యచంద్రుల వలె తమ ప్రభను విరజిమ్ముచుండిరి. క్రోధభరితులై ప్రళయకాల మహాగ్రహములవలె బీభత్సమును సృష్టించునటులుండిరి. వారిరువురు దేవాంశ సంభూతులై దేవతుల్య రూపవంతులై యుండిరి. సమరాభిమానులైన ఆ యిరువురు బలవంతులు యుద్ధముకొరకు నానాప్రకార అస్త్ర శస్త్రములు ధరించియుండిరి. పురుషసింహ కర్ణార్జునులు ఒకచోట యుండుట జూచిన సమస్తప్రాణులకు వారిలో విజయమునెవరిని వరించునని ఉత్కంఠ పెరిగినది. వారిరువురు శ్రేష్టరథముల నధిరోహించిరి. వారి రథసారధులు కూడ శ్రేష్ఠ పురుషులై యుండిరి. చరాచర జగత్తు నందున్న ప్రాణులన్నియు రెండు పక్షములుగా కర్ణార్జునులను సమర్థించుచు జయాపజయములు కాంక్షించసాగిరి. సూర్యదేవుడు ఇంద్రుడు కూడ తమతమ అంశలైన కర్ణార్జునులను ఎవరికివారు సమర్థించు కొనుచుండిరి. బ్రహ్మర్షులు – ప్రజాపతులతోగూడి బ్రహ్మదేవుడు – మహాదేవుడు దివ్య విమాన స్థితులై అంబరమున నిలిచిరి. కర్ణార్జునుల యుద్ధమును జూచుటకై ఆకాశములో దేవతలు, నాగులు, అసురులు, సిద్ధులు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, అప్సరసలు, బ్రహ్మర్షులు, రాజర్షులు, గరుడుడు మున్నగువారు గుమిగూడిరి. అపుడు ఆకాశము అత్యంత ఆశ్చర్యకరమైయున్నది. నానాప్రకార మనోహర శబ్దములు, వాయిజ్యములు, గీతములు, స్తోత్రములు, నృత్యములు, హాస్యక్రీడలతో ఆకాశము ముఖరితమై యున్నది. తదనంతరము కౌరవ పాండవపక్ష యోధులు గొప్ప ఆనందముతో శంఖధ్వనులు సింహనాదములు మున్నగువాని కోలాహలముతో సమస్త దిశలను ప్రతిధ్వనింప చేయుచు శత్రు సంహారమును చేయసాగిరి. మహాధనుర్ధర వీరులగు కర్ణార్జునులు గొప్ప గొప్ప అస్త్రములను ప్రయోగించుట అసంఖ్యాక సైనికులను, గజాశ్వములను సంహరించిరి. తదనంతరము దుర్యోధనుడు, కృతవర్మ, శకుని, కృపాచార్యుడు, కర్ణుడు యను పంచమహారథులు తమ బాణముల ద్వారా శ్రీకృష్ణార్జునులను గాయపరచసాగిరి. అపుడు అర్జునుడు తన బాణముల ద్వారా ఒకేసారి వారివారి ధనుస్సులను, ధ్వజములను, అమ్ముల పొదులను, రథములను, సారథులను ప్రమ థనమొనర్చి నలుప్రక్కలనున్న శత్రువులను శీఘ్రమే గాయపరచి కర్ణునికూడ పండ్రెండు బాణములతో గొట్టెను. అంతేగాక వేలకొలది రథికులు, గజారోహకులు, శకులు, తుషారులు, యవనులు, కాంభోజదేశీయ అశ్వారోహకులు ఒక్కపెట్టున తనపైదాడి చేసిననూ అర్జునుడు ధనుర్విద్యా నైపుణ్యముతో వారివారి అస్త్రశస్త్రములను ఖండించి శత్రువుల మస్తకములను చకచక తెగగొట్టెను. వారి గజతురంగ రథములను కూడ పడగొట్టెను. ఆ అద్భుత యుద్ధమును సమస్త ప్రాణులు వీక్షించి ఆశ్చర్యచకితులయ్యిరి. తత్సమయమున అశ్వత్థామ స్నేహపూర్వక కరస్పర్శతో "దుర్యోధనా! నీవు ప్రసన్నుడవై పాండవులతో సంధి చేసుకొనుము. విరోధమువలన ఏ

ప్రయోజనములేదు. ఇరువురు రక్త సంబంధీకుల నడుమ యిట్టి జగడమునకు ధిక్కారము. అస్త్ర విద్యాపండితుడైన నా తండ్రి ద్రోణాచార్యుడు, సాటిలేని శౌర్యపరాక్రమ సంపన్నుడైన భీష్మునకు, యితర ఎందరో మహాయోధులకు పాండవులను జయించుట అసంభవమయ్యెను. నేను, నా మేనమామ కృపాచార్యుడు వరప్రభావముచే అవధ్యులమై యుంటిమి. నీవు పాండవులతో సంధిచేసుకొని చిరకాలము రాజ్యశాసనముతో సుఖముగా నుండుము. సంధిప్రయత్నము చేయుటకు నేను సహకరించెదను" అనెను. కాని దుర్యోధనుడు ఏమాత్రము సుముఖత చూపలేదు. ఆయనకు కర్ణుని పరాక్రమముపై దృఢవిశ్వాసము యుండుటచే అనునయ వినయ విన్నపములతో అశ్వత్థామను ప్రసన్నుని చేసుకొనెను. కర్ణార్జునుల యుద్ధము భయంకరముగ జరిగినవైనము 90-91 అధ్యాయ ములలో వర్ణించబడినది. ఆ మహాసమరములో కర్ణుని వధకై అర్జునుడు ప్రయోగించిన దివ్యాస్త్రములన్నిటిని కర్ణుడు అలవోకగ ఆకాశమునందే నిర్వీర్యమొనర్చి నశింప జేయుచుండెను.

కౌరవసేనను దగ్ధమొనర్చుచున్న అర్జునుని అస్త్రములను కర్ణుడు తాను పరశురాముని వద్ద నేర్చిన అధర్వణ అస్త్రముతో నశింపజేసెను. ఆ యిరువురు మహారథులు తమ ధనుర్విద్యా నైపుణ్యమును విచిత్రరీతులలో వివిధ అస్త్రములద్వారా ప్రదర్శించు చుండిరి. ఆ వీరులిరువురు పరాక్రమము - అస్త్రసంచాలనము - మాయాబలము - పురుషార్థముల ప్రదర్శనలో ఒకరొకరు ఒక్కొక్కపుడు పై చేయి ప్రదర్శించుచుండిరి. ఒకరిపైనొకరు ప్రహారము జేసికొను అవకాశము నన్వేషించుచు ఘాతప్రత్యాఘాతముల నొనర్చుకొనుట జూచి సమస్త యోధులు ఆశ్చర్యచకితులగు చుండిరి. కర్ణుడు దీర్ఘకాలమునుండి ఒక దివ్యాస్త్రమును బంగారు అమ్ములపొదిలో చందన చూర్ణమునందు దాచుకొని యుంచెను. దానిని సదా పూజించుచుండెను. ఆ శత్రునాశక దివ్యాస్త్రము మహాతేజస్వంతము. అది భయంకర సర్ప ముఖముతో ప్రజ్వలితమైయున్నది. కర్ణుడు ఆ బాణముతో సవ్యసాచి అర్జునుని మస్తకమును తెగగొట్ట దలంచెను. అతడు ప్రయోగించదలంచిన దివ్యాస్త్రముబిగి అశ్వసేనుడను నాగరాజు యోగబలముతో ప్రవేశించి యుండెను. కర్ణునకు ఆ విషయము అసలు తెలియకుండెను. కర్ణుడు తన ధనుస్సుపై ఆ బాణమును సంధించినంతనే వందలవేల భయంకర ఉల్కాపాతములు జరుగసాగెను. నాగరాజు అశ్వసేనుడు అర్జునుని బలిగొనునని ఇంద్రుడు కలవరము చెందెను. కాని బ్రహ్మదేవుడు "దేవరాజా! అర్జునునకే విజయము సిద్ధించును. నీవు భయపడుకుము" అనెను. అదే సమయమున కర్ణుని రథసారధిగనున్న శల్యుడు "కర్ణా! నీ బాణము శత్రువుయొక్క కంఠమును ఛేదించు లక్ష్యమునందులేదు. కనుక మరొకసారి నిశితముగ సమీక్షించుకొని బాణమును తీసి చక్కగా సవరించుకొని సంధానము చేయుము"అనెను. ఆ వచనముల నాలకించిన కర్ణుడు కనులెర్రజేసి క్రోధముతో "శల్యా! యీ కర్ణుడు ఏ బాణమును రెండవసారి సవరించుకొని సంధించ ప్రయత్నించడు."అనెను. తాను కొన్ని సంవత్సరముల నుండి పూజించిన దివ్యాస్త్రమును లక్ష్యశుద్ధిలేకనే ప్రయోగించెను. అయిననూ ఆ ప్రజ్వలిత దివ్యాస్త్రములో దాగియున్న నాగరాజు అశ్వసేనుడు అర్జునుని మస్తకమును హరించ నెంచెను. కాని శ్రీకృష్ణభగవానుడు ఆ యదార్థము నెరిగి క్రీడాపూర్వకముగ అర్జునుని రథముయొక్క ముందుచక్రములు భూమిలోనికి క్రుంగునటుల చేసెను. అపుడు రథాశ్వములు మోకాళ్ళపై భూమిపైకి

వంగినవి. అపుడు కర్ణుని దివ్యాస్త్రము లక్ష్యము తప్పి అర్జునుని కిరీటమును తాకుటచే ముక్కలుచెక్కలై పెద్దశబ్దముతో నేలపైబడెను. అర్జునుడు తక్షణమే తన కేశపాశము లను శ్వేతవస్త్రముతో బిగించికట్టుకొనెను. నాగరాజు అశ్వసేనుడు కర్ణునివద్దకు పోయి నీవు లక్ష్యశుద్ధిరహితముగ ప్రయోగించుటచే నీ అస్త్రము పనిచేయలేదు. నేను నీ అమ్ముల పొదిలో వేరొక బాణములో ప్రవేశించెదను. నన్ను ఉపయోగించి నచో నా పూర్వవైరమునకు ప్రతీకారముగ అర్జునుని బలిగొనెదనని పలికెను. కర్ణుడు అట్టి కపట యుద్ధమునకు అంగీకరించకపోవుటచే స్వయముగా ఆకశమునకెగిరి అర్జునునిపైబడుటకు ప్రయత్నించెను. కాని శ్రీకృష్ణుని హెచ్చరికతో అర్జునుడు తీక్షణమైన బాణములతో నాగరాజు అశ్వసేనుని ఖండఖండములు గావించెను. తదనంతరము శ్రీకృష్ణుడు భుజబలముతో మరల రథమును పైకెత్తెను. అర్జునుడు పండ్రెండు వరాహకర్ణ బాణములతో కర్ణుని గాయపరచెను. సర్పతుల్య వేగవంత బాణములతో కర్ణుని రథాశ్వములను కొట్టెను. ఉత్తమ నారాచములతో కర్ణుని కవచమును చీల్చెను. కర్ణుడు కఱ్ఱదెబ్బతినిన పామువలె మెలికలు దిరిగి బుసకొట్టుచు ఉత్తమ బాణములతో అర్జునుని పీడించనారంభించెను. అర్జునుడు కుపితుడై వందకు పైచిలుకు బాణములతో కర్ణుని మర్మస్థానములను విదీర్ణమొనర్చెను. తొంబది బాణములతో కర్ణుని దేహమును క్షతవిక్షత మొనర్చెను. అతని మణిమకుటమును, కుండలము లను పడగొట్టెను. ఆ విధముగ వివశుడైన కర్ణుడు ధనుర్బాణములు జారవిడిచి రథాసనముపై మూర్ఛిల్లెను. అర్జునుడు సత్పురుషాచారమును స్మరించి కర్ణుని వధించకయుండెను. కాని శ్రీకృష్ణ భగవానుడు హెచ్చరించుటచే శత్రుదుర్బలతను జూచి వధించుటకు సిద్ధమయ్యెను. అర్జునుడు వత్సదంత బాణములతో కర్ణుని దేహమునంతటిని ఆచ్ఛాదించెను. అంతలో కాలదేవత అదృశ్యరూపములో కర్ణునకు పూర్వబ్రాహ్మణ శాప ఫలితముగ యుద్ధభూమిలో రథాశ్వము కూరుకు పోవునని దెలిపెను. అటులనే పరశురాముని శాపముచే తన ప్రాణరక్షణ సమయములో భార్గ వాస్త్రము కూడ జ్ఞప్తికి రాకుండునని తెలియజేసెను. కర్ణుడు నిస్సహాయస్థితిలో బలపూర్వకముగ ధైర్యము వహించి బ్రహ్మాస్త్రమును ప్రకటమొనర్చెను. కాని అర్జునుడు ఐంద్రాస్త్రము ప్రయోగించి శరవర్షము కురిపించెను. మహారథి కర్ణుడు ఆ బాణములన్నిటిని వ్యర్థమొనర్చసాగెను. అపుడు అర్జునుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించి బాణవర్షముతో కర్ణుని ఆచ్ఛాదించెను. కాని కర్ణుడు తేజస్వంతమైన బాణములతో అర్జునుని ధనుస్సు యొక్క అల్లె త్రాటిని ఖండించెను. అర్జునుడు బిగించిన అల్లె త్రాటిని వెంటవెంటనే ఖండించుచు కర్ణుడు తనకుతెలియకుండగనే వందకుపైగా అల్లెత్రాడులను ఖండించెను. అపుడు అర్జునుడు లోహమయు దివ్యబాణము నభిమంత్రించి రౌద్రాస్త్రమును సంధానమొనర్చెను. అంతలో కర్ణుని రథచక్రము భూమిలో కూరుకొనిపోయెను. కర్ణుడు వేవేగ రథమునుండి క్రిందకుదూకి ప్రయత్న పూర్వకముగ తన రెండుభుజములతో రథచక్రమును పట్టుకుని పైకెత్తుటకు ప్రయత్నించదలంచెను. రెండు ఘడియల సమయము నీయమని అర్జునుని అడిగెను. ఆ సమయమున ధర్మపన్నములు వల్లించిన కర్ణుని శ్రీకృష్ణుడు ఆక్షేపించెను. దుర్యోధనునకు బాసటగా నిలిచి కర్ణుడు చేసిన అధర్మ చర్యలన్నియు వివరించెను. కర్ణుడు లజ్జితుడై మౌనము దాల్చెను. అపుడు అర్జునుడు కర్ణుని యొక్క పూర్వదుష్కృత్యములను స్మరించి ఉత్తేజితుడై బాణవర్షము కురిపించెను. కర్ణుడందులకు కుపితుడై బ్రహ్మాస్త్రమును ప్రయోగించి కూరుకుపోయిన రథచక్రమును లేవనెత్త ప్రయత్నించెను. అర్జునుడు

కూడ బ్రహ్మాస్త్రమును ప్రయోగించి దానిని శాంతింపజేసెను. తదనంతరము కర్ణుని లక్ష్యముగా జేసి ఆగ్నేయాస్త్రమును ప్రయోగించెను. కర్ణుడు వారుణాస్త్రముతో దాని ప్రభావమును ఉపశమింపజేసెను. వారుణాస్త్ర ప్రభావముతో సంపూర్ణ దిశలందు మేఘములు కమ్ముకొని అంధకారము ఆవరించెను. అర్జునుడు వాయువ్యాస్త్రము ప్రయోగించి మేఘములను చెల్లాచెదురు గావించెను. కర్ణుడు అగ్నిజ్వాలలు గ్రక్కు భయంకర బాణమును ధనుస్సుపై సంధించినంతనే వనపర్వత కానన సహిత పృథివి భగభగమండెను. కంకరరాళ్ళ వర్షముతో ప్రచండవాయువులు చెలరేగెను. సంపూర్ణదిశలు ధూళితోవ్యాప్తమయ్యెను. ఆ బాణము అర్జునుని ఛాతిలో పుట్టలో దూరిన పామువలె ప్రవేశించెను. ఆ బాణాఘాతమునకు అర్జునుడు వివశుడయ్యెను. ఆయనకు ధనుస్సుపై నున్న చేతిపట్టు సడలిపోయెను. ఆ అవకాశమును జూచుకొని కర్ణుడు వేవేగ భూమిలో చొచ్చుకున్న చక్రమును పైకిలేపు ప్రయత్నమును చేయసాగెను. దైవ వశముచే ఆ ప్రయత్నములో బలవంతుడైన కర్ణుడు సఫలీకృతుడుగాకుండెను. అర్జునుడు భయంకర అంజలికా బాణమును ధరించి కర్ణుని విశాల రథముపై రెపరెపలాడుచున్న పతాకము యొక్క సూర్యసమాన ధ్వజదండముపై ప్రహారము చేసెను. మరొక పదునైన క్షురప్రబాణముతో కర్ణుని రథధ్వజమును పడగొట్టెను. అర్జునుడు తన అమ్ములపొదినుండి మరొక అంజలికా బాణమును గ్రహించెను. దానిని ధనుస్సుపై సంధించి మహాదివ్యాస్త్రముతో అభిమంత్రించి గాండీవము యొక్క అల్లెత్రాటిని ఆకర్ణాంతములాగి "ఈ మహాదివ్యాస్త్రముతో ప్రేరితమైన యీ మహాబాణము శత్రువుయొక్క శరీరమును, ప్రాణములను వినాశమొర్చునదై యున్నది. నేను తపస్సు చేసిన వాడనైనచో, నా సేవలతో గురుజనులను సంతుష్టిపరచిన వాడనైనచో, యజ్ఞారాధనలు చేసిన వాడనైనచో, హితైషులగు మిత్రుల హితవాక్యము లను ఆదరించినచో ఆ సత్యప్రభావముతో చక్కగా సంధించబడిన యీ బాణము నా శత్రువగు కర్ణుని నాశనమొనర్చుగాక" అని కర్ణునివధకై బాణమును విడిచిపెట్టెను. అర్జునుడు ఆ బాణముతో కర్ణుని శిరస్సును మొండెమునుండి వేరుచేసెను. అపుడా మస్తకము నేలపైబడినంతనే అతని శరీరముకూడ ధరాశాయి అయ్యెను. అపుడు కర్ణుని శరీరము నుండి ఒక తేజస్సు వెలువడి ఆకాశము నందంతటా వ్యాపించి పైపైకి ఎగయుచు సూర్యమండలములో విలీనమయ్యెను. ఆ అద్భుత దృశ్యమును అచటనున్న వారలందరు ప్రత్యక్షముగ దర్శించిరి. శ్రీకృష్ణార్జునులు, నకులసహదేవులు హర్షోల్లాసముతో శంఖములను పూరించిరి. సోమక గణము సింహనాదములు చేసిరి. శూరవీర కర్ణుడటుల శరాఘాతములతో రక్తసిక్తమై పడియుండుట చూచిన కర్ణుని రథసారధి మద్రరాజు శల్యుడు ధ్వజరహిత రథముతో రణరంగమునుండి పారిపోయెను. కర్ణుడు మృతిచెంది నంతనే భీమసేనుడు భయంకర స్వరముతో సింహనాదములు చేయుచు పృథివ్యాకాశములు కంపించునటుల కరతాళ ధ్వనులు చేయుచు, గెంతులు వేయుచు, ధృతరాష్ట్ర పుత్రులకు భయము గొల్పునటుల నాట్యము చేసెను. పాండవపక్ష క్షత్రియులెల్లరు పరస్పరము ఆనందహేల జరుపసాగిరి. పురుషప్రవరుడగు అర్జునుడు గొప్ప సంహార క్రియతో కర్ణుని వధించి తన ప్రతిజ్ఞను పూర్తిగావించి వైరమునంత మొందించెను. శల్యుడు మాత్రము వేవేగ దుర్యోధనుని కడకేగి "భారతా! నేడు కర్ణార్జునుల యుద్ధము జరిగినటుల యిదివరకెన్నడు జరిగియుండలేదు. కర్ణుడు శతవిధముల

శత్రుపక్షమును ప్రాణసంకటమున పడవేసిననూ ఆశించిన ఫలము దక్కలేదు. నిశ్చయముగ దైవము కుంతీపుత్రులకు అనుకూలమైయున్నది. ఈ కారణము చేతనె నీకు అర్థసిద్ధి గూర్చదలంచిన శూరవీరు లెల్లరు శత్రువుల చేతిలో హతులయ్యిరి. కనుక ఇది ప్రారబ్ధముకాక మరేమి? అందరికి అన్నివేళలా విజయసిద్ధి లభించుట జరుగదు. కనుక ధైర్యము వహించుము" అనెను. దుర్యోధనుడు ఒకింత తాను చేసిన అన్యాయములను స్మరించి మనస్సులోనే గొప్ప ఉదాసీనత చెంది దుఃఖితుడయ్యెను. అత్యంత శోకపీడితుడై అచేతనుడయ్యెను. పదేపదే దీర్ఘశ్వాసలు తీసెను. తదనంతరము భీమార్జునులు కౌరవసేనా విధ్వంశము కొనసాగించిరి. శల్యుడు రణరంగములోని మారణకాండ దిగ్దర్శనమును దుర్యోధనునకు గావించి నాటికి యుద్ధ చాలించెదమనెను. శల్యుని చిత్తము శోకవ్యాకులమయ్యెను. దుర్యోధనుడు కూడ అర్తితో "హా కర్ణా, హా కర్ణా"అని ఎలుగెత్తి పిలుచుచు ఏమియూ పాలుపోక మందుడై కూర్చొనెను. కర్ణుని కవచము బాణములతో ఛేదించ బడినది. ఆయన ధరించిన వస్త్రములు పూర్తిగా రక్తసిక్తమైనవి. ప్రాణములుకూడ ఎగిరిపోయినవి. అయిననూ ఆయనలో శోభ తగ్గలేదు. తప్త కాంచనమువలె, అగ్నివలె, సూర్య సమాన కాంతితో ఆయనదేహము ప్రకాశించుచుండెను. ఆ మహా సమరములో కర్ణుడు వధించబడినందులకు శ్రీకృష్ణార్జునుల నిరువురిని దేవతలు, గంధర్వులు, మానవులు, చారణులు, మహర్షులు, యక్షులు, గొప్పగొప్ప నాగులు జయజయధ్వానములతో సమాదరించిరి. కౌరవసేనకూడ తమ శిబిరములవైపు పలాయన మయ్యిరి. శ్రీకృష్ణార్జునులు పరస్పరము ఆనందముతో ఆలింగనమొనర్చుకొని యుధిష్ఠిరుని శిబిరమునకేగిరి. ప్రసన్నతాపూర్వకముగు ఆయన చరణములను స్పృశించిరి. శ్రీకృష్ణుడు మంద హాసముతో "రాజా! సూతపుత్రుడగు వైకర్తన కర్ణుడు వధించబడెను. ఏ నరాధముడు ద్యూతములో మీకు పరాజయము కలుగనటుల జేసి, ద్రౌపదిని అవమానించెనో ఆ సూతపుత్రుని రక్తము నిపుడు భూమి త్రాగుచున్నది. అతని దేహమునిండ బాణములు గ్రుచ్చుకొనియున్నవి. క్షతవిక్షతుడైన కర్ణుడు ధరాశాయిగ నుండుట దర్శించుము. నీవిక సావధానుడవై నిష్కంటక పృథివీరాజ్యము నేలుచు ప్రచుర భోగముల ననుభవించుము"అనెను. శ్రీకృష్ణుని వచనములు విన్నంతనే యుధిష్ఠిరుని చిత్తము ప్రసన్నమయ్యెను. అందులకు సంతోషమును వ్యక్తపరచి "దేవకీనందనా! నీ కరుణయుండగా కార్య మేదైననూ సంపన్నము గాకుండునా? నీవు సారథివై యుండుటచే అర్జునుడు కృతప్రయత్నముతో కర్ణుని వధించగలిగెను." అనెను. ఆయన శ్రీకృష్ణార్జును లతో ప్రియ సంభాషణము చేయుచు యుద్ధభూమిలో పడియున్న కర్ణునిజూచెను. పిమ్మట శ్రీకృష్ణార్జునులను పదేపదే ప్రశంసించెను.

ఉపాఖ్యానములు:

కర్ణపర్వములో హంసవాయసోపాఖ్యానము, బలాక కౌశిక ఉపాఖ్యానములు రెండు మాత్రమే యున్నవి. వీనిలో మొదటిది శల్యుడు తాను యుధిష్ఠిరునకు మాటయిచ్చిన ప్రకారము కర్ణుని శ్రేష్ఠతను కించపరచుచు నిరుత్సాహుని గావించుటకు చెప్పబడినది. రెండవది యుధిష్ఠిరార్జునుల నడుమ ధర్మసంకట స్థితిని దీర్చుటకై శ్రీకృష్ణుని తత్త్వభోధయై యున్నది. ఎంగిలి మెతుకులు తిని బలిసిన కాకి అజ్ఞానముతో ఒక హంసతో సుదూరమునకు ఎగురు పందెముగాచి సంకటస్థితిలో బడుట వర్ణించబడెను. ఇందులో కర్ణుని నీచజాతి పక్షి కాకిగ అర్జునుని శ్రేష్ఠ విహంగమగు హంసగ సరిపోల్చబడెను. ఈ వృత్తాంతము నలుబదిరెండవ అధ్యాయములో నున్నది.

రెండవ ఉపాఖ్యానము 69 నుండి 72 అధ్యాయములలో నున్నది. ఇందులో శ్రీకృష్ణుని ధర్మరహస్య తత్త్వబోధ రమ్యమనోహరము.

కర్ణపర్వ శ్రవణఫలము:

మహాత్ములగు కర్ణార్జునుల మహాయుద్ధము గురించి పఠించువారికి లేదా శ్రవణము చేయువారికి యజ్ఞానుష్ఠాన ఫలము లభించును. వారు సమస్తలోకములు సంచరించు పుణ్యభోగ సుఖములను పొందెదరు. ధనధాన్యములతో యశశ్వంతులై పుణ్యభాగులగుదురు. వారిపై త్రిమూర్తుల అనుగ్రహ దృష్టి ప్రసరించును. బ్రాహ్మణులకు వేదజ్ఞానము ప్రాప్తించును. క్షత్రియులకు బలవృద్ధి - యుద్ధ విజయము సంప్రాపించును. వైశ్యులు గొప్ప ధనవంతు లగుదురు. శూద్రులు ఆరోగ్యవంతులుగ నుందురు. ఈ పర్వమును నిత్యము స్వాధ్యాయ మొనర్చువారు సుఖవంతులై సంపూర్ణ మనోవాంఛితములు దీర్చుకొనగలరు. ఒక సంవత్సరముపాటు ప్రతిదినము వత్ససహిత కపిలధేనువును దానమునిచ్చిన ఫలము కేవలము ఒకమారు కర్ణ పర్వమును పఠించుట లేదా శ్రవణము చేయుటవలన ప్రాప్తించుట తథ్యము. మహాముని వేదవ్యాస వాక్సుధామృతమునకు అంతటి ప్రభావమున్నదని గ్రహించవలెను.

శల్య పర్వము - సంగ్రహ పరిచయము

మహాభారతమునందలి తొమ్మిదవ పర్వమగు శల్యపర్వము అరువదియారు అధ్యాయములతో మూడువేల రెండవందల ఇరువది శ్లోకములతో గూడియున్నది. శల్యపర్వము భీమ దుర్యోధనుల గదా యుద్ధము, అశ్వత్థామను కౌరవసేనాపతిగ అభిషేకించ బడుటచే పూర్తియగును. ఇందులో బలరామదేవుని తీర్థయాత్రా పర్యాటనము ప్రధానమైయున్నది.

కథాంశము:

కర్ణుని మృతివలన దుర్యోధనుడు శోక సాగరములో మునిగిపోయెను. కర్ణవధ స్మరణముతో ఎంతటికి శాంతి లభించకయుండెను. దైవవిధానము ప్రబలమని తలంచి మిగిలిన కొద్ది సైన్యముతో యుద్ధకర్మను కొనసాగించ దృఢనిశ్చయము జేసికొనెను. కృపాచార్యుడు చెప్పిన సంధిమార్గము పలుకారణములచే అసంభవమగునని పలికెను. ఆ సమయమున అశ్వత్థామ కడకేగి హతశేష కౌరవ సైన్యమునకు సేనాపతిగ యుండుటకు యోగ్యుడెవరో సూచించమని ప్రార్థించెను. అందులకు ద్రౌణి "దుర్యోధనా! మద్రరాజు శల్యుడు ఉత్తమకులములో జన్మించెను. ఆ తేజస్వంతుడు సద్గుణసంపన్నుడు. తన మేనళ్లుళ్ళను గాదని మన పక్షములో చేరిన కృతజ్ఞుడు. అతడు కార్తికేయునివలె మహతీసేనా సంపన్నుడు. మనముకూడ యా శల్యుని సేనాపతిగ జేసికొని శత్రువులపై విజయమును సాధించెదము" అనెను. అపుడు దుర్యోధనుడు రెండు చేతులతో శల్యునకు నమస్కరించి "మిత్రవత్సలా! నేడు మీ మిత్రులెవరో శత్రులెవరో తెలుసుకొను సమయము ఆసన్నమైనది. మీరు మాకు శూరవీర సేనాపతియై కౌరవసేన అగ్రభాగమునందు నిలిచి రణయాత్ర జరిపించుము, మీరు రణభూమిలో ప్రవేశించినంతనే మందబుద్ధులగు పాండవులు - పాంచాలురు ఉద్యోగశూన్యులయ్యెదరు"అనెను. ఆ వచనములకు మద్రదేశాధీశుడు మహదానందము చెంది సమస్త రాజుల సముఖమున దుర్యోధనునితో "కురురాజా! నీవు నానుండి ఏమి కోరుచుంటివో దానిని పరిపూర్ణ మొనర్చెదను. ఏలననగా నా ప్రాణములు, రాజ్యము, ధనము నీకు ప్రియముగూర్చుటకై పూర్వమే సమర్పించి యుంటిని."అనెను. అపుడు దుర్యోధనుడు "మామయ్యా! స్కందుడు దేవసేనాపతి పదమును స్వీకరించినటుల నీవు కూడ మాకు సేనాపతిగ అభిషిక్తుడవగుము. ఇంద్రుడు దానవ సంహారము చేసినటుల రణభూమిలో మా శత్రువులను వధించుము" అనెను. ఆ పొగడ్తకు మద్రరాజు శల్యుడు ఉప్పొంగిపోయి "దుర్యోధనా! ఒకే రథమునందాసీనులైన శ్రీకృష్ణార్జునులును, రథికులలో శ్రేష్ఠులగు రాజన్యులును నా బాహుబలముతో సమానులుగారు. నేను కుపితుడనైనచో దేవాసురులు ఏకమై వచ్చిననూ ఎదుర్కొనగలను. ఈ పాండవులు నాకొక లెక్కగాదు. నేను రణభూమిలో కుంతీదేవి పుత్రులనేగాక, నన్నెదిరించు సోమకులపైకూడ విజయమును సాధించెదను. నీకు సేనాపతినై శత్రువులెవరు లంఘించలేని వ్యూహ నిర్మాణము చేసెదను, ఇది నా సత్యవచనము"అనెను. దుర్యోధనుడు వెనువెంటనే శాస్త్రీయ విధిననుసరించి కౌరవసేనా మధ్యభాగములో మద్రరాజు శల్యుని సేనాపతి పదముపై అభిషిక్తుని జేసెను. తదనంతరము శల్యుడు అనేకానేక ఆడంబర వచనములు పలుకుచు తన అనుయాయులగు సైనికుల స్తుతులను విని యుద్ధరంగమునకు కదిలెను. శల్యుడు సేనాపతి యైనంతనే కౌరవసైన్యములో కర్ణుడులేని విచారము తగ్గినది. వారి మనస్సులో ఉత్సాహము వెల్లివిరిసినది. శల్యుడు కౌరవసైన్యము నకు సేనాపతిగ అభిషిక్తుడైన విషయము నెరిగిన పాండవులు

తమకు అవశ్య కర్తవ్యమును నిర్దేశించమని శ్రీకృష్ణుని అడిగిరి. అందుకు శ్రీకృష్ణ భగవానుడు యుధిష్ఠిరునితో "భారతా! ఋతాయన పుత్రుడగు శల్యుడు గొప్ప బలశాలి, మహా విద్వాంసుడు, విచిత్ర యుద్ధము చేయుటలో నేర్పరి. శీఘ్రముగా అస్త్ర శస్త్ర ప్రయోగములు చేయగల నిపుణుడు. భీష్మ ద్రోణ కర్ణుల పరాక్రమముకన్న మిన్నగా యుద్ధమును చేయగలడు. నేను ఎంత ఆలోచించిననూ యుద్ధపరాయణుడగు శల్యునితో సముడగు యోధుని మన పాండవ సైన్యములో ఎంచలేకున్నాను. సింహమువలె, మదగజమువలె పరాక్రమశాలియగు మద్రరాజు శల్యుడు ప్రళయకాలములో ప్రజావర్గముపై కుపితుడగు కాలునివలె రణభూమిలో నిర్భయముగ విహరించును. యుధిష్ఠిరా! నీ పరాక్రమముకూడ సింహసమానము. నేడు నీవు దప్ప యింకెవరూ శల్యునితో యుద్ధముచేయు సమర్థత గలవారిని చూడకున్నాను"అనెను. మరునాడు శేషించిన ఉభయపక్ష సైన్యములు సమరాంగణములో నిలిచిరి. ఇరు పక్షములు కలియబడి ఘోరసంగ్రామము జరిపిరి. భీమార్జునుల ధాటికి విశాల కౌరవసేన మదవతి యువతివలె ఒడలుమరిచి వారి వశమగుచున్నది. ధృష్టద్యుమ్నుడు శిఖండియు పరమోత్సాహభరితులై యుధిష్ఠిరుని ముందిడుకొని శల్యమహారాజుపై దాడిచేసిరి. నకులుని ద్వారా కర్ణుని ముగ్గురు పుత్రులు వధించబడిరి. పాండవ కౌరవసైన్యములు రెండిటిలో అనేకమంది యోధులు బలికాజొచ్చిరి. కౌరవ పాండవ సేనలలో అధికాంశము ద్వంద్వయుద్ధము కొనసాగెను. శల్య మహారాజు వందలవేల బాణములతో పాండవసైన్యమును యుధిష్ఠిరుని ఎదుట సంతప్త మొనర్చెను. శల్యుడు శరవర్షముతో యుధిష్ఠిరుని ఇతర పాండవపక్ష యోధులను పీడించసాగెను. శల్యుని బాణములు భ్రమర సమూహములవలె, మిడుతల దండువలె, మేఘములలో విద్యున్మాలికలవలె పృథివిపై పడసాగినవి. శల్యుని ద్వారా మర్దించబడిన పాండవసైనికులు భయావహులై యుధిష్ఠిరుని చెంతకు పరుగులుదీసిరి. శల్యుని పురోగమనమును యుధిష్ఠిరుడు అడ్డగించెను. కాని శల్యుడొక విషధరబాణముతో యుధిష్ఠిరుని గాయపరచెను. అందులకు భీమసేనుడు కుపితుడై ఏడుబాణములతో శల్యుని గాయపరచెను. అటులనే సహదేవుడు ఐదు బాణములతోను, నకులుడు పదిబాణములతోను, ద్రౌపదేయులు అనేక బాణములతోను శల్యుని గాయపరచిరి. అపుడు కృతవర్మ, కృపాచార్యులు క్రోధితులై శల్యుని రక్షణకు వచ్చిరి. వారితోబాటు ఉలూకుడు, శకుని, అశ్వత్థామ, ఇతర ధార్తరాష్ట్రులు మెల్లమెల్లగా వచ్చి శల్యునకు రక్షగానుండిరి. కృతవర్మ శరవర్షముతో భీమసేనుని పురోగమనమును నిలువరించెను. కృపాచార్యుడు శరపరంపరతో ధృష్టద్యుమ్నుని పీడించెను. ద్రౌపదేయులను శకుని, నకులసహదేవులను అశ్వత్థామ గాయపరచిరి. యోధశ్రేష్ఠుడగు దుర్యోధనుడు బాణవర్షముతో శ్రీకృష్ణార్జునులను గాయపరచెను. ఆ ప్రకారము కౌరవపాండవ యోధులు విచిత్ర ద్వంద్వ యుద్ధమును చేయసాగిరి. కృతవర్మద్వారా భీమ సేనుని రథాశ్వములు వధించబడినవి. భీమసేనుడపుడు విశాలగదను చేతబట్టి రథమునుండి దూకి గదాప్రహారములతో శత్రుసంహారము చేయసాగెను. శల్యమహారాజు తనకు ఎదురునిలిచి పోరాడిన సహదేవుని రథాశ్వములను వధించెను. సహదేవుడు తన ఖడ్గముతో శల్యుని పుత్రుని వధించెను. కృపాచార్యుడు ధృష్టద్యుమ్నునితో తలవడెను. అశ్వత్థామ మందహాసముతో ద్రౌపదేయులను గాయపరచెను. భీమసేనుడు మరొక రథమునెక్కి వచ్చినంతనే కృతవర్మ మరల రథాశ్వములను వధించెను. భీమసేనుడు గదను చేతబట్టి రథమునుండి క్రిందకు దూకి రోషావేశముతో కృతవర్మ రథాశ్వములను జంపి, రథమును నుగ్గు నుగ్గుచేసెను. కృతవర్మ అచటనుండి పారిపోయెను. శల్యుడు పదునైన బాణములతో యుధిష్ఠిరుని పీడించుట

జూచిన భీమసేనుడు యమదండమువంటి గదతో శల్యునిపై విరుచుకుపడెను. ముందుగా శల్యుని రథాశ్వములు నాలుగింటిని గదతో వధించెను. అందుకు కుపితుడైన శల్యమహారాజు భీముని వక్షస్థలముపై ఒక తోమరముతో గొట్టెను. అది భీమసేనుని కవచమును చీల్చి ఛాతిలో గ్రుచ్చుకొనెను. భీమసేనుడు ఆ తోమరమును ఛాతినుండి తొలగించుకొని దానితోనే శల్యుని రథసారథిని పడగొట్టెను. శల్యుడు వేగపూర్వకముగ లోహమయ గదను చేతబట్టి భీమసైనునిపైకి ఉరికెను. సంసారములో మద్రరాజు శల్యుడు, యదునందనుడగు బలరాముడు తప్ప యింకెవరు భీమసేనుని వేగమును సహించజాలరు. శల్య భీమసేనులిరువురు బరిలోదిగి గదలు చేతబట్టి ఆబోతులువలె అంకెలువేయుచు గదాంకుశములతో ఒకరిపైనొకరు ఘాతప్రఘాతములొనర్చుచు అలౌకిక పరాక్రమమును ప్రదర్శించుచు తీవ్రముగా గాయపడి ఒకేసారి రెండు ఇంద్రధ్వజములవలె నేలపై పడిపోయిరి. ఆ యిరువురి మర్మస్థానములందును లోతైన గాయములైనవి. అంతలో కృపాచార్యుడు వేవేగవచ్చి శల్యమహారాజును రథములో కూర్చుండబెట్టుకొని దూరముగా గొనిపోయెను. భీమసేనుడు నేలపై దొర్లుచు తెలివిదెచ్చుకొని గదాయుద్ధమునకు రమ్మని శల్యుని పిలువసాగెను. దుర్యోధనుడు ఒక ప్రాసతో పాండవ యోధుడు చేకితానుని వధించెను. శల్యుడు మరల కృపాచార్య కృతవర్మ శకునులు తోడురాగా యుధిష్ఠిరునిపై శరవర్షము కురిపించెను. యుధిష్ఠిరుడు పదునైన బాణములతో శల్యుని క్షతవిక్షతమొనర్చెను. తదనంతరము యుధిష్ఠిరుడు డెబ్బది బాణములతో చంద్రసేనుని, తొమ్మిది బాణములతో శల్యుని రథసారథిని అరువదినాలుగు బాణములతో ద్రుమసేనుని వధించెను. రథచక్ర రక్షకులగు చంద్రసేన - ద్రుమసేనులు నశించుటచే కోపోద్రిక్తుడైన శల్యుడు తక్షణమే పదునైన బాణములతో సాత్యకి - భీమసేనుడు - నకుల సహదేవులను గాయపరచి విచ్చల విడిగా సమరాంగణములో శత్రుసైనికులను సంహరించ సాగెను. అపుడు యుధిష్ఠిరుడు విషధరసర్ప సమాన భయంకరమగు తీక్షణబాణములతో శల్యుని పీడించి మరొక భల్లబాణముతో శల్యుని రథధ్వజమును పడగొట్టెను. శల్యుడు కుపితుడై యుధిష్ఠిరునిపై బాణవర్షము కురిపించెను. అటులనే తనను ఆక్రమించిన సాత్యకి భీమసేన నకుల సహదేవులను ఒంటరిగా ఎదుర్కొని నిలువరించెను. పాండవ మహారథులెవ్వరూ అగ్నిగదృశుడగు శల్యుని వంక చూడలేకుండిరి. మద్రరాజు చండప్రచండ పరాక్రమమును ప్రదర్శించుచుండగ యుధిష్ఠిరుడు పురుషార్థ ప్రేరితుడై శ్రీకృష్ణార్జునులను ఇతర అన్నదమ్ములను పిలిచి "బంధువులారా! మీరందరు యీ సమరాంగణములో మీ పురుషార్థమునకు న్యాయముగూర్చి ఉత్సాహముతో మీమీవంతు కార్యములను పూర్తి చేసితిరి. ఇపుడు మహారథి శల్యుడు ఒక్కడే నా భాగముగ మిగిలియుండెను. కనుక నేను మద్రరాజు శల్యుని మర్దించి వధించు ఆకాంక్షతో నుంటిని. నకులసహదేవులు నా రథచక్ర రక్షకులుగ నుండవలెను. అర్జునుడు నా పృష్ఠభాగము నందును, భీమసేనుడు నాకు అగ్రభాగమునందు నడువవలెను. ఇట్టి వ్యవస్థతో నేను శక్తివంతుడ నయ్యెదను"అనెను. ఆ ప్రకారము యుధిష్ఠిరుడు మద్రరాజుపై దాడిచేసెను. విజయాభిలాషులైన ఇరువక్షముల వారు ఘోరసంగ్రామము జరిపిరి. యుధిష్ఠిరుడు ఒంటరిగా అశ్వ - సారథి - ధ్వజ - రథిక సహిత అనేకమంది రథికులను ధరాశాయులను చేసెను. తన బాణ వర్షముతో నలుదిశలను కాంతిశూన్యముగావించి మద్రరాజు శల్యునిపై దాడిచేసి "నిలునిలు"మని గర్జించెను. ఒక క్షురప్రబాణముతో శల్యుని ధనుస్సును ఖండించెను. వంగిన ములుకు బాణములతో రథాశ్వములు నాలుగింటిని వధించెను. మరొక రెండు

పదునైన బాణములతో శల్యుని పార్శ్వరక్షకులిరువురిని యమలోకమునకు బంపెను. మెరుపు బాణముతో శల్యుని రథధ్వజమును పడగొట్టెను. అది జూచిన కౌరవసేన పరుగులెత్తి పారిపోయినది. అట్టి దురవస్థలోనున్న శల్యుని రక్షించుటకు వేవేగ అశ్వత్థామ వచ్చి తన రథముపై శల్యుని ఎక్కించుకొని దూరముగా గొనిపోయెను. తదనంతరము దుర్యోధనుడు తదితర శ్రేష్ఠకౌరవయోధులతో గూడివచ్చిన శల్యుడు ఏడు బాణములతో యుధిష్ఠిరుని ఛాతిపైగొట్టి గాయపరచెను. యుధిష్ఠిరుడు కూడ బాణాఘాతములతో శల్యుని మూర్ఛితుని గావించెను. అతని సువర్ణమయ కవచమునుకూడ చీల్చెను. శల్యుడు తెలివిదెచ్చుకొని వందబాణములతో భీమసేనుని – యుధిష్ఠిరుని కవచములను చీల్చెను. యుధిష్ఠిరుని ధనుస్సును ఖండించి రథాశ్వములను కూడ హతమార్చెను. అపుడు భీమసేనుడు కలుగజేసుకొని శీఘ్రగామి బాణములతో శల్యుని ధనుస్సును ఖండించి, రథసారథిని వధించి, అశ్వములను కూడ హతమార్చి, శల్యుని కవచమును చీల్చెను. డాల్కత్తులతో వీరవిహారము చేయుచున్న శల్యుని, సహదేవుడు బాణములతో ఆచ్ఛాదించెను. భీమసేనుడు తొమ్మిది బాణములతో శల్యుని చేతియందున్న డాలును ముక్కలుముక్కలు చేసెను. అనేక భల్లబాణములతో ఖడ్గముయొక్క పిడినికూడ ఖండించెను. భీమసేనుని అద్భుతకర్మను జూచి పాండవపక్ష శ్రేష్ఠ రథులు పరమానందముచెందిరి. అపుడు మద్రరాజు శల్యుడు హుటాహుటిని యుధిష్ఠిరుని వెంట లేడిని పట్టుకొనుటకు పరుగిడు సింహమువలె దౌడుతీసెను. యుధిష్ఠిరుని రథాశ్వములు – సారథి అప్పటికే హతులైయుండిరి. అందుచే నిస్సహాయుడై రథమునందున్న యుధిష్ఠిరుడు కోపోద్రిక్తుడై మద్రరాజు శల్యుని బలవంతముగ ఆక్రమించి వధించ నిర్ణయించెను. శల్యవధ తన కర్తవ్యమని సంకల్పించెను. మణి జటిత సువర్ణమయ దండముతో నున్న శక్త్యాయుధమును చేతబట్టెను. పాండవులు ఆ శక్త్యాయుధమును గంధ – పుష్పమాల – ఉత్తమాసన – పేయపదార్థ నివేదన – విప్రభోజన – తర్పణాది ఉపచారములతో పూజించుండిరి. అది ప్రళయకాల సంవర్తకాగ్నివలె ప్రజ్వరిల్లుచు అథర్వాంగీరస మంత్ర ప్రభావములచే ప్రకిటితమైన కృత్యవలె అత్యంత భయంకరమైయున్నది. ఒకప్పుడు త్వష్టప్రజాపతి ఆ శక్త్యాయుధమును శంకర భగవానుని కొరకు నిర్మించెను. అది జల – స్థల – ఆకాశ స్థిత ప్రాణులనైననూ బలిపూర్వకముగ సంహరించు సమర్థతగలది. యుధిష్ఠిరుడు ఆ సమయమున ఘోరమంత్రములతో దానిని అభిమంత్రించి మద్రరాజు శల్యుని వధకై ప్రయత్నపూర్వకముగ ఉత్తమ మార్గ స్థితముగ ప్రయోగించెను. ఆ శక్త్యాయుధము మద్రరాజు శల్యుని మర్మస్థానములను విదీర్ణమొనర్చి, ఆయన ఉజ్జ్వల విశాల వక్షస్థలమును చీల్చి, ఆయన విస్తృత యశస్సును దగ్ధమొనర్చి జలమువలె ధరలో యింకిపోయెను. అతడు పిడుగుపాటుకు వివీర్ణమైన పర్వతశిఖరమువలె పడిపోయెను. ఆయన అంగములు విదీర్ణమైనవి.

తదనంతరము మద్రరాజుయొక్క అనుచరు లను కూడ పాండవపక్ష యోధులు వధించిరి. భీమసేనుడు విజృంభించి కౌరవసేన పదాతి దళమును కూడ విధ్వంసమొనరించసాగెను. పారిపోవుచున్న కౌరవ సైన్యమును నిలువరించుటకై దుర్యోధనుడు పరాక్రమ భాషణమును, వీరస్వర్గగతిని ఎలుగెత్తి చాటసాగెను. కాని అటుల మరలివచ్చిన యోధులపై పాండవులు వ్యూహ బద్ధులై ఎదుర్కొని మారణకాండ కొనసాగించిరి. సాత్యకి పర్వతీయ సాళ్వరాజును, సైన్యమును సంహరించెను. అటులనే మేఘధూర్తిని వధించి కృతవర్మను పరాజితుని చేసెను. దుర్యోధనుడు ప్రాణములకు తెగించి దుస్సహ పరాక్రమమును ప్రదర్శించి పాండవసైన్యమును సంహరించసాగెను. అటులనే ఏడువందలమంది రథయోధులను యుధిష్ఠిరుని ఆక్రమించుటకు బంపెను. అపుడు

పాండవపక్ష మహారథులు యుధిష్ఠిరుని రక్షణకై వచ్చి రథయోధులనందరిని తెగటార్చిరి. అపుడు గాంధార రాజు శకుని కూటయుద్ధయోచనచేసి కౌరవ యోధులతో "వీరులారా! మీరు పాండవసైన్యము నెదుర్కొని పోరు సలుపు సమయమున నేను పాండవ సైన్యము వెనుకచేరి సంహారక్రియ గావించెదను" అనెను. అపుడు యుధిష్ఠిరుడు యదార్థమును గ్రహించి సహదేవుని పిలిచి "పాండునందనా! శకుని మన సైన్యముయొక్క వెనుక భాగమును చేరి యోధులను పీడించుచున్నాడు. నీవు శీఘ్రమే ద్రౌపదేయులతోగూడి శకునిని వధించుము"అని అజ్ఞాపించెను. వేగవంతమగు అశ్వసైన్యముతో వెడలిన సహదేవుడు శకునియొక్క రథసేనలో జొచ్చుకొని మధ్యభాగములో నిలిచి శత్రుమూకపై బాణవర్షమును కురిపించెను. కౌరవ పాండవ సైనికులు ప్రాణ మోహమును వీడి భయంకర యుద్ధమును చేసిరి. యుద్ధకోలాహలము కొంత తగ్గిన తరువాత శకుని శేషించిన అశ్వ సైన్యముతో మరల పాండవ సైన్యముపై దాడిచేసెను. పాండవులు తమ పదాతి గజాశ్వసైన్యమును కూడగట్టుకొని శకుని సైన్యమును అన్నివైపులనుండి కోష్టబద్ధమొనర్చి నానాప్రకార శస్త్రములద్వారా గాయమొనర్చసాగిరి. అపుడా రణక్షేత్రములో మర్యాద శూన్య యుద్ధము జరిగెను. అర్జునుడు కౌరవరథసేనను నిర్మూలముగ నశింపజేసెను. పిమ్మట భీమార్జునులు కలిసికట్టుగా గజాశ్వసేనలను సంహరించిరి. అదే సమయమున ధార్తరాష్ట్రులు మూకుమ్మడిగ భీమసేనుని ఆక్రమించిరి, భీమసేనుడు వారినందరిని ఎదుర్కొని పోరాడుచు అవకాశము లభించినపుడు ఒక్కొక్కరిని మట్టుబెట్టుచు పదునొకండుగురు ధృతరాష్ట్ర పుత్రులను వధించెను. అర్జునుడు త్రిగర్తసైన్యముపై దాడిచేసి సత్యేషుని, సుశర్మను, అతనియొక్క నలుబదైదుగురు మహారథి పుత్రులను వధించి కౌరవసేనపై ఆక్రమణచేసెను. ఇంకొక ప్రక్క భీమసేనుడు ధృతరాష్ట్ర పుత్రుడగు సుదర్శనునితో తలబడి అతని మస్తకమును ఎగురగొట్టెను. సహదేవుడు పదిబాణములు ప్రయోగించి శకునిని గాయపరచెను. మూడు బాణములతో శకుని రథాశ్వములను వధించెను. రణ దుర్మదుడగు శకుని అరువది బాణములతో సహదేవుని, ఏడు బాణములతో భీమసేనుని గాయపరచెను. రణభూమిలో తనతండ్రి శకునిని రక్షించుచు ఉలూకుడు డెబ్బది బాణములతో సహదేవుని క్షత విక్షత మొనర్చెను. సహదేవుడు క్రుద్ధుడై ఒక భల్లబాణముతో ఉలూకుని మస్తకమును ఖండించెను. తన పుత్రుడటుల ప్రాణశూన్యుడగుట జూచిన శకుని దగ్గుత్తికతో దీర్ఘశ్వాసదీయుచు ఒకప్పుడు విదురుడు పలికిన వచనములను స్మరించెను. కన్నీరు గార్చుచు రెండు ఘడియలు చింతామగ్నుడయ్యెను. పిమ్మట సహదేవుని మూడుబాణములతో గొట్టెను. సహదేవుడు వానిని నివారించి శకుని యొక్క ధనుస్సును ఖండించెను. అపుడు శకుని వరుసగా పొడవాటి ఖడ్గమును - విశాలమగు గదను, శక్త్యాయుధమును వరుసగా విసిరెను. సహదేవుడు వానిని తన వాడి బాణములతో శకలములు గావించెను. సహదేవుడు వేవేగ శకుని రథమును వెన్నంటుచు శకుని వధ తనవంతుగ సంకల్పించెను. దుర్జయవీరుడగు సహదేవుడు పదిబాణములతో శకునిని గాయపరచి మర్మస్థానము లపై బాణవర్షము కురిపించెను. అందుకు కుపితుడైన శకుని సువర్ణభూషిత ప్రాసతో సహదేవుని వధించుటకు ఉద్యుక్తుడై రెండుచేతులతో పైకి ఎత్తెను. సహదేవుడు మూడు బాణములు ప్రయోగించి ఆ ప్రాసను, శకుని రెండు భుజములను ఖండించెను. పిమ్మట సుదృఢ లోహమయ బాణమునొకటి ధనుస్సుపై సంధించి శకుని మస్తకమును మొండెమునుండి వేరుచేసెను. అతని మొండెము నేలపైబడి గిలగిలమని కొట్టుకొనుచు ప్రాణశూన్యమై చేష్టలుడిగెను. అది చూచిన కౌరవ యోధులు ధైర్యహీనులై నలుదిశలకు పారిపోయిరి. శ్రీకృష్ణసహిత సమస్త పాండవులు ఆనందముతో

శంఖనాదములు చేయుచు భూరిప్రశంసలతో సహదేవుని సన్మానించిరి. ఆ మహా సమరములో సంజయుడు మాత్రము సాత్యకిచేతిలో బందీగా లొంగిపోయెను. చివరగా దుర్యోధనుడు క్రోధితుడై తన సైన్యమునంతటిని ఒక్కటిగా చేసి పాండవులపై దాడిచేయమని ఆదేశించెను. కాని రెండుఘడియలలో పాండవులు ఆ సైన్యము నంతటిని నష్టమొనర్చిరి. ఒక్క యోధుని కూడ మిగల్చలేదు. ఒకప్పుడు దుర్యోధనుని వద్ద పదునొకండు అక్షౌహిణీల సైన్యముయుండెను. ఆ మొత్తము సైన్యమును పాండవులు - సృంజయులు నశింపజేసిరి. ఒక్క దుర్యోధనుడు మాత్రమే అగుపడుచుండెను. అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులుఎచటనో దాగియుండిరి. దుర్యోధనుడు శోకసంతప్తుడై అటనుండి పారిపోవుటకు నిశ్చయించుకొనెను. ఆయనవద్ద సైన్యము లేదు. వాహనములు లేవు. పాండవుల విశాలసేనలో కేవలము రెండువేల రథములు, ఏడువందల ఏనుగులు, ఐదువేల గుఱ్ఱములు, పదివేల కాల్బలము మాత్రమే మిగిలియుండెను. కౌరవుల తరపున దుర్యోధనుడు ఒంటరివానిగ మిగిలిపోయెను. తనకు సహాయకులు లేకుండిరి. తన వాహనముగనున్న అశ్వముకూడ మరణించుటచే భయభీతులు చెందిన దుర్యోధనుడు తూర్పుదిశగ పరుగుదీసెను. ఒక గదను మాత్రమే చేతబట్టి పాదచారియై సరోవరము దిశగా వెడలెను. మధ్యలో ఒకచోట ఆగి మహాత్ముడగు విదురుని పూర్వహిత వచనములను స్మరించెను. ఖైదులోనున్న సంజయుని జూచిన ధృష్టద్యుమ్నుడు సాత్యకితో "ఇతడిని సజీవముగా నుంచుటవలన మనకు ప్రయోజనమేమి?" అనెను.

వెంటనే సాత్యకి పదునైన ఖడ్గమునెత్తి సంజయుని చంపుటకు ఉద్యుక్తుడయ్యెను. అదే సమయమున శ్రీకృష్ణద్వైపాయన మహర్షి వచ్చి "సంజయుని సజీవముగ వదిలిపెట్టుము. ఇతడు వధ యోగ్యుడు గాదు" అనెను. సాత్యకి చేతులు జోడించి వ్యాసమహర్షి వచనములనాదరించి "సంజయా! యథేచ్ఛగా నీ అభీష్ట సాధన చేసికొనుము"అని ఆజ్ఞాపించెను. సంజయుడు తక్షణమే కవచమును వదిలి అస్త్ర శస్త్ర రహితుడై సాయంకాల సమయములో హస్తినాపురమువైపు బయలుదేరెను. ఒక క్రోసుడు దూరము వెడలిన పిమ్మట దుర్యోధనుడొకచోట నిలిచియుండుట జూచెను. క్షతవిక్షతుడై యున్న దుర్యోధనుడు కనులనిండ నీరునింపుకొని దుఃఖశోకములో మునిగి రెండు ఘడియలు ఏమియూ పలుకక మౌనమువహించెను. పిమ్మట కరస్పర్శ చేయుచు "సంజయా! ఈ సంగ్రామములో నీవుతప్ప నాకు ఆత్మీయజనులెవరూ జీవించియుండలేదు. నీవు మా తండ్రిగారివద్దకుపోయి నేను జీవనముతో బయట పడి జలభరితమైన సరోవరములో దాగుంటిననియు, దేహము నిండుగా గాయము లున్నవనియు, పరాక్రమవంతులగు సుహృదులను, పుత్రులను, తమ్ములను కోల్పోయి సరోవరప్రవేశము చేసితినని చెప్పుము. ఇట్టి దయనీయ స్థితిలో నావంటివాడు ఎటుల జీవించియుండ గలుగును?" అని పలికి సరోవర జలములో ప్రవేశించి జలస్తంభనము గావించెను. సంజయుడు మరికాస్త దూరమున కేగినంతనే అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మల రక్తసిక్తదేహములతో, అశ్వవాహనములలో అలసి సొలసి అగుపడిరి. సంజయుని ద్వారా దుర్యోధనుడు గుప్తముగా దాగిన విషయమునెరిగి సరోవరము చెంతకేగి కరుణాక్రందనలు జరిపిరి. అంతలో పాండవులు ఆ దిశగా వచ్చుట గమనించి దూరముగాపోయి దాగుకొనిరి. కౌరవ శిబిరములలో రాజవంశ స్త్రీల ఆర్తనాదములు మిన్నుముట్టినవి. వారు తమ దేహములను గోళ్ళతో గీరుకొనుచు, చేతులతో తలలు బాదుకొనుచు, రొమ్ముపై ఆఘాతములు చేసుకొనుచు, కేశపాశములను విరబోసుకుని రోదించసాగిరి. దుర్యోధనుని మంత్రిమండలి రాజవంశ మహిళలను తోడ్కొని హస్తినాపురమువైపు కదిలిరి.

పూర్వము రాజమహాలుకు మాత్రమే పరిమితమై సూర్యదేవునికూడ దర్శించని రాణివాస స్త్రీలు హస్తినాపురమువైపు పయనించుట సాధారణ జనులుకూడ దర్శించసాగిరి. యుయుత్సుడపుడు యుధిష్ఠిరునికడకేగి కౌరవ స్త్రీలతోబాటు తాను హస్తినాపురమునకు పోవ అనుజ్ఞనడిగెను. రాజ మహిళలను అంతఃపురములో చేర్చి విదురుని చెంతకేగి ప్రణమిల్లెను. విదురుడు అతని ఆగమనమును ప్రశంసించి "పుత్రా! ఈ అవస్థలో నీవు మాత్రమే ధృతరాష్ట్ర మహారాజునకు సహాయకునిగా బ్రతికియుంటివి.'' అని రాజమహాలులోనికి గొనిపోయెను. యుయుత్సుడు ఆ రాత్రిసమయమున తన గృహమునందే గడిపెను. ఆయన దుఃఖముతో ఉద్విగ్నుడై భరతవంశ ఘోరవినాశనమును గురించి ఆలోచించుచు దిగులొందెను. శత్రుశేషముగ మిగిలిన దుర్యోధనుని వధించుటకు పాండవులు అన్వేషించి అతని జాడతెలియక తమ శిబిరములకు మరలిరి. అదేసమయమున కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామలు దుర్యోధనుడు దాగియున్న సరోవరము చెంతకేగి "నరేశ్వరా! లెమ్ము మాతోగలిసి యుధిష్ఠిరునితో యుద్ధము చేయుము. నీవు కూడ పాండవుల సప్త అక్షౌహిణీ సైన్యమును హతమార్చితివి. కొద్దిపాటి సైన్యము, మహారథులు మాత్రమే మిగిలియుండిరి. వీరుకూడ బాగా గాయపడియుండిరి. నీవు మాద్వారా సురక్షితుడవై పాండవసైన్యము నాక్రమించుము. విజయముతో యీ పృథివీరాజ్యమును భోగించుము. మృత్యువశుడవైనచో వీరస్వర్గము నలరించుము" అనిరి.

అందుకు దుర్యోధనుడు వారితో "వీరులారా! మీకు నాపై అపారమగు ప్రేమయున్నది. మీ ముగ్గురు వీరులు సజీవులైయుండుట నా సౌభాగ్యమనుకొందును. మనందరము కాస్త విశ్రాంతిచెంది అలసట దూరమొనర్చుకొనినచో అవశ్యము విజయశీలుర మయ్యెదము."అనెను. వారిటుల సంభాషించుచుండగా కొందరు వేటగాండ్రు ఆ మార్గమున పోవుచు వేటభారమును మోయుచు నీరు త్రాగుటకై సరోవరము చెంత ఆగిరి. ఒకింత గుట్టుగా నిలిచి అచట జరుగుచున్న సంభాషణ నాలకించిరి. వ్యాధులకు దుర్యోధనుడు ఆ సరో వరములో దాగెనని అవగతమయ్యెను. అంతకు ముందుగనే పాండుపుత్రులు దుర్యోధనుని గురించి అన్వేషించుచు తమతో సమాచారమునడిగిరి. అందుచే వ్యాధులు తమలోతాము గుసగుసలాడుచు దుర్యోధనుని సమాచారమును యుధిష్ఠిరునకు చెప్పినచో మంచి ధనబహుమానము లభించునని ఆశించిరి. తక్షణమే వారు పాండవ శిబిరములనేగి భీమసేనునకు ఆ విషయమును నివేదించి ధన బహుమానమును పొంది వెడలిపోయిరి. భీమసేనునిద్వారా యుధిష్ఠిరుడు విషయమును తెలుసుకొని శ్రీకృష్ణభగవానుని ముందిడుకొని ద్వైపాయహ్లద తటాకమునకు బయలుదేరెను. యుధిష్ఠిరుని సైన్యము యొక్క కోలాహల ధ్వని నాలకించిన కృతవర్మ, కృపాచార్య, అశ్వత్థామలు "రాజా! విజయోల్లాసకులై పాండవులు ఆనందముతో యీ సరోవరము చెంతకు వచ్చుచున్నారు. మేమిచటనుండి దూరముగా వెడలిపోయెదము. అనుజ్ఞనిమ్ము" అనిరి. దుర్యోధనుడు "తథాస్తు"అని పలికెను.

సరోవర జలములను మాయద్వారా మరల స్తంభితమొనర్చెను. తదనంతరము యుధిష్ఠిరాదులు తటాకమును చేరినంతనే శ్రీకృష్ణభగవానుడు క్రియాత్మక ఉపాయములతో మాయను మాయతో నశింప జేయునటుల జలగర్భమునందున్న దుర్యోధనుని వధించమని అనేకమంది పూర్వపురుషుల ఉదాహరణల నిచ్చెను. అయిననూ యుధిష్ఠిరుడు సావధానముగా అనేక యుక్తియుక్త వచనములతో జలస్థితుడైన దుర్యోధనుని ద్వంద్వ యుద్ధమునకు లేచిరమ్మని (32, 33, 34 అధ్యాయము) కవ్వించెను. దుర్యోధనునితో ద్వంద్వయుద్ధమునకు భీమసేనుడు ఉత్సుకత

ప్రదర్శించెను. ఆ సమయమున తీర్థయాత్రా సంచారమునందున్న బలరామదేవునకు భీమసేన దుర్యోధనుల గదాయుద్ధవార్త దెలిసి వేవేగ ద్వైపాయనహ్లదము చెంతకువచ్చెను. గదాయుద్ధ నేర్పరులగు దుర్యోధన భీమసేనులు యిరువురు తమగురువు బలరామదేవునకు నమస్కరించి యుద్ధమునారంభించిరి. సమంతపంచక తీర్థములో భీమదుర్యోధనులు గదాయుద్ధము ఏర్పాటు చేయబడెను. ముల్లోకములలోను పరమపుణ్యతమ మగు యీ సనాతన తీర్థములో యుద్ధముచేసి మృతుడైనవాడు నిశ్చయముగ స్వర్గలోకమునకేగును" అని బలరామదేవుడు పలికెను. శక్తిశాలి దుర్యోధనుడు ప్రసన్నచిత్తముతో గదను చేతపట్టి క్రోధముతో కనులెఱ్ఱజేసి దీర్ఘముగా శ్వాసలుదీయుచు ఒక ఏనుగు మరొక ఏనుగును కవ్వించునటుల భీమసేనునివంక జూచెను. భీమసేనుడు కూడ వనములో ఒక సింహము మరొక సింహమును గర్జనతో పిలుచునటుల దుర్యోధనుని కవ్వించసాగెను. ఆ యిరువురు దున్సహవీరులు ఒకరినొకరు కఠోరవచనములతో దూషించుకొనుచు బరిలోనికి దూకిరి. నరేశ్వరులెల్లరు బలరామ శ్రీకృష్ణులతోబాటు నక్షత్రములవలె వారివారి అనుకూల ప్రదేశములందు ఆసీనులై భీమదుర్యోధనుల పోరు తిలకించసాగిరి. కొద్దిసమయము వారిరువురు వాగ్యుద్ధము జరిపిన పిమ్మట గొప్పవేగముతో ముందుకు కదిలి కొమ్ములతో ఢీకొను ఆబోతులవలె తమగదలతో కలియబడిరి. వారి గదా ప్రహారముల శబ్దము పిడుగులవలె భయంకరముగ నుండెను. వారి గదాఘాతములకు నిప్పురవ్వలు ఎగియుచున్నవి. ఆ నిప్పురవ్వలు ఆకాశములో ఎగురు మిణుగురుల సమూహమువలె దర్శనీయమగుచున్నవి. వారిరువురు శత్రుప్రహారములనుండి రక్షించుకొనుచు విపక్ష ప్రహారములను వ్యర్థమొనర్చుచు కుడి ఎడమలకు యిటునటు తిరుగుచుండిరి. ఒకప్పుడు శీఘ్రముగా ఒకరు యింకొకరి సమక్షమునకు పోవుదురు. ఒకప్పుడు విరోధిని గదాప్రహారముతో తిరగద్రోయుటకు ప్రయత్నించెదరు. ఒకప్పుడు అచలురై స్థిరభావముతో నిలిచెదరు. ఒకప్పుడు క్రిందపడి పైకిలేచుచున్న శత్రువుతో తలపడెదరు. ఒకప్పుడు దగ్గరగా పోయి గదాప్రహారము చేయుదురు. నానాప్రకార పద్ధతులు, భిన్నభిన్న మండలములతో తిరుగుచున్న దుర్యోధనుడు ఆ సమయమున భీమసేనుని కన్న అధికముగా శోభిల్లెను. దుర్యోధనుడు తన మనస్సులో దృఢనిశ్చయ మొనర్చుకొని ఎడమ ప్రక్కగా తిరుగుచు తన భయంకర వేగశాలి గదతో భీమసేనుని మస్తకముపై ప్రహార మొనర్చెను. భీమసేనుడందులకు పీడితుడైననూ విచలితుడుగానుండెను.

తదనంతరము శత్రుసూదనుడగు భీమసేనుడు బలపరాక్రమములతో వజ్రతుల్య వీరఘాతిని గదతో దుర్యోధనునిగొట్టెను. అందుకు దుర్యోధనుని దేహము నుగ్గునుగ్గు అయ్యెను. అతడు శాలవృక్షమువలె కంపించి నేలపైపడెను. కాని అంతలోనే తేరుకొని ఒక శిక్షిత యోధునివలె చరించుచు భీమసేనునిపై గదాప్రహారము చేసెను. ఆ దెబ్బకు భీమసేనుని శరీరము శిథిలమయ్యెను. భీమసేనుడు ఆ దెబ్బకు నేలపై చతికిలబడుట జూచిన దుర్యోధనుడు సింహమువలె గర్జించెను. భీమసేనుని సుదృఢకవచముకూడ ఛిన్నాభిన్నమయ్యెను. భీమసేనుడు బలవంతముగ తననుతాను సంబాళించు కొనుచు ధైర్యమువహించి కనులు తెరిచి మరల యుద్ధసన్నద్ధుడయ్యెను. భీమసేనదుర్యోధనుల నడుమ భీషణమగు యుద్ధము ఉద్ధృతమగుచుండగా అర్జునుడు శ్రీకృష్ణభగవానునితో "జనార్దనా! నీ ఉద్దేశ్యములో యీ యిరువురి వీరులలో ఎవరు గొప్పవారు? ఎవరిలో గుణాధిక్యతయున్నది"అని ప్రశ్నించెను. అందుకు వాసుదేవుడు "అర్జునా! వీరు యిరువురు ఒకవిధముగనే సుశిక్షితులయ్యిరి. భీమసేనుడు అధికబలవంతుడైనప్పటికి అభ్యాసములో - ప్రయత్నములో దుర్యోధనుడు అధికుడు. భీమసేనుడు ధర్మపూర్వకముగ యుద్ధముచేయుచున్నచో ఎన్నడూ గెలువడు. అన్యాయ

పూర్వకముగ యుద్ధముచేసినచో దుర్యోధనుడు వధించ బడును. పూర్వము దేవతలు మాయతోనే అసురలపై విజయమును సాధించిరి. దేవేంద్రుడు మాయతోనే వృత్రాసురుని తేజస్సును హరించెను. నాడు జూదసందర్భములో భీమసేనుడు ఒక ప్రతిజ్ఞచేసెను. యుద్ధములో దుర్యోధనుని రెండుతొడలను గదతో విరుగగొట్టెదనని శపథము చేసెను. ఇపుడా శపథమును సత్యమొనర్చుటకు ప్రయత్నించవలెను''అనెను. శ్రీకృష్ణభగవానుని వచనములనాలకించిన అర్జునుడు వెంటనే భీమసేనుడు చూచుండగా తన జంఘములను కొట్టుకొనెను. ఆ సంకేతమును గ్రహించిన భీమసేనుడు అలనాటి తన ప్రతిజ్ఞను స్మరించుకొనెను. భీమసేనుడు తన శత్రువును మోహితమొనర్చు విధముగ కుడిఎడమల గోమూత్రిక మండలములో సంచరించసాగెను. గదాయుద్ధ ప్రణాళిని బాగుగా ఎరిగిన దుర్యోధనుడుకూడ భీమసేనుని వధించు ఇచ్ఛతో విచిత్రగతులలో చరించెను. దుర్యోధన భీమసేనులు పలురీతుల పోరాడుచు రక్తసిక్తులయ్యిరి. రెండు ఘడియలు విశ్రాంతి చెంది మరల ఘోర యుద్ధము జరిపిరి. అర్జునుడు మరల సంకేతము నిచ్చుట దుర్యోధనుడు క్రీగంట జూచి తనపై భీమసేనుడు గదను విసురుట గమనించి తప్పుకొనెను. అపుడా గద వ్యర్థముగ నేలపైబడెను. దుర్యోధనుడు వేవేగ భీమసేనుని గొట్టెను. భీమసేనుని దేహమునుండి రక్తము ధారలై ప్రవహించి అతడు మూర్ఛిల్లెను. దుర్యోధనుడు అదిగ్రహించక తనపై భీమసేనుడు ఎదురుదాడి చేయుటకు నిలిచియుండె ననుకొనెను. రెండుఘడియలు గడిచినంతనే భీమసేనుడు తెప్పరిల్లెను. దుర్యోధనుడు వంచనాభినయముతో స్థిరముగా నిలబడినటుల యుండి వేగముగ పైకి ఎగురదలంచెను. భీమసేనుడు అదిగ్రహించెను. కనుక వంచనతో అడుగులవేయుచున్న దుర్యోధనుని గమనించుచు, దుర్యోధనుడు పైకి ఎగిరినంతనే సింహమువలె గర్జించుచు దుర్యోధనుని జంఘములపై గదా ప్రహారమును చేసెను. ఆ గద పిడుగువలె దుర్యోధనుని రెండు జంఘములను పగులుగొట్టెను. తక్షణమే దుర్యోధనుడు పృథివిని ప్రతిధ్వనింపజేయుచు నేలపైబడెను. దుర్యోధనుడు ధరాశాయియగుట జూచిన ఇంద్రుడు రక్తమిశ్రిత ధూళివర్షమును కురిపించెను. భీమసేనుడు కసిగా దుర్యోధనుని పూర్వకృత్యములను ఎత్తిజూపుచు దుర్భాషలాడుచు ఆయన శిరస్సును ఎడమపాదముతో త్రొక్కెను. యుధిష్ఠిరుడు వెంటనే కలుగజేసుకొని "భీమసేనా? నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటివి. విషయమును పెద్దదిచేయకుము. ధర్మోల్లంఘనము చేయుకుము'' అని వారించెను. అటులనే దుర్యోధనునికడకేగి "నాయనా! నీవు లోభముతో, మదమాత్సర్యములతో, అవివేకముతో చేసిన అపరాధముల ఫలితముగ గొప్ప సంకటపరిస్థితి ప్రాప్తించినది. నీవు నీ పుత్రులను, మిత్రులను, పితృతుల్య పురుషులను, పౌత్రులను కుటుంబజనులను వధకు గురిజేసితివి. ఇది దైవముయొక్క దుర్లంఘ్యవిధానమని అనుకొందును. నీవు నీ కొరకుకూడ దుఃఖించపనిలేదు. ప్రశంసనీయ మృత్యువే జరుగుచున్నది." అని పలికెను. బలరామ దేవుడు ఆ గదా యుద్ధములో భీమసేనుని ధర్మోల్లంఘన గదాప్రహారమును ఖండించెను. శ్రీకృష్ణుడు భీమసేనుని పూర్వప్రతిజ్ఞను, మైత్రేయమహర్షి దుర్యోధనునకు యిచ్చిన శాపమును చెప్పి శాంతింపచేయ ప్రయత్నించెను. తదనంతరము దుర్యోధనుడు పరుష పదజాలముతో శ్రీకృష్ణుని నిందించెను. అందులకు సమాధానముగ శ్రీకృష్ణుడు దుర్యోధనుని దుశ్చేష్టలుచెప్పి ఆక్షేపించెను. కాని దుర్యోధనుడు తన జీవితమును సఫలమొనర్చుకొన్న విధమును, తనకు లభించిన ఉత్కృష్ట అంతమును శ్లాఘించుకొనెను. శ్రీకృష్ణుడు ఆ మహాసమరములో జరిగిన కొన్ని అధర్మకార్యములు పలువిధముల సమర్థించుచు పాండవుల మనస్సును స్థిమితపరచెను. పాండవులు కౌరవుల శిబిరములకేగి

ధనరాసులను జాగ్రత్తపరచిరి. గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చి సమాధానపరచుటకై శ్రీకృష్ణుని హస్తినాపురమునకు పంపించిరి. జంఘములు విరిగి నేలపై పడియున్న కురురాజు దరికి సంజయుడు వెడలెను. సంజయుని చూచినంతనే దుర్యోధనుడు తనరెండు భుజములతో నేలనురాసి మదోన్మత్త గజరాజువలె తలపైనున్న కేశములను విదిల్చెను. దంతములతో దంతములను కొరుకుచు పటపట శబ్దముచేయుచు యుధిష్ఠిరుని పరుషవచనములతో నిందించుచు గట్టిగా ఊపిరి పీల్చుకొని యిట్లనెను. ''సంజయా! నిశ్చయముగా కాలగతినెవరూ ఉల్లంఘించలేరు. నేనొకప్పుడు పదునొకండు అక్షౌహిణీల సైన్యమునకు స్వామిని. నేడిట్టిదశలో పడియుంటిని. నా పక్షములో సజీవులై యున్న యోధులతో భీమసేనుడు గదాయుద్ధములో నన్ను పడగొట్టిన అన్యాయపు రీతిని దెల్పుము. పాండవులు యీ విధముగనే భూరిశ్రవుడు, కర్ణుడు, భీష్ముడు, ద్రోణాచార్యుల వధలోకూడ క్రూరముగ వ్యవహరించిరి. తమకు అపకీర్తితెచ్చు కర్మలుచేసిరి. అందుచే వీరు సాధుపురుషుల సభలో పశ్చాత్తాపము చెందెదరని నా విశ్వాసము. పాపాత్ముడగు భీమసేనుడు నన్ను అన్యాయముగా పడగొట్టికూడ కుపితుడై నా మస్తకమును ఎడమపాదముతో తన్నెను. నేను యజ్ఞములు చేసితిని. భరణపోషణ యోగ్యులగు వారిని పోషించితిని. సముద్రపర్యంత భూమిని శాసించితిని. సజీవ శత్రువు మస్తకముపై పాదముపెట్టి నొక్కితిని. యథాశక్తి దానముచేసితిని. మిత్రులకు ప్రియము గూర్చితిని. శత్రువులకు క్లేశము కలిగించితిని. నా ఆజ్ఞాధీనులైనవారిని సత్కరించితిని, ధర్మార్థకామములను సేవించితిని. పెద్దపెద్ద రాజులను శాసించితిని. అత్యంత దుర్లభమగు సన్మానములు పొందితిని. నాకన్న మంచి అంతమును యింకెవరు పొందగలరు''అనెను. దుర్యోధనుడు పడగొట్టబడెనని వార్తాహరులద్వారా తెలుసుకొన్న అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు వేవేగ దుర్యోధనుని దైన్యస్థితిని దర్శించి విధిబలీయమని సాంత్వన పలికిరి. దుర్యోధనుడు రెండుచేతులతో అశ్రువులు తుడుచుకొని "మర్త్యలోక ధర్మము యిటులే యుండుననియు, సంపూర్ణ ప్రాణిజాతము ఏదోఒకరోజు వినాశమును పొందుచునే యుండు ననియు పలికెను. దుర్యోధనుడు కన్నీరుగార్చుట జూచిన అశ్వత్థామ ప్రళయకాలాగ్నివలె క్రోధ ప్రజ్వలితుడై "కురురాజా! నీచ పాండవులు అత్యంత క్రూరతాపూర్ణకర్మల ద్వారా నా తండ్రి ద్రోణాచార్యుని వధించిరి. అందులకు నేను చింతించలేదు. కాని నేడు నీ వధ అనుచిత అన్యాయ రీతిలో జరిగినదని విని చాల కష్టము కలుగుచున్నది. "ప్రభూ! నేను సత్య శపథము చేయుచుంటిని. నా ఇష్టాపూర్త దానధర్మ తదితర శుభకర్మలపై శపథమొనర్చి ప్రతిజ్ఞ చేయుచున్నాను. శ్రీకృష్ణుని సమక్షమునందే సంపూర్ణ పాంచాలురను సమస్త ఉపాయములద్వారా యమసదనమునకు బంపెదను. అందులకు నీవు నాకు ఆజ్ఞనొసంగుము"అనెను. ద్రోణపుత్రుని వచనములకు సంప్రీతిచెందిన దుర్యోధనుడు కృపాచార్యునితో "ఆచార్యా! మీరు శీఘ్రమే స్వచ్ఛజల పూర్ణకలశమును గొనితెచ్చి యీ ద్రోణపుత్రుని సేనాపతిపదముపై అభిషేకించుడు"అనెను. అటుల అభిషేకించబడినంతనే అశ్వత్థామ నృపశ్రేష్ఠుడగు దుర్యోధనుని హృదయాలింగన మొనర్చుకొని సంపూర్ణ దిశలు ప్రతిధ్వనించునటుల గర్జనచేసి అచటనుండి కృతవర్మ – కృపాచార్యులతోగూడి వెడలిపోయెను.

తీర్థయాత్రా విశేషములు (ఉపాఖ్యానములు)

శల్యపర్వములో 36వ అధ్యాయము ప్రభాస తీర్థమునుండి ఏబదినాల్గవ అధ్యాయము కురుక్షేత్ర మహిమవరకు పుణ్యతీర్థములు – పుణ్యతీర్థముల విస్తృత వర్ణన యున్నది. మహాభారత సంగ్రామము ఆరంభమునకు పూర్వమే బలరామదేవుడు వృష్ణి

వంశజులతోగూడి తీర్థయాత్రకుపోవ నిశ్చయించు కొనెను. ఆయన శ్రీకృష్ణునితో "కేశవా! నేను ధృతరాష్ట్రుని పుత్రుడగు దుర్యోధనునకుగాని, పాండవులకుగాని సహాయము చేయను"అని చెప్పి వెడలిపోయెను. నలుబదైదు దినములు గడిచిన పిమ్మట తీర్థయాత్రలు ముగించుకొని భీమసేన దుర్యోధనుల గదాయుద్ధమును వీక్షించెను. బల రామదేవుడు సరస్వతీ తటస్థిత తీర్థములను దర్శించనెంచి ముందుగా కురుక్షేత్రముతో ప్రారంభించెను. ప్రభాసతీర్థ చర్చ సందర్భమున చంద్రునకు దక్షప్రజాపతిద్వారా శాపము, ఆ శాపమునుండి రుద్రారాధనతో విముక్తుడగుట చెప్పబడినది. ఉదపాన తీర్థము గురించి వర్ణించి నపుడు త్రితముని ఉపాఖ్యానము చెప్పబడెను. వినశన, సుభూమిక, గర్గస్రోత, శంఖ, ద్వైతవన, నైమిషీయాది సరస్వతీ తట తీర్థములన్నిటియందును ప్రత్యేక విశేషములు ముప్పదిఎనిమిదవ అధ్యాయములో చెప్పబడినవి. సరస్వతీనది ఏఏ సందర్భములలో ఎవరెవరి ప్రార్థనచే ప్రభవించెనో వానిని సుప్రభా, కాంచనాక్షి, విశాలా, మనోరమా, రేఘవతీ, సురేణు, విమలోదకా యని పిలిచిరి. ఈ ఏడు సరస్వతులు ఒకటైవచ్చిన తీర్థమే సప్త సారస్వతము. ఇచట మంకణమహర్షి చరిత్ర వర్ణించ బడినది. నలుబదవ అధ్యాయములో ఔశనస, కపాలమోచన, ఋషంగక ఆశ్రమము, పృథూదక తీర్థముల మహిమ అద్భుతముగ వర్ణించబడినది. శుక్రాచార్యుడు తపస్సుచేసి నీతిశాస్త్రమును రచించిన ప్రదేశము ఔశనస తీర్థము. బ్రహ్మదేవుడు జగత్సృష్టిని పృథూదక తీర్థమునందే చేసెను. ఇచటనే కఠోర వ్రతములతో అర్ష్టిషేణుడు, రాజర్షి సింధుద్వీపుడు, మహాతపస్వి దేవాపి, ఉగ్రతేజస్వి విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వమును పొందిరి. వసిష్ఠాపవాహ తీర్థములో సరస్వతీనది వేగము తీవ్రమెటులయ్యెనో చక్కని ఉపాఖ్యానము నలుబదిమూడవ అధ్యాయములో నున్నది. సరస్వతీనదికి విశ్వామిత్రుని శాపము, ఆ శాపనివృత్తికై తపస్వుల ప్రయత్నము నలుబది నాల్గవ అధ్యాయము నందున్నది. స్కందుని దేవసేనాపతిగ అభిషేకించిన సరస్వతీ తీర్థపుణ్య ప్రదేశ చర్చ సందర్భముగా స్కందుని జననము ఆదిగా దేవసేనాపతి అభిషేకమువరకు నలుబదైదవ అధ్యాయమునుండి నలుబదేడవ అధ్యాయమువరకు వర్ణించబడినది. బదరిపాచన తీర్థము, వరుణదేవుని సరితలకు అధిపతిగ అభిషేకించుట, ఇంద్ర – రామ – యమున – ఆదిత్య తీర్థముల మహిమ 48, 49, 50 అధ్యాయము లలో వర్ణించబడినది. ఆదిత్యతీర్థ మహిమ సందర్భములో అసితదేవల, జైగీషవ్యుల దివ్యచరిత్ర వివరించబడినది. దధీచి, సారస్వత మునుల వృత్తాంతము ఏబదిరెండవ ఆధ్యాయములో వర్ణించబడినది. దధీచి దేవతల కార్యముకొరకు ప్రాణత్యాగము చేయుటచే ఆయన అస్థికలతో దేవేంద్రుడు వజ్రాయుధమును నిర్మించుకొనెను. ఒకప్పుడు వేదములు లుప్తముకాగా సారస్వతముని వేలకొలది బ్రాహ్మణులకు మరల వేదజ్ఞానము గలుగునటుల చేసెను. కురుక్షేత్రములో మరణించు వారు పాపరహితులై పుణ్యలోకముల కేగుదురు. మనుష్యులు – పశుపక్ష్యాదులు అచట నిరాహారులై లేదా యుద్ధములో మరణించినచో స్వర్గము పొందునటుల దేవేంద్రుడు కురుమహారాజునకు వరమునిచ్చెను. అందుచే కురుక్షేత్రము పవిత్ర మహిమాన్విత తీర్థముగ లోకవిఖ్యాతి చెందినది. కురుక్షేత్రములో వంద పవిత్రతీర్థము లున్నవి. అందుచే కురుక్షేత్రమును స్మరించినంత మాత్రమున మానవులకు పాపములు నశించి పవిత్రులగుదురు.

ॐ

సౌప్తిక పర్వము

సౌప్తిక పర్వము - సంగ్రహ పరిచయము

కథాంశము: సౌప్తికపర్వములో కేవలము పదునెనిమిది అధ్యాయములున్నవి. అశ్వత్థామ సేనాపతి పదముపై అభిషిక్తుడైన పిమ్మట కృపాచార్య, కృతవర్మలతోగూడి దక్షిణదిశగా పోయి శత్రువులకు తమ జాడ తెలియకుండుటకై వనాంతరములలోనికి ప్రవేశించి శిబిరములకు కొద్దిదూరములోనే విశ్రమించిరి. దుర్యోధనుడు ధరాశాయియగుటచే దుఃఖితులైన ఆ వీరులు ముప్పురు ఒక ముహూర్తకాలము మౌనము దాల్చిరి. కృపాచార్య, కృతవర్మలు మెల్లగా నిదురలోనికి జారుకొనిరి. అశ్వత్థామకు నిదురపట్టక యుండెను. అతడు తాము కూర్చునియున్న వటవృక్షముపైనున్న కాకుల గుంపుపై దృష్టి సారించెను. వేలకొలది కాకులు తమ గూళ్ళ నాశ్రయించి సేదదీరుచున్నవి. ఇంతలో అకస్మాత్తుగ ఒక భయానక గుడ్లగూబవచ్చి వటవృక్ష శాఖను ఆక్రమణచేసి నిదురపోవుచున్న అనేక కాకులను వధించెను. తన కాలిపంజాలతో కొన్ని కాకుల శిరస్సులను విరిచెను. కొన్నికాకుల పాదము లను త్రుంచెను. తనకు చిక్కిన లేదా ఎదుర్కొన్న కాకులన్నిటిని క్షణకాలములో సంహరించెను. ఆ కపటపూర్ణ కర్మను జూచి స్వయముగా తానుకూడ పాంచాలురపై అటుల చేయుటకు అశ్వత్థామ నిశ్చయించు కొనెను. న్యాయానుసారము వారితో యుద్ధము చేసినచో తన ప్రాణములకు ముప్పువచ్చును. కాని దుర్యోధనుని చెంత తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చదలంచినచో వంచనతోనే సాధ్యమగునని తలంచెను. నిదురుబోవుచున్న కృతవర్మ - కృపాచార్యులను మేల్కొలిపి తన నిర్ణయమును చెప్పెను. అపుడు కృపాచార్యుడు "మేనల్లుడా! ప్రతిమానవుడు ప్రారబ్ధము - పురుషార్థము యను రెండు విధములగు కర్మలకు బద్ధుడైయుండును. ఈ రెండు తప్ప వేరొకటిలేదు. దైవము లేదా ప్రారబ్ధము లేకున్నచో పురుషార్థ మొక్కటియే కార్యసిద్ధిని గూర్చుననుటకు వీలులేదు. ఆ రెండిటి సంయోగము తోనే కార్యసిద్ధియగును. ప్రతిదినము ప్రొద్దున లేచి వృద్ధజనులను సన్మానించుచు తనకు హితము గూర్చు విషయములను చర్చించువానికి అప్రాప్తమగు వస్తుప్రాప్తికి తగు ఉపాయములు లభించును. మానవులు మోహవశులైనచో హితాహిత నిర్ణయములు తీసుకొనుటకు అసమర్థులగుదురు. వృద్ధ పురుషుల వచనములనాలకించి కార్యముల నాచరించువారికి ఉత్తమ ఫలములు ప్రాప్తించును. మన హితైషుల నడిగినచో కార్యముయొక్క మూలకారణమును నిశ్చయించి తగు సలహా నిచ్చెదరు. కృపాచార్యుని వచనములు ధర్మార్థ యుక్తములు, మంగళకరములైనను అశ్వత్థామకు నచ్చకుండెను. రాత్రి సమయమున సుస్థిరచిత్తముతో నిదురించుచున్న పాంచాలుర శిబిరములో దూరి వారందరిని సంహరించుటకు నిశ్చయించుకొనెను. నిదురపోవుచున్న వారిని వధించరాదని కృపాచార్యుడు పదేపదే పలుకుచున్ననూ అశ్వత్థామ తన నిశ్చయమును మార్చుకొనకయుండెను. తదనంతరము ఆ ముప్పురు యోధులు పాంచాలుర శిబిరముల చెంతకేగిరి. శిబిరద్వారము చెంత అశ్వత్థామ నిలిచెను. కాని అతనికి విశాలకాయుడగు మహాపురుషుడు వ్యాఘ్రచర్మాంబర ధారియై అడ్డుగా నిలిచెను. ఆ అద్భుత పురుషునిపై అశ్వత్థామ దివ్యాస్త్రములను వర్షించెను. కాని అతడు ఆ దివ్యాస్త్రముల నన్నిటిని మ్రింగివేసెను. ఖడ్గము ప్రయోగించిన ఖడ్గము కూడ ఆ మహా పురుషునిలో విలీన మయ్యెను. ఇంద్రధ్వజమువంటి గదా యుద్ధమును ప్రయోగించగ అదికూడ మహాభూతములో

విలీనమయ్యెను. ఆ సమయమున అశ్వత్థామకు ఆకాశము అసంఖ్యాక విష్ణుస్వరూపము లతో నిండినటుల అగుపడెను. తక్షణమే తనకు కృపాచార్యుని హితవచనములు స్మరణకు వచ్చెను. సుహృదుల వచనములను పెడచెవి పెట్టినచో విపత్తులలో చిక్కుకొనెదరని తలంచెను. ఇట్టి సంకటపరిస్థితిలో దైవానుకూలమును పొందుటయే మార్గమని ఎంచి సర్వవ్యాపకుడగు శంకరభగవానుని శరణుజొచ్చెను. పది శ్లోకములతో శివభగవానుని స్తుతించెను. శంకరభగవానుడు తన పార్షదులతో గూడి ప్రత్యక్ష మయ్యెను. అపుడు శంకరభగవానుడు అశ్వత్థామతో "మానవా! శ్రీకృష్ణుడు సత్య, శౌచ, సరళ, త్యాగ, తప, నియత, క్షమ, భక్తి, ధైర్య, బుద్ధి, వాక్కు మున్నగు శుద్ధ భావములతో నన్ను ఆరాధించెను. ఆయనకంటె నాకు ప్రియమైనవారు లేరు. నేనాయనను గౌరవించుటకు, నిన్ను పరీక్షించుటకు రక్షగా నిలిచితిని. పాంచాలురను రక్షించి శ్రీకృష్ణుని సన్మానించితిని. కాని పాంచాలురు కాలపరాజితులైరని గ్రహించితిని. వారికి జీవన శేషము లేకున్నది."అని పలికి శివ భగవానుడు తన స్వరూపమును అశ్వత్థామలో ప్రవేశింపజేసి ఒక నిర్మల ఖడ్గము నిచ్చెను. రుద్రావేశముపొందిన అశ్వత్థామ అత్యంత తేజస్వి అయ్యెను. అశ్వత్థామతోబాటు అనేకమంది అదృశ్య భూత రాక్షస గణములు కూడ శిబిరముల వైపు దౌడుతీసిరి. అశ్వత్థామ మున్ముందుగా ధృష్టద్యుమ్నుని తనకాలిమడమలతో నొక్కి ఉక్కిరిబిక్కిరి చేసి వధించెను. ధృష్టద్యుమ్నుని స్త్రీలు, రక్షకులు గగ్గోలుచేయగా దరిదాపుల శిబిరములనుండి యోధులు కవచధారులై వచ్చిరి. అశ్వత్థామ వారందరిని ఖడ్గముతో తెగటార్చెను. రుద్రప్రదత్తమైన ఖడ్గముతో గుఱ్ఱములను, ఏనుగులను కూడ ఖండఖండములు గావించెను. ద్రౌపదేయులను ఆక్రమించి ఖడ్గముతో ఛిన్నాభిన్న మొనర్చి వధించెను. అశ్వత్థామ ఒక్కడే సమస్త పాంచాలురను, పాండవ సైన్యమును వివీర్ణమొనర్చెను. ప్రళయకాలములో క్రోధితుడైన రుద్రదేవుడు సమస్త ప్రాణులను సంహారమొనర్చు రీతిని కుపితుడైన అశ్వత్థామ ఏ ప్రాణిని వదిలిపెట్టలేదు. కృపాచార్య – కృతవర్మలు కూడ తాము శిబిరద్వారముల చెంతనే యుండి బయల్పడిన అనేకమంది పాంచాల – సృంజయ వీరులను ఖండఖండములు గావించిన సంతోష సమాచారమును అశ్వత్థామకు దెలిపిరి. అశ్వత్థామ ఆనందముతో "పాంచాలురు, ద్రౌపదేయులు, సోమకవంశ క్షత్రియులు, మత్స్యదేశ అవశిష్ట సైనికులు మొత్తము నా చేతిలో చచ్చిరి. మనమిపుడు కృతకృత్యులమైతిమి. మన రాజు దుర్యోధనుడు జీవించియున్నచో యీ సమాచారమును వినిపించెదము" అనెను. అశ్వత్థామ చేసిన ఘన కార్యము దుర్యోధనుడు మెచ్చుకుని ప్రాణములు వదిలి శాశ్వతముగ నిదురపోయెను. దుర్యోధనుడు స్వర్గస్థుడైనంతనే సంజయునకు వ్యాసమహర్షి యిచ్చిన దివ్యదృష్టికూడ నశించినది. ధృష్టద్యుమ్నుని సారథి యుధిష్ఠిరుని కడకేగి రాత్రి నిద్రావస్థలో జరిగిన మారణసంహార సమాచారము నంతయు వివరించెను. యుధిష్ఠిరుడు శోకసంతప్తుడై శత్రువులిపుడు ఓడి గెలిచితిరి, మేము గెలిచి ఓడిపోయితిమని భోరున విలపించెను. సమృద్ధిశీలి వ్యాపారులు సముద్రములు దాటి మంచి వ్యాపారము చేసి తిరిగివచ్చుచు నదుల పిల్లకాలువలలో మునిగి మరణించినట్లు తమ పరిస్థితి యున్నదని పరితపించెను. ద్రౌపదేయులు మృతి గురించి ద్రౌపదిదేవి శోకసముద్రములో మునుగునని చింతిల్లసాగెను. పాండవులకు పుత్రసంతతి పూర్తిగా నశించినందులకు ఆమె సంతప్తము చెందుచు "పాండవులారా! అశ్వత్థామ తన పాపకర్మ ఫలితమును పొందకున్నచో నేను అవశ్యము ప్రాణమును త్యజించెదను."అనెను. అతడు వధించబడెనని తెలియుటకు అతని శిరస్సుపై జన్మసిద్ధముగనున్న మణిని తెమ్మనెను. భీమసేనుడు ఒంటరిగా అశ్వత్థామను వెంబడించుట జూచిన శ్రీకృష్ణుడు తక్షణమే యుధిష్ఠిర అర్జునులతో గలిసి భీమసేనుని రక్షణకై బయలుదేరెను. అప్పటికే భీమసేనుడు

క్రోధప్రజ్వలితుడై శత్రుసంహార ఉద్యుక్తుడైయుండెను. అశ్వత్థామ భాగీరథీ తీరముపై విశ్రమించి యుండెనని యుధిష్ఠిరాదులు ఎరిగిరి. భీమసేనుడు విల్లమ్ములు ధరించి వచ్చుట ఆయన వెనుకనే శ్రీకృష్ణుని రథముపై యుధిష్ఠిరార్జునులు కూర్చుని యుండట జూచిన అశ్వత్థామ హృదయములో భయమావహించెను. అతడు కలవరపాటుతో బ్రహ్మాస్త్ర మంత్రమును స్మరించి ఎడమచేతిలో దర్భపోచను పైకెత్తి "ఈ అస్త్రము సమస్త పాండవులను వినాశమొనర్చును గాక''అని కఠోరవచనము పలికెను. అపుడా అస్త్రమునుండి భయంకర అగ్ని వ్యక్తమై ముల్లోకములను భస్మమొనర్చునదై యుండెను. తక్షణమే శ్రీకృష్ణుని హితవు ప్రకారము అర్జునుడు కూడ పాండవ రక్షణకై బ్రహ్మాస్త్రమును ప్రయోగించి శత్రు బ్రహ్మాస్త్రము ఉపశమించుగాక"అనెను. ఆ రెండు అస్త్రముల తేజస్సుతో లోకములన్నియు సంతప్తముకాజొచ్చెను. అపుడు దేవర్షి నారదుడు – వేదవ్యాస మహర్షు లిరువురు ... అస్త్రములను శాంతింప జేయుటకు అశ్వత్థామ – అర్జునుల నడుమ వచ్చి నిలిచిరి. ఆ మహర్షులను చూచినదే తడవు గాండీవధారి అర్జునుడు చేతులు జోడించి సమయోచిత కర్తవ్యము నాలోచించి "మునివరులారా! శత్రువు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును శాంతింపజేయుటకు మాత్రమే నేను బ్రహ్మాస్త్రమును ప్రయోగించితిని. నేనిపుడు నా అస్త్రమును పూర్తిగ ఉపసంహరించినచో యీ పాపాత్ముడగు అశ్వత్థామ తన అస్త్రతేజస్సుతో మమ్ములను భస్మమొనర్చును. మీరిరువురు దేవతుల్యులు. ఈ సమయమున ఏ విధముగ చేసినచో మాకు సర్వదా హితము గలుగునో శెలవీయుడు"అనెను. ఈ ప్రకారము పలికి అర్జునుడు తన అస్త్రమును మెల్లగా వెనుకకు తీసుకొనెను. అశ్వత్థామకు బ్రహాస్త్ర ప్రయోగము తెలుసును. ఉపసంహారము తెలియదు. అతడు తన అసమర్థతను ఋషివర్యులకు దెలిపెను. ఆ అస్త్రమును పాండవుల గర్భిణీస్త్రీల గర్భములపై పడునటుల పలికి తన శిరస్సుపైనున్న మణిని పాండవులకు సమర్పించెను. శ్రీకృష్ణభగవానుడు అశ్వత్థామ యొక్క క్రూర కర్మకు కోపించి అతడు మూడువేల సంవత్సరములు మానవ లోకములో రోగపీడితుడై బాలహంతకుడను అపకీర్తితో బ్రతుకు నీడ్చునటుల శపించెను. దేవర్షి నారద, వేదవ్యాస మహర్షులు కూడ శ్రీకృష్ణుని శాపమును సమర్థించిరి. అశ్వత్థామ వనాంతరముల లోనికి పోయెను. అశ్వత్థామ బ్రాహ్మణుడు గావున ప్రాణములు తీయక, అతని యశస్సును బూడిదపాలుచేసి కేవలము అతని శిరోమణిని విజయచిహ్నముగ దెచ్చితిమని ద్రౌపదీదేవికి సమర్పించిరి. ఆమె కూడ గురుపుత్రుడు గురువుతో సమానుడని పలికి ఆ మణిని యుధిష్ఠిరుడు శిరస్సుపై ధరించుటకు యిచ్చివేసెను. ఆ మణిని ధరించినవానికి శస్త్ర – వ్యాధి – క్షుధా బాధలుండవు. దేవదానవ రాక్షస నాగ తదితర భయములుండవు.

ఓం

స్త్రీ పర్వము

స్త్రీ పర్వము - సంగ్రహ పరిచయము

స్త్రీ పర్వములో మొత్తము ఇరువదేడు అధ్యాయము లున్నవి. ఏడువందల డెబ్బదియైదు శ్లోకములున్నవి. ధృతరాష్ట్ర మహారాజు తన వందమంది పుత్రులు మృతిచెందుటచే సమస్త శాఖలు ఖండించబడిన వృక్షమువలె పుత్రశోక సంతప్తుడయ్యెను. సంజయుడు సాంత్వన వచనములతో ధృతరాష్ట్రుని ఓదార్చెను. తదనంతరము విదుర మహాశయుడు కూడ దేహము యొక్క అనిత్య స్థితిని, దుఃఖమయ సంసారమునుండి విముక్తిపొందు ఉపాయమును వివరించెను. అటులనే సంసారమునొక భయంకర వనముగా పేర్కొని, జ్ఞానాది ముక్తి ఉపాయములను ధృతరాష్ట్రునకు చెప్పి శోకోపశమనము చేయ ప్రయత్నించెను. అటుపిమ్మట వ్యాసమహర్షి ఏతెంచి ధృతరాష్ట్ర మహారాజును పరిపరి విధముల ఓదార్చెను. విదుర మహాశయుడు శోక నిరావరణోపాయములను ధృతరాష్ట్రునకు చెప్పెను.

ధృతరాష్ట్ర మహారాజు రణభూమికిపోయి మృత పుత్రులను, బంధువులను, సుహృదులను దర్శించనెంచెను. అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు ఆయనకు ఎదురుపడి తాముచేసిన మారణకాండను వివరించి, దుర్యోధనుని స్వర్గలోక గతి నెరింగించిరి. కృపాచార్యుడు హస్తినాపురమునకు, కృతవర్మ తన దేశమునకు, అశ్వత్థామ వ్యాసాశ్రమమునకు వెడలిపోయిరి. తదనంతరము పాండవ మహారథులు అశ్వత్థామను చేరి బలపూర్వకముగ పరాజితుని చేసిరి. వృద్ధుడగు ధృతరాష్ట్ర మహారాజు సంగ్రామములో మృతిచెందిన బంధువులకు, పుత్రులకు అంత్యేష్టి కర్మలొనర్చుటకు హస్తినా పురమునుండి బయలుదేరిన విషయము నెరిగిన యుధిష్ఠిరుడు అన్నదమ్ములతో గూడి పెదతండ్రిని గలియుటకు వెడలెను. ఆయనతోబాటు శ్రీకృష్ణభగవానుడు, సాత్యకి, యుయుత్సుడు కూడ అనుసరించిరి. అత్యంత దుఃఖాతురయై శుష్కించిన ద్రౌపదీదేవి కూడ పాంచాల మహిళలతో యుధిష్ఠిరుని అనుసరించెను. అచట పాండవులకు ప్రియాప్రియ జనులుండిరి. వారందరు చేతులుపైకెత్తి ఆర్తస్వరముతో కరుణాక్రందనలు చేయుచుండిరి. తదనంతరము పాండవులందరు ధర్మానుకూలముగ పెదతండ్రి చరణములకు నమస్కరించి తమతమ నామములు చెప్పుకొనిరి. పుత్రవధకు పీడితుడైయున్న ధృతరాష్ట్ర మహారాజు శోకవ్యాకులుడై యున్నను, తన పుత్రులను అంతమొందించిన పాండవుల పై క్రోధితుడై యున్ననూ, యుధిష్ఠిరుని ఆలింగనమొనర్చు కొనెను. తాను మనస్సులో అప్రసన్నుడై యున్నను యుధిష్ఠిరునకు సాంత్వవచనములు పలికెను. ఆయన క్రోధాగ్ని శోకరూప వాయువుతో వృద్ధిచెంది ఎపుడెపుడు భీమసేనుడనెడి వనమును దహించు నాయని ఉద్విగ్నమై యుండెను. అతని దుష్ట సంకల్పము నెరిగిన శ్రీకృష్ణ భగవానుడు ఒక్క ఉదుటున భీమసేనుని ప్రక్కకునెట్టి దుర్యోధనుడు ఇదివరలో తయారుచేయించిన భీమసేనుని లోహమయ విగ్రహమును తన రెండు బాహువులతో దెచ్చి ధృతరాష్ట్రుని ఎదుటనిలిపెను. బలవంతుడగు ధృతరాష్ట్ర మహారాజు ఆ లోహమయ విగ్రహమును భీమసేనునిగా దలంచి కౌగిలించుకొను నెపముతో తనరెండు బాహువుల నడుమ నలిపి నుగ్గునుగ్గు చేసెను. అందులకు ధృతారాష్ట్ర మహారాజు ఛాతి నుండి రక్తముగారెను. అతడు నోటినుండి రక్తవమనము జేయుచు మూర్ఛిల్లి నేలపై బడెను. పిమ్మట "హా భీమా! హా భీమా" ఎంతపని చేసితినని ఆక్రందన చేసెను. అపుడు శ్రీకృష్ణుడు "ధృతరాష్ట్ర మహారాజా! మీ చేతిలో

భీముడు హతముగాలేదు. మీరు నలిపి నలిపి నుగ్గుచేసినది భీమసేనుని లోహమయ విగ్రహమే సుమా! నీవు క్రోధివశీభూతుడవగుదువని ఎరింగి భీమసేనుని నీమృత్యుకోరల నుండి రక్షించుటకై ప్రక్కకు నెట్టి లోహమయ విగ్రహము నుంచితిని.''అని పలికి ధృతరాష్ట్రుని అన్యాయ కృత్యము లన్నిటిని చెప్పి తానిపుడు చేసిన కార్యము మరింత నీచమని దెలిపెను. ధృతరాష్ట్రుడు లజ్జితుడై శాంతించి భీమార్జున నకుల సహదేవులందరని అంగములతోన్స్పృశించి సాంత్వన పలికెను. యుధిష్ఠిరుదు– భీమసేనుదు గాంధార దేవి వద్దకు వెడలి క్షమాభిక్ష కోరిరి. ఆ సమయమున భీమసేనుదు "మాతా! దుర్యోధనుని వధ ధర్మమో – అధర్మమో నాకు తెలియదు. దుర్యోధనునకు భయపడి నా ప్రాణములను రక్షించుకొనుటకై అటులచేసితిని, మహా బలవంతుడగు నీ పుత్రునితో ఎవరైననూ ధర్మానుకూల యుద్ధముతో వధించుటకు సాహ సించరు. కనుక నేను విరుద్ధ ప్రవర్తనతో వధించితిని. పూర్వము అతడుకూడ యుధిష్ఠిర మహారాజును ద్యూతక్రీడలో మోసగించి జయించెను. మా పాండవులతో సదా కపటపూర్వకముగ వ్యవ హరించెను. అందుచేతనే నేను కూడ అతనితో అధర్మముగ వ్యవహరించితిని. కౌరవసేనలో మిగిలిన ఆ ఒకేఒక్క వీరుడు నన్ను ఓడించి మరల రాజ్యమును హరించునను శంకతో అటుల అయోగ్యముగ ప్రవర్తించితిని, రాజ కుమారి ద్రౌపది ఏకవస్త్రయై యున్నను ఆమెను నీ పుత్రుడు ఏ విధముగ అవమానించెనో నీకు తెలుసును. ఆయన నిండు సభలో తన ఎడమ తొడను చూపించి కూర్చొనమని సైగచేసెను. అందులకు ఆయన తొడలను విరిచెదనని ఆనాడే ప్రతిజ్ఞచేసితిని. ఇపుడు మా క్రోధము శాంతించినది"అనెను. ఆమె భీమసేనునితో "నాయనా! నీవు దుర్యోధనుని బలశౌర్య పరాక్రమములను ప్రశంసించితిగావున అతడు అమరుడగును. నీవు నాతో చెప్పినవన్నియు నిస్సందేహముగ దుర్యోధనుని అపరాధములు. కాని నీవు దుశ్శాసనుని వధించి రక్తము త్రాగితివి. ఇది అత్యంత నిందిత కర్మ. ఇట్టి క్రూర కర్మ నెటులచేసితివి"అనెను. అందుకు భీమసేనుదు "మాతా! ఇతరుల రక్తమును త్రాగనివాడు తన రక్తమును తానే ఎటుల త్రాగును? నా శరీరమువంటిదే నా అన్న శరీరమగును. అన్నకు, నాకు భేదము లేదు. దుశ్శాసనుని రక్తము నా దంతములు, పెదవులు దాటి లోనికి పోలేదు. ఈ విషయము సర్వసాక్షి యగు యమధర్మరాజునకు తెలుసును. కేవలము నా రెండు చేతులు రక్తముతో తడిసినవి. యుద్ధములో వృషసేనుని ద్వారా నకులుని అశ్వములు వధించబడినపుడు దుశ్శాసనుడు అన్నదమ్ములతో గూడి హర్షోల్లాసభరితుడై నృత్యము చేసెను. నా మనస్సులో గొప్ప బాధ కలిగించెను. అటులనే ద్యూత క్రీడా సమయములో ద్రౌపది కేశములను పట్టి లాగుకొని వచ్చినపుడు అట్టి రాక్షసానందమునే ప్రదర్శించెను. నేనపుడు క్రోధ భరితుడనై యుద్ధములో అతని గుండెలు చీల్చి రక్తపానము చేయుదునని ప్రతిజ్ఞ చేసితిని. ఆ ప్రతిజ్ఞ నా హృదయములో స్థిరముగా నిలిచిపోయినది. నేను ఆ ప్రతిజ్ఞను పూర్ణముగానీయకున్నచో నా క్షత్రియ ధర్మమునుండి దిగజారినట్లగును. అందుచే నేను ఆ కార్యమును చేసితిని. మాతా! నీవు నాపై దోషము నాపాదించకుము. ఇతఃపూర్వము మేము ఎన్నడూ ఏ అపరాధము చేయనపుడు నీ పుత్రులు మాపై అత్యాచారములు చేసిరి. ఆ సమయమున నీవు వారిని నివారించకయుంటివి. ఇపుడు నా పై దోషారోపణ చేయుచుంటివి"అనెను. యుధిష్ఠిరుదు గాంధారీదేవి చరణములపై పడెను. మిగిలిన పాండవులు అటునిటు దాగుకొను చేష్టలు చేయుచుండిరి. అంతలో ఆమె క్రోధము దిగిపోయెను. ఆమె వారందరిని స్నేహముతో దరిజేర్చుకొని సాంత్వన వచనములు పలికెను.

తదనంతరము పాండవులందరు గాంధారదేవి అనుమతితో కుంతిమాతను జూచుటకు వెడలిరి. ఆమె తన కష్టములను స్మరించుకొని పైటకొంగుతో ముఖమును గప్పుకొని కన్నీరు గార్చెను. తన పుత్రుల దేహములను నిమురుచు వారి అస్త్ర శస్త్ర గాయములను తడిమెను. పిమ్మట పుత్రులను గోల్పోయిన ద్రౌపదిని ఊరడించెను. వారిరువురు గలిసి గాంధారిదేవి కడకేగిరి. ఆమెకూడ దుఃఖితయై వారితో "నేను ఏ స్థితిలో నుంటినో మీరుకూడ అదే స్థితిలోనుంటిరి. మన యిరువురి కి ధైర్యము చెప్పు వారు లేరు. మనకుమనమే ధైర్యము చెప్పుకొన వలెను"అనెను. తదనంతరము ధృతరాష్ట్రాదులు తమ స్త్రీలతో గలిసి రణరంగమున కేగిరి. కురుక్షేత్రమును చేరిన అనాథ స్త్రీలు అచట మృతిచెందిన తమ పుత్రులను, అన్నదమ్ములను, పితరులను, పతులను జూచిరి. రుద్రుని క్రీడాస్థలమువలె నున్న ఆ రణభూమిని జూచి ఆక్రందనలు చేసిరి. కొందరు శవములపై పడిరి. కొందరు నేలపై పడిరి. కొందరు అచేతనులయ్యిరి. కొందరు దయనీయ స్థితిలోనుండిరి. కొందరు దుఃఖితులై వ్యాకుల చిత్తముతో కరుణా క్రందనలు చేయించుండిరి. అది జూచిన ధర్మజ్ఞురా లగు గాంధారి ఆ కౌరవ వినాశముపై దృష్టిసారించి శ్రీకృష్ణునితో "కమలనయన మాధవా! విధవరాండ్రైన నా కోడండ్రను చూడుము. వారు కేశపాశములు చెదిరి కురరవక్షులవలె రోదించుచుండిరి. తమతమ పతుల గుణములను ఏకరువుబెట్టుచు వారి మృత కళేబరములవైపు పరుగు దీయుచుండిరి. వీర పుత్రులను గనిన మాతలతోను, వీరగతి పొందిన తమ పతులను చూడవచ్చిన పత్నులతోను యీ యుద్ధభూమి నిండిపోయినది. అతి భయంకరముగ నున్న యుద్ధభూమిని జూచి నేను శోకదగ్ధనగు చుంటిని. పాంచాల, కౌరవ వీరుల మృతిని జూచి పంచభూతములు వినాశము చెందినటుల నా మనస్సునకు దోచుచున్నది. ఒకప్పుడు కోమలమైన పట్టుపాన్పులపై శయనించిన యీ వీరులెల్లరు నేడు కటికనేలపై పడియుండిరి"అనెను. తరువాత దుర్యోధనుని మృతదేహము చెంతకేగి పరిపరి విధముల అతని పూర్వభాగ్యమును స్మరించుచు పతిపుత్రుల కొరకు శోకించుచున్న కోడలి దుఃఖమును జూచి భోరున విలపించెను. తరువాత దుశ్శాసనుని ఇతరపుత్రుల దేహములను జూచి వారివారి భార్యల రోదనలను ఆలకించుచు తాను యిదివరలో దుర్యోధన - దుశ్శాసనాదులకు పాండవులతో సంధిగూర్చు కొనమని పలికిన హితవచనములు ఎలుగెత్తి స్మరించి విలపించెను. విరాటకులస్త్రీలతో కూడి అభిమన్యుని గురించి రోదించినది. ఉత్తరాదేవి తన పతి అభిమన్యుని ఆరుగురు మహారథులు గూడి అన్యాయమున హతమార్చుట గురించి శోకించుట గాంధారాదేవి ఆలకించినది. పిదప కర్ణుని చెంత విలపించుచున్న అతని భార్యల దీన స్థితి గురించి, గొప్పగా విచారించినది. తదనంతరము అవంతీ నరేశుల స్త్రీలు, తన కుమార్తె దుశ్శల శోకాలాపములతో గాంధారదేవి గొంతుకలిపినది. అటుపిమ్మట శల్య - భీష్మ - ద్రోణుల గురించి పదేపదే స్మరించి విలపించినది. తరువాత భూరిశ్రవ, శకుని యొక్క స్త్రీల చెంతకేగి పరామర్శించి దుఃఖాంబుధితో మునిగినది. కాంభోజరాజు సుదక్షిణుడు, మగధరాజు జయత్సేనుడు, కోసలదేశ బృహద్బలురు, ద్రోణాచార్యుని ద్వారా పడగొట్టబడిన బలవీర పుత్రులు, ద్రుపద మహారాజు, చేదిరాజు ధృష్టకేతు మున్నగువారి రాణుల ఆక్రందనల నాలకించెను. గాంధారిదేవి ఆ రణరంగములోని మారణకాండను దర్శించి ఉద్వేగముచెంది శ్రీకృష్ణునితో యిట్లనెను. "మాధవా! ఏనాడు నీ సంధి ప్రయత్నములు విఫలమై నీవు నిరాశతో ఉపప్లవ నగరమునకు వెనుదిరిగి పోయితివో ఆనాడే నా శూరవీర పుత్రులు మరణించిరని తలంచితిని. ఆ రోజుననే నా పుత్రులపై మమకారమును

వదులుకొనమని భీష్ముడు విదుర మహాశయుడు నాకు చెప్పిరి." అనెను. గాంధారీదేవి శోకమూర్ఛితయై ధైర్యము సడలి నేలపైబడెను. తదనంతరము ఆమె అంగాంగము లన్నియు క్రోధముతో వ్యాప్తమయ్యెను. పుత్రశోక సంతప్తయై తన బుద్ధిలో యీ యుద్ధ పరిణామములకు శ్రీకృష్ణుడే కారణమని శంకించెను. ఆమె ఆవేశముతో "జనార్ధనా! పాండవులు, ధార్తరాష్ట్రులు తమలో తాము కలహించుకొని భస్మమయ్యిరి. వీరు నశించుట జూచి నీవు ఉపేక్షించి యూరకుంటివి. వారి నాశనమును ఆపకుంటివి. నీవు మహాగొప్ప బలవంతుడవు. ఇరుపక్షములవారిని నీ మాటవినునటుల చేయగల సమర్ధుడవు. వేదశాస్త్రములు, మహాత్ముల వచనములు తెలిసిన వాడవు. అన్నియు తెలిసిన సర్వజ్ఞుడవు. ఇంత తెలిసినవాడవైనను కేవలము ఉపేక్షాభావము జూపి కురుకులము స్వయముగా నశించుటకు స్వేచ్ఛ నిచ్చితివి. నీవు తెలిసితెలిసి యీ వినాశనమును జరుగనిచ్చితివి. ఇది కేవలము నీ యొక్క మహా దోషము వలననే జరిగినది. ఇందులకు తగిన దుష్ఫలమును నీవుకూడ అనుభవించ వలెను. కేశవా! నేను పతివ్రతనైనచో, తపస్సుచేసిన దాననైనచో ఆ దుర్లభ తపోబలముతో నీకు శాపము నిచ్చుచున్నాను. నీ బంధుజనులు కూడ తమలోతాము కలహించుకొని నశించుట జూచెదనుగాక. నేటికి ముప్పదియారు సంవత్సరములు గడిచిన పిమ్మట వారందరు కలహించుకొని నశించెదరుగాక. నీవు అందరికి అపరిచితుడవై లోకులదృష్టికి దూరముగా సంచరించుచు ఒక నిందిత ఉపాయముతో మృత్యువును పొందెదవుగాక. భరతవంశ స్త్రీలవలె నీ యదువంశ స్త్రీలుకూడ పుత్రులను, అన్నదమ్ము లను, భర్తలను కోల్పోయి వారి మృతదేహములపైబడి శోకించెదరుగాక"అని శపించెను. అపుడు మహామనస్వి శ్రీకృష్ణుడు "క్షత్రాణీ! నీవిటుల శపించెదవని నేనెరుగుదును. యాదవులు దేవమానవులకు అవధ్యులు గావున తమలోతామే పోరాడుకొని నశించెదరు"అనెను. పిమ్మట ఆమెతో "గాంధారీ! లెమ్ము లెమ్ము. శోకములో మునిగి పోవలదు. నీ అపరాధము వలననే కౌరవ వినాశము జరిగినదని తెలుసుకొనుము. నీ పుత్రుడగు దుర్యోధనుడు పరమదుర్మార్గుడు. ఆ దురాత్ముడు యితరులపై ఈర్ష్య పెంచుకొని సదా రగులుచుండును. గొప్ప దురభిమాని. దుష్కర్మ పరాయణుడు, నిష్ఠురుడు. వైరమునకు సాక్షాత్తు మూర్తిస్వరూపము. పెద్దల ఆజ్ఞలను ఉల్లంఘించువాడు. నీవు అతనిని వెనకవేసుకుని గొప్ప అపరాధమును చేసితివి. నీవు చేసిన పని మంచిదనుకొందువా! నీపై దోషమునుంచుకొని నాపై నిందను మోపుచుంటివి. ఇదెక్కడి ధర్మము"అని మందలించెను. గాంధారి వెంటనే మౌనముదాల్చెను. తదనంతరము యుధిష్ఠిరుడు సుధర్మ, ధౌమ్యుడు, సంజయుడు, విదుర మహాశయుడు, కురువంశజుడగు యుముత్సు, ఇంద్రసేనుడు మున్నగు వారిని, సంపూర్ణ సూతసేవక బృందములను పిలిపించి తక్షణమే ప్రేతకార్యములు సంపన్నము గావించమనియు, ఏ ఒక్క మృత దేహమును అనాధగ విడిచిపెట్టవలదని ఆదేశించెను. ఆ ప్రకారము దహన సంస్కారములు పూర్తిగావించ బడినవి. పిమ్మట యుధిష్ఠిరుడు ధృతరాష్ట్ర మహారాజును ముందిడుకొని గంగానదికి అభి ముఖముగ పయనమయ్యెను. అచట బంధుజను లందరు తమ పితరులకు, అన్నదమ్ములకు, పుత్రులకు, పౌత్రులకు, స్వజనులకు, ఆర్యులకు జలాంజలులు సమర్పించిరి. కురుకుల స్త్రీలందరుకూడ తమ పితరులు, పతులు మున్నగువారికి జలాంజలులు సమర్పించిరి. అపుడు కుంతీదేవి అకస్మాత్తుగా మందస్మరముతో రోదించుచు పాండవులతో "పాండుపుత్రులారా! యుద్ధములో అర్జునుని ద్వారా వధించబడిన శూరవీర కర్ణుడు సూతపుత్రుడుగాదు. ఆ మహావీరుడు

సూర్యాంశవలన నా గర్భమునుండి ఉత్పన్నమైనాడు. అతనికి జన్మతః కవచకుండలము లుండెను. అతడు సూర్యదేవునివలె మహా తేజస్వంతుడు" అనెను. ఆ వచనములు వినినంతనే పాండవులు ఒక్క పెట్టున కర్ణుని గురించి శోక విలాపములు చేసిరి. కర్ణుడు తమకు జ్యేష్ఠభ్రాతయను విషయము దెలిసి తమ పుత్రపౌత్ర బంధునాశము కన్న వందరెట్ల శోకమును పొందిరి. యుధిష్ఠిరుడు పలురీతుల కర్ణుని మృతిగురించి వార్తాలాపములు చేయుచు వెక్కివెక్కి రోదించుచు సావధానముగ నిగ్రహించుకొని మెల్లమెల్లగా కర్ణునకు జల ప్రదానములు సమర్పించెను. బుద్ధిమంతుడగు యుధిష్ఠిరుడు తక్షణమే అన్నగారగు కర్ణునిపై ప్రేమతో ఆయన స్త్రీలను పరివార సహితముగ పిలిపించి వారితో గూడి విధిపూర్వకముగ కర్ణునకు ప్రేత కార్యములు సంపన్నమొనర్చెను. తదనంతరము బాహాటముగ యిట్లనెను. "నేను కర్ణుని జన్మ రహస్యము నెరుగకుండుటచే అన్నగారిని వధ గావించిన వాడనైతిని. కనుక నేటినుండి స్త్రీలు తమ మనస్సులో గుప్తరహస్యములను దాచుకొన లేకుందురుగాక". యుధిష్ఠిరుడటుల స్త్రీ జాతిని శపించి వ్యాకుల మనస్సుతో గంగాజలముల నుండి తన అన్నదమ్ములతోబాటు బయటకు వచ్చి నదీతీరమును చేరెను.



శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

శాంతిపర్వ పూర్వభాగము

సంపుటి : 9

ఓం పూషాయ నమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

శాంతి పర్వము (పూర్వ భాగము) - సంగ్రహ పరిచయము

శ్రీమన్మహాభారతమునందలి తొమ్మిదవ పర్వముగ శాంతి పర్వము యున్నది. రాజధర్మ పర్వము, ఆపద్ధర్మ పర్వము, మోక్ష పర్వము యను మూడు ఉపపర్వములతో శాంతిపర్వము విలసిల్లుచున్నది. శాంతిపర్వము పూర్వభాగములో 173 అధ్యాయములుగ రాజధర్మ, ఆపద్ధర్మ పర్వములున్నవి.

కథాంశము: కురుక్షేత్ర సంగ్రామములో జరిగిన మహాసంహారానంతరము పాండవులు, విదురుడు, ధృతరాష్ట్రుడు, భరతవంశ సమస్త స్త్రీలు తమతమ బంధువులు, సుహృదులకొరకు గంగా జలముతో జలాంజలులు సమర్పించిరి. పాండవులు ఆత్మశుద్ధికొరకు నగరమునకు వెలుపల గంగా తటముపై ఒక మాసము గడిపిరి. ఆ సమయమున యుధిష్ఠిరుని దర్శించుటకు దేవర్షి బ్రహ్మర్షి, సిద్ధులు ఎందరెందరో వచ్చిరి. ఆ మహాత్ములందరు యుధిష్ఠిరుని పూజలందుకొని ఉచితాసనముల నలరించిరి. మున్ముందుగా దేవర్షి నారదుడు "యుధిష్ఠిరా! మీమీ బాహుబలముతో, శ్రీకృష్ణుని కృపావీక్షణములతో, ధర్మప్రభావముతో సంపూర్ణ పృథివిని జయించితిరి. ఇవుడిక ధర్మ పాలనా తత్పరులై సంతోషముతో యీ రాజ్యలక్ష్మిని భోగించుడు"అనెను. అందులకు యుధిష్ఠిరుడు నా హృదయములో బంధు స్నేహితుల మహా సంహారము జరిగినదను గొప్ప దుఃఖము నెలకొని యున్నది. సుభద్రా కుమారుడగు అభిమన్యుడు, ద్రౌపది యొక్క అయిదుగురు పుత్రులను బలిగొన్న యీ విజయము నాకు పరాజయమువలె దోచుచున్నది. మా తల్లి కుంతీదేవి కర్ణుని జన్మ రహస్యమును దాచిపెట్టి నన్ను గొప్ప దుఃఖమున పడవేసినది. ఈ యదార్థము తెలియక నేనొక తమ్మునిద్వారా మా అన్నగారినే వధింపజేసితిని. ఈ చింతన పదేపదే నా అంగాంగములను జ్వలింప జేయుచున్నది. సంగ్రామములో కర్ణుని రథ చక్రములు భూమిలో కూరుకుపోయినవి. మా అన్నగారగు కర్ణునకు యీ శాపము యెటుల వచ్చినది"అని అడిగెను. అపుడు దేవర్షి నారదుడు "యుధిష్ఠిరా! అర్జునునితో యుద్ధము చేయుటయే కోరికగానున్న కర్ణుడు బ్రహ్మాస్త్ర ప్రయోగ ఉపసంహార రహస్యములు ఉపదేశించమని ద్రోణాచార్యుని ప్రార్థించెను. కాని బ్రహ్మాస్త్రము నెరుగుటకు చక్కగా బ్రహ్మచర్యవ్రతపాలన చేసిన బ్రాహ్మణులు లేదా తపస్వియగు క్షత్రియుడు మాత్రమే అర్హులనియు ఇతరులు (సూతులు మున్నగువారు) నేర్చుకొనజాలరని బదులిడెను. అందుచే కర్ణుడు బ్రాహ్మణవేషము ధరించి మహేంద్ర గిరిపైనున్న పరశురాముని ఆశ్రయించెను. ధనుర్విద్యాభ్యాసము చేయుచున్న కర్ణుడొకనాడు అగ్నిహోత్రి బ్రాహ్మణుని ధేనువత్సమును పొరపాటున వధించెను. ఆ బ్రాహ్మణుడు అందులకు కుపితుడై "దురాచారీ! నిన్ను వధించుట యోగ్యమైననూ యీ పాపఫలమును పొందు విధానమును శాపరూపమున యిచ్చుచున్నాను. నీవు ఎవనితో ఈర్ష్యవహించి యుద్ధములో పరాజితుని చేయదలంచితివో వానితో యుద్ధము చేయుచుండగా నీ రథ చక్రములు భూమిలో కూరుకుపోవుగాక"అని శపించెను. పరశురాముని చెంత సంపూర్ణ ధనుర్విద్య నేర్చిన కర్ణుడు బ్రహ్మాస్త్రప్రయోగ ఉపసంహార రహస్యములను కూడ అనుగ్రహించబడెను. కాని అతడు బ్రాహ్మణవేషములో

విద్యనేర్చెనను విషయము పరశురాముడెరిగినంతనే "మూర్ఖుడా! నీవు బ్రహ్మాస్త్రమును నేర్చుకొనవలెనను లోభముతో కపటపూర్వకముగా వ్యవహరించితివి. కనుక నీతో సరిసమానుడగు యోధునితో సంగ్రామములో తలపడి నీకు మృత్యుసమయము ఆసన్నమైనపుడు యీ బ్రహ్మాస్త్రమంత్రము నీ స్మరణకు రాకుండునుగాక"అని శపించెను. కుంతీదేవి ప్రార్థనపై పంచపాండవులలో అర్జునుని తప్ప మిగిలిన వారిని వధించక యుందునని కర్ణుడు వరమునిచ్చెను. కర్ణుడు సహజ కవచ కుండలములను దేవేంద్రునకు దానముగా నిచ్చెను. భీష్మపితామహుడు పదేపదే కర్ణుని మహారథిగా గణించక (పై శాప కారణములచే) అర్థ రథియని అవమానించెను.

యుద్ధములో కర్ణుని రథ సారధ్యము వహించిన శల్యుడు సూటిపోటిమాటలతో నిరుత్సాహపరచెను. శ్రీకృష్ణభగవానుని యుద్ధనీతి కూడ పదేపదే కర్ణునకు ప్రతికూలములైనవి. ఇవియన్నియు కర్ణుని పరాజయమునకు కారణములైనవి. గాండీవధారి అర్జునునకు రుద్రభగవానుడు, దేవరాజు ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు మున్నగువారు దివ్యాస్త్రములనిచ్చిరి. అందుచే యుద్ధములో సూర్యసమాన తేజ స్వంతుడైన వైకర్తన కర్ణుని అర్జునుడు వధించ గలిగెను."అనెను. ఆ వచనముల నాలకించిన యుధిష్ఠిరుడు శోకమగ్నుడై చింతావ్యాకులుడై సర్పమువలె దీర్ఘశ్వాసలు దీయుచు అశ్రుధారలు గార్చెను. కుంతీదేవి ఆయనను శాంతపరచ ప్రయత్నించెను. తాను ముందుగనే కర్ణునకు జన్మ రహస్యము చెప్పి అన్నదమ్ములతో చేర్చుటకు కృషిచేసితిననియు, సూర్యభగవానుడు కూడ స్వప్నములో అగుపడి కర్ణునకు ఆ విషయము చెప్పెననియు, కాని కర్ణుడు కాలవశుడై దుర్యోధనుని కొమ్ముకాచి వైరప్రతీకార చేష్టలందు సంలగ్నుడయ్యెను"అనెను. ధర్మాత్ముడగు యుధిష్ఠిరుడు అత్యంత దుఃఖితుడై జగత్తులోని స్త్రీలందరిని "నేటినుండి స్త్రీలు తమ మనస్సులో ఏ రహస్యమును దాచుకొన లేకుందురుగాక"అని శపించెను.

తదనంతరము యుధిష్ఠిరుడు అర్జునునితో "శత్రుసూదనా! నేను రాజ్యము - ధనసంగ్రహము లను వాంఛించి కురుక్షేత్ర మహాసంగ్రామములో పలువురు బంధువులను, అనేకమంది నరేశ్వరులను, సైనికులను వధించి గొప్ప పాపమును మూటగట్టు కుంటిని. పరిగ్రహమువలన పాపము ప్రాప్తించునని శ్రుతివచనమున్నది. పాపమే జన్మమృత్యువులకు కారణమనిరి. కనుక ఈ రాజ్యమును, సుఖ భోగములను తృణీకరించి బంధవిముక్తుడనై శోకము నధిగమించి వనములకు పోయెదను''అనెను. యుధిష్ఠిరుని వచనముల నాలకించిన అర్జునుడు తనపై ఆక్షేపణ చేసినటుల యూహించుకొని సహించలేక పోయెను. అతడు తన ఉగ్రరూపమును ప్రదర్శించుచు "యుధిష్ఠిర మహారాజా! మీ దుఃఖ విహ్వలత పరాకాష్ఠకు చేరినటులున్నది. మీరు శత్రుసంహారము చేసి పృథివిపై అధికారమును సంపాదించితిరి. ఈ రాజ్యలక్ష్మి మీకు ధర్మానుసారము ప్రాప్తించినది. ఈ భాగ్యమంతయు కృతప్రయత్నమువలన మీ చేతిలోనికి వచ్చినది. ఇపుడు అల్పబుద్ధితో వదులుకొనుట ఎందులకో తెలియకున్నది. నరేశ్వరా! మీరు సమృద్ధిశాలి రాజ్యమును త్యజించి కొంగుచేతబట్టి ఇంటింటికిపోయి భిక్షాటనము చేయు నీచాతినీచ వృత్తి నాశ్రయించి జీవన నిర్వాహము చేసినచో జనులు ఏమని అను కొందురు? మీరు సమస్త ఉద్యోగములను వదిలి కల్యాణసాధన హీనులై, అకించనులై, సాధారణ పురుషులవలె భిక్షాటనము చేయు ఇచ్ఛను ఏల పొందుచుండిరి? సర్వస్వమును త్యాగమొనర్చి నిర్ధనుడు అకించనుడగుట ఋషులకు - మునులకు

ధర్మమగును. రాజధర్మము కేవలము ధనముతోనే సంపన్నమగును. నరేశ్వరా! ధనము ద్వారా ధర్మము, కామము, స్వర్గము సిద్ధించును. ఎవనిచేతిలో ధనముండునో వానికి చాలామంది మిత్రులుందురు. బంధుబలగము పుష్కలముగా పెరుగును. ధనము ద్వారా కులప్రతిష్ఠ పెరుగును. ధనముతోనే ధర్మస్రోత ప్రవహించును. మహా సాగరమునందలి జలమును గ్రహించి మేఘములుగా రూపొందిన జలధరములు జలవృష్టిని సంపూర్ణదిశలందు కురిపించును. అటులనే రాజులు ధన సంగ్రహమును చేసి సంపూర్ణ పృథివిపై సమృద్ధిని వ్యాపింపజేయుదురు. పూర్వము యీ పృథివి దిలీపుడు, నృగుడు, నహుషుడు, అంబరీషుడు, మాంధాత మున్నగువారిచే శాసించ బడినది. ఇపుడు మీ అధీనమైనది. కనుక మీరు సర్వస్వమును దక్షిణగా సమర్పించు ద్రవ్యములతో యజ్ఞముల ననుష్ఠించు అవసరము ప్రాప్తించినది" అనెను. అందులకు ధర్మరాజు "అర్జునా! నేను గ్రామ్య సుఖములను పరిత్యజించి సాధుపురుషుల మార్గము అనుసరించెదను. వనమునరు పోయి కఠోరమైన తపస్సుచేయుదును. ఫలమూలాదుల దినుచు లేళ్ళమందతో సంచరించెదను. ఇరు సంధ్య లందును స్నానమాచరించి యథాసమయమున అగ్నిహోత్ర మాచరించి పరిమిత ఆహారమును సేవించుచు నా శరీరమును దుర్బలమొనర్చెదను. మృగచర్మము, వల్కల వస్త్రములు ధరించి శిరస్సుపై జటాధారణ చేయుదును. శీతోష్ణవాతావరణములను సహించెదను. ఆకలి దప్పులు - పరిశ్రమనోర్చుకొను అభ్యాసము చేయుదును. శాస్త్రోక్త తపస్సు ద్వారా నా శరీరమును ఎండగట్టెదను. ఏకాంతములో ఆధ్యాత్మిక తత్త్వమును విచారణ చేయుదును. మధురవాణితో దేవతలను స్తుతించి స్వచ్ఛ జలముతో పితృతర్పణల నిచ్చెదను. వాన ప్రస్థులకు చెప్పిన కఠోర నియమములను పాలించెదను. ఆయుః సమాప్తివరకు యీ దేహయాత్ర జరిపెదను. లేదా శిరోముండనము గావించుకొని మననశీలి సంన్యాసినయ్యెదను. వనములో ఒక్కొక్కరోజు ఒక్కొక్క వృక్షమునుండి భిక్షనడిగి నా శరీరమును జీవన మాత్రము పోషించుకొనెదను. నా దేహముపై ధూళిదుమ్ము పడనీయుము. వృక్ష జడ మూలములందు నివసించెదను. ప్రియాప్రియ విచారణ వదిలిపెట్టెదను. ఎవరి గురించి శోకించను. హర్షించను. నిందా స్తుతులను సమానముగ గ్రహించెదను. ఆశా మమతలను త్యజించి నిర్ద్వంద్వుడ నయ్యెదను. సంగ్రహ పరిగ్రహములు చేయక యుందును. మనస్సును ప్రసన్నముగా నుంచుకొని ఆత్మచింతనలో సుఖము ననుభవించెదను. ఇతరులతో సంభాషించు వ్యసనము మానుకొందును. మూగ గ్రుడ్డి బధిరునివలె యుందును. ఏ ప్రాణిని హింసించను. ఎవరినీ అవహేళన చేయను. ఎవరిపైనను భృకుటి ముకుళించి క్రోధభావమును ప్రదర్శించను. ఎవరి ఆధీనము నందును యుండక వాయువువలె సర్వత్రా సంచరించెదను. అజ్ఞానవశముచే తృష్ణా పీడితుడనై అనేక పెద్దపెద్ద పాపములు చేయించితిని. దీర్ఘకాలము గడిచిన పిమ్మట నేడు నాకు వివేకరూప అమృతము ప్రాప్తించినది. ఈ వివేకముతో అక్షయము - అవికారము - సనాతనమునగు పరమాత్మ పదమును పొంద దలంచితిని."అనెను. భీమసేనుడు యుధిష్ఠిరుని సంన్యాస నిర్ణయమును విరోధించెను. క్షాత్ర ధర్మముతో ఉత్పన్నమై, క్షాత్ర ధర్మతత్పరులై, క్షాత్ర ధర్మము నాశ్రయించి జీవన నిర్వాహముచేయు క్షత్రియులు వానప్రస్థ సన్యాస ధర్మముల నాశ్రయించుట యుక్తముగాదు. క్షత్రియులకు సంన్యాసాధికారము లేదు.''అనెను. నకులుడు గృహస్థ ధర్మమును ప్రశంసించుచు యుధిష్ఠిరునకు నచ్చజెప్ప ప్రయత్నించెను. దక్షిణాయుక్త యజ్ఞములు చేయుచు,

రాజధర్మము నిర్వర్తించమని విన్నవించెను. మమతాసక్తులను విడిచి రాజ్యపాలన చేయమని సహదేవుడు చెప్పెను. రాజదండము ధరించి పృథివిని శాసించమని ద్రౌపది యుధిష్ఠిరుని ప్రేరేపించెను. అన్నదమ్ములు యిటుల విన్నవించినను యుధిష్ఠిరుడు తన ప్రతిజ్ఞను పలురీతులు సమర్థించుకొనెను. అపుడు దేవస్థానుడను మునీశ్వరుడు యజ్ఞానుష్ఠానములు చేయమని యుధిష్ఠిరుని ప్రోత్సహించెను. అర్జునుడు క్షాత్రధర్మ ప్రశంసతో యుధిష్ఠిరునకు నచ్చజెప్ప ప్రయత్నించెను. వ్యాసమహర్షి కూడ యుధిష్ఠిరునకు రాజధర్మమును రాజా హయగ్రీవుని చరిత్ర– రాజా సేనజిత్ వృత్తాంతముల ద్వారా బోధించెను. అయినను యుధిష్ఠిరుడు ధనత్యాగమహిమను వివరించి తాను రాజ్యలోభముతో అత్యంత క్రూరముగ యుద్ధకాండ నిర్వహించి అనేకమంది సుహృదుల వధకు కారకుడనైతినని పరిపరి విధముల శోకాలాపములు చేయుచు ప్రాణత్యాగ సంసిద్ధుడయ్యెను. అపుడు వ్యాసమహర్షి వలదు వలదని యుధిష్ఠిరుని ఆలోచనను నివారించుచు "మహారాజా! నీవిటుల సంతప్తుడవు గావలదు. నీటిలో బుడగలు ఎటుల పుట్టి మరల నశించునో అటులనే యీ సంసారములో ఉత్పన్నమైన ప్రాణులు తమకు తాము సంయోగము చెంది చివరకు నిశ్చయముగా వియోగము పొందెదరు. నరేశ్వరా! కర్మచేయుట కొరకు విధాత నిన్నెందులకు సృష్టించెనో ఆ కర్మలను చేయుము. దానివలన నీకు సిద్ధి ప్రాప్తించును. కర్మఫలములకు నీవు యజమానివి – నియంతవు గాదు"అనెను. తదనంతరము శ్రీకృష్ణ భగవానుడు కూడ యుధిష్ఠిరుని శోకమును దూరమొనర్చుటకై షోడశమహారాజుల సంక్షిప్త చరిత్రను, సువర్ణష్ఠీవి ఉపాఖ్యానమును చెప్పెను. తదనంతరము వ్యాసమహర్షి అనేక యుక్తులతో యుధిష్ఠిరుని రాజధర్మము నాచరించమని నచ్చచెప్పెను. కాలమే త్వరితగతిని తన నియమానుసారము దేహధారుల ప్రాణములను తీయును. నీవు యుద్ధము చేయుట యందు నిమిత్తమాత్రుడవు. ప్రజావర్గము యొక్క కర్మలకు సాక్షియైన కాలమే నీ శత్రువులను పరిమార్చినది. కాలము ఈశ్వరీయ స్వరూపము. ప్రాణులద్వారా ప్రాణులను కాలమే వధించును. యుద్ధములో మరణించిన వారందరు వారివారి కర్మల విధానముచే వినాశము పొంది కాలాధీను లయ్యిరని తెలుసుకొనుము. అయిననూ నీవు యుద్ధకర్మ చేసినందులకు నిరంతరము పశ్చాత్తాపము చెందుచుంటివి. అందులకు అశ్వమేధ యాగమును చేయుట మాత్రమే గొప్ప ప్రాయిశ్చిత్త కర్మయగును. నీవు ఆ యజ్ఞము ననుష్ఠించినచో పాపరహితుడ వయ్యెదవు."అనెను. ఈ సందర్భముగా కర్మలు చేయుట – కర్మలు చేయకుండుట – కర్మయొక్క ప్రాయశ్చిత్త విధివివేచన గురించి వ్యాసమహర్షి చెప్పిన ధర్మవిధులు (ముప్పది నాలుగు, ముప్పదియైదవ అధ్యాయములు) ప్రతి ఒక్కరు మననము చేయదగినవి. అటులనే స్వాయంభువ మనువు చెప్పిన ధర్మ రహస్యములను కూడ యుధిష్ఠిరునకు చెప్పి రాజశాసనము చేయుటకు ఒప్పించెను. ధర్మమును గురించి పూర్తి వివేచన ఎరుగ దలంచినచో శరశయ్యపై నున్న భీష్మపితామహుని అడుగమనెను. శ్రీవేదవ్యాస మహర్షి – శ్రీకృష్ణభగవానుల ఆదేశానుసారము యుధిష్ఠిరుడపుడు రాజశాసనము చేపట్టి దీక్షతో హస్తినాపుర నగర ప్రవేశమునకు సంసిద్ధుడయ్యెను. నగరపౌరుల ద్వారా యుధిష్ఠిరునకు, పాండవులకు ఘనస్వాగతము లభించెను. ఆ సమయమున చార్వాకుడను రాక్షసుని బ్రాహ్మణులు వధించిరి. చార్వాకుని పూర్వ వృత్తాంతమును శ్రీకృష్ణుడు ధర్మరాజునకు ఎరిగించెను. యుధిష్ఠిరుడు హస్తినాపుర

రాజ సింహాసనముపై అభిషిక్తుడయ్యెను. తదనంతరము తన తమ్ములను విభిన్న రాచకార్యము లందు నియుక్తమొనర్చెను. యుద్ధములో మృతిచెందిన ఆత్మబంధువులకు యుధిష్ఠిర ధృతరాష్ట్రులు శ్రాద్ధకర్మలొనర్చిరి యుధిష్ఠిరాదులు తమతమ భవనములలో ప్రవేశించి విశ్రాంతి చెందిన పిమ్మట ఒకనాడు యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని చెంతకేగెను. అపుడు శ్రీకృష్ణుడు పరధ్యానముగ నుండుట గమనించిన యుధిష్ఠిరుడు అందులకు కారణమేమని ప్రశ్నించెను. అపుడు శ్రీకృష్ణ భగవానుడు ''యుధిష్ఠిరా! ఆరిపోవుచున్న అగ్నివలె భీష్ముడు నన్ను ధ్యానము చేయుచుండెను. అతడు తన ఇంద్రియ వృత్తులన్నిటిని ఏకాగ్రమొనర్చి బుద్ధిద్వారా మనస్సును కూడ సంయమన మొనర్చి నా శరణాగతుడైయుండెను. గంగానందనుడు వసిష్ఠునివద్ద వేదవిద్యను, పరశురాముని వద్ద దివ్యాస్త్ర ధనుర్విద్యను నేర్చెను. అతడు త్రికాలజ్ఞుడు, ధర్మజ్ఞుడు. నీవు తక్షణమే ఆయన కడకేగి చరణముల మ్రొక్కి నీ మనస్సులోని ధర్మసందేహములన్నియు తీర్చుకొనుము. భీష్మరూప సూర్యుడు త్వరలో అస్తమించనున్నాడు. ఆయనతో బాటు జ్ఞాన ప్రకాశముకూడ నశించును."అనెను. అపుడు యుధిష్ఠిరుడు "కృష్ణా! నీవు ఆదిదేవుడవు. క్షర – అక్షర పురుషుడవు. నీ దర్శనము భీష్మునకు కూడ గొప్ప ప్రయోజనము నిచ్చును. కనుక నీవు కూడ నాతో గలిసి రమ్ము"అనెను. ఆ సందర్భమున పరశురాముని క్షత్రియ సంహార చరిత్ర గురించి యుధిష్ఠిరునకు శ్రీకృష్ణుడు చెప్పెను. శరశయ్యపై నున్న భీష్ముని గుణగణములను ప్రశంసించిన శ్రీకృష్ణుడు "భీష్మా! శాస్త్రములలో చెప్పబడిన చాతుర్వర్ణ – చతుర్విధాశ్రమముల ధర్మములు నీకు సువిదితము. యోగమునందును, సాంఖ్యము నందును నియతమైన ధర్మముల నెరుంగుదువు. దీనజాతి కులముల ధర్మ లక్షణములు నీకు ఎరుక. వేదధర్మములు – శిష్టులు చెప్పిన ధర్మములు – ఇతిహాస పురాణముల అర్థము నీకు బాగా తెలుసును. ధర్మశాస్త్రము సర్వస్వము నిత్యము నీ మనస్సులో మననము అగుచుండును. కనుక నీవు ధర్మజుని మనస్సులో కలిగిన శోకమును నీ బుద్ధిబలముతో తొలగించుము. గంగానందనా! నీ బుద్ధివైభవము అపారము – అప్రమేయము. నీ వంటివారే మోహగ్రస్తులైన వారికి శాంతిని కూర్చగలరు. (కనుక యీ పర్వమునకు శాంతిపర్వము అను పేరు వ్యాసమహర్షి పెట్టెను). సత్యపరాయణుడగు యుధిష్ఠిరుడు బంధుజన శోకమగ్నుడై తన శాస్త్ర జ్ఞానమును కోల్పోయెను. కనుక నీవు ఇతనికి ధర్మార్థ యోగయుక్తమగు యధార్థ తత్త్వవివేచన వచనములను వినిపించి ఇతని శోకమును దూరమొనర్చుము." అనెను. అందులకు భీష్ముడు ''గోవిందా! శరాఘాతముల వేదనతో నా దేహము శిధిలమైనది. నేను ఏ విషయమును చెప్పుటకు అశక్తుడనైయుంటిని. నా శరీరమునుండి ప్రాణములు ఎగిరి పోవుటకు ఉత్సాహమును జూపుచున్నవి. నా దేహములోని మర్మస్థానములన్నియు గొప్ప వేదన చెందుచున్నవి. కనుక నా చిత్తమును భ్రాంతమొనర్చుచున్నవి. దుర్బలుడనగుటచే నాలుక తాలువులందు అతుకు కొనుచున్నది. ఇట్టి అవస్థలో నేను ఏమి చెప్పగలను? నీ సమీపమున ప్రవచనము చేయుట బుద్ధిశాలి బృహస్పతికి కూడ నోరు పెగలదు. మరి నేనెటుల సమర్ధుడనగుదును? మధుసూదనా! నాకు దిశలు తెలియకున్నవి. భూమ్యాకాశములు అగుపడకున్నవి. అందుచే యుధిష్ఠిరునకు ఏది హితమో దానిని స్వయముగా నీవే శీఘ్రముగా బోధించుము. శ్రీకృష్ణా! నీవు జగత్కర్తవు – సనాతన పురుషుడవు. నీవు యుండగా నా వంటి మానవు డెవడూ గొప్ప ఉపదేశములను చేయజాలడు. గురువు సమక్షమున

నా వంటి శిష్యుడు ఉపదేశము చేయుటకు అధికారి ఎట్లగును?"అనెను. అందులకు వాసుదేవుడు "భీష్మా! మీరు పలికిన పలుకులలో యదార్థమున్నది. నీపై ప్రసన్నుడనై వరము నిచ్చుచున్నాను గ్రహించుము. నీకు గాయముల వలన గ్లానిగాని, మూర్ఛగాని యుండవు. నీవు ఏఏ ధర్మార్థయుక్త విషయములను చింతన చేసెదవో వానిపై నీ బుద్ధి సఫలతా పూర్వకముగ ముందుకు సాగును. నీకు దివ్యదృష్టి లభించి చతుర్విధ ప్రాణుల తత్త్వమును దర్శించెదవు. నీవు జ్ఞాన దృష్టి సంపన్నుడవై సంసార బంధనములో పడిన సంపూర్ణ జీవసముదాయమును నిర్మల జలములో మత్స్యము సర్వమును దర్శించునటుల సమస్తమును చూడగలవు."అని పలికెను. మరునాడు శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో గూడి భీష్ముని సమీపమునకేగెను. భీష్ముడపుడు ఆకాశమునుండి భూమిపైకి పడియున్న సూర్యభగవానునివలె తేజరిల్లుచుండెను. యుధిష్ఠిరుడు ఆ బ్రహ్మతేజమును చూచి భయకంపితుడయ్యెను. కాని శ్రీకృష్ణుడు "భీష్మా! నీకు జ్ఞాతవ్య విషయములు స్పష్టముగా దర్శించు నిర్మల బుద్ధి ప్రాప్తించినదా! నీ అంతఃకరణములో అన్ని విధముల జ్ఞానప్రకాశమగుచున్నదా! నీ హృదయములో గ్లానిలేదు గదా! నీ మనసు వ్యాకులమై లేకుండెనా!" యని శ్రీకృష్ణుడు పలుకరించెను. అందులకు భీష్ముడు "వృష్ణినందనా! నీ కృపవలన నా శరీరములో మంటలు, మనస్సులో మోహము, దేహమునందు అలసట – వికలత – గ్లాని – రోగము యివియన్నియు దూరమైనవి. ఇపుడు అరచేతిలో ఫలమువలె భూత భవిష్యవర్తమాన విషయములన్నియు స్పష్టముగా అగుపడుచున్నవి. అచ్యుతా! వేదములలో చెప్పిన ధర్మము, ఉపనిషత్ జ్ఞానము, సమస్తధర్మములు నీ వరదాన ప్రభావమువలన ప్రత్యక్ష దర్శనమైనవి. జనార్దనా! శిష్టపురుషుల ధర్మోపదేశములు కూడ నా హృదయములో స్ఫురించినవి. అటులనే దేశ – జాతి – కులధర్మములు కూడ నా స్మృతిలో పూర్ణజ్ఞానమై భాసిల్లుచున్నవి. చతుర్విధ ఆశ్రమముల సారభూత తత్త్వములు కూడ నా మదిలో ప్రకాశించినవి. సంపూర్ణ రాజధర్మములు కూడ చక్కగా స్మరణకు వచ్చినవి. నీ కృప వలన నా హృదయము నిర్మలమైనది. కల్యాణమయ బుద్ధి ఆవేశించినది. జనార్దనా! నిన్ను స్మరించుటవలన నా శక్తి పరిఢవిల్లినది. మాధవా! యుధిష్ఠిరునకు కల్యాణమయ ఉపదేశములను నీవే చేయ వచ్చును గదా! ఇందులకు కారణమేమి?"అనెను. అందులకు వాసుదేవుడు "కురునందనా! యశస్సుకు – శ్రేయస్సుకు నేనే మూలమని తెలుసుకొనుము. సంసారములో సత్ – అసత్ పదార్థములన్నియు నా నుండియే ఉత్పన్నమైనవి. చంద్రుడు చల్లని కిరణములు ప్రసరించుననుమాట జగత్తులో ఎవరికీ ఆశ్చర్యము కలిగించదు. అదే ప్రకారము యశస్సే స్వరూపముగా గల పరమేశ్వరుడు ఏ ఉపదేశము చేసినను అది విని ఆశ్చర్యపడువారెవరుందురు? మహా తేజస్వి భీష్మా! నీకు యీ లోకములో గొప్ప యశస్సును కలిగించవలెనని సంకల్పించితిని. కనుక నా విశాలబుద్ధిని నీలో ప్రవేశపెట్టితిని. ఈ పృథివి యున్నంతకాలము యీ జగత్తులో నీ అక్షయ కీర్తి విఖ్యాతిచెందియుండవలెను. భీష్మా! నీవు యుధిష్ఠిరుని ప్రశ్నలకు చెప్పు సమాధానములన్నియు వేదవాక్యములవలె యీ భూతలములో మాన్యత చెందును. నీ ఉపదేశములను ప్రమాణముగా స్వీకరించి జీవన యానము చేయు మానవులు మరణానంతరము పుణ్యఫలప్రాప్తి పొందెదరు." అనెను. అపుడు భీష్ముడు "గోవిందా! నేను సమస్త ధర్మములను ప్రవచించెదను. ధర్మాత్ముడగు యుధిష్ఠిరుడు ఒక్కొక్క ధర్మము విషయములో ప్రశ్నల నడుగనిమ్ము. ఎవనియందు ధైర్యము, ఇంద్రియ

సంయమనము, బ్రహ్మచర్యము, క్షమ, ధర్మము, ఓజస్సు, తేజస్సు, నిత్యము విరాజిల్లి యున్నవో ఆ ధర్మజుని ప్రశ్నలనడగమనుము. ఎవనికి క్రోధము – కామనలనెడి భయములేదో, ఎవడు ఏనాడూ స్వార్ధమునకైననూ లోభమనెడి అధర్మమునకు పాల్పడడో ఆ ధర్మాత్ముడగు పాండుపుత్రుడు నన్ను ప్రశ్నించనీయుము"అనెను. భీష్మడిటుల పలికినంతనే యుధిష్ఠిరుడు భీష్ముని చెంతకేగి వినీత భావముతో ఎదురుగా నిలిచి ఆయన చరణద్వయమును పట్టి నమస్కరించెను. భీష్ముడు వెంటనే యుధిష్ఠిరుని మస్తకమును ముద్దాడి "పుత్రా కూర్చొనుము. నీవు ఏ మాత్రము భయం పడక నిర్భయముగా ప్రశ్నించుము"అనెను.

స్తుతులు: యుధిష్ఠిరుడు హస్తినాపుర ప్రవేశానంతరము రాజసింహాసనముపై అభిషిక్తుడైన పిమ్మట ఆత్మబంధువులకు శ్రాద్ధకర్మలొనర్చి కొంత శాంతించిన మనస్సుతో శ్రీకృష్ణ భగవానుని సమీపించి చేసిన స్తుతి మహత్తరమైనది. (43వ అధ్యాయము) పరమాత్మా! అంతర్యామివగు నిన్నే ద్విజులు స్తుతించెదరు. నీవే విశ్వములో ప్రవేశించి విశ్వాత్మవైతివి. సర్వవ్యాపకుడ వగుటచే విష్ణువనియు, విజయీ వీరుడవగుటచే జిష్ణువనియు, దుఃఖములను హరించి ఐశ్వర్యము నిచ్చువాడవగుటచే శ్రీహరివనియు, అందరినీ నీవైపు ఆకర్షించుకొనుటచే శ్రీకృష్ణుడవనియు, క్షర అక్షర తత్త్వములకు పరమైన వాడవగుటచే పురుషోత్తముడవనియు, అదితి గర్భమున ఏడుసార్లు జన్మించి అవతారములు ధరించుటచే పృశ్నిగర్భుడవనియు, విశుద్ధపరమాత్మ వగుటచే హంసయనియు పిలువబడుచున్నావు. ఇటుల శ్రీకృష్ణుని భగవత్ గుణగానము పంద్రెండు శ్లోకములలో చేయబడిన యీ స్తుతి చేయుటవలన పాఠకులకు భగవదనుగ్రహము ప్రాప్తించును. అటులనే శరశయ్యపైనున్న భీష్ముడు ఇంద్రియములను మనస్సును ఏకాగ్రమొనర్చి శ్రీకృష్ణావతారమగు భగవంతుని స్తుతించెను. మాఘమాస శుక్లపక్ష అష్టమీ రోహిణీ నక్షత్రము మధ్యాహ్న సమయమున భీష్ముడు ధ్యానమగ్నుడై తన మనస్సును పరమాత్మయందు లగ్నమొనర్చెను. భీష్ముడు శరశయ్యపై నుండియే చేతులు జోడించి పవిత్ర భావనలతో మనోవాక్కాయ కర్మలద్వారా హృష్ట పుష్ట స్వరముతో మధుసూదన భగవానుని స్తుతించనారంభించెను. ఎనుబది శ్లోకములుగల యీ పరమాత్మ స్తుతి భగవంతుని తత్త్వమును ప్రదర్శితమొనర్చెను. దీనిని నిత్యము పారాయణము చేయువారికి సమస్త శుభములు గలిగి సద్గతులు ప్రాప్తించును. ఈ స్తవము నలుబది ఏడవ అధ్యయమునందున్నది.

నీతి ధర్మ బోధలు

కురుక్షేత్ర మహాసంగ్రామములో బంధు మిత్రుల మహా సంహారమునకు తానే కారకుడనైతినని యుధిష్ఠిరుడు శోకించి సర్వస్వమును త్యాగమొనర్చి భిక్షాజీవన సంన్యాస వృత్తి స్వీకరించెదనని ప్రతిజ్ఞబూనెను. శత్రుసంహారము చేసి పృథివిపై విజయము సాధించిన క్షత్రియుడు క్షాత్ర ధర్మము నాశ్రయించి రాజశాసనముతో ప్రజలను పాలించి రక్షించ వలెనని అర్జునుడు, భీమసేనుడు, నకుల సహదేవులు తమ అన్నగారగు యుధిష్ఠిరుని ఒప్పించ ప్రయత్నించిరి. శ్రీకృష్ణుడు షోడశ మహారాజుల వృత్తాంతము చెప్పి యుధిష్ఠిరునకు ఊరట గలిగించెను. అపుడు వ్యాసమహర్షి అనేక యుక్తులతో ధర్మోపదేశము చేసెను. "రాజా! రాజధర్మములలో ప్రజాపాలన ఒక ముఖ్యధర్మము, ధర్మమునసనుసరించు వారికి ధర్మమే ప్రమాణమై యుండును. ధర్మరక్షణ చేయని రాజు ధర్మ ఘాతుకుడగును. నీవు మనస్సులో జరిగిపోయిన దాని గురించి శోకించుట మానుకొనుము. సంగ్రామములో

పాల్గొన్న క్షత్రియులందరు ధర్మానుసారము మరణించిరి. కాలమే త్వరితగతిని నియమానుసారము దేహధారుల ప్రాణములను తీయును. యుద్ధమును నిమిత్తమాత్రము చేసి కాలమే నీ శత్రువులను వధించినది. కాలమే జీవులయొక్క పాపపుణ్యకర్మలకు సాక్షియని తెలుసుకొనుము. కర్మయే వ్యక్తియొక్క కర్మల సమూహము నాశ్రయించి సుఖదుఃఖముల ఉత్పాదనకు మూలమై సమయానుసారము సుఖదుఃఖస్వరూప ఫలములనిచ్చును. యుద్ధములో మరణించినవారుకూడ కర్మల విధానముచే వినాశముపొంది కాలాధీనులయితిరని తెలుసుకొనుము. నీ చిత్తములో యీ మారణకాండకు నీవే కారణమను మిథ్యాచింతన పీడించుచున్నది. దాని నివృత్తి కొరకు ప్రాయశ్చిత్తము చేసికొనుట సముచితము. పూర్వము ఇంద్రుడుకూడ శత్రువులను జయించి ఒక్కొక్కమారు విడివిడిగ వంద అశ్వమేధ యాగములను మరుద్గణములతో గూడి అనుష్ఠించెను. అందుచే ఆయన శతక్రతుడను పేర విఖ్యాతిచెందెను. ఆయన సర్వపాపవిముక్తుడై స్వర్గ రాజ్యముపై విజయమును సాధించెను. కుంతీకుమారా! నీవు క్షత్రియ ధర్మమును పాటించితివి. నీకిపుడు నిష్కంటక రాజ్యము లభించినది. కనుక నీవు ధర్మ రక్షణ గావించుము.

యుధిష్ఠిరా! శాస్త్రవిహిత కర్మలనాచరించకుండుట లేదా శాస్త్రవిరుద్ధ కర్మలొనరించుట యందు ప్రాయశ్చిత్తములు చేసుకొనినచో పాపవిముక్తులయ్యెదరు. ఏఏ కర్మలకు ప్రాయశ్చిత్తముల నొనర్చుకొనవలెనో వ్యాసమహర్షి ముప్పది నాల్గవ అధ్యాయములో యుధిష్ఠిరునకు వివరించెను. అటులనే ఏఏ పాపకర్మలకు ఎట్టి ప్రాయశ్చిత్తములు చేసుకొనవలెనో ముప్పదియైదవ అధ్యాయములో చెప్పబడెను. ఆ సందర్భమున స్వాయంభువ మనువునకు సిద్ధపురుషుల సంవాదరూప ప్రాచీన ఇతిహాసము నుదహరించి ధర్మరహస్యములు ముప్పదియారవ అధ్యాయములో వివరించెను. అన్నమనగా ఏమి? దానము - అధ్యయనము - తపస్సు యొక్క స్వరూపము ఎటులుండును? కర్తవ్యము - అకర్తవ్యము అనగా ఏమి? ఈ ప్రశ్నలను పురస్కరించుకొని చెప్పిన ధర్మములు విస్తారముగ వివేచన చేయబడినవి. సంపూర్ణ జీవజగత్తుకు రాజధర్మము పరమాశ్రయ మైన దగుటచే దానిగురించి వర్ణించమని యుధిష్ఠిరుడు భీష్మపితామహునడిగెను. అందులకు ఆయన "కురు నందనా! రాజధర్మములో ధర్మార్థకామములు మూడున్నూ మిళితమైయున్నవి. ఒక విధముగా మోక్ష ధర్మము కూడ రాజధర్మములో నిహితమైయున్నది. ఏనుగును వశమునందుంచుకొనుటకు అంకుశమెటుల అవసరమో అటులనే సమస్త సంసారమును మర్యాదలలో నిలుపుటకు రాజధర్మము ఆవశ్యకమైయున్నది. ఈ విషయముల గురించిన వివేచన ఏబదియారవ అధ్యాయములో నున్నది. రాజునకు యుండదగు ధర్మానుకూల నీతివర్తన ఏబదిఏడవ అధ్యాయములో నున్నది. బుద్ధిమంతుడు, త్యాగి, శత్రుదుర్బలము విచారణ చేయుతత్పరుడు, సమస్త వర్ణములవారి న్యాయాన్యాయములు తెలిసినవాడు, ఆశ్రితులపై కృపజూపువాడు, మహామనస్వి, కోమలస్వభావము గలవాడు, ఉద్యోగశీలి, కర్మఠుడు, ఆత్మప్రశంసకు దూరముగా నుండువాడు, కార్యారంభములన్నియు చక్కగా పూర్తిచేయువాడు రాజులలో శ్రేష్ఠునిగా పరిగణించబడును. పుత్రుడు తన తండ్రి గృహములో నిర్భయుడై యుండునటుల ఏ రాజుయొక్క రాజ్యములో ప్రజలు నిర్భయులై యుందురో ఆ రాజు శ్రేష్ఠుడనబడును. ఎవని రాజ్యములో చోరబాధలుండవో, న్యాయాన్యాయముల వివేచన యుండునో ఆ రాజు

శ్రేష్ఠుడనబడును. ఎవని రాజ్యములో నివసించు ప్రజలు విధిపూర్వకముగ, సురక్షితులై పాలించ బడుదురో, ప్రజలు తమ తమ కర్మలందు సంలగ్నులై యుందురో, దేహాసక్తి లేక జితేంద్రియులై యుందురో, తమకు తాము వశవర్తులై యుందురో, శిక్షణనిచ్చుటలో – నేర్చుకొనుటలో యోగ్యతగలిగి యుందురో, రాజశాసనమును పాలించెదరో, కలహ వివాదములకు దూరముగానుందురో, దానము లిచ్చుటయందు ప్రీతిగలిగియుందురో ఆ రాజు శ్రేష్ఠుడనబడును. రాజ్యరక్షణ సాధనలు ఏబది ఎనిమిదవ అధ్యాయములో చెప్పబడినవి. బ్రహ్మ దేవుని నీతిశాస్త్ర ఆవిర్భావము – రాజోద్భవము గురించి ఏబదితొమ్మిదవ అధ్యాయము విస్తారముగా వర్ణించినది. ఒకప్పుడు దేవతలు బ్రహ్మదేవుని కడకేగి మానవలోకములో మానవులు కర్తవ్యాకర్తవ్య విముఖులై జ్ఞానశూన్యులగుటచే ధర్మము – ధర్మమర్యాదలు నశించెననియు, మానవులు లోభాధీనులై కామరాగ ద్వేషములకు లోనయ్యిరని, కర్తవ్యాకర్తవ్య జ్ఞానశూన్యులై అగమ్యగమనము, వాచ్య అవాచ్యము, భక్ష్యము అభక్ష్యము, దోష అదోషములు తెలియకుండిరనియు, ఆ ప్రకారము మానవలోకములో ధర్మవిప్లవము సంభవించెనని విన్నవించిరి. అపుడు వేద స్వాధ్యాయము లేకుండుటచే వైదికజ్ఞానము లుప్తమగుటచే వైదిక కర్మలు లోపించెను"అని కూడ విన్నవించుకొనిరి. అపుడు బ్రహ్మదేవుడు స్వబుద్ధితో ఒక లక్ష అధ్యాయముల నీతిశాస్త్రమును రచించెను. అందులో ధర్మార్థ కామములనెడి మూడు పురుషార్థముల గురించి విస్తారముగ వర్ణించబడెను. అందుచే యీ ప్రకరణము త్రివర్గ నామముతో విఖ్యాతిచెందెను. నాల్గవ పురుషార్థమగు మోక్షము యీ త్రివర్గలకన్న భిన్నమైనది. దండనీతి త్రివర్గలో స్థానము – వృద్ధి – క్షయము యున్నవి. బ్రహ్మదేవుడు రచించిన నీతిశాస్త్రములో ఆత్మ – దేశము – కాలము – ఉపాయము – కార్యము – సహాయకులు యను ఆరువర్గల వర్ణన యున్నది. ఈ ఆరువర్గల నీతి సంచాలనమువలన ఉన్నతిని సాధించవచ్చును. ఈ గ్రంథములో వేదత్రయీ (కర్మకాండ), అన్వీక్షకీ (జ్ఞానకాండ), వార్తా (కృషి – వాణిజ్య – గోరక్షణ), దండనీతియను విద్యలు విపులముగ నిరూపించ బడినవి. నీతిశాస్త్రములోని విషయములు విస్తారముగ ఏబదితొమ్మిదవ అధ్యాయములో వర్ణించబడినవి. అటులనే భీష్మ పితామహుడు వర్ణ ధర్మములు, ఆశ్రమ ధర్మముల గురించి, వర్ణాశ్రమ ధర్మములలో రాజధర్మ విశిష్టత గురించి యుధిష్ఠిరునకు బోధించెను. తదనంతరము ఇహపరలోక సుఖములు పొందదలంచిన రాజునకు యుండదగు ముప్పది యారు గుణములు, రాజపురోహితుని ఆవశ్యకత, ఉత్తమాధమ బ్రాహ్మణులతో రాజు వర్తించు విధానము, రాజునకు ఎవరి ధనముపై అధికారము ప్రాప్తించును, మిత్ర శత్రువులను గుర్తించుట, సభాసదుల లక్షణములు, గుప్త మంత్రణ విధానము, మధుర భాషణ మాహాత్మ్యము, రాజోద్యోగుల గుణములు, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్రరక్షణ, ప్రజలనుండి పన్నులు గ్రహించు విధానము, రాజుయొక్క కర్తవ్యములు, విజయాభిలాషి రాజుయొక్క యుద్ధనీతి, శూరవీర క్షత్రియుల కర్తవ్యము, సమరాంగణములో మరణించువారికి లభించు శ్రేష్ఠగతులు, సైన్య సంచాలన రీతిరివాజులు, భిన్నభిన్న దేశములకు చెందిన యోధుల లక్షణములు, విజయసూచక చిహ్నములు మున్నగునవి భీష్ముడు విస్తారముగ యుధిష్ఠిరునకు వర్ణించెను. తదనంతరము యుధిష్ఠిరుడు గణతంత్రరాజ్య ప్రజలు ఏ ప్రకారము అభ్యుదయమును సాధించెదరో తెలుపమని అడిగెను. అందులకు భీష్ముడు "రాజా! గణతంత్ర రాజ్యములందు

సంఘంటిత బలపౌరుషముల వలన అభీష్ట ప్రయోజనములు సిద్ధించును. ప్రాజ్ఞులను, పరాక్రమవంతులను, మహోత్సాహముతో కార్యములను నిర్వహించు వారిని గౌరవించుచు గణరాజ్య సదస్సులు సదా ప్రయత్నశీలురై యుండ వలెను." అనెను. తదనంతరము యుధిష్ఠిరుని కోరికపై భీష్ముడు సత్యాసత్య వివేచనము, ధర్మలక్షణముల గురించి చెప్పెను. సత్యమును మించిన ధర్మము మరొకటిలేదు. ఒక ప్రాణి సంకటము నుండి విముక్తమగుట లేదా సత్యము చెప్పుటవలన సంకటస్థితియందు పడుట జరుగునపుడు సత్యమును పలుకరాదు. అచట అబద్ధమాడుటయే సముచితము. ఎవనియందు సత్యము స్థిరముగా నుండదో అతడు నశించును. ఏ పలుకుయందు లేదా నిర్ణయమునందు అభ్యుదయము, శ్రేయస్సుదాగి యుండునో అదియే ధర్మము. అందరినీ ధరించునది ధర్మము. అధోగతి గాకుండ జీవన రక్ష కలిగించునది ధర్మము. ధారణ – పోషణ సిద్ధింప చేయునదగుటచే ధర్మమునకు ఆ నామము గలిగెను. ప్రాణులను హింసింపక యుండుటకై ధర్మోపదేశము జరుగును. కనుక ఎచట అహింసయుండునో అదియే ధర్మమని ధర్మాత్ములు నిశ్చయించిరి. అహింస, సత్యము, అక్రోధము, తపస్సు, దానము, మనస్సు – ఇంద్రియ సంయమనము, విశుద్ధబుద్ధి, ఎవరి యందును దోషమును చూడకుండుట, ఒకరిని జూచి అసూయ, ద్వేషముతో రగలకుండుట, ఉత్తమ శీలస్వభావములు కలిగియుండుట సనాతన ధర్మములని పరమేష్టి బ్రహ్మదేవుడు వచించెను. ఎవని జీవనము నియమాను సారము అనుకూలమునైయుండునో, ఎవని బుద్ధి విషయములవైపు పోకుండగయుండునో అతడు దుః ఖములను దాటును. ఇతరులు పరుష వచనము లాడిననూ, నిందించిననూ ప్రత్యుత్తరము నీయకుండు వారు లేదా ఒకని ద్వారా దెబ్బతిన్ననూ స్వయముగా ప్రహారము చేయనివారు లేదా ఇతరులను ఏమీ అడగనివారు, ఇతరులయందు దోషముల నెంచనివారు, ప్రతిదినము అతిథులను సత్కార పూర్వకముగ ఆదరించువారు, నిత్యము నియమపూర్వకముగ వేదాది సద్గ్రంథములను స్వాధ్యాయమొనర్చువారు, సదా మాతాపితర సేవయందు సంలగ్నమగువారు, పగటిపూట నిదురించనివారు, మనోవాక్కాయ కర్మలతో ఎన్నడూ పాపము చేయనివారు, ఏ ప్రాణికిని కష్టమును కలిగించనివారు దుఃఖములనుండి సుఖముగా విముక్తి పొందగలరు. మూర్ఖులయొక్క కఠోర వచనములను, ప్రలాపములను ఉపేక్షించుటయే మేలు. అతడు అందరికి ద్వేషపాత్రుడగును. అతడి సత్కర్మలన్నియు నిష్ఫలములగును. హింసించు వానిని తిట్లతో నివారించు ప్రయత్నము చేయుట వ్యర్థము. నెమలి నృత్యము చేయునపుడు తన గుప్తాంగములను బహిర్గతమొనర్చును. అటులనే మూర్ఖుడు అనుచిత ఆచరణతో కుచేష్టలతో తనలో దాగియున్న దోషములను ప్రదర్శించును. రాజునకు సహాయకులు లేకుండగ అర్థసాధన కుదరదు. ఒకవేళ అది లభించిననూ దానిని రక్షించుట అసంభవమగును. ఎవని సేవకులు జ్ఞానవిజ్ఞాన కుశలురో, హితైషులో, కులీనులు – స్నేహశీలురో అట్టిరాజు మాత్రమే పరిపాలనా దక్షుడగును. గుణవంతులగువారిని యోగ్యస్థానము లందు నియోగించిన రాజు యశస్వంతుడగును. యోగ్యతను బట్టి ఉన్నతస్థానము నీయవలెను. సాధుపురుషులు, కులీనులు, శూరవీరులు, జ్ఞానులు, దోషదర్శనము లేనివారు, మంచి స్వభావముగలవారు, పవిత్రులు, కార్యదక్షులగు వారిని అంతరంగిక పదవులందుంచవలెను. వినీతులు, కార్యదీక్షాపరులు, శాంతస్వభావులు, చతురులు,

నిందారహితముగ తమ విధులను నిర్వర్తించువారిని బాహ్యోద్యోగులగ నియమించ వలెను. పురుషుడు ప్రతిదినము శాస్త్రస్వాధ్యాయము చేయుచున్నకొలది జ్ఞానవృద్ధియగుచుండును. విశేషజ్ఞానము పొందవలెనను అభిరుచి పెరుగుచుండును. జ్ఞానము లేకున్నచో మానవులకు ఆపదకాలములో అవసరమైన ఉపాయములు స్ఫురించవు.

ఆపద్ధర్మములు: శాంతిపర్వము 131 అధ్యాయమునుండి 173 అధ్యాయమువరకు ఆపద్ధర్మములు చెప్పబడినవి. ఆపదలలోనున్న రాజుయొక్క కర్తవ్యములు 131 అధ్యాయములో వర్ణించిరి. దుష్టపురుషుల నుండి ధనమును గ్రహించి సత్పురుషులకు సమర్పించువాడే ఆపద్ధర్మము నెరిగినవాడు. ఈ జగత్తులో ధనముగ పరిగణించబడు నదంతయు శ్రేష్ఠపురుషుల కొరకు యున్నది. తల బిరుసుతో కర్తవ్యాకర్తవ్యములను విచారించక కుమార్గము ననుసరించు గురువు నైననూ దండించ వలసిన ఆవశ్యకత యున్నది. వంచనతో, మోసముతో ధనప్రాప్తి పొందువాడు ధర్మభ్రష్టుడగును. వేదవిహితము, ధర్మసమ్మతము, సజ్జనసేవితము, తనకు ప్రియము గూర్చునది ధర్మమగును. ఈ ప్రకారము ధర్మము చతుర్గుణ సంపన్నమై యున్నది. ఇట్టి ధర్మములను ఉపదేశించువాడే ధర్మజ్ఞుడన బడును. బలము – ధర్మము యనువానిలో బలమే శ్రేష్ఠమైనది. ఏలననగా బలము యున్నపుడే ధర్మప్రవృత్తి గలుగును. ప్రాణుల సంచారమునకు పృథివి ఆధారమైనటుల ధర్మముకూడ బలముపైననే ప్రతిష్ఠితమైయున్నది. లతలు వృక్షము నాశ్రయించి ప్రాకునటుల నిర్బలమగు ధర్మముకూడ బలము నాశ్రయించి స్థిరత్వమును పొందుచున్నది. సంకట పరిస్థితులలో రాజు ఎటుల వ్యవహరించవలెనో 136, 137 అధ్యాయములందున్నది. కణికుని కూటనీతి నూటనలుబదవ అధ్యాయములో చెప్పబడినది. ఎవరైననూ ఒకేఒక శాఖయొక్క ధర్మమునెరిగి సంతృప్తిచెందరాదు. సంకట పరిస్థితిలో ఎవని బుద్ధికి స్ఫురించిన ఉపాయముతో వారు ఆత్మరక్షణ గావించుకొనెదరు. ధర్మము – సత్పురుషుల ఆచారము యను రెండును బుద్ధినుండి ప్రకటితమగును. సత్యజ్ఞాన సంపన్నులైనవారే సత్పురుషులు. సత్పురుషుల జ్ఞానము మాత్రమే సర్వదా ఆదరణీయము. ధర్మద్రోహులు మాత్రమే శాస్త్రప్రమాణమును స్వీకరించరు. జీవికకొరకు విద్యనేర్చినవాడు అదే విద్యాబలముతో తాను సర్వత్రా యశస్సునా కాంక్షించును. వారు పాపాత్ములు – ధర్మద్రోహులుగ పరిగణించబడెదరు. పరిపక్వతలేని బుద్ధి మాంద్యుడు, మందమతి యదార్థ తత్త్వమునెరుగడు. నిరంతరము శాస్త్రమునందు దోషములనెంచువాడు శాస్త్ర మర్యాదలను చెడగొట్టును. వాక్చాతుర్యముతో ఇతరుల విద్యను నిందించుచు తన విద్య శ్రేష్ఠమని మిథ్యా ప్రచారము చేయువాడు ధర్మవిద్రోహిగ పరిగణించ బడును. వీరిని రాక్షస సమానులుగ చూడవలెను. వారితో సంపర్కమువలన సత్పురుష ధర్మము నశించును. శాస్త్రవచనము – తర్కము యొక్క సముచ్చయము ద్వారా మాత్రమే ధర్మ నిర్ణయము జరుగునని బృహస్పతి వచనము.

బుద్ధిమంతులు శిష్టాచారమును ధర్మమనెదరు. బుద్ధిమంతుడైననూ శాస్త్ర విషయమును సరిగా అర్థముచేసుకొనక మోహ వశుడై ఉప్పొంగుచు శాస్త్ర ప్రవచనములు చేసినను ఆ ప్రభావము లోక సమాజముపై ప్రసరించదు. వేదశాస్త్రములద్వారా అనుమోదితము, తర్కయుక్త బుద్ధిద్వారా సమర్పితము నైన వచనములు మాత్రమే ప్రశంసించబడి ప్రజల మనస్సులో ప్రతిష్ఠిత మగును. కొందరు అజ్ఞాత విషయమును జ్ఞాతమొనర్చుటకు తర్కమే శ్రేష్ఠమార్గము

అనుకొనెదరుగాని అది వారి తెలివితక్కువతనము. తర్కముతో శాస్త్రమును, శాస్త్రముతో తర్కమును బోధించుటకు ప్రయత్నించరాదు. రెండిటి సహాయముతో కర్తవ్యమును నిశ్చయించి పాలించవలెను. లోభము వలననే పాపప్రవృత్తి గలుగును. లోభముద్వారా పాపము, అధర్మము, మహా దుఃఖము ఉత్పన్నమగును. శఠము, వంచన, కపటములకు మూలకారణము కూడ లోభము. లోభముతో క్రోధము వ్యక్తమగును. కామప్రవృత్తి కూడ యగును. అంతేగాక లోభముతో మాయ, మోహము, అభిమానము, ఉద్ధండత, పరాధీనము మున్నగు దోషములు సంభవించును. అసహనము, నిర్లజ్జ, సంపద్వినాశము, ధర్మక్షయము, చింత, అవయశస్సు కూడా లోబోత్పన్నములు. లోభము వలననే కృపణత, తృష్ణ, శాస్త్రవిరుద్ధ కర్మలందు ప్రవృత్తి చెందుట, కులాభిమానము, విద్యావిషయ గర్వము, రూపైశ్వర్యమదము, ప్రాణులయెడ ద్రోహము, అందరినీ తృణీకరించి తిరస్కరించుట, అందరిపై అవిశ్వాసము, కుటిలవర్తనము కూడ సంభవించును. పరుల ధనమును అపహరించ దలంచుట, పరస్త్రీని బలాత్కరించుట, నోరు అదుపులో లేకుండుట, మనస్సులో తొందరబాటు, పరనిందా ప్రవృత్తి, జననేంద్రియ వేగము, ఉదరపోషణకై అనురక్తి, ఆత్మహత్యాప్రవృత్తి, ప్రబల ఈర్ష్యాదోషము, మిథ్యావ్యవహారము నెరవుట, అనివార్య జిహ్వాచాపల్యము, దుస్సహ శ్రవణేంద్రియ వేగము, ఘృణిత వ్యవహారము, ఆత్మస్తుతి కొరకు దంబముతో పలుకుట, మాత్సర్యము, పాపయుక్తి, దుష్కర్మలు చేయుటయందాసక్తి మున్నగునవి లోభము యొక్క ప్రభావములు. బాల్య కౌమార యౌవ్వన దశలలో దేని కారణముచే దుష్కర్మలను వదిలిపెట్ట లేకుందురో, వృద్ధాపస్థలో కూడ ఏది శిథిలము గాకుండునో అట్టి లోభగుణము గురించి ఎంతచెప్పిననూ చాలదు. నదులన్నియు వచ్చి చేరినను సముద్రము నిండననటుల జగత్తులోని వస్తువులన్నియు ప్రాప్తించినను లోభియొక్క తృష్ణ తీరకుండును. కనుక ప్రతి ఒక్కరు మనస్సును, ఇంద్రియములను వశమునందుంచుకొని యీ మోహనహిత లోభమును జయించుటకు ప్రయత్నించవలెను. లోభమువలన అజ్ఞానము - అజ్ఞానమువలన లోభము ఉత్పన్నమగును. మోహాత్మక అజ్ఞానమే మనుష్యుల దుర్గతులకు కారణమగుచున్నది. లోకములో శ్రేయోదాయకము లగు అనేక మతములున్నవి. కాని ఇహపర లోకము లందు శుభమును గూర్చునేది? ధర్మమార్గము విస్తృతమైనది. అనేక శాఖలతో విస్తరించియున్నది. వాస్తవముగ ధర్మమునకు మూలమేది? మహర్షులు తమతమ జ్ఞానసాధనలలో ఒకే ధర్మమును అనేక రీతుల చెప్పిరి. కాని అన్నిటికి ఆధారమగు ఇంద్రియ మనోనిగ్రహమనెడి దమము శ్రేష్ఠము. దమము ఒక పవిత్ర సాధన. దానివలన తేజస్సు వృద్ధిచెందును. ఈ సంసారములో దమముతో సమానమైన వేరొక ధర్మములేదు. దమము గురించి కూలంకషముగా నూట అరువదవ అధ్యాయము నందు చెప్పబడినది. నూట అరవదొకటవ అధ్యాయములో తపస్సు మహిమ గురించి వర్ణించబడెను. సంపూర్ణ జగత్తు ప్రభవించుటకు తపస్సే మూలము. తపస్సు చేయని మూఢునకు శుభకర్మల ఫలములు సిద్ధించవు. ఋషులు తపస్సుతో వేదజ్ఞానమును పొందిరి. బ్రహ్మదేవుడు తపస్సుతో అన్నమును ఉత్పన్న మొనర్చెను. ఔషధములు, ఆరోగ్యాదులు, శుభప్రాప్తి మున్నగు, క్రియాశీల కార్యములన్నియు తపస్సుతోనే సిద్ధించును, ప్రతిసాధనకు తపస్సే మూలము. సంసారములో దుర్లభమైనదేదైననూ తపస్సుతో సులభసాధ్యమగును.

నూట అరవైరెండవ అధ్యాయములో సత్యము గురించి, సత్యము తత్త్వము గురించి, సత్య మహిమ గురించి వర్ణించ బడినది. నూట అరవదిమూడవ అధ్యాయములో కామక్రోధాది పదమూడు దోషముల నివారణోపాయముల గురించి విస్తృతముగా చెప్పబడినది. నూట అరువదినాల్గవ అధ్యాయములో నృశంస (క్రూరులు) పురుషుల లక్షణములు చెప్పినది. వారికి దూరముగ నుండుట శ్రేయస్కరము. సర్వదా సత్పురుషుల స్నేహమును చేయవలెను. నానావిధ పాపములకు చేయదగు ప్రాయశ్చిత్త కర్మల గురించి నూట అరువదైదవ అధ్యాయమునందున్నది. ఎవరితో మైత్రి నెరపవలెనో, ఎవరికి దూరముగ నుండవలెనో భీష్మపితామహుడు నూట అరువదెనిమిదవ అధ్యాయములో విశదముగ చెప్పెను.

గీతలు: బ్రహ్మర్షి ఋషభుడు ఒకప్పుడు ఆశాతత్త్వముగురించి సుమిత్రుడను రాజునకు బోధించిన విషయము నూట ఇరువదారు నుండి నూట ఇరువదెనిమిదవ అధ్యాయములందున్నది. ఆశ లేదా ఆశావశుని దుర్బలతకన్న మించిన దేదియూ యీ లోకమునందు లేదు. అవసరమైన వస్తువును యితరులనుండి యాచించనివాడు యీ లోకములో దుర్లభుడు. అటులనే యాచకుని కోర్కెను నిరాదరించక తీర్చువాడు కూడ దుర్లభుడు. ఎవరికైనా ఏదైనా యిచ్చెదనని ఆశగల్పించి ఆ ఉపకారమును చేయనివాడు ఆశావశుని కన్న బలహీనుడు. కనుక దేహమును కృశింపజేయు ఆశను పరిత్యజించవలెను. పంచపాండవులు, విదురుడు ధర్మచర్చ చేసిన విషయము నూట అరువదేడవ అధ్యాయములో షడ్జగీతగానున్నది. ముమ్మందుగా విదురుడు "యుధిష్ఠిరా! ధర్మమే సమస్తమునకు మూలము. ధర్మముతోనే ఋషులు సంసార సముద్రమును దాటిరి. ధర్మముపై సమస్తలోకములు నిలిచియున్నవి. ధర్మమువలననే సమస్త దేవతలు ఉన్నతిని పొందిరి. ధర్మమునందే అర్థస్థితికూడ యున్నది. ధర్మమే శ్రేష్ఠ గుణము. అర్థము మధ్యమము. కామము అల్పము. కనుక మనస్సును వశమునందుంచుకొని ధర్మమును ప్రధాన ధ్యేయముగా చేసుకొనవలెను."అనెను. తదనంతరము అర్జునుడు అర్థతత్త్వము శ్రేష్ఠమనియు, భీమసేనుడు కామపురుషార్థము శ్రేష్ఠమనియు, నకుల సహదేవులు ధర్మార్థములు రెండును సమన్వయ మొనర్చుకొనుట శ్రేష్ఠమనియు వారివారి వాదములను వినిపించిరి. అపుడు యుధిష్ఠిరుడు ధర్మార్థకామములు మూడు లేకున్ననూ మనుష్యులు ఆవశ్యక పదార్థములను పొందెదరు. కాని ఆసక్తి రహితుడైన వానికి మాత్రమే మోక్షసిద్ధియగునని బ్రహ్మదేవుడు వచించెను. కనుక ముముక్షువులు ఎవరికీ ప్రియా ప్రియములు చేయరాదు. ఇదియే మోక్షమునకు ప్రధాన ఉపాయము. విధాత నిర్ణయించిన విధముగ ప్రాణులు విభిన్న కార్యములందు ప్రేరణ పొందుచుందురు. విభిన్న కార్యములు చేయు చుందురు. కావున విధి విధానమే ప్రబలమై యుండును. కనుక మోక్షప్రాప్తి ఒక్కటియే వాస్తవిక శుభమును గూర్చును. మోక్షప్రాప్తికి జ్ఞానమొక్కటియే ఉపాయము"అని చెప్పెను.

ఉపాఖ్యానములు: ధర్మార్థకామమోక్ష సంబంధమైన అనేక ఉపాఖ్యానములు శాంతి పర్వమునందున్నవి. ఏదైనా గంభీర తత్త్వమును దెలుపుటకు ప్రాచీన ఇతిహాసములు గాని, కథలుగాని చెప్పి తత్త్వబోధ నొనరించుటయే ఉపాఖ్యానముల యొక్క లక్ష్యము. మహాభారతము నందు ఎన్నియో ఉపాఖ్యానములు వివిధ పర్వములలో గాన వచ్చుచున్నవి. ప్రస్తుత శాంతిపర్వ పూర్వ భాగము నందున్న ఉపాఖ్యానములిచట సంగ్రహముగ దెలుపబడుచున్నవి. మహాభారత సంగ్రామములో బహు సంఖ్యాక జన సంహారము, గజాశ్వ సంహారము

జరిగినందులకు యుధిష్ఠిరుడు శోకసంతప్తుడై, ఆ యుద్ధమునకు తానే కారణమని దలంచి చింతించసాగెను. అందరూ అన్ని విధముల నచ్చజెప్ప ప్రయత్నించిననూ సమాధానపడక మౌనస్థితుడై యుండుట గమనించిన అర్జునుడు తమకు అత్యంత సుహృదుడైన శ్రీకృష్ణభగవానుని ప్రార్థించి యుధిష్ఠిరునకు ధర్మబోధ చేయుమనెను. ఆ సందర్భమున శ్రీకృష్ణభగవానుడు పూర్వము దేవర్షి నారదుడు చెప్పిన షోడశమహారాజుల వైభవమును, వారి జీవనాంతమును యుధిష్ఠిరునకు చెప్పి సాంత్వన గూర్చప్రయత్నించెను. ఈ ఉపాఖ్యానము ఇరువది తొమ్మిదవ అధ్యాయము నందున్నది. షోడశమహారాజుల చరిత్రను దేవర్షి నారదుడు ఏ సమయమున ఎవరికి ఉపదేశించ బడెనో దెలుపుటకై నారద - పర్వత మహర్షుల ఉపాఖ్యానము ముప్పదియవ అధ్యాయములో వర్ణించబడెను. పరశురాముని క్షత్రియ సంహార చరిత్రను, క్షత్రియ వినాశము - పునరుత్పత్తుల గురించి నలుబదెనిమిది, నలుబదితొమ్మిదవ అధ్యాయములలో యుధిష్ఠిరునకు ఉపదేశించెను. తదనంతరము పాండవులతో గూడి కురుక్షేత్రమున కేగి భీష్మునకు దర్శనభాగ్యము నిచ్చిన శ్రీకృష్ణుడు మున్ముందుగా భీష్ముని గుణములను ప్రభావమును యుధిష్ఠిరునకు ఏబదియవ అధ్యాయములో చెప్పెను. అటులనే భీష్మునకు ధర్మోపదేశము చేయు స్థిమితబుద్ధి - ఆరోగ్యమునిచ్చి యుధిష్ఠిరునకు సమస్త ధర్మముల గురించి ఉపదేశించమని ఆదేశించెను. క్షాత్రధర్మవైశిష్ట్యము గురించి ఇంద్ర - మాంధాత సంవాద రూపముగనున్న ప్రాచీన ఇతిహాసమును భీష్ముడు 63, 64, 65 అధ్యాయములలో యుధిష్ఠిరునకు వివరించెను. చతుర్విధ ఆశ్రయముల ధర్మములు, యతి ధర్మములు, లౌకిక వైదిక ఉత్కృష్ట ధర్మములు మున్నగునవన్నియు క్షాత్రధర్మమునందే ప్రతిష్ఠితమైయున్నవి. క్షాత్రధర్మము లేకున్నచో యీ జగత్తులోని జీవులన్నియు తమ మనోవాంఛిత వస్తు ప్రాప్తిలో నిరాశ చెందవలసి యుండును. మూడు వర్ణముల ధర్మములు క్షత్రియ ధర్మములో అంతర్భూతమై నటుల నైష్ఠిక బ్రహ్మచర్య - వానప్రస్థ - యతి ధర్మములు బ్రాహ్మణుల గార్హస్థ్యధర్మమునందు సమావేశమై యుండును. పురోహితునియొక్క ఆవశ్యకత - ప్రాధాన్యత గురించి పురూరవ - కశ్యప మహర్షుల సంవాదము డెబ్బదిమూడవ అధ్యాయము నందున్నది. అటులనే బ్రాహ్మణ క్షత్రియ కలయిక బహువిధముల ప్రయోజనకారి యను విషయము డెబ్బదినాల్గవ అధ్యాయము నందున్నది. ధర్మాచరణ మహాత్మ్యము మాంధాత - ఉతథ్యుల సంభాషణగ తొంబది, తొంబదియొకటవ అధ్యాయములలో నున్నది. వసుమన మహారాజు - వామదేవ మహర్షి సంవాదములో ధర్మాచరణము - రాజోచిత ప్రవర్తన - రాజురాజ్యములు వర్తించువిధానము 92 నుండి 95 అధ్యాయములలోనున్నది. క్షేమదర్శి - కాలక వృక్షీయ సంవాదములో రాజ్యభ్రష్టుడైన రాజు మరల ఉద్ధరించుకొను ఉపాయము 104 నుండి 106 అధ్యాయములలో చెప్పబడెను.

మాతాపితర - గురుసేవా మహాత్మ్యము గురించి నూటఎనిమిదవ అధ్యాయములో వర్ణించ బడినది. తల్లి - తండ్రి - గురువు యనువారు ముల్లోకములు. వీరే మూడు ఆశ్రమములు. వీరే వేదత్రయము. వీరే త్రేతాగ్నులు. పితృసేవచే యీ లోకమును, మాతృసేవచే పరలోకమును, గురుసేవచే బ్రహ్మలోకమును పొందెదరు. సోమరితనము చేటు దెచ్చునని దెలుపుటకు నూటపండ్రెండవ అధ్యాయములో ఒక ఒంటె ఉపాఖ్యానము చెప్పబడినది. శక్తిశాలి చెంత సతమస్తకుడై యుండుట మేలుయని బోధించుటకు

బూరుగువృక్షము - వాయువుయొక్క ఉపాఖ్యానము నూటపదమూడవ అధ్యాయమునందున్నది. సజ్జన వ్యవహారమును వర్ణించుటకై నూటపదునారు నూట పదునేడు అధ్యాయములలో ఒక మహర్షి ద్వారా కృపాపాత్రమైన శునకము తన దుష్టబుద్ధిని వీడకుండుటచే యథాపూర్వస్థితిని పొందెనని చెప్పబడెను. దండన స్వరూపము - దండోత్పత్తి - దండము క్షత్రియ పరంపరాగతమగుట మున్నగు విషయములు నూటఇరువదొకటి, నూటఇరువది రెండు అధ్యాయములలో నున్నది. ఈ సంసారములో సర్వస్వము దేని అధీనము నందున్నదో ఆ అద్వితీయ పదార్థమును దండము అనెదరు. ఇష్టులపట్ల, అనిష్టులపట్ల సమభావము గలిగి, ఎవరినైనను పక్షపాతము చూపక దండశాసనమును చక్కగా ఉపయోగించుటవలన ధర్మార్థకామములు సిద్ధించును. దండముయొక్క నామములు రూపములు అనేకమని చెప్పబడెను. దండనీతి యథార్థముగ సత్యస్వరూపము. అదియే ముల్లోకములను శాసించి ధరించుచున్నది. కావున సత్పురుషుల దృష్టిలో దండమే సనాతన వ్యవహారము. వ్యవహార స్వరూప వేదమే ధర్మము, ధర్మమునకు మరొకపేరు సన్మార్గము. దుష్టదమనమే దండము యొక్క ప్రధాన ఉద్దేశ్యము. దండము ఒకరినుండి ఒకరికి ఎటుల హస్తగతమైనదో యీ ఉపాఖ్యానము వివరించినది. ధర్మార్థములను పరిత్యజించి కేవలము కామమును సేవించువాని బుద్ధి నశించును. బుద్ధి నాశనమునే మోహమనెదరు. అది ధర్మార్థములు రెండిటిని మోహమొనర్చును. ఆ కారణముచే మనుష్యులలో నాస్తికత ఆవహించును. నాస్తికత దురాచారమునకు దారితీయును. అట్టి దుష్టులను, దురాచారులను దండించి వశమునకు తేకున్న రాజుయొక్క రాజ్యములోని ప్రజలు సర్పమున్న గృహములో నివసించునటుల ఉద్విగ్నులై యుందురు.

శీలము యొక్క మహాత్మ్యము గురించి ఇంద్ర ప్రహ్లాద ఉపాఖ్యానమున్నది. మనోవాక్కాయకర్మలద్వారా ఏ ప్రాణికి ద్రోహము తలబెట్టక, ప్రాణులందరిపై దయజూపి, యథాశక్తి దానము చేయుటనే శీలము అనెదరు. సచ్ఛీలము గలవాడు త్రిలోక విజయిగా వచ్చును. దయాళువులను శీలవంతులగుటచేతనే యీ పృథివినంతటిని మాంధాత చక్రవర్తి ఒక దినములో, జనమేజయుడు మూడు దినములలో, నాభాగుడు ఏడుదినములలో జయించగలిగిరి. దైత్యరాజు ప్రహ్లాదుడు కేవలము తన శీలసంపదతో మహేంద్రుని దేవరాజ్యమును సంపాదించెను. ప్రహ్లాదుడు ఆ శీలమును ఛద్మవేషములోనున్న దేవేంద్రునకు దానమిచ్చి సమస్తమును కోల్పోయెను. మర్యాదలను పాటించు బందిపోటు దొంగకూడ మరణానంతరము దుర్గతులను పొందడను ఇతిహాసము కాయవ్యదస్యుని ఉపాఖ్యానము ద్వారా నూటముప్పదైదవ అధ్యాయము నందు చెప్పబడెను. మార్జాల - మూషిక ఉపాఖ్యానముద్వారా సంకట పరిస్థితుల నూహించి వ్యవహరించుతీరు నూట ముప్పది ఏడు, నూట ముప్పది ఎనిమిదవ అధ్యాయములందు చెప్పబడెను. శత్రువుతో సదాసావధానులై యుండవలెనని పూజని - బ్రహ్మదత్తుల ఉపాఖ్యానము ద్వారా నూటముప్పది తొమ్మిదవ అధ్యాయములో చెప్పబడెను. భయంకర సంకట పరిస్థితిలో బ్రాహ్మణుడెటుల జీవన నిర్వాహము చేయవలెనో విశ్వామిత్ర - చండాల సంవాదము ద్వారా నూట నలుబదొకటవ అధ్యాయములో చెప్పబడెను. శరణాగత రక్షణ - అతిథిసత్కార మహిమ గురించి 143 నుండి 149 అధ్యాయమువరకు పావురముల జంట - బోయవాని ఉపాఖ్యానముద్వారా చెప్పబడెను. బ్రహ్మహత్యా పాతకమును తొలగించుకొనుటకై జనమేజయ మహారాజు ఇంద్రోతముని నాశ్రయించి ఆయన ఉపదేశముతో పవిత్రుడైన విధానము 150-151

అధ్యాయములలో చెప్పబడినది. బ్రాహ్మణసేవ చేయుటయే పారలౌకిక హేతువు. నిరంతరము ధర్మముపై దృష్టి నిలుపవలెను. దీర్ఘకాలము భక్ష్యభోజ్య పదార్థములు త్యజించి తపస్సు చేయుటచే పాపములు నశించును. యజ్ఞము, దానము, చక్కగా చేసిన తపస్సుల ద్వారా పాపక్షయమగును. సుఖదుఃఖములు నానాప్రకార సంసర్గదోషముల ననుసరించి ప్రాప్తించును. మమతాహంకారములతోబాటు సమస్తమును త్యజించినవారు, పుణ్యపాపములు త్యజించి నివృత్తి చెందినవారియొక్క జీవనము కల్యాణమయమై యుండును. ఎవనియందు బలము – ఓజస్సు యుండునో అతడే ధర్మాచరణ సమర్థుడగును. ఒక సంవత్సరము నియమ పూర్వకముగ అగ్నిహోత్రము నారాధించువానికి తనపై పడిన కళంకిత దోషము దూరమగును. మూడు సంవత్సరములు విధిపూర్వకముగ అగ్నోపాసన చేసినచో భ్రూణ హత్యాపాపము తొలగిపోవును. లేదా పుష్కరము, ప్రభావతీర్థము, ఉత్తరమానససరోవరము మున్నగు తీర్థములను సేవించుచు వందయోజనముల పాదయాత్ర చేయవలెను. మానవుడు మూడుమార్లు అఘమర్షణ మంత్రమును జపించుచు నీటిలో మునకలు వేసినచో అశ్వమేధయాగము చేసి అవభృథ స్నానము చేసిన ఫలము లభించునని మనుధర్మశాస్త్ర వచనమున్నది. అఘమర్షణ మంత్రములను నిత్యము జపించువాడు శీఘ్రమే సర్వపాపవిముక్తుడగును. సర్వత్రా సన్మానమును పొందును. ప్రాణులన్నియు అతనిపై ప్రసన్నతచెందును. చనిపోయిన మనిషి మరల సజీవుడగుట చాల అరుదైన విషయము. ఒక నక్క – గ్రద్ద స్మశాన భూమిలో ఒక మృతబాలుని విషయమై వారిబంధువులతో చేసిన సంవాదము నూటనలుబది మూడవ అధ్యాయమునందున్నది. బలవంతులతో విరోధముకన్న ఒదిగియుండుటయే మేలు యను హితబోధ చేయుచు వాయుదేవుడు – శాల్మలీవృక్ష ఉపాఖ్యానము 154 నుండి 157 అధ్యాయములలో నున్నది. ఖడ్గోత్పత్తి – పరంపరా ప్రాప్తి మహాత్మ్యము నూటఅరువదారు, నూట అరువదేడు అధ్యాయములందున్నది. కృతఘ్నుని స్వభావము, దుర్గతుల గురించి నాడీజంఘ – గౌతమ ఉపాఖ్యానము 169–173 అధ్యాయము లందున్నది. కృతఘ్నులు విశ్వాసయోగ్యులుగారు. వారిని ఉద్ధరించుటకు శాస్త్రములో ఎట్టి ఉపాయములు లేవు.

శ్రీవేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

శాంతి పర్వము (ఉత్తర) - 10










నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥



రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

శాంతి పర్వము (ఉత్తర భాగము) - సంగ్రహ పరిచయము

శాంతి పర్వము పూర్వభాగములో రాజ ధర్మములు, ఆపద్ధర్మములు విస్తృతముగ వర్ణించబడినవి. ప్రస్తుత ఉత్తర బాగములో కేవలము మోక్షధర్మములు చెప్పబడినవి. కొన్ని ధర్మ సంవాదముల ద్వారా, కొన్ని ఉపాఖ్యానముల ద్వారా, కొన్ని స్తోత్రముల ద్వారా, కొన్ని అధ్యాత్మ గీతల ద్వారా యీ మోక్ష ధర్మములు వివరించబడినవి. శరశయ్య పై నున్న భీష్మ పితామహుడు యీ ధర్మములన్నిటిని యుధిష్ఠిరుని ప్రశ్నలకు సమాధానముగ వివరించెను.

ధర్మ ప్రసంగములు :

జగత్తు బహుదోష భూయిష్ఠమని నిశ్చయము చేసుకొన్న బుద్ధిమంతుడు మోక్షము కొరకు ప్రయత్నశీలియగును. మానవులు తమ స్త్రీ పుత్ర పిత్రాదులు మృతి చెందినపుడు "సంసారము దుఃఖమయము" అని దలంచి ఆ శోకమును దూర మొనర్చుకొనుటకు శమదమాది సాధనల ననుష్ఠించ వలెను. జలప్రవాహములో కొట్టుకొని పోవుచున్న రెండు కొయ్యదుంగలు ఒకప్పుడు కలిసి పయనించి విడిపోవు నటుల లోకములో ప్రాణుల సంయోగ వియోగములు కూడ జరుగును. అదే ప్రకారము పుత్రులు, పౌత్రులు, జాతి బంధువులు, సంబంధీకులు కూడ కలిసి విడిపోవు చుందురు. వారిపై ఆసక్తిని పెంచుకొనరాదు. ఏలననగా ఒకప్పుడు వారితో వియోగము చెందుట నిశ్చితము. సుఖ దుఃఖములు, జన్మ మృత్యువులు మున్నగునవి ప్రారబ్ధ ఆధీనములై సంభవించును. అన్యధా సుహృదులు సుఖమును, శత్రువులు దుఃఖమును కలిగించ సమర్థులుగారు. కావున బుద్ధిమంతులు సుఖదుఃఖములు ప్రియా ప్రియములు ప్రాప్తించినపుడు వానిని స్వాగతించవలెను. ధైర్యమును కోల్పోవరాదు. శోకమునకు, భయమునకు వందల వేల స్థానము లున్నవి. అవి మూర్ఖులపై, ప్రభావమును జూపును. బుద్ధిమంతులను, ఊహాపోహ కుశలురను, శిక్షిత బుద్ధి యున్నవారిని, అధ్యాత్మశాస్త్ర శ్రవణమునందు ఇచ్ఛగలవారిని, ఇతరులందు దోషములను చూడని వానిని, మనస్సును వశమునందుంచుకొనువానిని, జితేంద్రియుని శోకము స్పృశించదు. ఇట్టి విచారణ నాశ్రయించి మనస్సును కామ క్రోధాది అరిషడ్వర్గము నుండి సురక్షితమొనర్చుకొనుచు విద్వాంసులు వర్తించవలెను. ఉత్పత్తి వినాశముల తత్త్వము నెరిగిన వానిని శోకము స్పృశించదు. దుఃఖమునకు మూల కారణమగు దేహావయవమునైననూ త్యజించుటకు సిద్ధముగావలెను. మనుష్యులు ఏ పదార్థముపైననూ మమత్వమును పెంచుకొనరాదు. మమత్వమే దుఃఖ కారణమగును. కామనలు ఏవేవి పరిత్యజించబడునో అవియే సుఖకారకములగును. ఈ ప్రకారము శోక రహితులగుటకు అనేక ఉపాయములు నూటడెబ్బది నాల్గవ అధ్యాయములో రాజాసేనజిత్ శోకాకుల చిత్తమునకు శాంతి గూర్చు బోధలో చెప్పబడినవి. తదనంతరము పితాపుత్ర సంవాదములో ఆత్మకల్యాణ జ్ఞానోపదేశము నూటడెబ్బదియైదవ అధ్యాయములో నున్నది. పుట్టుకతోనే మృత్యువు – వార్ధక్యము మనిషిని వెన్నంటియుండును. స్థావర జంగమాత్మక ప్రాణులన్నిటికి యీ రెండు లక్షణము లుండును. మానవుడు జరావస్థకు చేరినంతనే సంసారాసక్తి పెంచుకొనుట మృత్యుద్వారమే యగును. వానప్రస్థమనగా ఇంద్రియములనెడి గోవులను బంధించు గోశాల యని

శ్రుతి చెప్పినది. పుణ్యాత్ములు సంసార బంధములను త్రెంచుకొనగలరు. దుష్కర్మలు చేయువారు సంసార పాశములందు మరింత చిక్కుకొనెదరు. మనోవాక్కాయములతో ఏ ప్రాణిని హింసించక యుండువాని జీవనము - అర్థము సురక్షితమై యుండును. ఎవని వాక్కు -మనస్సు ఏకాగ్రమై యుండునో, ఎవడు త్యాగముతో-తపస్సుతో - సత్యముతో సంపన్నుడై యుండునో వానికి సమస్తము ప్రాప్తించును. పరమాత్మతో ఐక్యత, సమత, సత్యభాషణము, సదాచారము, బ్రహ్మనిష్ఠ, అహింస, సరళత, సకామ కర్మలపై మున్నగునవియే మానవునకు గొప్పధనము.

"ఎట్టి ధర్మాచరణతో మానవులు శోకరహితులై యీ లోకములో సంచరించగలరు ?" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు భీష్ముడు అజగర వృత్తి నవలంబించుచున్న మునీశ్వరుని ఇతిహాసమును చెప్పెను. జగత్తులోని చరాచర ప్రాణులు మృత్యుపాశ బద్ధమై యున్నవని తెలిసి సర్వత్రా సమభావము జూపుచు సుఖముగా నుండవలెను. ఈ జగత్తులో ప్రాణుల ఉత్పత్తి, వృద్ధి క్షయములు, వినాశము, సత్త్వ స్వరూప పరమాత్మ నుండియే జరుగును. పూర్వకృత కర్మానుసార స్వభావముచేతనే ప్రాణుల యొక్క వర్తమాన ప్రవృత్తులు వ్యక్తమగును. గుణయుక్తమగు ప్రాణుల నాశమును, ఉత్పత్తిప్రళయ తత్త్వములను ఎరిగినవానికి యీ లోకములో చేయవలసిన కార్యము ఏమి మిగిలి యుండును ? జగత్తులోని చరాచర ప్రాణులు మృత్యుపాశ బద్ధమై యున్నవని తెలిసి సర్వత్రా సమభావము జూపుచు సుఖముగా నుండవలెను. సుఖదుఃఖములను సమముగా అనుభవించుట యను అజగరవృత్తి అత్యంత సుదృఢమైనది. ఇది మృత్యువును దూరమొనర్చి శుభములు కలిగించును. శోకహీనమైన యీ శుద్ధమైన వృత్తి అనుపమైనది. విద్వాంసులచే ప్రశంసించబడినది.

సద్బుద్ధి ద్వారా ఆత్మహత్యాది పాపకర్మల నివృత్తి జరుగునని నూట ఎనుబదవ అధ్యాయము వర్ణించినది. శుభాశుభ కర్మల ఫలమును అశశ్యము కర్తయే భోగించునని నూట ఎనుబదొకటవ అధ్యాయములో వివరణగా చెప్పబడినది. శిష్టాచార, సదాచారముల గురించి, ధర్మప్రశంసను గురించి నూటతొంబదిమూడవ అధ్యాయములో అనేక సూసృత వాక్యములున్నవి. అధ్యాత్మజ్ఞానమనగానేమి ? అది ఎటులుండును ? ఈ చరాచర జగత్తు యొక్క సృష్టి ఎవరి వలన జరిగినది ? ప్రళయకాలమునందు ఈ సృష్టి ఎటుల విలీనమగు చున్నది ? వీనిని గురించి విపులముగా బోధించుము" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందుకు సమాధానముగ నూటతొంబది నాల్గవ అధ్యాయములో సవివరముగ భీష్ముడు వర్ణించెను. నూట తొంబదియైదవ అధ్యాయములో ధ్యానయోగ వివరణ యున్నది. ధ్యానయోగము ద్వారా కామక్రోధాది దోషముల నుండి ముక్తులై జననసంబంధ శూన్యులై పరమాత్మ స్వరూపము నందు ప్రవేశించుదురు. వారికి పునరావృత్తి యుండదు. ధ్యానయోగి లక్షణములు, ధ్యాన విధానము యిచట వర్ణించబడినవి.

కాలమే ప్రబలమను ప్రతిపాదన ఇంద్ర-బలి సంవాదములోనున్నది. స్వభావ సిద్ధముగ కాల చక్రము పరివర్తనశీలమైనది. దాని వలన సమస్త వస్తువులకు అనిత్యత - జగత్తు సర్వస్వము వినాశశీలమని ఎరుగవలెను. కాలము ద్వారా నశించబడిన తరువాతనే ఏ వస్తువైనా తన ఉనికిని కోల్పోవును. కాలము ద్వారా నిశ్చితమైనపుడే ఎవరికైన ప్రాప్తించదగు వస్తువులు హస్తగతమగును. ఇంద్ర - మహాలక్ష్మీ సంవాదములో లక్ష్మీదేవి ఎటుల నాలుగు భాగములుగా విభజించబడెనో చెప్పబడినది. భూమి యందు ఒక భాగము, నీటి ప్రవాహమునందు ఒక భాగము, వేదములు -

యజ్ఞములు - దేవతలందు ఒక భాగము, బ్రాహ్మణ హితైషులు - సత్యవాదులగు సత్పురుషులందు ఒక భాగము యున్నది. ఇంద్ర - నముచి సంవాదము దుః ఖోపశమన మార్గములను సూచించినది. మానవులు విధాత లిఖించిన ప్రారబ్ధమునే అనుభవించెదరు. సుఖదుఃఖములు కూడ అటులనే ప్రాప్తించును. ఈ తత్త్వము నెరిగినచో మానవులు దేనియందును మోహము చెందక, దుఃఖములందు కూడ సుకుశలురై యుందురు. సమత్వ బుద్ధి గలవారే అవినాశి బ్రహ్మపదమును పొందెదరని జైగీషవ్య - అసిత దేవల మహర్షుల సంవాదము తెలియజేసినది.

"ధర్మమనగా ఏమి ? అదెటుల ఉత్పన్నమైనది?" యని యుధిష్ఠిరుడు భీష్మ పితామహుని అడిగెను. అందులకాయన "యుధిష్ఠిరా ! వేదము - స్మృతులు - సదాచారము యను మూడున్నూ ధర్మ స్వరూపమును వివరించును. కొందరు విద్వాంసులు అర్థమును కూడ ధర్మము యొక్క లక్షణమనెదరు. శాస్త్రములలో ధర్మానుకూల కార్యములుగా చెప్పిన వన్నియు ధర్మములని జనులందరు నిశ్చితరూపముగ ఆమోదించెదరు. లోకయాత్రను నిర్వహించుట కొరకు మహర్షులు - ధర్మమర్యాద పురుషులు చెప్పిన ఆచారము నాశ్రయించినచో, ధర్మము యొక్క యదార్థ తత్త్వము అవగతమగును. ఎవని ఆచార విచారములు శుద్ధమో అతడెన్నడూ చింతాగ్రస్తుడు గాకుండును.

రాజు అహింసాపూర్వకముగ రాజ్యశాసనము నెటుల చేయవలెనో ద్యుమత్సేన - సత్యవంతుల సంవాదమున నున్నది. మరణదండన విధించునపుడు అపరాధి యొక్క అపరాధమును చక్కగా విచారించ వలెను. తొందరపాటు పనికిరాదు. ఈ విషయమై ధర్మచర్చ రెండు వందల అరవదేడవ అధ్యాయము నందున్నది. యజ్ఞములలో పశుహింస నింద్యమను వాదన రెండు వందల డెబ్బది రెండవ అధ్యాయము చెప్పినది. లోభమోహములు, రాగద్వేషములకు వశీభూతులైనవాని బుద్ధి ధర్మముపై నిలువదు. సత్పురుషుల సాంగత్యము, సత్కర్మాభ్యాసముచే మానవుని బుద్ధి పరిపక్వత చెందును. అతడు ధర్మార్జిత ధనమునే ఆశించును. శుభకారకులైన మిత్రులను పొందును. అతడు పంచ జ్ఞానేంద్రియ విషయములను శాసించు వాడగును. మోక్షసాధనకు యోగ్య ఉపాయములు రెండువందల డెబ్బది నాల్గవ అధ్యాయములో చెప్పబడినవి. మోక్షమును కోరువారు మున్ముందుగా క్రోధమును జయించవలెను. సంకల్పరాహిత్యముతో కామనలు తొలగించుకొని సాత్త్విక గుణము నలవరచుకొనవలెను. నిద్రను క్షయము గావించుకొని సర్వదా శాస్త్రాధ్యయనము చేయుచు భ్రమ - మోహము - సంశయములను నివారించు కొనవలెను. జ్ఞానాభ్యాసముతో ఆలస్యమును - నానా విషయ బుద్ధిని తొలగించుకొనవలెను. దయాగుణమును ముందిడుకొని అధర్మమును జయించవలెను. అనాసక్తితో అర్థముపై విజయమును సాధించవలెను. యోగాభ్యాసము ద్వారా ఆకలిని, కరుణ ద్వారా అభిమానమును, సంతోషము ద్వారా తృష్ణను జయించవలెను. ప్రయత్నపూర్వకముగ సోమరితనమును, శాస్త్ర నిశ్చయముతో విపరీత తర్కమును, మౌనముతో అతివాదమును, శూర వీరత్వముతో భయమును త్యజించవలెను. మనస్సు సహితముగా ఇంద్రియములను బుద్ధి ద్వారా వశపరచు కొనవలెను. బుద్ధిని వివేకరూప జ్ఞానముతో, జ్ఞానమును ఆత్మ జ్ఞానముతో సాధించి ఆత్మను పరమాత్మలో విలీనమొనర్చవలెను. ఈ ప్రకారము పవిత్ర ఆచార విచారములతో సాధకుడు అన్ని విధముల ఉపరతి చెంది శాంత భావముతో పరమాత్మను సాక్షాత్కార

మొనర్చుకొనవలెను. కామక్రోధ లోభ భయ నిద్రలను అయిదు దోషములును యోగ సంబంధ విఘ్నకారకములు. వీనిని మూలచ్ఛేదన మొనర్చు కొనవలెను. పిమ్మట వాక్కును సంయమన మొనర్చుకొని యోగసాధన చేయవలెను. ఒకప్పుడు మాండవ్య మహర్షి జనక మహారాజుకడకేగి తృష్ణా పరిత్యాగమునెటుల చేయవలెనని జనక మహారాజునడిగెను. అందులకు సమాధానముగా రెండు వందల డెబ్బది యారవ అధ్యాయములో వివరణ యున్నది. సంక్షిప్తముగా అధ్యాత్మ జ్ఞానము – తత్ఫలము రెండు వందల ఎనుబది యారవ అధ్యాయములో చెప్పబడెను. ప్రజ్ఞకు మూలము ఇంద్రియముల నిర్మలత్వమని జ్ఞానులనెదరు. ఇంద్రియ మోహములందు పడినవారే శోకమగ్నులగుదురు. జగత్తు పరిణామ ప్రవర్తకమని దర్శించువారు యీ జగత్తులో దేని గురించియు సంతాపము చెందరు. అభీష్ట సుఖ భోగముల వెంటపడరు. దుఃఖము వచ్చి పైబడిననూ చింతాక్రాంతులు గాకుందురు. ఈ ప్రకారము సమంగ మహర్షి తన శోకరహిత స్థితిని గురించి రెండు వందల ఎనుబది ఏడవ అధ్యాయములో దేవర్షి నారదునకు వివరించెను. గురుజనులను పూజించుట, వృద్ధులను సేవించుట, శాస్త్ర శ్రవణము యను మూడున్నూ ఆత్మ శ్రేయస్సుకు అమోఘ సాధనలు. ఈ విషయమై దేవర్షి నారదునకు – గాలవ మునికి జరిగిన సంవాదము రెండు వందల ఎనుబది ఎనిమిదవ అధ్యాయము విపులముగా చెప్పినది. యోగ సాంఖ్యములలో అంతరములను భీష్ముడు మూడు వందల ఒకటవ అధ్యాయములో చెప్పెను. విద్వాంసులు సాంఖ్యమును, యోగులు యోగమును ప్రశంసించెదరు. యోగవాదులు ఈశ్వరుని అస్తిత్వమును స్వీకరించెదరని వక్కాణించుదురు. విషయ విరక్తి చెందినవారు దేహత్యాగానంతరము ముక్తి చెందెదరని సాంఖ్యుల అనెదరు. యోగవిదులు ప్రత్యక్ష ప్రమాణమును ప్రధానముగ పరిగణించుదురు. సాంఖ్యులు శాస్త్ర ప్రమాణమును విశ్వసించుదురు. శ్రేష్ఠ పురుషులు యీ రెండు మతములను ఆదరించెదరు. రెండు మతములు పరమ గతిని గలిగించును. బాహ్యాభ్యంతర శుచి, తపస్సు, ప్రాణులపై దయ, వ్రతపాలన మున్నగు నియమములు రెండు మతములందును సమానమే. మోక్షధర్మమునందు మాత్రమే కొంత మార్పు యున్నది. యోగ సాధనా ఫలములు, సాంఖ్యయోగ సాధనా ఫలములు వివరముగా మూడు వందల రెండవ అధ్యాయము నందున్నవి. నాస్తికులు మాత్రమే దేహములను చక్కగా పోషించుకొనుటకు చేయరాని చేష్టలు చేయుచుందురు. పారలౌకిక కర్మలందు అలసత్వము జూపి నిదురపోవు చుందురు. బుద్ధి యొక్క వ్యామోహములో పడిన మనుష్యులు ధర్మద్వేషులై సదా కుమార్గమునందు పయనించుదురు. ధర్మ సంపన్నులైన మహాత్ములు నిత్యసంతుష్టులై శ్రుతిపరాయణులై సర్వదా ధర్మారూఢులై యుందురు. మానవులు ధర్మరూప నిచ్చెన నాశ్రయించి మెల్లగా ఒక్కొక్క మెట్టును ఎక్కవలెను. పట్టు పురుగు వలె వాసనాజాలములో బంధించు కొనరాదు. ధర్మ మర్యాదలనుల్లంఘించు వారి సాంగత్యమును దూరము నుండియే త్యజించవలెను. విషయాసక్తి స్వరూపమగు నదిని సాత్త్విక ధృతియనెడి నౌక ద్వారా దాటవలెను. సంసారాంధకారములో ప్రవేశించదలచినచో ధర్మబుద్ధి యనెడి దీపమును యత్నపూర్వకముగ ధరించినచో ధర్మజ్యోతి యొక్క దీపశిఖ క్రమముగా ప్రజ్వరిల్లు చుండును. బ్రాహ్మణ శరీరము భోగములననుభవించుటకు పుట్టినదిగాదు. క్లేశయుక్త తపస్సు చేసి పరమాత్మ పదమును చేరుటకు యని తెలుసుకొనవలెను. కనుక సదా స్వాధ్యాయము, తపస్సు, ఇంద్రియ సంయమనములందు పూర్తిగా తత్పరులై యుండుటకు

ప్రయత్నించవలెను. ఇటుల వైరాగ్య ధర్మోపదేశమును సముచిత రీతిలో మూడువందల ఇరువది రెండవ అధ్యాయమునందు చెప్పబడినది.

గీతలు : శాంతిపర్వము (ఉత్తరభాగము) నందు ఆధ్యాత్మతత్త్వ గీతలనేకములున్నవి. వానిలో నూట డెబ్బదియారవ అధ్యాయముగ నున్న శంపాక గీత త్యాగ మహిమను వివరించినది. సంసారములో అకించనతయే సుఖప్రదము. అదియే హితకారకము - కల్యాణ దాయకము - నిరుపద్రవ మార్గము. ఈ మార్గములో శత్రుత్వమునకు తావు యుండదు. అందరూ మిత్రులై యుందురు. అకించనుడు అన్ని విధముల శుద్ధవైరాగ్య సంపన్న పురుషునితో సమానుడు. అకించనుడు సదా దైవేచ్ఛననుసరించి చరించును. నూటడెబ్బది యారవ అధ్యాయములో నున్న మంకిగీత కూడ త్యాగ మహిమను విశదమొనర్చినది. అన్నిటి యందు సమభావము - వ్యర్థ పరిశ్రమ లేకుండుట - సత్యభాషణము - వైరాగ్యము - కర్మాసక్తి లేకుండుట యను అయిదు విషయములు ఎవని యందుండునో అతడే సుఖవంతుడగును. జ్ఞానవృద్ధులు యీ అయిదు విషయములను శాంతి కారకములనెదరు. ఇదియే ధర్మము. ఇదియే పరమోత్తమ సుఖ సాధనము. దేహయాత్రకై ప్రయత్నించు మూర్ఖజనుల తృష్ణ ఎన్నటికీ తీరదు. అది వృద్ధి చెందుచునే యుండును. ధన తృష్ణ - తత్ప్రయత్నములను విరమించుకొనువాడే సుఖించును. సంకల్పములు చేయకుండుటచే మనోనాశము జరుగును. దానిచే కామనలు నశించును. గంగా ప్రవాహమువలె ధన తృష్ణకు అంతముండదు. తృష్ణయే బుద్ధి వినాశకారకము. కామము వలననే తృష్ణ - శోకము - పరిశ్రమ ఉత్పన్నమగుచున్నవి. ఈ లోకములోని విషయ సుఖములు గాని, పరలోకములో దివ్య సుఖములుగాని తృష్ణా క్షయ సుఖమునకు పదునారవ వంతు కూడ సరిగావు. శాంతభావము ప్రాప్తించుటకు ఏమి చేయవలెనో బోధ్యమహాముని యయాతికి చెప్పిన బోధ్యగీత నుదహరించెదరు. బోధ్యమహాముని తన గురువులు పింగళ యను వేశ్య, కురరపక్షి, సర్పము, వానకోయిల, బాణములు తయారు చేయువాడు, కన్య యను వారల ద్వారా నేర్చిన సత్యములను వివరించెను. ఆశ చాలా ప్రబలమైనది. అదియే సమస్త దుఃఖములకు మూలము. ఆశ లేకుండుటయే మూల కారణము. భోగేచ్ఛ త్యజించువారు శాంతిని పొందగలరు. శాంతిని గోరు గృహస్థు జంజాటము నందు పడక ఒక సంకేత స్థలము నేర్పరచుకొనక సుఖముగా విహరించవలెను. ఎవరికీ ద్రోహము తలబెట్టక భిక్షావృత్తితో జీవించువాడు పరమశాంతిని పొందును. పరతత్త్వము నందు ఏకాగ్ర చిత్తముగలవాడు పరమశాంతిని పొందును. పరతత్త్వ ప్రాప్తికై ప్రయత్నించువాడు పదుగురి మధ్యలో నివసించుచు కలహములకు దారితీయు లౌకిక సంభాషణలు చేయుట కన్న ఏకాంతముగ నుండుటయే మేలు. ఏకాంతవాసమే పరమశాంతిని గూర్చును.

భృగు భరద్వాజ సంవాదమను 182 - 192 అధ్యాయములలో జగదుత్పత్తి - స్థూలభూతోత్పత్తి - పంచ భూతముల గుణ విశేషములు - ప్రాణాపానాదుల వర్ణన - జీవస్థితి సంశయము - జీవ సత్త నిత్యము- ప్రాణోత్పత్తి - వర్ణ విభాగము - చాతుర్వర్ణ ధర్మములు - సదాచారము - పరబ్రహ్మ ప్రాప్తి - లోకపర లోకములు - బ్రహ్మచర్య గృహస్థ ధర్మములు - వానప్రస్థ, సన్యాస ధర్మములు - శిష్టాచార ఫలము - ధర్మ ప్రశంస మున్నగు విషయములు కూలంకషముగా చర్చించబడినవి.

జ్ఞానయోగము, వేద పఠనము, అగ్నిహోత్రాది కర్మలు మున్నగువాని ఫలమెటులుండును ? సమస్త

ప్రాణుల హృదయమునందుండు పరమాత్మ యొక్క జ్ఞానమెటుల సిద్ధించును ?" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందుకు భీష్ముడు మను ప్రజాపతితో బృహస్పతి జరిపిన సంవాదరూప ప్రాచీన ఇతిహాసమును చెప్పెను. ఒకప్పుడు మను ప్రజాపతితో దేవగురువగు బృహస్పతి శిష్య భావముతో యిటుల ప్రశ్నించెను. భగవాన్ ! జగత్తుకు కారణమేదియో, ఎద్దాని కొరకు వైదిక కర్మలు అనుష్ఠించబడుచున్నవో, జ్ఞాన ఫలమని బ్రాహ్మణులు దేని గురించి చెప్పెదరో, ఏ తత్త్వమును వేద మంత్రములు సైతము పరిపూర్ణముగా ప్రకాశింప చేయజాలకున్నవో అట్టి నిత్య వస్తువు యొక్క యదార్థ జ్ఞానమునుపదేశించుము. యజ్ఞములతో - గోదానములతో ఏ సుఖమయ ఫలప్రాప్తికై ప్రయత్నించెదరో అదెట్టిది ? అది ఎచట యుండును ? భగవాన్ ! ఈ పృథివి - పార్థివ పదార్థములు - వాయువు - ఆకాశము - జలము - జల జంతువులు - ద్యులోకము - దేవతలు ఎవరి నుండి ఉత్పన్న మొందిరి? ఆ పురాతన సనాతన వస్తువేది ? ఆ పరమోత్కృష్ట వస్తుజ్ఞానము లభించుటకు ఎట్టి ప్రయత్నము చేయవలెను? ఋగ్యజుస్సామ మంత్రములను, ఛందో వ్యాకరణములను, శీక్షా కల్పములను, జ్యోతిశ్శాస్త్ర నిరుక్తములను ఎన్నెన్ని చదివినను ఆకాశాది పంచ మహాభూతముల యొక్క ఉపాదాన కారణము తెలియకున్నది. కావున విశేష వాక్యముల తత్త్వ జ్ఞానమును సరళమగు భాషలో ఉపదేశించుము. తత్త్వజ్ఞానము లభించు మార్గమును, కర్మానుష్ఠాన ఫలమును వివరించుము. జీవుడు ఒక దేహమును త్యజించి వేరొక శరీరమునెటుల పొందునో తెలియజెప్పుము" అని అడిగెను. పైన చెప్పిన ప్రశ్నలన్నిటికి సమాధానముగ బుద్ధ్యాది ప్రాకృత పదార్థముల వివేచన, ఆత్మసత్త నిత్యము, ఆత్మ సాక్షాత్కార ఉపాయము, పరబ్రహ్మ ప్రాప్తికి ఉపాయము, పరమాత్మ నిరూపణము యను అధ్యాయముల ద్వారా నిరూపించబడినవి.

గురు శిష్య సంవాదమను ప్రసంగములో మోక్ష సాధనభూత పరమ యోగమును భీష్ముడు ఉపదేశించెను. ఇందులో మున్ముందుగా శ్రీకృష్ణ తత్త్వము వివరించబడినది. తదనంతరము జీవాత్మ స్థితి - సత్త్వగుణ సంసేవనము - విషయాసక్తి త్యాగము - బ్రహ్మచర్య వైరాగ్యములు - బ్రహ్మప్రాప్తి యత్నము - బ్రహ్మప్రాప్తికి ఉపాయములు - పరబ్రహ్మ ప్రాప్తి యను విషయములు ప్రతిపాదించబడినవి.

పంచశిఖుని ఉపదేశముతో జనక మహారాజు మోక్షము పొందిన విషయమును గురించి భీష్ముడు చెప్పెను. ఆత్మ యొక్క నిత్యత్వ ప్రతిపాదన, మోక్షతత్త్వ వివేచనము, దమ గుణము యొక్క మహాత్మ్యము, వర్ణించబడినవి. వేదోక్త వ్రతములందు ప్రవృత్తులైనవారు సకామ యజ్ఞములననుష్ఠించి యజ్ఞావశిష్ట అన్నమును భుజించినచో వ్రతఫలములను పొందెదరు. ప్రతిరోజు ఉదయము, సాయంకాలములందు మాత్రమే భుజించి మధ్యలో ఏమియూ తిననివాడు ఉపవాసము చేసినవాడగును. కేవలము ఋతు స్నాతయైన పిమ్మట భార్యతో సంగమించువాడు, సదా సత్యభాషణ తత్పరుడు, నిత్యము జ్ఞాన స్థితుడు, సదా బ్రహ్మచర్యమును పాలించినవాడగును. ఎన్నడూ మాంసమును ముట్టనివాడు– నిత్యదానశీలి పవిత్రుడగును. పగటిపూట నిదురించనివాడు సదాజాగరము చేసినవాడగును. తనపై భరణ పోషణకు ఆధారపడిన తల్లిదండ్రులు మున్నగు కుటుంబ జనులందరు భుజించిన పిమ్మట తాను ఆహారమును స్వీకరించువాడు అమృత భోజియగును. భృత్యులు, అతిథులకు కూడ అన్నము సమర్పించిన

పిమ్మట తాను భుజించువారు స్వర్గలోక ఉత్తమ గతులు పొందును.

వేదవేదాంగములు, ఉపనిషత్తులు అధ్యయన మొనర్చిన శ్రీశుకుడు వైదిక కర్మానుష్ఠాన జ్ఞానేచ్ఛతో తన తండ్రి శ్రీకృష్ణ ద్వైపాయనుని కడకేగి "తండ్రీ ! సమస్త ప్రాణులను పుట్టించువాడెవడు ? కాలము గురించి మీ నిశ్చితాభిప్రాయమేమి ? అని అడిగెను. అందులకు వ్యాస మహర్షి కాల విభాగము, కాల స్వరూపము, యుగ పరిమాణములు, యుగ ధర్మములు మున్నగునవి వర్ణించెను. తదనంతరము సృష్టి, కాలము, వేదము గురించి చెప్పెను. అటు పిమ్మట బ్రహ్మ ప్రళయము – మహాప్రళయముల గురించి వివరించెను. తరువాత బ్రాహ్మణ కర్తవ్యము – దానమహిమ వర్ణించెను. ధ్యాన యోగము – మోక్ష సాధన – బుద్ధి వైశిష్ట్యము – ప్రాణుల తారతమ్యము – కర్తృత్వ వివేచనము – యుగ ధర్మములు – జ్ఞాన సాధనలు – జ్ఞాన మహిమ – యోగసాధన – కర్మజ్ఞాన భేదములు– బ్రహ్మచర్య ధర్మములు – బ్రాహ్మణ గృహస్థ ధర్మములు – వానప్రస్థ ధర్మములు – సన్యాసి ప్రశంస – జ్ఞానోపదేశము – మహాభూతముల తత్త్వ వివేచనము – ప్రకృతి పురుష వివేకము – జ్ఞానసాధనలు – జ్ఞాని లక్షణములు – జ్ఞాన మహిమ – పరబ్రహ్మ ప్రాప్తి – బ్రహ్మవేత్త లక్షణములు – పంచభూతముల కార్యములు – గుణ విచారణ – స్థూల సూక్ష్మ కారణ శరీరముల కన్న పరమైన జీవాత్మ – కామరూప వృక్షఛేదన – ముక్తిని పొందు ఉపాయము మున్నగు విషయములన్నియు వ్యాసగీత (231 - 255 అధ్యాయములు)లో చెప్పబడినవి.

ప్రాచీన కాలములో విచఖ్యుడను రాజు అహింసా ధర్మమును ప్రశంసించుచు చేసిన గానమే విచఖ్యుగీత. మనువు కూడ తన ధర్మశాస్త్రములో కర్మలన్నిటి యందును అహింసా ధర్మము పాలించమని ప్రతిపాదించెను. వైదిక ప్రమాణముల యొక్క ధర్మ సూక్ష్మమును చక్కగా పరిశీలించి బలి ప్రదానముల సమంజసతను నిర్ణయించవలెను. అహింసా ధర్మమును పాలించుట వలన మనుష్యులకు శమదమాది సద్గుణ సంపత్తి ప్రాప్తించుటయే గాక భోగమోక్షములు ప్రాప్తించును. గృహస్థ ధర్మము – యోగ ధర్మములలో ఏది శ్రేష్ఠము?" అని యుధిష్ఠిరుడు భీష్మ పితామహుని అడిగెను. అందుకు కపిల – స్యూమరశ్మి సంవాదము నుదహరించెను. ఈ ధర్మప్రసంగము 268 నుండి 270 అధ్యాయము నందు రసవత్తరముగ నున్నది. చతుర్విధ ఆశ్రమములలోను ఉత్తమ సాధనలతో పరబ్రహ్మ ప్రాప్తిని పొందవచ్చును. సమస్త లోకములలో వేదమే ప్రమాణము. కనుక వేదము నెవరూ అవహేళన చేయకుండిరి. పరబ్రహ్మమునకు రెండు స్వరూపము లున్నవి. ఒకటి శబ్ద బ్రహ్మమగు వేదము. రెండవది సచ్చిదానంద ఘన పరమాత్మ యగు పరబ్రహ్మము. శబ్ద బ్రహ్మ పారంగతుడు తన అనుష్ఠాన బలముతో శుద్ధాంతఃకరణముతో పరబ్రహ్మ ప్రాప్తి నొందును. ఎవని శరీరము వైదిక సంస్కారములతో శుద్ధి చెందునో అతడే బ్రహ్మజ్ఞాన ప్రాప్తికి యోగ్యుడగును.

పరమాత్మ ప్రేరణతో కాలాత్మ – యీ పంచ మహాభూతముల ద్వారా సమస్త ప్రాణుల సృష్టి జరుగుచున్నది. పంచ కర్మేంద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, చిత్తము, మనస్సు, బుద్ధి, ప్రాణము, సాత్వికాది మూడు గుణములు వెరసి పదునేడు గుణములగును. వీనికి అధిష్ఠాతయగు దేహాభిమాని జీవాత్మ పదునెనిమిదవ తత్త్వము. జీవాత్మ దేహాంతర్గతుడై నివసించును. ఆయనను సనాతనుడనెదరు. సంచిత పుణ్యపాపముల ప్రేరణతో జీవుడు సమయానుసారము

కర్మజనిత వేరొక శరీరమును ప్రవేశించును. కాలప్రేరితుడైన జీవుడు క్రమముగా ఒక్కొక్క శరీరమును విడిచి పూర్వ సంకల్పముల ద్వారా నిర్మితమగు ఇతరేతర శరీరములకు పోవును. ఆత్మ సర్వదా శరీరము కన్న భిన్నము - అసంగము - అవినాశి. అందుచే దేహవియోగము వలన ఆత్మకు ఎట్టి సంతాపము కలుగదు. జీవునకు వాస్తవముగా ఎవరూ ఏమీ కాదు. జీవుడు ఎల్లపుడు ఒంటరివాడే. కాని దేహస్థితుడై యుండి దేహాభిమానమును చెందుటచే సుఖదుఃఖముల భావమును పొందుచున్నాడు. జీవాత్మ ఎన్నడూ పుట్టుటలేదు. జీవుడు తత్త్వజ్ఞానమును పొందినపుడు దేహాభిమానము వదిలి పరమగతిని పొందును. దేహము పుణ్యపాపమయము. దేహధారి జీవుడు ప్రారబ్ధ కర్మ క్షయముతో బాటు దేహ క్షయమును పొందుచుండును. ఈ ప్రకారము దేహ నాశనము తరువాత ముక్త పురుషులు బ్రహ్మభావ ప్రాప్తినొందెదరు. ఈ పుణ్యపాపముల క్షయము కొరకే జ్ఞానయోగ సాధన చెప్పబడినది. ఈ అసిత దేవలగీత రెండు వందల డెబ్బది అయిదవ అధ్యాయముగ నున్నది.

ప్రకృతికి పరమైన పరబ్రహ్మము అవినాశి. పరబ్రహ్మ పరంధామము ఎటులుండును ? పరబ్రహ్మ ప్రాప్తి కొరకు ఎట్టి ఆచరణ చేయవలెను ? ఏ విద్యనాశ్రయించవలెను ? అని యుధిష్ఠిరుడు అడిగెను. పూర్వము హారీతముని ఉపదేశించిన జ్ఞానమును యీ సందర్భమున భీష్ముడు ఉపదేశించెను. ముముక్షువులు లాభ నష్టములందు సమాన భావము గలిగి మునివృత్తి నవలంబించవలెను. భోగములు ప్రాప్తించిననూ వానిని ఆకాంక్షించరాదు. నేత్రములు, మనస్సు, వాక్కు ద్వారా ఇతరుల యందు దోషములనెన్నరాదు. ఎవరి సమక్షమున లేదా పరోక్షమున ఇతరుల దోషములను చర్చించరాదు. ఏ ప్రాణిని హింసించి పీడించరాదు. అందరి యెడల మైత్రీ భావమును ప్రదర్శించవలెను. నశ్వరమగు యీ జీవనములో ఎవరితోను శత్రుత్వము వహించక యుండుటయే మేలు. ఇటుల సర్వోత్తమ సమయోచిత వర్తనములు యీ గీతలో చెప్పబడినవి.

వృత్రాసుర - శుక్రాచార్య సంవాదములో పరబ్రహ్మ ప్రాప్తికి ఉపాయములు చెప్పబడినవి. ఈ వృత్రాసుర గీత 278-280 అధ్యాయములలో నున్నది. అజ్ఞానము వలన కలిగిన అంధకారమును తత్త్వ జ్ఞానముతో జీవుడు తొలగించుకొనవలెను. అపుడు జీవుని హృదయములో సనాతన బ్రహ్మము ప్రకాశించును. కర్మల వలన బ్రహ్మప్రాప్తి సాధ్యము గాకుండును. ఇది ఋషివాక్యము. కామనల బంధనములతో బంధితులైన జీవులెందరో వివశులై వేల పర్యాయములు తిర్యగ్యోనులలో పడి పునరుద్ధారణ పొందెదరు. వృత్రాసురుడు శుక్రాచార్యునితో "బ్రహ్మన్! అణిమాది ఐశ్వర్యము - మహత్తు యగు బ్రహ్మము ఏ వర్ణములో యుండును? అట్టి ఉత్తమ ఐశ్వర్యము ఎటుల నష్టమగును ? ప్రాణులు ఏ హేతువుతో జీవన ధారణ చేయుదురు ? ఏ కారణముతో కర్మ ప్రవృత్తి చెందెదరు? జీవులు ఎట్టి పరమ ఫలము ప్రాప్తించుటచే అవినాశి - సనాతన రూప పరబ్రహ్మమునందు ప్రతిష్ఠితు లగుదురు? ఏ కర్మ లేదా ఏ జ్ఞానముతో అట్టి పరమ ఫలము ప్రాప్తించును ?" అని అడిగెను. వానికి సమాధానముగ శుక్రాచార్యులు చెప్పినదియే వృత్రగీత. ఇందులో విష్ణుతత్త్వమునే పరబ్రహ్మముగా ప్రవచించిరి. స్వర్ణకారుడు పదే పదే కొలిమిలో కాల్చుచు వెండి బంగారములను శుద్ధమొనర్చునటుల జీవులు కూడ వేలకొలది జన్మలలో మనస్సును శుద్ధమొనర్చుకొను ప్రయత్నము చేయవలెను. శరీరమునకు పట్టిన మైలను కడుగుట, తోముట వలన పోగొట్టుకొనునటుల గొప్ప ప్రయత్నముతో మనస్సులోని రాగద్వేషాది దోషములను

కూడ దూరమొనర్చుకొనవలెను. జీవునకు పరమ జ్ఞానము ప్రాప్తించు వరకు జన్మ పరంపరలు కొనసాగుచునే యుండును. ఎవరైనా ఒక యోగి సిద్ధలోకము నుండి చ్యుతుడై మర్త్యలోకమునకు వచ్చునటుల మర్త్యలోకము నుండి వేరొక సాధకుడు సాధనా బలముతో క్రమముగా ఒక లోకము నుండి మరొక లోకమునకు పోవుచు సిద్ధపురుషుల గతిని పొందవచ్చును. విశుద్ధ భావ సంపన్నులగు సిద్ధపురుషులు తమ ప్రారబ్ధముననుభవించు వరకు పరా – అపరా విద్య యందు లగ్నమై యుందురు. ఏ సాధకుడు శుద్ధ మనస్సుతో విశుద్ధ పరమగతిని అనుసంధానించునో అతడు అవ్యయము అవికార, దుర్లభ, సనాతన బ్రహ్మపదమును పొందును.

ఒకప్పుడు సగర మహారాజు అరిష్టనేమి మహర్షిని సందర్శించి "బ్రహ్మన్ ! ఈ జగత్తులో ఏ శుభదాయక కర్మలొనర్చినచో మానవులు సుఖవంతులగుదురు ? ఏ ఉపాయముతో శోకము – క్షోభను పొందక యుందురో తెలుసుకొనదలంచితిని" అని అడిగెను. అందులకు అరిష్టనేమి "సగర మహారాజా ! ప్రపంచములో మోక్షసుఖమే వాస్తవికము, ధన ధాన్య సంపాదనలందు, దారా పుత్రులందు, పశుసంపద యందు ఆసక్తి యున్న మూఢునకు మోక్షము యొక్క యదార్థ జ్ఞానము తెలియకుండును. ఎవని మనస్సు అశాంతి చెంది యుండునో, ఎవని బుద్ధి విషయాసక్తి చెందునో అట్టివానికి చికిత్స చేయుట కఠినము. ఎవడు స్నేహబంధానురాగబద్ధుడగునో అట్టి మూఢుడు మోక్షప్రాప్తికి యోగ్యుడు గాడు" అనెను. ఎవడు శాస్త్రాధ్యయముగాని, లౌకికానుభవముచే గాని జ్ఞాన సంపన్నుడై యీ మానవ జగత్తు సారహీనమని ఎరుంగునో, అతడు తప్పక ముక్తిమార్గమునే అనుసరించును. సగర మహారాజా ! నీ బుద్ధిని వ్యాకుల రహితమొనర్చి గృహస్థ లేదా సంన్యాసాశ్రమమునందు ముక్తి సాధనలు చేసి ముక్తి మార్గమున పయనించుము" అని అరిష్టనేమి హితవు పలికెను.

జనక మహారాజునకు – పరాశర మహర్షికి జరిగిన సంవాదము 291–299 అధ్యాయములలో పరాశర గీతగ యున్నది. ఒకప్పుడు మహా యశస్వి జనక మహారాజు పరాశర మహర్షి కడకేగి "మునీంద్రా! సమస్త ప్రాణులకు ఇహపరలోకములందు శ్రేయస్సు గూర్చు ఏ వస్తువును గురించి తెలుసుకొనుట యోగ్యమో తెలియజేయుము" అని అడిగెను. అందులకు పరాశర మహర్షి "మహారాజా ! ధర్మమును విధిపూర్వకముగ ఆచరించవలెను. ధర్మాచరణమొక్కటియే సకల శ్రేయస్సులను గూర్చును. ధర్మమునకు మించిన శ్రేయస్సాధనము యింకొకటి లేదు. ధర్మమునాశ్రయించి జీవించువారు సర్వత్రా గౌరవించబడుదురు. వేద వాక్యములగు "సత్యం వద" – "ధర్మంచర" యనునవి కర్తవ్యవిధులుగ చెప్పబడినవి. ధర్మస్థితులైనవారు ఏ ఆశ్రమమునందున్ననూ తమ విధ్యుక్త ధర్మములను పాలించవలెను. ఈ సందర్భముగ పరాశర మహర్షి విస్తృతముగ "కల్యాణప్రాప్తి సాధనోపదేశములు, కర్మఫల అనివార్యత, పుణ్యకర్మలాభము, ధర్మోపదేశములు, వర్ణధర్మపాలన మాహాత్మ్యము, స్వధర్మపాలన, తపస్సు శ్రేష్ఠత – వర్ణవిశేష ఉత్పత్తి, సత్కర్మ శ్రేష్ఠత, మానవ జన్మ ఉత్కృష్టత మున్నగు విషయములు ప్రస్తావించెను.

ఒకప్పుడు ప్రజాపతి బ్రహ్మదేవుడు హంస రూపము దాల్చి ముల్లోకములందు విహరించుచుండెను. ఒకనాడు ఆయన సాధ్యగణముల సమీపమున వ్రాలెను. సాధ్య గణములు ఆ హంసరాజమును మోక్ష ధర్మ విజ్ఞాతగా గుర్తించి మోక్ష విషయ ప్రశ్నలనిటుల అడిగిరి. విహంగరాజమా ! మీ అభిప్రాయములో సర్వశ్రేష్ఠమైన

వస్తువేది ? మీ మనస్సు దేని యందు రమించుచుండును? అనేక కార్యములలో ఏ ఒక్కటి చేసినచో అది అత్యుత్తమమగునో సెలవిమ్ము. దేనిని చేయుటచే జీవులకు అన్ని బంధముల నుండి శీఘ్రముగా విముక్తి గలుగునో అద్దానిని ఉపదేశించుము" అని ప్రార్థించిరి. ఆ సందర్భమున హంస స్వరూప ప్రజాపతి బ్రహ్మ చెప్పిన అనేక సదుపదేశములు మూడువందల అధ్యాయమునందు చెప్పబడినవి. దీనినే హంసగీత అనెదరు.

ఏ అక్షర తత్త్వము నెరుగుటచే జీవుడు మరల యీ లోకమునకు తిరిగిరాడో, ఏ క్షర తత్త్వము వలన జీవునకు మరల పునరావృత్తి ప్రాప్తించునో ఆయా అక్షర – క్షర స్వరూపములను తెలియబరచమని యుధిష్ఠిరుడు భీష్మునడిగెను. అందులకు భీష్ముడు పూర్వము వసిష్ఠ మహర్షికి – కరాళ జనక మహారాజునకు జరిగిన సంభాషణను వివరించెను. ఇదియే వసిష్ఠగీతగ మూడు వందల మూడవ అధ్యాయము నుండి మూడు వందల తొమ్మిదవ అధ్యాయము వరకు యున్నది. ఈ వసిష్ఠ గీతలో క్షర – అక్షర తత్త్వనిరూపణము – ప్రకృతి సంసర్గ కారణముచే జీవుడు కర్తృత్వ భోక్తృత్వముల నాపాదించుకొనుట – ప్రకృతి సంసర్గ దోషమే జీవునకు పతన హేతువు – క్షర అక్షరములు, ప్రకృతి పురుషుల వివరణ – ఆత్మజ్ఞానముతో ముక్తి – విద్యాఅవిద్యలు – అక్షరక్షరములు – ప్రకృతి పురుషుల స్వరూపములు – వాని వివేచన – ఉద్ధరణ – జీవుని నానాత్వ ఏకత్వ వర్ణనము యున్నవి. యుధిష్ఠిరుడు "పితామహా ! ధర్మాధర్మ బంధన ముక్తము, సమస్త సంశయరహితము, జన్మ మృత్యు రహితము, పుణ్య పాపముక్తము, నిత్యము, నిర్భయము, కల్యాణమయము, అక్షరము, అవ్యయము, అవికారము, పవిత్రము, క్లేశ రహితమునగు తత్త్వమును ఉపదేశించుము అని భీష్ముని ప్రార్థించెను. ఒకప్పుడు భీష్ముడు అంబులకు, జనక మహారాజు కూడ యాజ్ఞవల్క్య మహర్షిని ప్రశ్నించిన విధానమును గురించి వివరించెను. "బ్రహ్మర్షీ ! ఇంద్రియములెన్ని ? ప్రకృతి భేదములెన్ని? అవ్యక్తమనగా ఏమి ? దానికి పరమైన పరబ్రహ్మ పరమాత్మ యొక్క స్వరూపమెటుండును ? సృష్టి ప్రళయములు అనగా ఏమి ? కాలగణనము నెటుల చేయుదురు ?" అని అడిగెను. అందులకు యాజ్ఞవల్క్య మహర్షి "భూపాలా! నీవడిగిన ప్రశ్న పరమరహస్యమైన యోగ – సాంఖ్య విశేష జ్ఞానము. రాజా ! ప్రకృతులు ఎనిమిది. వాని వికారములు పదునారు. వీనిలో పంచజ్ఞానేంద్రియములున్నూ సవిశేషములు. పంచ కర్మేంద్రియములు, శబ్దాది పంచ విశేషములు గలిపి విశేషములు. ఈ సవిశేష – విశేషములు పంచ భూత స్థితములై యున్నవి. మనస్సు పదునారవ వికారము. అవ్యక్త ప్రకృతి నుండి మహత్తత్త్వము (సమష్టిబుద్ధి) ఉత్పన్నమైనది. దీనినే బుద్ధ్యాత్మక సృష్టి అనెదరు. అహంకారము నుండి మనస్సు ఉత్పన్నమైనది. మనస్సు నుండి పంచ సూక్ష్మభూతములు ఉత్పన్నమైనవి. ఈ ప్రకారము అహంకారిక, మానసిక, భౌతిక, చింతాత్మక మున్నగు తొమ్మిది సర్గలున్నవి. తొమ్మిది సర్గలు – ఇరువది నాలుగు తత్త్వములు శ్రుతిననుసరించి చెప్పబడినవి. ఈ ప్రకారము యాజ్ఞవల్క్యగీతలో సృష్టిక్రమము – కాలనిర్ణయము – సంహారక్రమ వర్ణన – అధ్యాత్మ ఆధిభూత అధిదైవములు – త్రిగుణ భావములు – త్రిగుణములననుసరించు వారికి ఎట్టి గతులు ప్రాప్తించును – క్షర అక్షర తత్త్వ నిరూపణములు – విభిన్న అంగముల ద్వారా ప్రాణోత్క్రమణ – మృత్యు సూచకములు – మోక్షోపదేశము మున్నగు ప్రసంగములు 311–319 అధ్యాయములందున్నవి.

స్తుతులు – స్తోత్రములు : దక్ష ప్రజాపతి కృత

శివసహస్ర నామములు రెండు వందల ఎనుబదైదవ అధ్యాయము నందున్నవి. దేవర్షి నారదుడు శ్రీమన్నారాయణుని ద్విశతి నామములతో స్తుతించిన స్తోత్రము మూడువందల ముప్పది తొమ్మిదవ అధ్యాయము నందున్నది.

ఉపాఖ్యానములు : మంత్రజపము చేయువారికి ఎట్టి ఫలము ప్రాప్తించును ? జపఫలము ఎటులుండును? జాపకులకు ఎటువంటి లోకములు సంప్రాప్తించును ? జపవిధిని గురించి వర్ణించుము. జపము ఏ వర్గమునకు చెందును ? అది సన్యాస యోగమా, ధ్యాన యోగమా, క్రియా యోగమా ! అని యుధిష్ఠిరుడు ప్రశ్నించెను. అందులకు భీష్ముడు ప్రాచీన ఇతిహాసమును ఉదహరించెను. మోక్షదర్శనులగు మునులు జపయోగమును సంన్యాసముతో సమానమని పేర్కొనిరి. ఉపనిషద్ వాక్యములు నివృత్తి మార్గమును, శాంతి – బ్రహ్మనిష్ఠలను బోధించినవి. సమదర్శనులగు మునులు సాంఖ్యమును, యోగమును చెప్పిరి. ఆ రెండింటి ద్వారా చిత్త శుద్ధిని సాధించి జ్ఞానప్రాప్తికి ఉపకారకముగ కొందరు జపయోగము నాశ్రయించెదరు. కొందరు అట్టి జపయోగము నాశ్రయించకనే జ్ఞానప్రాప్తి నొందెదరు. జప కర్మ ద్వారా ఏ ప్రకారము నివృత్తి మార్గమును చేరవలెనో 196-200 అధ్యాయములందు ఉపాఖ్యానము ద్వారా చెప్పబడెను.

ఎటువంటి విద్యనాశ్రయించినచో మనుష్యులు ప్రకృతికి పరమైన అవినాశి బ్రహ్మపదమును పొందెదరని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు సమాధానముగ జైగీషవ్య – అసితదేవల మునుల సంభాషణను భీష్మ పితామహుడు 229వ అధ్యాయములో చెప్పెను. మానవులు కామ్య కర్మలను పరిత్యజించి ఇంద్రియ నిగ్రహమును పెంచుకొని సమత్వబుద్ధి నలవరచుకొనవలెను.

"మృత్యువు ఎవరి ద్వారా సంభవించును ? ఏ కారణముచే మృత్యువు సమస్త ప్రాణులను సంహరించును ?" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు మృత్యుదేవత ఆవిర్భావ వృత్తాంతమును 256 నుండి 258 అధ్యాయములో చెప్పబడెను. జాజలి – తులాధరుల ఉపాఖ్యానము ద్వారా ధర్మ వివేచన గావించబడినది. ఈ ఉపాఖ్యానము 261 నుండి 264 అధ్యాయము లందున్నది. జాజలి మహర్షి వ్రత దీక్షతో కదలక మెదలక తపస్సు చేసినపుడు ఒక పక్షుల జంట అతని మస్తకము నందున్న జటలపై గూడు పెట్టినవి. అవి గ్రుడ్లు పెట్టి పిల్లలను పెంచి పెద్ద చేసిన పిమ్మట వెడలిపోయినవి. జాజలి మహర్షి తన ధర్మ నిరతికి తానే ఆనందపడు చుండగా ఆకాశవాణి ధర్మతత్త్వమును తులాధరుని చెంత నేర్చుకొనమని చెప్పినది. జాజలి మహర్షి సరాసరి తులాధరుని కడకేగి ధర్మస్వరూప రహస్యముల నాలకించెను. పిమ్మట జాజలి మహర్షి తన జటలలో నివసించిన పక్షులను రమ్మని ఎలుగెత్తి పిలిచెను. ఆ సందర్భమున తులాధరుడు ఆత్మ యజ్ఞము గురించి కూడ ధర్మబోధ చేసెను. తదనంతరము పక్షులు కూడ శ్రద్ధ – శీలము – తపస్సుల తత్త్వమును గురించి జాజలి – తులాధరులకు ఉపదేశించినవి. ఈ విషయములు 261 - 264 అధ్యాయములందున్నవి. చిరకాలము ఆలోచించి కర్తవ్య నిర్వహణ చేయు ధీరపురుషుల గుణము లెటులుండవలెనో చిరకారి ఉపాఖ్యానము నందు గౌతమ మహర్షి గానము చేసిన గాథ రెండువందల అరవై ఆరవ అధ్యాయమునందున్నది. చిరకాలము ఆలోచించిన పిమ్మట ఎవరితోనైనా మిత్రత్వము నెరుపవలెను. అట్టి మిత్రత్వమునకు భంగము కలిగినచో చిరకాలము ఆలోచించిన పిమ్మట తగు నిర్ణయము తీసుకొనవలెను. ద్రోహము – పాపకర్మ

- ఎవరికైనా అప్రియమైనదర్చుట యను విషయములందు ఆలస్యము చేయుట సర్వధా ప్రశంసనీయము. బంధువులు, సుహృదులు, సేవకులు, స్త్రీలు చేసిన రహస్య అపరాధముల గురించి ఎట్టి నిర్ణయమును తొందరపడి చేయరాదు.

ధర్మము - తపస్సు యొక్క ఉత్కర్ష గురించి రెండు వందల డెబ్బది ఎనిమదవ అధ్యాయములో కుండధారోపాఖ్యానము చెప్పినది. కుండధారుని ప్రసాదముచే తపస్సు ద్వారా సిద్ధిని సాధించిన బ్రాహ్మణుడు సంపూర్ణ లోకములలో సంచరించు ఖేచర యోగమును, సమస్తమును దర్శించు దివ్య దృష్టిని సాధించెను. ధర్మయోగ శక్తుల ద్వారా పరమగతిని కూడ పొందెను. వృత్రాసుర వధ - దక్ష యజ్ఞ విధ్వంసము యను ఉపాఖ్యానములు 281 - 284 అధ్యాయములలో చెప్పబడెను. గృహస్థు స్థూల సూక్ష్మ దేహాభిమానమును వీడి మోక్ష సిద్ధిని పొందు ఉపాయములు యోగిని సులభా ఉపాఖ్యానము (321 వ అధ్యాయము) నందున్నది. శుకమహర్షి ఉపాఖ్యానము (324 - 334 అధ్యాయము) సవివరముగ వ్యాసమహర్షి పుత్రార్థియై శంకర భగవానుని ఆరాధించుట - యజ్ఞోపవీతాది సంస్కారములు - శుకముని మిథిలానగరమునకేగి జనక మహారాజుతో ధర్మచర్చ చేయుట - వ్యాస మహర్షి స్వాధ్యాయ విధి వివరించుట - ప్రవహాది సప్త వాయువుల పరిచయము - శుకమునికి దేవర్షి నారదుని జ్ఞానబోధ - కర్మఫల ప్రాప్తి పరతంత్రము - శుక మహాముని ఊర్ధ్వగతి - శోకాతురుడైన వ్యాసమహర్షిని శివ మహాదేవుడు ఓదార్చుట మున్నగు విషయములున్నవి. తదనంతరము 335 నుండి 352 అధ్యాయము వరకు నారాయణ కథనమను విషయము వివిధ ప్రసంగములతో కూడి యున్నది. ఈ ఉపాఖ్యానములో నారాయణ ఋషి నారదునకు ఉపదేశించుట - ఉపరిచర వసువు చరిత్ర - పాంచరాత్ర ఉత్పత్తి - శ్వేత ద్వీప భగవానుని మహిమ - దేవర్షి నారదునకు భగవద్దర్శనము -ప్రవృత్తి నివృత్తి ధర్మములు - సృష్ట్యారంభము - బ్రాహ్మణ మహిమ - శ్వేతద్వీప మాహాత్మ్యమును దేవర్షి నారదుడు వర్ణించుట - వాసుదేవ మహాత్మ్యము - పితృ పూజా విధాన కల్పరచన - హయగ్రీవ అవతారగాధ మున్నగునవి వర్ణించబడినవి.

సాత్వత ధర్మము గురించి శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతా ఆవిష్కార సందర్భమున భక్తి యోగముగ అర్జునునకు ఉపదేశించెను. అగతి - గతి యొక్క స్వరూపము చాలా గహనము. అది అజితాత్ములకు దుర్గమము. అది సామవేదముతో సమానమైనది. ఈ భక్తి ధర్మము సత్యయుగము నుండి ప్రచలితమయ్యెను. జగదీశ్వరుడగు శ్రీమన్నారాయణుడే యీ ధర్మమును ధరించును. శ్రీమన్నారాయణుని నుండి బ్రహ్మదేవునకు ఆయన ద్వారా తదితరులకు ఈ సాత్వత ధర్మము పలు మార్లు ఉపదేశించబడి యుగయుగములందు ప్రచలితమైనది. భక్తి మార్గము ఇతర ధర్మానుయాయులకు దుర్విజ్ఞేయము. సాత్వత ధర్మమునను సరించువారు అహింసాభావయుక్తులై యుందురు. సాత్వత ధర్మము ప్రకారము మోక్షధర్మతత్పరులైన వారికి తృష్ణ యుండదు. వారి యొక్క యోగక్షేమముల భారమును భగవానుడే వహించును. జనన మరణ వలయములో చిక్కుకున్న వారిలో ఎవరిపై భగవానుని దృష్టిపడునో వారు సాత్వతులనబడెదరు. వారే మోక్షమునకు సునిశ్చిత అధికారులగుదురు. అనన్య భక్తుల యొక్క పరమాత్మ సేవాధర్మము సాంఖ్య - యోగ మతములతో సమానము.

వ్యాస మహర్షి నారాయణాంశతో అపాంతర మునిగా జన్మించుట యను ఉపాఖ్యానము మూడు వందల ఏబదొకటవ అధ్యాయమునందున్నది. పరాశర

మహర్షి పుత్రుడగు కృష్ణద్వైపాయన మహర్షికి కూడ పూర్వజన్మ వృత్తాంతమున్నది. వ్యాస మహర్షి స్వయముగా నారాయణుని యందు పుత్రునిగా ఉత్పన్నమయ్యెను. జగత్స్రష్ట శ్రీహరి "ఓమ్" శబ్దముతో సంపూర్ణ దిశలను ప్రతిధ్వనింపజేయుచు వాక్కు (సరస్వతి) నుచ్చరించెను. ఆ ప్రకారము సారస్వతము ఆవిర్భవించెను. అనగా సరస్వతి లేదా వాక్కు ద్వారా ఒక శక్తిశాలి పుత్రుడు ఉత్పన్నమయ్యెను. అతడు "అపాంతరతముడు" యని పిలువబడెను. ఆయన త్రికాలజ్ఞుడు - సత్యవాది - దృఢవ్రత పాలకుడు అయ్యెను.

అపుడు శ్రీమన్నారాయణుడు "అపాంతరతమా ! నీవు వేదవ్యాఖ్యానము కొరకు ఋగ్యజుస్సామాది శ్రుతులను వేర్వేరుగ సంగ్రహించ వలెను. నా ఆదేశము ప్రకారము నీవు యీ కార్యమును చేయుము". అని ఆదేశించెను. ప్రతి మన్వంతరములో అటుల చేయవలెనని ఆదేశించుటచే వేదవ్యాసులటుల ప్రతి ద్వాపరమునందు వెలయుచుందురు.

చివరగా దేవర్షి నారదుడు ఊంఛవృత్తి వైశిష్ట్యమును ఒక ఆఖ్యానము ద్వారా వివరించెను. అన్ని ఆశ్రమములలో స్వధర్మపాలన యను విధానమున్నది. ఆశ్రమములన్నియు స్వర్గ సాధకములే గాక మోక్ష సాధకములై యున్నవి. ధర్మమునకు యజ్ఞము - దానము - తపస్సు యను ధర్మములున్నవి. జగత్తులో ధర్మము గురించి చేసిన కార్యములేవియు నిష్ఫలములు గావు. ఊంఛ వృత్తిలో జీవనము గడిపిన వాన ప్రస్థుడు పరబ్రహ్మ ప్రాప్తిని పొందెనను విషయము ఇందులో ప్రతిపాదించబడినది.



శ్రీ వేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

అనుశాసనపర్వము

సంపుటి : 11

ఓం త్వష్టాయ నమః

రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

అనుశాసన పర్వము - సంగ్రహ పరిచయము

శాంతిపర్వములో రాజధర్మములు, ఆపద్ధర్మములు, మోక్ష ధర్మములు విస్తారముగా చర్చించబడినవి. అనుశాసన పర్వములో చతుర్విధ పురుషార్థముల సాధనకు కొన్ని విధులు, నియమములు, వర్తనలు శాసించబడినవి. వేద వాక్యములన్నియు రాజాజ్ఞ వలె పాలించదగినవి. అటులనే అనుశాసన పర్వము నందు చర్చించబడిన ధర్మములన్నియు చాతుర్వర్ణములవారు, చతుర్విధ ఆశ్రమములవారు తప్పక పాటించవలెను. అనుశాసన పర్వము నూట అరువది ఎనిమిది అధ్యాయములతో నున్ననూ దానధర్మ పర్వము ప్రధానమై, రెండవది భీష్మ స్వర్గారోహణ పర్వముతో సమాప్తమైనది.

స్తుతులు : అనుశాసన పర్వములో ప్రధానముగా పదునాల్గవ అధ్యాయము నుండి పదునెనిమిది అధ్యాయముల వరకు శివస్తుతి, శివసహస్రనామములు, శివసహస్రనామ మహిమ విపులముగా వర్ణించబడినవి. ఎనుబదియవ అధ్యాయములో గోవుల గురించి స్తుతి యున్నది. విష్ణుసహస్రనామ స్తోత్రము నూటనలుబది తొమ్మిదవ అధ్యాయమునందున్నది. శ్రీకృష్ణ మహాత్మ్యము, శ్రీకృష్ణ మహిమల గురించి నూట నలుబదేడు, నూట నలుబదెనిమిది, నూట ఏబది ఎనిమిది, నూట అరవదొక్క అధ్యాయములలో చెప్పబడెను. జపయోగ మంత్రములు, నిత్యస్మరణీయ నామములు నూట ఏబది, నూట అరువదైదవ అధ్యాయములలో నున్నవి.

ఉపాఖ్యానములు : ఎవరైననూ తాము చేసుకున్న కర్మల ద్వారా కాలప్రేరితులై వినాశము చెందెదరు. జీవుడు కర్మపరాధీనుడై తన మృత్యువునకు తానే కారణమగును. ఈ ధర్మ తత్త్వమును ప్రథమాధ్యాయము నందలి ఉపాఖ్యానము ద్వారా యుధిష్ఠిరునకు భీష్ముడు ఉపదేశించెను. సుదర్శనుడను రాజశ్రేష్ఠుడు అతిథి సేవావ్రతమను గృహస్థ ధర్మమును పాలించి అట్టి తపః ఫలితముగా పునరావృత్తిరహిత సనాతన లోకముల కేగెను. ఈ ఉపాఖ్యానము రెండవ అధ్యాయములో నున్నది. విశ్వామిత్ర మహర్షికి బ్రాహ్మణత్వము ప్రాప్తించిన విధానము మూడు - నాలుగు అధ్యాయములందున్నది. దయా ధర్మమును పాలించి ఒక చిలుక సనాతన లోకములను సాధించిన ఉపాఖ్యానము అయిదవ అధ్యాయమునందున్నది. దైవము - పురుషార్థములలో ఏది శ్రేష్ఠమను వసిష్ఠుని సందేహమును బ్రహ్మదేవుడు తీర్చిన సంవాదరూప ఇతిహాసము ఆరవ అధ్యాయమునందున్నది. పుణ్యపాపకర్మలనెడి విత్తనముల ద్వారా తగువిధమగు ఫలములే ఉత్పన్నమగును. విత్తనములు నాటనిదే ఫలోత్పత్తిగానటుల దైవము (ప్రారబ్ధము) కూడ పురుషార్థము లేనిదే సిద్ధించదు. మనుష్యులు యోగ్యకర్మలనొనర్చక కేవలము దైవమునాశ్రయించి వ్యర్థముగ జీవనము గడిపినచో కష్టముల పాలయ్యెదరు. పురుషార్థమే లేకున్నచో దైవము ఏదియూ యీయజాలదు. దైవ పురుషార్థముల మాన్యతల గురించి ఆరవ అధ్యాయము గొప్పగా విశదీకరించినది. ఎవరైనా మైత్రీ భావము లేదా సౌహార్దతతో నీచజాతి వానికి ఉపదేశమొనర్చినచో దోషము సంభవించును. అందులకు నిదర్శనముగా శూద్ర తపస్వి ఉపాఖ్యానము పదియవ అధ్యాయములో చెప్పబడినది. బ్రాహ్మణులు ఎన్నడూ నీచ వర్ణులకు

ఉపదేశములు చేయరాదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ద్విజాతులగుటచే వారికి ఉపదేశములు చేయవచ్చును. పురుషుడు శాస్త్ర విరుద్ధ అనుచిత వచనములు పలికినచో ఆ దుష్కర్మ యొక్క ఫలము ననుభవించును. బ్రాహ్మణుడు ఎవరికైనా ఉపదేశము చేయునపుడు కూడ జాగ్రత్త వహించవలెను. ఏలననగా ఉపదేశము చేసినవాడు తన శిష్యుని పాపమును స్వీకరించును. ఎవరికైనా ఏదైనా ఉపదేశము చేయునపుడు సత్యాసత్యమిశ్రిత దోషమున్నచో అది హానికరమే యగును. కనుక ఎవ్వరైనా ఏదైనా అడిగినపుడు చక్కగా ఆలోచించి శాస్త్ర సిద్ధాంతమునే చెప్పవలెను. ధర్మప్రాప్తియగు ఉపదేశమునే చేయువలెను. అనధికారులకు ఉపదేశము చేయుట వలన గొప్ప క్లేశములు సంభవించును. శూద్రునకు సేవాధర్మము ఉత్కృష్టము. మునీశ్వరుడు అందుకు విరుద్ధముగా శూద్రమునికి ఉపదేశమొనరించి స్వయముగా తన తపస్సును వ్యర్థమొనర్చుకొనెను. శూద్రమునికి సేవా ధర్మముచే లభించు ఉత్కృష్ట గతులను సాధించు అవకాశమును పోగొట్టి ఆత్మోద్ధరణకు భంగమొనర్చెను. స్త్రీలకు సురతసుఖము అధికముగ నుండునని ఉదహరించు ఉపాఖ్యానము పంద్రెండవ అధ్యాయమునందున్నది. స్త్రీలు సహధర్మమునెటుల పాటించెదరు ? సహధర్మము ఆయా దంపతులు మృతి చెందిన పిమ్మట ఎచటికి పోవును ? ధర్మసూత్రకారులు స్త్రీలను అసత్యపరాయణులై యుందురని నిశ్చయాత్మకముగా చెప్పిరి. అటులైనచో అసత్యవాదివి యగు స్త్రీని తోడుగా నుంచుకొని సహధర్మానుష్ఠానము నెరవేర్చుట ఎటుల సంభవమగును. అసత్యము ఎన్నటికి ధర్మసమ్మతముగాదు. కనుక దాంపత్య ధర్మమని చెప్పబడు సహధర్మము గౌణసంజ్ఞకమా ? అని యుధిష్ఠిరుడు ప్రశ్నించెను. అందులకు సమాధానముగా భీష్ముడు ఉత్తరదిశాధిష్ఠాత్రిదేవితో అష్టావక్రముని సంభాషణ ఉపాఖ్యానమును పందొమ్మిది, ఇరువది, ఇరువదొక్క అధ్యాయముల ద్వారా వినిపించెను. స్వర్గమర్త్యలోకములందైననూ ఎచట స్త్రీ పురుషులు ఒకేచోట నివసించెదరో వారిలో పరస్పర సంయోగ వాంఛ గలుగును. స్త్రీలు వృద్ధులైననూ సంభోగవాంఛ సంతాప కష్టమును పొందుచుందురు. ముల్లోకములలోను ఏ స్త్రీయు స్వతంత్రురాలు గాదు. అట్టి యోగ్యత వారికి లేదు. బాల్యావస్థలో తండ్రి రక్షణ, యౌవ్వనావస్థలో భర్త రక్షణ, వృద్ధాప్యములో పుత్రుని రక్షణలో స్త్రీలు జీవనమును గడుపవలెను. కనుక పురుషుడు ఎల్లవేళలా తన స్త్రీని రక్షించుకొనుచు సహధర్మమును పాలించవలెను. ఆ దాంపత్య సహధర్మము యిరువురికి ఇహపరములందు మేలు గూర్చును. తదనంతరము యుధిష్ఠిరుడు "పితామహా ! క్షత్రియ - వైశ్య - శూద్ర జాతులందెవరైనా బ్రాహ్మణత్వమును సాధించు ఉపాయమున్నచో తెలియజేయుము" అని ప్రార్థించెను. అందులకు భీష్ముడు "యుధిష్ఠిరా ! క్షత్రియ, వైశ్య, శూద్ర యోనులందు జన్మించినవారు బ్రాహ్మణత్వము నొందుట అత్యంత దుర్లభము. బ్రాహ్మణత్వము సమస్త ప్రాణులలో సర్వోత్తమ స్థానము. ఎన్నియో జన్మలు ఎన్నియో యోనుల ద్వారా పొందిన పిమ్మట ఎప్పుడో ఒకప్పుడు భాగ్యవశమున బ్రాహ్మణ యోనిలో జన్మ లభించును. ఈ విషయములో మతంగుడు - గాడిద సంవాదరూప ఇతిహాసమునొకటి ఇరువదేడు, ఇరువదెనిమిది, ఇరువది తొమ్మిది అధ్యాయముల ద్వారా వినిపించెను. వీతహవ్యుడను క్షత్రియుడు మాత్రమే భృగుమహర్షి మహిమచే బ్రాహ్మణుడైన వృత్తాంతము ముప్పదియవ అధ్యాయమునందున్నది. విశ్వామిత్రుడు క్షత్రియుడైననూ ఋచీక మహర్షి బ్రహ్మతేజము నిక్షిప్తమొనర్చిన చరువు మాహాత్మ్యము వలన పుట్టిన వాడగుటచే బ్రాహ్మణత్వమును

పొందెను. శరణార్థులై వచ్చిన చతుర్విధ ప్రాణులను రక్షించువానికి అక్షయ లోక ఉత్తమ గతి ప్రాప్తించునని భీష్ముడు ఉశీనరోపాఖ్యానము (శిబి చక్రవర్తి)ను ధర్మరాజునకు వినిపించెను. ఈ కథలో ఉశీనరునకు డేగ – కపోత రూపములలో ఇంద్రాగ్ని దేవతలు వచ్చి శరణాగత రక్షణ పరీక్ష పెట్టిరి. ఉశీనరుడు తన శరణుగోరి వచ్చిన కపోతము యొక్క ప్రాణమును రక్షించుటకై తన శరీరమును సమర్పించుకొనుటకు సిద్ధమయ్యెను. స్త్రీల యొక్క సహజ దోషములు గురించి దేవర్షి నారదునకు – పంచచూడయను అప్సరసకు జరిగిన సంవాదము ముప్పది ఎనిమిదవ అధ్యాయమునందున్నది. స్త్రీ రక్షణ ఆవశ్యకత గురించి యుధిష్ఠిరుడు ప్రశ్నించుచు, పూర్వము ఎవరైనా అట్టి ప్రయత్నములో సఫలీకృతులైనచో ఆ వృత్తాంతమును దెలుపమని ప్రార్థించెను. ఈ సందర్భములో భీష్ముడు చెప్పిన విపులోపాఖ్యానము నలుబది, నలుబదొకటి, నలుబదిరెండు, నలుబదిమూడు అధ్యాయములలో నున్నది. గోవు మాహాత్మ్యమును దెలుపుటకు చ్యవన మహర్షి బెస్తవారి వలలో నుండి విడిపడుటకు నహుష మహారాజు గోవును మూల్యముగా చెల్లించిన ధర్మోపాఖ్యానము ఏబది, ఏబదొకటవ అధ్యాయము లందున్నది. భృగు కుశిక వంశముల సంయోగము గురించి ఏబదిరెండు నుండి ఏబది యారు అధ్యాయముల వరకు యున్నది. చ్యవన మహర్షి యీ విషయము గురించి బ్రహ్మలోకమునందు ఆలకించి, బ్రాహ్మణ, క్షత్రియ సంకరము భృగు కులమునందు జరుగరాదని కుశిక మహారాజ దంపతులను పరీక్షించనెంచెను. ఆ దంపతులు తమ ధర్మనిష్ఠతో చ్యవన మహర్షిని సేవించి వరములు పొందిరి. ఆ ప్రకారము కుశిక వంశములో రాజర్షిగా నున్న విశ్వామిత్రుడు బ్రహ్మర్షియై కౌశిక గోత్రమునకు మూలపురుషుడయ్యెను. అటులనే కుశిక వంశ కన్యను వివాహమాడిన జమదగ్ని మహర్షికి పుత్రునిగా జన్మించిన పరశురాముడు క్షత్రియ ధర్మము నాచరించెను. బ్రాహ్మణ ధనాపహరణను తెలిసియో, తెలియకయో చేసిననూ తత్ ఫలితమును తప్పక అనుభవించెదరని తెలియజేయుచు డెబ్బదియవ అధ్యాయములో నృగోపాఖ్యానము వివరించినది. ప్రాణత్యాగమొనర్చుట అత్యంత దుష్కరకార్యము. ప్రాణులు ఉన్నతిలోగాని, అవనతిలోగాని, శుభాశుభ అవస్థలలోగాని మృత్యువును స్వాగతించరు. ఇందులకు కారణమేమి ?" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు భీష్ముడు ఒక కీటకోపాఖ్యానమును చెప్పెను. ఇది 117 నుండి 119 అధ్యాయము లందున్నది. నీచయోని యందు జన్మించిననూ సత్కార్యములు చేయు తలంపు గలిగినచో జన్మాంతరము లందు ఆత్మోన్నతి పొందవచ్చునని యీ వృత్తాంతము తెలిపినది. సామదాన దండోపాయము లలో సామమే శ్రేష్ఠమని దెలిపిన ప్రాచీన ఇతిహాసము నూటయిరువది నాల్గవ అధ్యాయమునందున్నది.

నీతిధర్మములు : సమస్త శుభకర్మల ఫలము లెటులుండునో, మరణానంతరము జీవులకు గతులెట్టివి లభించునో ఏడవ అధ్యాయములో భీష్ముడు వర్ణించెను. లక్ష్మీ – అలక్ష్మి నివాస స్థానములు స్త్రీ పురుషులందెటుల ప్రతిష్ఠితమైయుండునో పదునొకండవ అధ్యాయములో చెప్పబడెను. మనోవాక్కాయ పాపములు మూడున్నూ ఎటులుండునో, వానిని పరిత్యజించు విధానమేదియో పదమూడవ అధ్యాయమునందు చెప్పబడెను. ఇరువది నాల్గవ అధ్యాయములో బ్రహ్మహత్యా పాతక సమాన అనేక పాపములు ఉదహరించ బడినవి. తీర్థయాత్రా సేవనము పుణ్యసంచయమునకు, పాప ప్రక్షాళనకు ఒక గొప్ప సులభమగు ఉపాయము. ఇరువదైదు, ఇరువదారు అధ్యాయములలో తీర్థ మాహాత్మ్యములు

వర్ణించబడినవి. మానవులలో ఎవరెవరు పూజనీయులో, వారిని పూజించుట వలన ప్రాప్తించు లాభమేదియో ముప్పదియొకటవ అధ్యాయము నందున్నది. కన్యకు వివాహము చేయునపుడు సత్పాత్రుడగు వరుడు ఎట్లుండవలెనో నలుబదినాల్గవ అధ్యాయమునందున్నది. కన్య, దౌహిత్రులకు ఉత్తరాధికార ప్రాప్తి విషయమై నలుబది అయిదవ అధ్యాయము చెప్పినది. స్త్రీలను ఆవశ్యము వస్త్రభూషణాదులతో సదా సత్కరించవలెనని నలుబదియారవ అధ్యాయము నందున్నది. బ్రాహ్మణాది వర్ణములలో దాయభాగవిధి, వర్ణ సంకర సంతాన వివరములు, దశవిధపుత్రులు 47, 48, 49 అధ్యాయములలో చెప్పబడెను. గృహస్థ ధర్మము నాశ్రయించిన మనుజుడు ఏ కర్మను చేయుటచే సఫలీకృతుడగునని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు భీష్ముడు "రాజా ! ఈ విషయము గురించి శ్రీకృష్ణునకు – పృథివీదేవికి జరిగిన సంవాదమును వినిపించెదరు. గృహస్థ పంచయజ్ఞకర్మలు చేయుట వలన సఫలీకృతుడగునని భూదేవి చెప్పిన విధానములు తొంబది ఏడవ అధ్యాయములో నున్నవి. పితామహా ! పుణ్యాత్ములందరూ తమ మరణానంతరము ఒకే లోకమున కేగెదరా లేక వారికి లభించు లోకములు భిన్న భిన్నములుగా నుండునా" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు భీష్ముడు మహాతపస్వి గౌతమునకు ధృతరాష్ట్రుడను రాజు రూపము ధరించి వచ్చిన దేవేంద్రునకు జరిగిన ప్రాచీన సంవాదమును నూట రెండవ అధ్యాయములో వినిపించెను. మనుష్యులు తాము చేసిన కర్మలననుసరించి భిన్న భిన్న లోకముల కేగుదురు. ఎవరెవరికి ఏ ఏ లోకములు ప్రాప్తించునో యీ సంవాదమునందు విశదమొనర్చబడెను. పితామహా ! మానవులు ఏ ఉపాయముతో దీర్ఘాయువులగుదురు లేదా ఏ కారణముచే వారికి ఆయువు క్షీణమగును ? ఏ కార్యములు చేయుట వలన కీర్తిమంతులగుదురు ? ఏమి చేయుట వలన ధన సంపదలు ప్రాప్తించును" అని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు సమాధానముగ భీష్ముడు "యుధిష్ఠిరా ! సదాచారము వలన మానవులకు ఆయుర్వృద్ధి యగును. సదాచారమే అతనిని ధనవంతుని చేయును. సదాచారము వలన ఇహపర లోకములందు కీర్తి లభించును. దురాచారికి దీర్ఘాయువు యుండదు'' అని పలికెను. ఆ సందర్భమున భీష్ముడు చెప్పిన సదాచార దురాచారములు నూటనాల్గవ అధ్యాయము నందున్నవి. అన్నదమ్ముల మధ్య యుండవలసిన సద్వర్తనము, మాతాపితరులు గురుజనులపై చూపవలసిన గౌరవాదరములు నూట అయిదవ అధ్యాయములో వివరించబడినవి. పితామహా ! ఏ తీర్థములు శ్రేష్ఠములో, ఎచటకు పోయినచో పరమ శుద్ధి ప్రాప్తించునో వర్ణించమని యుధిష్ఠిరుడు అడిగెను. అందులకు భీష్ముడు "యుధిష్ఠిరా ! ఈ పృథివిపై ఎన్ని తీర్థములున్నవో అవియన్నియు గుణకారకములే యగును. ఆచారశుద్ధి – మనశ్శుద్ధి – తీర్థశుద్ధి – జ్ఞానశుద్ధి యనువానిలో జ్ఞానముతో లభించు శుద్ధి అన్నిటికన్న శ్రేష్ఠమైనది. జగత్తులో బలము – క్రియ సంయుక్తమైనపుడే కార్యసిద్ధి యగును. అటులనే శరీర శుద్ధి – తీర్థశుద్ధి సంయుక్తమైనపుడే మానవుడు పవిత్రుడై పరమాత్మ ప్రాప్తిరూప సిద్ధిని పొందును. భీష్ముడు పరమ పవిత్రమైన ప్రధాన మానస – పార్థివ తీర్థముల గురించి నూట ఎనిమిదవ అధ్యాయములో చెప్పెను. "యుధిష్ఠిరా ! ప్రాణి ఒంటరిగా జన్మించి, ఒంటరిగా మరణించి, ఒంటరిగా సద్గతిని – దుర్గతిని భోగించును. అతని ధర్మమొక్కటియే ఆ జీవాత్మను అనుసరించి వెడలును. కావున ధర్మమొక్కటియే మానవునకు నిజసహాయము. అందుచే మానవులు

సదాధర్మమును సేవించవలెను. ధర్మయుక్త ప్రాణియే ఉత్తమ స్వర్గమునకేగును. అధర్మ పరాయణులు నరక గతులు పొందెదరు" అని బృహస్పతి నానావిధ పాపములు - నరకగతులు గురించి నూట పదకొండవ అధ్యాయములో చెప్పెను. మాంసభక్షణ - మద్యసేవనము త్యాగమొనర్చి, అహింసాధర్మమును పాలించు ఆవశ్యకత గురించి 113 నుండి 116 అధ్యాయములలో చెప్పబడినది. ఇందులో చెప్పిన ధర్మవిశ్లేషణ సమాదరణ ప్రశంసనీయము. శాండిలినీదేవి చెప్పిన పతివ్రతా స్త్రీల కర్తవ్యములు నూట యిరువది మూడవ అధ్యాయములో నున్నవి. మానవులు ప్రతిదినము ప్రాతఃకాలమున లేచినంతనే గోవును - నేయిని - పెరుగును - ఆవాలను - కొఱ్ఱ ధాన్యమును స్పృశించినచో పాపవిముక్తు లగుదురు. ఉపవాసాది వ్రత సంకల్పములు, పూజోపచారములు, శ్రాద్ధకర్మలలో రాగి పాత్రనుపయోగించుట చేసినచో దేవతలు - పితరులు సంతుష్టి చెందెదరు. అతిథి సత్కారము చేయని గృహస్థునకు స్త్రీహత్య - గోహత్య - బ్రహ్మహత్య - గురుతల్పగామి పాపము - కృతఘ్నుల పాపము సంభవించును. ఆత్మ శ్రేయస్సు కోరుకొనువాడు గోవులపై - ప్రజ్వలిత అగ్నిపై ఎన్నడూ పాదము నెత్తరాదు. గోవుల గురించి రెండు శ్లోకమంత్రములను ప్రతిదినము పఠించువానికి పాపము - భయము - శోకము యుండవు. పుష్యమాసములో శుక్లపక్ష రోహిణీయుక్త యోగమునందు రాత్రి స్నానముచేసి శుద్ధి పొందిన పిమ్మట ఏక వస్త్రము ధరించి ఏకాంత ప్రదేశములో వెల్లకిలా పడుకొని బాహ్యాకాశములో నక్షత్రములను జూచుచు చంద్రకిరణములను పానము చేయువానికి గొప్ప యజ్ఞానుష్ఠాన ఫలము వచ్చును. సంవత్సరములో నాలుగు నెలలకు ఒకసారి పితరులకు తిలమిశ్రిత జలాంజలులు, వేదశాస్త్ర పారంగతులగు బ్రాహ్మణులకు యథాశక్తి భోజనము సమర్పించువానికి వంద యజ్ఞములు చేసిన ఫలము లభించును. ఇటుల అనేకానేక ధర్మరహస్యములను పితృదేవతలు, దేవేంద్రుడు, బృహస్పతి, విష్ణువు, బలరాముడు, దేవగణములు, అగ్నిదేవుడు, విశ్వామిత్రుడు, గోసముదాయము, లక్ష్మీదేవి, అంగిరా మహర్షి, గార్గ్యముని, ధౌమ్యుడు, జమదగ్నిమహర్షి, వాయుదేవుడు, లోమశమహర్షి, అరుంధతి, యమధర్మరాజు, చిత్రగుప్తుడు, ప్రమథగణములు, దిగ్గజములు, మహాదేవుడు మున్నగువారు చెప్పిరి. అవియన్నియు 125 నుండి 134 అధ్యాయములలో చెప్పబడినవి. ముందుగా భీష్మపితామహుడు ధర్మశాస్త్ర విశిష్టతను వేదవ్యాస మహర్షి ద్వారా తాను ఆలకించిన విషయమునిటుల వర్ణించెను.

"యమధర్మరాజు నియమపరాయణుడై యోగయుక్తుడై గొప్ప తపస్సు చేసెను. ఆ తపస్సు యొక్క ఫలస్వరూపముగ దేవగుహ్య ధర్మరహస్యము లనెరిగెను. అవియే పైన చెప్పబడినవి. ధర్మార్థ కామములను. ప్రతిపాదించు శాస్త్రములన్నియు పవిత్రములు ధర్మశాస్త్రములలో ధర్మములు, వాని రహస్యముల వ్యాఖ్యానమున్నది. ధర్మశాస్త్రమును నిత్యము పఠించి, ధర్మతత్త్వమును హృద్యంగము జేసికొని, ధర్మ ఫలములను ఇతరుల సమక్షమున వ్యాఖ్యానించువాడు సాక్షాత్తు నారాయణ స్వరూపుడగును". తదనంతరము భీష్ముడు శివపార్వతీ సంవాదరూప ప్రాచీన ఇతిహాసమును యుధిష్ఠిరునకు వినిపించెను. ఇందులో వర్ణాశ్రమ సంబంధ ఆచారములు, ప్రవృత్తి నివృత్తిరూప ధర్మములు, వానప్రస్థ ధర్మ మాహాత్మ్యము, బ్రాహ్మణాది వర్ణములలో జన్మ లభించుటకు చేయదగు శుభకర్మలు, మనోవాక్కాయములలో చేయు శుభాశుభకర్మలు,

స్వర్గనరకములు - ఉత్తమ నీచజన్మలు కలిగించు శుభాశుభ కర్మలు, స్త్రీ ధర్మములు, శ్రీకృష్ణమహిమ మున్నగునవి 140 నుండి 148 అధ్యాయములలో చెప్పబడెను.

బ్రాహ్మణ మహిమ : భీష్మ పితామహుడు బ్రాహ్మణ శ్రేష్టుల మహిమను వర్ణించుచు "యుధిష్ఠిరా ! వేదము మాత్రమే ఎవనికి పరమధనమో, ఆత్మజ్ఞానమే స్వర్గధామమో, వేదస్వాధ్యాయ మొనర్చుటయే శ్రేష్ఠతపస్సుయో, ఎవని కులములో పరంపరాగతముగ ధార్మిక కార్యములు సమర్థవంతముగ జరుగునో, ఎవరు వినీత భావముతో విద్యాధ్యయనము చేయుదురో, శాస్త్రజ్ఞాన సంపన్నులెవరో, సదాచార వర్తనులై అవినాశి పరమాత్మతత్త్వమునెవరు ఎరుగుదురో, ఇంద్రియ సంయమనముతో మధుర భాషణము చేయుచు మేఘ సమాన గంభీర స్వరముతో మనోహర మంగళమయ మాటలు ఎవరు వినిపించుదురో అట్టి బ్రాహ్మణులే శ్రేష్ఠులనబడుదురు" అని ఎనిమిదవ అధ్యాయములో ప్రశంసించబడెను. కులీనుడు, ధర్మాత్ముడు, తపస్వి, విద్వాంసుడునైన బ్రాహ్మణులు తారసిల్లినచో వారిని దర్శించినవారు కృతార్థులగుదురు. దానము యిచ్చెదనని బ్రాహ్మణునకు వాగ్దానము చేసి అద్దానిని భంగమొనర్చినవాడు వేయి అశ్వమేధములను చేసి ప్రచుర దానము చేయుటచే పాపవిముక్తుడగునని ధర్మశాస్త్ర వాక్యమున్నది. బ్రాహ్మణ మహత్వవర్ణనము ముప్పదిమూడు, ముప్పది నాలుగు అధ్యాయములలో నున్నది. పాపములను నశింపజేసుకొన దలంచినచో బ్రాహ్మణసేవ చేయుటయే ఉత్తమ మార్గమయని భూదేవి చెప్పినది. స్వయముగా బ్రహ్మదేవుడు చెప్పిన బ్రాహ్మణుల మహత్త్వము ముప్పదియైదవ అధ్యాయములో విస్తారముగా చెప్పబడినది. ఇంద్ర - శంబరాసుర సంవాదములో బ్రాహ్మణ మాహాత్మ్యము నవివరముగ ముప్పదియారవ అధ్యాయమునందున్నది. బ్రాహ్మణ ధనము నపహరించు చండాల స్వభావ మానవుడు తాను పరివార సహితముగ నశించును. ఇందులకొక ప్రాచీన ఉపాఖ్యానము నూట ఒకటవ అధ్యాయములో చెప్పబడినది. బ్రాహ్మణుడు విద్వాంసుడైననేమి, అవిద్వాంసుడైననేమి, భూతలములో మహాదేవతగ నెన్నదగును. అగ్నిని పంచభూసంస్కారము లతో స్థాపించిననూ లేకున్ననూ అగ్ని మాహాత్మ్యము తగ్గనటుల బ్రాహ్మణుడు మహాదేవతగనే పరిగణించబడును. తేజస్వంతమగు అగ్ని శ్మశానము నందున్ననూ దూషితముగాదు. విధిపూర్వక హవిష్యములు గ్రహించు యజ్ఞాగ్ని, గృహములో నుండు గార్హపత్యాగ్ని రెండునూ అధికాధిక శోభనే గూర్చును. అదే ప్రకారము బ్రాహ్మణుడు అనిష్టకర్మలు చేయుచున్ననూ సర్వధా మాననీయుడు. ఇటుల బ్రాహ్మణ మహిమను భీష్మ పితామహుడు పలు విధముల నూటయాబది యొకటవ అధ్యాయములో బ్రాహ్మణ ప్రశంస చేసెను. కార్తవీర్యార్జునుకు - వాయుదేవునకు జరిగిన సంవాదములో బ్రాహ్మణుల శ్రేష్ఠత 152-153 అధ్యాయము లందున్నది. అటులనే ఉతథ్యమహర్షి, అగస్త్యమహర్షి, వసిష్ఠ మహర్షి, అత్రి మహర్షి, చ్యవన మహర్షి, దుర్వాసమహర్షి మున్నగువారి ప్రభావములు 154 నుండి 159 అధ్యాయములలో నున్నది.

వ్రతములు - దానముల ప్రశంస : యజ్ఞ యాగాది కర్మలతో దేవ ఋణమును, స్వాధ్యాయముతో ఋషి ఋణమును, పుత్రోత్పత్తి - శ్రాద్ధకర్మలతో పితృ ఋణమును, దానములతో బ్రాహ్మణ ఋణమును, అతిథి సత్కారములతో మనుష్య ఋణమును దీర్చుకొను గృహస్థు వినయముతో శాస్త్రకర్మలను అనుష్ఠించినచో ధర్మభ్రష్టుడుగాకుండును. పరిచితులు

– అపరిచితులు – యథా సమయమునకు వచ్చినవారు దానమునకు పాత్రులే యగుదురు. ఋత్వికులు – పురోహితులు – ఆచార్యుడు – శిష్యులు – బంధువులు – విద్వాంసులు – దోషదృష్టిలేనివారు దానపాత్రత యోగ్యులు. వీరుగాక యితర వర్గములకు చెందినవారు దాన పాత్ర యోగ్యులుగారు. దానమునిచ్చునపుడు ఏకాగ్ర చిత్తముతో పరీక్షించవలెను. ఎవని యందు అక్రోధము – సత్యభాషణము – అహింస – ఇంద్రియ సంయమనము – సరళత – ద్రోహచింతన లేకుండుట – అభిమాన శూన్యత – లజ్జ – సహనము – దయ – మనోనిగ్రహము మున్నగు సద్గుణములుండునో, ఎవరు ధర్మ విరుద్ధకార్యములు చేయకుందురో అట్టివారిని దానమునకు ఉత్తమాధికారులుగ గ్రహించవలెను. దానపాత్రత గురించి మరింత విస్తృతముగ ముప్పదిఏడవ అధ్యాయము చెప్పినది. కన్యాదాన విషయములో పాత్రత నిర్ణయము గురించి నలుబదినాల్గవ అధ్యాయము చెప్పినది. వివిధ తపస్సులు – దాన ఫలముల గురించి ఏబదిఏడవ అధ్యాయము వర్ణించినది. జ్ఞానము – విజ్ఞానము – ఆరోగ్యము – రూపసంపత్తి – సౌభాగ్యము – ధనము, తపస్సు వలన ప్రాప్తించును. మౌనవ్రత పాలనచే ఇతరులపై అధికారము చెలాయించు సమర్థత గలుగును. దానముచే భోగప్రాప్తి, బ్రహ్మచర్యపాలనచే దీర్ఘాయువు లభించును. అహింస యొక్క ఫలము మంచిరూపము. దీక్ష యొక్క ఫలముగ ఉత్తమ కులములో జన్మము, పయోవ్రతముచే స్వర్గలోక ప్రాప్తి, గురుసేవచే విద్యాప్రాప్తి మున్నగు అనేక తపః ఫలములు వర్ణించబడినవి. దానముతో యశస్సు, అహింసతో ఆరోగ్యము, బ్రాహ్మణసేవతో రాజ్యప్రాప్తి, జలదానముచే అక్షయకీర్తి, అన్నదానముచే కామభోగ పూర్ణ తృప్తి, దీపదానముచే నేత్ర రోగములు లేకుండుట, దర్శనీయ వస్తువులను దానమొనర్చుటచే మేధాశక్తి ప్రాప్తించును. తటాక జలాశయ నిర్మాణము వలన ఏ ఏ యజ్ఞ ఫలములు ప్రాప్తించునో, ఉద్యాన వనములు – తోటలు నిర్మాణము వలన ఎట్టి మాహాత్మ్యము గలుగునో ఏబది ఎనిమిదవ అధ్యాయము చెప్పినది. సమస్త ప్రాణులకు అభయదానమొసంగుట, సంకట పరిస్థితిలో ప్రాణులను అనుగ్రహించుట, యాచకుడు కోరిన వస్తువునిచ్చుట, దాహార్తి దప్పికను దీర్చుట శ్రేష్ఠ దానములుగా పరిగణించబడును. ఈ శ్రేష్ఠ దానముల పుణ్యమే దాతను అనుసరించును. సువర్ణదానము, గోదానము, భూదానము యను గొప్పదానములచే పాపాత్ములు సైతము పాపవిముక్తు లగుదురు. బ్రాహ్మణసేవా పుణ్యమునకు మించిన పుణ్యము మరొకటి లేదు గాక లేదు. ఇటుల అనేకానేక ఉత్తమ దానములు, ఉత్తమ బ్రాహ్మణుల గురించి ఏబది తొమ్మిదవ అధ్యాయము వర్ణించినది. యాచకుని కన్న యాచన చేయని వానికి యిచ్చిన దాన ఫలమే శుభకరమై యుండును. కృపణుని కన్న ధైర్యవంతుడే విశేషించి సన్మానపాత్రుడగును. రక్షణ కార్యములో ధైర్యమును ప్రదర్శించు క్షత్రియుడు, యాచించ కూడదను దృఢ నిర్ణయము గల బ్రాహ్మణుడు శ్రేష్ఠులుగా పరిగణించబడుదురు. ధీరుడు, విద్వాంసుడు, సదా సంతోషముతో నుండు బ్రాహ్మణుడు మాత్రమే తన వ్యవహారశైలితో దేవతలను సైతము సంతుష్టిపరచును. వేదవిద్వాంసుడు, వ్రతధారియునగు బ్రాహ్మణునకు యిచ్చిన దానము వలన ప్రాతః సాయం సంధ్యలందు విధిపూర్వకముగ అగ్నిహోత్రము లొనర్చిన ఫలము సిద్ధించును. ఇటుల అనేక దానధర్మముల గురించి అరువది, అరువదొక్క అధ్యాయములు వర్ణించినవి. భూదానమును మించిన దానములేదు. భూదానము చేసినవారు సమృద్ధిశీలిగ సుఖములను భోగించుదురు. భూదానముతో

బ్రహ్మహత్యాపాతకములు సైతము నశించును. భూదాన మహిమ అరువది రెండవ అధ్యాయము నందు విస్తృతముగ వర్ణించబడినది. అన్నదాన మాహాత్మ్యము అరువదిమూడవ అధ్యాయములో చెప్పబడినది. ఏ ఏ నక్షత్రములలో ఏ ఏ వస్తువులను దానమొనర్చుటచే ఎట్టి ఫలప్రాప్తి యగునో అరువది నాల్గవ అధ్యాయమునందున్నది. సువర్ణాది వస్తువుల దాన మహిమను గురించి 65 - 68 అధ్యాయములలో వర్ణించబడినది. ఈ సందర్భముగ కుమార సంభవము, తారకాసుర వధ, సువర్ణోత్పత్తి గురించి 84 నుండి 86 అధ్యాయములలో వర్ణించబడెను. గొడుగు - పాద రక్షలు ఉత్పత్తియైన విధానము, వానిని దానము చేయుటచే లభించు ఫలము తొంబదియైదు, తొంబదియారు అధ్యాయములు చెప్పినవి. ద్వాదశి ఉపవాస విష్ణుపూజా మాహాత్మ్యము, మార్గశీర్ష మాసములో చంద్రవ్రతము గురించి నూట తొమ్మిది, నూటపది అధ్యాయములలో చెప్పబడెను.

గోదాన మహిమ - గోమహాత్మ్యము : గోదాన మహిమను గురించి నచికేతునకు యమధర్మరాజు చేసిన ఉపదేశము డెబ్బదియొకటవ అధ్యాయములో నచికేతోపాఖ్యానముగ నున్నది. కేవలము గోదానము చేయుట ప్రశస్తము గాదు. దానవిధి నెరుగవలెను. గోవులలోని తారతమ్యము నెరుగుట అతికష్టమైనది, పాత్రత గలవారిని గుర్తించుట కూడ కష్టమే. వేదస్వాధ్యాయ సంపన్నుడు, తపస్వి, యజ్ఞానుష్ఠాన తత్పరుడు గోదానమునకు సర్వోత్తమ పాత్రులు. కృచ్ఛ్రవ్రతపరాయణుడు, కుటుంబ పుష్టి కొరకు గోదానము నడిగినవాడు కూడ గోదానమునకు ఉత్తమపాత్రుడు. ఇటులనే ఎవరెవరు గోదాన గ్రహణమునకు పాత్రులో డెబ్బది యొకటవ అధ్యాయమునందున్నది. గోదానము చేయుటకు ముందు మూడు రాత్రులు ఉపవాస పూర్వకముగ కేవలము నీరు త్రాగి భూశయనము చేయవలెను. ఆ మూడురోజులలో గోవునకు పుష్టిగా ఆహారమును, కుడితి మున్నగు వానితో సంతృప్తిపరచవలెను. గోవు దూడతో బాటు నుండవలెను. క్షీరసమృద్ధి గలదై, ఉత్తరోత్తర ఉత్తమ సంతానమునిచ్చునదై యుండవలెను. అట్టి గోవును దానము చేసిన పిమ్మట మూడు రోజులు కేవలము గోరసమును (పాలు, పెరుగు, మజ్జిగ, నేయి) ఆహారముగ స్వీకరించవలెను. గోవు - భూమి - సరస్వతి ఒకే వర్ణమునకు చెందినవారు గావున ఆ మూడింటిలో ఏది దానమొసంగిననూ సమాన ఫలమునిచ్చును. వేద విద్యనుపదేశించుట సరస్వతీ దానమగును. స్వేచ్ఛగా సంచరించు గోవులను గాని, విశ్రాంతి చెందుచున్న గోవులను గాని ఉద్వేగపరచి పరుగులు పెట్టించరాదు. గోవు ఆకలి దప్పులతో యుండి తన యజమాని వంక క్రోధ వీక్షణము చేసినచో అతడు సబాంధవముగ నశించును. ప్రతిదినము భుజించుటకు ముందు పట్టెడు పచ్చగడ్డి గోవునకు తినిపించు వ్రతము చేయువానికి పుత్రప్రాప్తి, యశస్సు, దానము, సంపద లభించును. గోదానము దురాచారి - పాపాత్ముడు - లోభి - అసత్యవాది - దేవపితృ కార్యములు చేయని వానికి యీయరాదు. దౌహిత్రుడు - దత్తుడు - క్రీతుడు యను ముచ్వురు పుత్రులలో ఏ ఒక్కరు యున్నను పుత్రహీన దోషము తొలగును. ఒకప్పుడు దేవేంద్రునకు గోలోకము గురించి, గోదాన మహిమ గురించి బ్రహ్మదేవుడు వర్ణించిన విధానము డెబ్బదిమూడవ అధ్యాయమునందున్నది. భూలోకమువలె అనేక లోకములున్నవి. గోలోకము రమ్యమనోహరమై నానాప్రకార వనములు, గృహములు, పర్వతములు, నదులు, తటాకములు, జలాశయములతో విశాలముగ నుండును. అచట

అమంగళములు, రోగశోక భయములు, తాపము, వృద్ధాప్యము ఉండవు. గోలోకవాసులు తమ ఇచ్ఛానుసారము ఏ లోకమునందైననూ విహరించగలరు. వారు మనస్సుతో స్మరించినంత మాత్రమున ఏ వస్తువునైననూ పొందెదరు. గోలోకవాసము కేవలము పుణ్యాత్ముల సొత్తు. పిత్రార్జిత ధనముతో గోవును కొని గోదానము చేయువానికి అక్షయ లోకములు ప్రాప్తించును. గోదానముతోబాటు సువర్ణమును దక్షిణగా నీయవలెను. అపుడా పుణ్యము ద్విగుణీకృతమగును. గోహత్య చేసినవాడు ఆ గోవుయొక్క శరీరముపై ఎన్ని రోమములుండునో అన్ని సంవత్సరములు నరకగతులు పొందును. గోదానవిధి – గోప్రార్థన డెబ్బది యారవ అధ్యాయమునందున్నవి. నదులలో గంగాదేవి శ్రేష్ఠమైనటుల గోవులలో కపిల గోవు శ్రేష్ఠమైనది. కపిల గోవుల ఉత్పత్తి – వాని మహిమ గురించి డెబ్బదిఏడవ అధ్యాయము నందున్నది. గోదాన విధానము, గోదానమహిమ గురించి – గవోపనిషత్తు గురించి వసిష్ఠ మహర్షి సౌదాసునకు చెప్పిన విషయము డెబ్బది ఎనిమిదవ అధ్యాయమునందున్నది. ఆ సందర్భమున గోవులు తపస్సు చేసి బ్రహ్మదేవుని ద్వారా పొందిన వరములను వర్ణించబడెను. దక్షిణాయోగ్యమగు వస్తువులలో గోవులు శ్రేష్ఠములు. గోమయముతో స్నానము చేసినవారు పవిత్రులగుదురు. గోమయమును పవిత్రత కొరకు దేవపితృ కార్యములందు వినియోగించెదరు. గోవులు సంపూర్ణ జగత్తుకు ఆశ్రయములై భూత భవిష్యద్వర్తమానములకు మాతలైనవి. వ్యాసమహర్షి గోవులు – గోదానమహిమ – గోలోకము గురించి శుకమునికి చెప్పిన విషయములు ఎనుబది యొకటవ అధ్యాయమునందున్నవి. లక్ష్మీదేవికి – గోవులకు జరిగిన సంవాద రూప ఉపాఖ్యానములో గోవుల పేడలో – మూత్రములో తాను నివసించునటుల లక్ష్మీదేవి గోవులను ప్రార్థించెను. ఇది ఎనుమది రెండవ అధ్యాయమునందున్నది. సమస్త దేవతల – లోకపాలుర లోకముల కన్న గోలోకము ఊర్ధ్వముగ నుండును. గోదానము చేసిన వారికి ప్రతిదినము అన్నదానము – యజ్ఞము చేసిన ఫలము ప్రాప్తించును. దధి – గోఘృతము లేనిదే యజ్ఞమునకు యజ్ఞత్వము సిద్ధించదు.

శ్రాద్ధకర్మ మహాత్మ్యము : శ్రాద్ధకర్మచే ధనము – యశస్సు – పుత్రప్రాప్తి గలుగును. దేవాసుర మనుష్య గంధర్వాది సమస్త గణములకు పితరులు సదా పూజనీయులు. సత్పురుషులు ముందుగా పితరులను పూజించిన పిమ్మట మాత్రమే దేవతా పూజలొనరించెదరు. పితృ శ్రాద్ధములను అన్వాహార్యములనెదరు. కావున విశేష విధి ద్వారా పితృ దేవతా అనుష్ఠానమును ముందుగా చేయవలెను. ఏ దినములందు శ్రాద్ధ కర్మతో పితరులను పూజించినచో ఎట్టి ఫలము ప్రాప్తించునో ఎనుబదేడవ అధ్యాయము చెప్పినది. శ్రాద్ధ కర్మలో తిలలు – వ్రీహి ధాన్యము – యవలు – మినుములు వినియోగించినచో పితరులు అక్షయ తృప్తి నొందెదరు. ఆవుపాల పెరుగు – ఘృతమిశ్రిత పాయసము బ్రాహ్మణ భోజనములో సమర్పించినచో పితృ దేవతలకు ఒక సంవత్సర తృప్తి గలుగును. పితరులు గానము చేసిన రెండు శ్లోకములను సనత్కుమార మహర్షి చెప్పినవి ఎనభైఎనిమిదవ అధ్యాయములో యిటులున్నవి. "మా వంశములో ఎవడైన దక్షిణాయన ఆశ్వయుజ మాస కృష్ణపక్ష మఖా నక్షత్రయుక్త త్రయోదశి తిథినాడు ఘృతమిశ్రిత పాయసమును మా ప్రీతి కొరకు బ్రాహ్మణునకు దానము చేయునా లేదా ఏ మాసమునందైననూ మఖా నక్షత్రయుక్త తిథియందు గజఛాయలో (రావిచెట్టు నీడలో) వరి అన్నముతో చేసిన పాయసము, బలుసాకు కూరతో కూడిన శ్రాద్ధ కర్మ చేయునా ! మా


వంశములో ఒకడైననూ గయా తీర్థములో వటవృక్షము చెంత మా కొరకు శ్రాద్ధ కర్మ చేయునా ! అని గానము చేసిరి." ఇట్టి శ్రాద్ధకర్మలు పితరులకు అక్షయ తృప్తినిచ్చును. విభిన్న నక్షత్రములలో చేసిన శ్రాద్ధ కర్మల ఫలము ఎటులుండునో ఎనభై తొమ్మిదవ అధ్యాయములో చెప్పబడెను. శ్రాద్ధకర్మలో ఎటువంటి బ్రాహ్మణులను భోక్తలుగా పిలువవలెను – ఎటువంటి వారిని త్యజించవలెను యను విషయములు తొంబదియవ అధ్యాయములో నున్నవి. శ్రాద్ధకర్మ ఉత్పత్తి గురించి తొంబది యొకటవ అధ్యాయము నందున్నది. శ్రాద్ధ దానములకు సుపాత్రుల లక్షణములు ఇరువది రెండవ అధ్యాయములో వివరించబడినవి. శ్రాద్ధకర్మలో నిమంత్రణకు యోగ్యులగు వారిని గురించి పూర్వమే చెప్పబడినది. కొద్ది సడలింపుతో నిమంత్రణకు అనుగ్రహించబడిన వారు, నిమంత్రణకు అయోగ్యులగు వారిని గురించి ఇరువది మూడవ అధ్యాయము వివరించినది. అవిగాక ఎటువంటి పదార్థములు దాన యోగ్యములు గాక రాక్షస భాగములగునో కూడ వివరించబడినవి. శ్రాద్ధకర్మకు దోషభూయిష్టమగు ధనముల గురించి శ్రాద్ధ కర్మయందు పలుకవలసిన వచనము గురించి, సత్కర్మలు గురించి కూడ విస్తృతముగా చర్చించబడినవి.

గృహస్థ ధర్మ రహస్యములు : ఒక ఉపాఖ్యానము ద్వారా ఋషులు చెప్పిన గృహస్థ ధర్మరహస్యములు, మరొక ఉపాఖ్యానము ద్వారా బ్రహ్మర్షి – రాజర్షులు చేసిన సనాతన ధర్మోపదేశములు తొంబది మూడు, తొంబది నాలుగు అధ్యాయములలో చెప్పబడినవి.

పుష్పధూప దీప నైవేద్యాదుల మాహాత్మ్యము : ప్రజాపతి మనువు – తపస్వి సువర్ణుని సంవాదరూప ప్రాచీన ఇతిహాసము నూటతొంబది ఎనిమిదవ అధ్యాయమునందున్నది. పూలతో దేవతలనెందుకు పూజించ వలెను ? దీపము – ధూపము ఇచ్చుట వలన ఫలమేమి ? ఈ విషయముపై శుక్రాచార్యుని ఉపదేశమును బలిచక్రవర్తి కోరెను. అందుకు శుక్రాచార్యుడు "రాజా ! ముందుగా తపస్సు ఉత్పన్నమైన పిమ్మట ధర్మము వెలిసినది. ఈ రెండింటి మధ్యకాలములో లతలు – ఓషధులు ప్రాదుర్భవించినవి. వానిలో అమృత – విష – తదితరజాతి తృణములున్నవి. దేనిని జూచిన మనస్సు ప్రసన్నమగునో అది అమృతము. ఏది తత్కాల తృప్తినిచ్చునో అది విషము. తన వాసనతో చిత్తమునకు తీవ్రగ్లాని కలిగించునది కూడ విషము. ఓషధులన్నియు అమృతములు. మనస్సునకు ఆహ్లాదము కలిగించునవగుటచే పూవులను సుమనములని పుణ్యాత్ములు పేర్కొనిరి. పూల అలంకరణతో, పూసుగంధములతో దేవతలు సంతృప్తి చెంది ఆరాధనకు పుష్టినిచ్చెదరు. దేవతలకు తెల్లని పూలు ప్రీతికరములు. కమలములు, తులసి, సంపెంగ, జాజి, మల్లె మున్నగు వానిని అధికముగా ప్రశంసించెదరు. జలోత్పన్నమగు కమలములు, ఉత్పలములు మున్నగువానిని గంధర్వులకు – నాగులకు – యక్షులకు విద్వాంసులు సమర్పించెదరు. ఇటుల ఏ ఏ పూలు అభిచార కర్మలందు, భూత ప్రేతములకు వినియోగించెదరో విపులముగా చెప్పబడినది. అటులనే ధూపములు, దీపముల గురించి వర్ణించబడినది.

తపస్సు – అనశన వ్రతముల ప్రశంస : తపస్సుననుసరించి మానవులకు ఉత్తమ లోకములు ప్రాప్తించును. అనశన వ్రతములు గొప్ప తపస్సుగా పరిగణించబడినవి. ఇందులకు భగీరథునకు బ్రహ్మదేవునకు జరిగిన సంవాదరూప ఉపాఖ్యానము నూట మూడవ అధ్యాయమునందున్నది. కృచ్ఛ

చాంద్రాయణాది వ్రతములను అనశన వ్రతములనెదరు. బ్రాహ్మణులు, క్షత్రియులు మూడు రాత్రులు మాత్రమే ఉపవాసము చేయు విధానమున్నది. వైశ్యులు, శూద్రులు కేవలము రెండు దినములు లేదా రెండు రాత్రులు ఉపవాసము చేయు విధానమున్నది. మాస - పక్ష - తిథి సంబంధ వ్రతోపవాస ఫలములు సవివరముగ చెప్పబడినవి. వేదమునకు మించిన శాస్త్రము, ధర్మమునకు మించిన ఉత్కృష్ట లాభము, ఉపవాసమునకు మించిన తపస్సులేవు. దేవతలు కూడ విధిపూర్వక ఉపవాసములు చేసి స్వర్గప్రాప్తి పొందిరి. ఋషులు కూడ ఉపవాసములతోనే సిద్ధులను పొందిరి. చ్యవన, జమదగ్ని, వసిష్ఠ, గౌతమ, భృగు మున్నగు మహర్షులందరు ఉపవాస వ్రతములతోనే దివ్యలోకములను పొందిరి. యజ్ఞతుల్య ఉపవాస వ్రతముల గురించి నూట ఏడవ అధ్యాయము విస్తారముగ వర్ణించినది. వేదవ్యాసునకు, మైత్రేయునకు జరిగిన సంవాదములో దాన ప్రశంస, కర్మ రహస్యము, తపః ప్రశంస మున్నగునవి నూట వదునెనిమిది, నూట పందొమ్మిది అధ్యాయములందున్నది. మనుష్యులకు మూడు వ్రతములు ఉత్తమ వ్రతములుగా వేదము చెప్పినది. 1. ఎవరికీ ద్రోహము తలబెట్టకుము, 2. దానమును చేయుము, 3. ఇతరులకు ఎల్లపుడూ సత్యమునే చెప్పుము. వేదోక్త కర్మలలో దానమే శ్రేష్ఠతరము. దానము చేయువాడు ప్రాణదాతయే. అతని యందు సర్వము ప్రతిష్ఠితమై యుండును. వేదములకు స్వాధ్యాయము, ఇంద్రియములకు సంయమనము, సర్వస్వమునకు త్యాగము ప్రధానమైనటుల యీ సంసారములో దానమే అత్యంత ఉత్తమము. వాస్తవముగ తపస్సు పవిత్రతను చేకూర్చును. వేదాధ్యయనము - తపస్సు స్వర్గ సాధనలు. తపస్సు మానవులకు మహోన్నత పదమును ప్రాప్తింపజేయును. పాపములన్నిము తనస్సుతోనే దూరమగును. ఎవరు ఏ ఉద్దేశ్యముతో తపస్సు చేసిననూ విద్యాప్రాప్తి కూడ యగును. ఏది అత్యంత కఠినము - దుర్ధర్షము - దుర్లంఘ్యమో దానిని తపస్సుతో సుసాధ్యమొనర్చు కొనవచ్చును. తపస్సు యొక్క బలము అన్నిటికన్న శ్రేష్ఠమైనది.



శ్రీవేదవ్యాస ప్రణీత

శ్రీమన్మహాభారతము

(మూలశ్లోక - చిత్సుఖానంద వచన సుధా సహితము)

ఆశ్వమేధిక, ఆశ్రమవాస, మౌసల
మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు - 12









నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥



రచయిత

బ్రహ్మశ్రీ సరిపల్లె వేంకట సుబ్రహ్మణ్య సోమయాజి

అశ్వమేధిక పర్వము - సంగ్రహపరిచయము

మహాభారత గ్రంథములో పదునాల్గవ భాగమగు ఆశ్వమేధిక పర్వములో అశ్వమేధ పర్వము, అనుగీతా పర్వములను రెండు ఉపపర్వములున్నవి. మహాభారత ఆదిపర్వము రెండవ అధ్యాయములో ఈ ఉపపర్వము లందు నూటమూడు అధ్యాయములు, మూడువేల మూడు వందల ఇరవై శ్లోకములున్నటుల యున్నది. అధ్యాయములు, శ్లోకములలో భేదము కొన్ని అధ్యాయములు విడదీయుట వలన లేదా కలుపుట వలన తరువాత ప్రతులందు ఏర్పడినట్లు భావించబడినది.

కథాంశము :

యుధిష్ఠిర మహారాజు భీష్మునకు జలాంజలి సమర్పించిన పిమ్మట జలాశయము నుండి బయటకు వచ్చినంతనే ఆయన సర్వేంద్రియములు శోక వ్యాకులమైనవి. యుధిష్ఠిరుడు గంగాతటముపై వేటగానిచే కొట్టబడిన గజరాజువలె క్రింద పడిపోయెను. ఆయన నేత్రద్వయము నుండి అశ్రుధారలు ప్రవహించెను. ధృతరాష్ట్రుడు పరిపరి విధముల తన తప్పిదము చేతనే యింతటి ప్రజానాశనము జరిగినదని, తాను విదురుని హితవచనములను పెడచెవిని పెట్టుటచే వంద మంది పుత్రులను కోల్పోయి శోకాంబుధిలో మునిగిపోయితి నని పలికెను. అటులనే యుధిష్ఠిరుని శోకమునువీడి తమ్ములతోగూడి మనోవాంఛిత భోగములను భోగించమని చెప్పెను. అపుడు శ్రీకృష్ణభగవానుడు, వ్యాసమహర్షి యుధిష్ఠిరుని ఓదార్చుచు పాప నిర్మూలనకై అశ్వమేధయాగమును చేయమనిరి. యుధిష్ఠిరుడు తన వద్ద ధనములేదని చెప్పగా వ్యాసమహర్షి మరుత్తు మహారాజు వృత్తాంతమును వివరించెను. యుధిష్ఠిరుడు తన తమ్ములతో గూడి హిమాలయములకేగి శివమహాదేవుని ఆరాధించి యజ్ఞమునకు సరిపడు ధనమును దెచ్చుటకు నిశ్చయించెను. యుధిష్ఠిరుడు హస్తినాపురమున కేగి దేవతలను - బ్రాహ్మణులను పూజించెను. మృతి చెందిన బంధువులకు శ్రాద్ధకర్మలొనర్చి పృథివీ రాజ్యమును శాసించసాగెను. శ్రీకృష్ణుడు ద్వారకా నగరమునకేగి తన బంధుజనులను కలిసి మహాభారత యుద్ధవిశేషములు వినిపించెను. శ్రీకృష్ణుడు రైవత పర్వత మహోత్సవములో పాల్గొనెను. పాండవులు శివుని ఆరాధించి ప్రచుర ధనరాశులను దెచ్చి యజ్ఞాచారణ సంసిద్ధులయ్యిరి. శ్రీకృష్ణభగవానుడు మరల హస్తినాపురమును చేరెను. సుభద్రకోరికపై అభిమన్యుని మృతపుత్రుని బ్రతికించి ఉత్తరాదేవికి దుః ఖోపశమనము గావించెను. అభిమన్యు సుతునకు నామకరణము గావించెను. వ్యాసమహర్షి ఆదేశము ననుసరించి పాండవులు అశ్వమేధ యజ్ఞవిధులను స్వీకరించిరి. అర్జునుడు యజ్ఞాశ్వముననుసరించి జైత్రయాత్రకు బయలుదేరెను. అర్జునుడు తన జైత్రయాత్రలో పుత్రుడగు బభ్రువాహనుని చేతిలో పరాజయము పొందెను. అందులకు కారణము తెలిసిన తండ్రీ తనయులు గాఢానురాగబద్ధులయ్యిరి. పిమ్మట అర్జునుడు తన జైత్రయాత్రను ముగించుకొని హస్తినాపురమును చేరెను. అశ్వమేధ యజ్ఞమునకు తగు ఏర్పాట్లు జరిగెను. ఈ మహాయజ్ఞములో యాగాశ్వమును శ్రవణము చేసిన పిమ్మట మంత్ర- ద్రవ్య- శ్రద్ధ యనెడివానితో శాస్త్రోక్తప్రకారము

అశ్వవపను హోమము చేసి ఆ ధూమమును యుధిష్ఠిరుడు తన ధర్మపత్ని మరియు సోదరులతో గూడి ఆఘ్రాణించి పాపవిముక్తులయ్యిరి. యజ్ఞ పరిసమాప్తి యందు వ్యాసమహర్షి శిష్యులగు పదునారుమంది ఋత్విజులు ఆశీస్సులనిచ్చిరి. వ్యాసమహర్షి కూడ శుభకామనలు దెలిపి అభ్యుదయ పూర్వక ఆశీస్సుల నొసంగెను. పిమ్మట యుధిష్ఠిరుడు అశ్వమేధయాగ విధి ననుసరించి భూమండలము నంతయు వ్యాసమహర్షికి దానముగానిచ్చి, కోటి సువర్ణముద్రలు దక్షిణగా నిచ్చెను. వ్యాసమహర్షి కోర్కెపై ఒక్కొక్క బ్రాహ్మణునకు కోటి సువర్ణముద్రలు చొప్పున మూడింతల దక్షిణనొసంగెను. ఆ ప్రకారము పృథివీమూల్యమును సువర్ణముద్రలతో చెల్లించి యుధిష్ఠిరుడు అన్నదమ్ములతో గూడి ప్రసన్నుడయ్యెను.

ఉపాఖ్యానములు

ఆశ్వమేధిక పర్వములో సంవర్త – మరుత్తుల వృత్తాంతము మహదాశ్చర్యకరమైనది. సంవర్తుడు బృహస్పతి యొక్క సోదరుడు. బృహస్పతివలె గొప్ప మేధా సంపన్నుడు. బృహస్పతి దేవ పౌరోహిత్యము స్వీకరించిన పిమ్మట ఇంద్రుని ప్రేరణతో మానవుల పౌరోహిత్యము చేయనని ప్రతిజ్ఞచేసెను. తమ కుల పురోహితుడగు బృహస్పతి అట్టి నిర్ణయము తీసుకొనుటచే మరుత్తు మహారాజునకు గొప్ప ఇబ్బంది కలిగెను. అపుడాయన దేవర్షి నారదుని సలహా ప్రకారము సంవర్తుని ఆశ్రయించెను. సంవర్తుడు శివానుగ్రహము పొంది ఉపదేశమును మరుత్తునకు చేసి అమిత ధనరాశి లభించునటుల చేసెను. పిమ్మట తన మంత్రబలముతో ఇంద్రాది దేవతలు స్వయముగా మరుత్తు యొక్క యజ్ఞకార్యములు నిర్వహించునటుల చేసెను. ఇదొక అద్భుత ఉపాఖ్యానము. మహాభారత యుద్ధములో శ్రీకృష్ణుని పాత్రను ఆక్షేపించి శాపము నీయదలించిన ఉత్తంక మహర్షికి చేసిన ఆధ్యాత్మబోధ, విశ్వరూప దర్శనము కూడ ఒక చిత్రమైన ఉపాఖ్యానము. ఈ సందర్భమున ఉత్తంకుని గురుభక్తి కూడ వివరించబడినది. తన కుమారుడగు బభ్రువాహనుని చేతిలో అర్జునుడు పరాజయము చెందుటకు గల కారణమును వివరించుచు చెప్పిన ఉపాఖ్యానము కూడ ఆశ్చర్యకరము. మృతశిశువుగా జన్మించిన అభిమన్యు సుతుని శ్రీకృష్ణభగవానుడు బ్రతికించిన విధానము కూడ అత్యద్భుతము. ఉంఛవృత్తి వైశిష్ట్యము గురించి ఒక ముంగిస యుధిష్ఠిరుని యజ్ఞవైభవమును తృణీకరించి చెప్పిన ఉపాఖ్యానము ఒక గొప్ప ధార్మిక ప్రసంగము.

ధర్మములు

ఒకప్పుడు దేవరాజు ఇంద్రుడు యజ్ఞము చేసెను. పశ్వాలంబన సమయములో మహర్షులందరు పశువుపై దయగలిగి యజ్ఞపశువును వధించు విధానము శుభకారకముగాదనిరి. ఏలననగా హింసతో గూడిన దేదియూ ధర్మము అనిపించు కొనదు. మూడు సంవత్సరములకు పైగా నిల్వయున్న గోధుమలు, యవలు, సజ్జలు మున్నగు ధాన్య బీజములతో యజ్ఞము నొనర్చమనిరి. అదియే గొప్ప ధర్మానుకూలము, గుణకారకము, మహత్తర ప్రదమనిరి. ఇంద్రుడందులకు అంగీకరించక వివాదమునకు సిద్ధమయ్యెను. కొందరు జంగమ (పశ్వాదులు) పదార్థములతో యజ్ఞము చేయుట సమ్మతమనిరి. కొందరు స్థావర (బీజాన్న ఫలాదులు) పదార్థములతో చేయుట సముచితమనిరి. అపుడు తత్త్వదర్శనులగు ఋషులు దేవేంద్రుని సలహా ననుసరించి ఉపరిచరవసువును ధర్మమును చెప్పమనిరి. అందులకాయన ఏ పదార్థము దొరికిన ఆ పదార్థముతో చేయవచ్చునని అనాలోచితముగ

పతికి పాతాళమునకు పతనము చెందెను. కనుక ఏదైనా ధర్మసందేహము ఉత్పన్నమైనపుడు ప్రజాపతి బ్రహ్మ తప్ప యితరులెవరూ ఏ ఒక్క నిర్ణయమును చేయరాదు. కావున ధర్మదూషిత బుద్ధిగల పాపాత్ముడు చేసిన దానము ఎంతటి అధికమైనదైననూ వ్యర్థమేయగును. తపోధనుదగు ధర్మాత్ముడు ఫలమూలాదులు, శాకములు, ధాన్యాది అన్నములు, జలపాత్రలతో తన శక్త్యనుసారము దానము చేసి ఊర్ధ్వలోక గతులు పొందును. అదియే ధర్మము. అదియే గొప్పయోగము. సర్వభూతదయ, బ్రహ్మచర్యము, సత్యము, కరుణ, ధృతి, ఓర్పు యనునవి సనాతన ధర్మమునకు మూలములు. పూర్వము మహర్షులందరు తమ న్యాయార్జిత ధనమును దానము చేయుచు సత్యవ్రతమును పాలించుచు పరమసిద్ధిని పొందిరి. ఈ సందర్భములో అగస్త్యుని యజ్ఞము గురించి ఉపాఖ్యానము చెప్పబడినది. ఆయన ధాన్యబీజయజ్ఞము నిరాటంకముగా పండ్రెండు సంవత్సరములు సాగెను. ఆ విధానములు యీ ఉపాఖ్యానములో మనోహరముగ వివరించబడినవి.

గీతలు

శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునకు మనశ్శాంతిని పొందు విధానమును బోధించి ఆయన శోకవ్యాకుల దీనత్వమును పోగొట్టదలంచెను. మానవులలో కుటిల బుద్ధియే మృత్యుస్వరూపము. సరళబుద్ధియే బ్రహ్మప్రాప్తికి సాధనము. ఈ యదార్థము నెరుగుటయే జ్ఞానవిషయము. ఇందులకు విరుద్ధముగ చెప్పునది వ్యర్థప్రలాపమే. యుధిష్ఠిరా! నీవు నీ శత్రువులను జయించితి ననుకొనుచుంటివి. కానీ నీ కర్తవ్యము పూర్తికాలేదు. నీ అంతఃశత్రువులను జయించలేదు. వారు నీ శరీరమునందే యున్నారు. నీ అంతశ్శత్రువులగు కామక్రోధ మదమాత్సర్య లోభమోహములనెడి అరిషడ్వర్గమును ఎందులకు గుర్తించలేకుంటివి? యుధిష్ఠిరా! ఎవనికి మమత్వబుద్ధి యుండదో, అతదు సంపత్తినేమి చేసుకొనును? అనగా ఆ సంపత్తి అతనికి అనర్థము కలిగించదు. మమకారము మాయామయము. మాయామయ మంతయు మిథ్యయే. సమస్త కామనలు మనస్సునందే వుండును. విద్వాంసులు కోరికలు దుఃఖకారణమని తలంచి కామనా పరిత్యాగమొనర్చుదురు. ఈ సందర్భమున శ్రీకృష్ణభగవానుడు "కామగీతను" యుధిష్ఠిరునకు వినిపించెను. ఇది 13వ అధ్యాయములో 12 నుండి 22 శ్లోకములుగా నున్నది.

మహాభారత యుద్ధానంతరము అర్జునుడు కొన్నాళ్ళు శ్రీకృష్ణునితో ఆనందపూర్వకముగా మైత్రీ బంధము ననుభవించెను. ఒకనాడు శ్రీకృష్ణార్జునులు యిరువురు స్వజనులతో మయసభలో సంచరించుచు ఒక దివ్య ప్రదేశమునందు ఆసీనులయ్యిరి. అపుడు అర్జునుడు "దేవకీనందనా! మహాభారత సంగ్రామ సమయములో నాకు దివ్యజ్ఞానోపదేశము - ఈశ్వరీయ విశ్వరూప సందర్శనము లభించిదని, కాని యుద్ధములో విచలితుడనగుటచే నీవు ఉపదేశించిన జ్ఞానమునంతయు మరచిపోయితిని. ఆ జ్ఞానము నంతయు మరల వినవలెనని ఉత్కంఠగనున్నది." అనెను. అందులకు శ్రీకృష్ణభగవానుడు "అర్జునా! నేను ఆ సమయమున యోగయుక్తుడనై పరమాత్మ తత్త్వమును వర్ణించితిని. ఆయా ధర్మములన్నియు అదే విధముగా వివరించుట నా వశముగాదు. ఇపుడా జ్ఞానమును సంక్షేపముగ చెప్పుటకు నీకొక ప్రాచీన ఇతిహాసమును వర్ణించెదను. దాని వలన లభించు సమత్వబుద్ధి నాశ్రయించినచో నీకు ఉత్తమగతి

ప్రాప్తించును" అనెను. ఆ సందర్భమున చెప్పినదియే అనుగీతగ పేరొందినది. అనుగీత పదునారవ అధ్యాయము నుండి ఏబదియొకటవ అధ్యాయము వరకు యున్నది. ఇందులో మొదటి తొమ్మిది అధ్యాయములు ఒక సిద్ధపురుషునకు – శ్రీకృష్ణునకు జరిగిన సంవాదముగ నున్నది. సిద్ధుడు మోక్ష, ధర్మ విషయములు, జీవుని వివిధగతులు, సంసారమును తరించు ఉపాయము, మోక్షప్రాప్తికి ఉపాయములు చెప్పెను. ఆ విషయములన్నియు అర్జునునకు వివరించిన పిమ్మట ఒక బ్రాహ్మణునకు తనపత్నితో జరిగిన సంభాషణను కూడ బ్రాహ్మణగీతగ శ్రీకృష్ణుడు పదునైదు అధ్యాయములలో బోధించెను. ఈ అనుగీతాంతర్గత బ్రాహ్మణగీతలో జ్ఞానయజ్ఞోపదేశము, మనస్సువాక్కుల యొక్క శ్రేష్ఠత, పంచప్రాణముల శ్రేష్ఠత, ఉదానప్రాణ ఉత్కృష్టత, చాతుర్హోమయజ్ఞము, అంతర్యామి ప్రాముఖ్యత, అధ్యాత్మవనము, జ్ఞానపురుషస్థితి, పరశురాముని క్షత్రియ కులసంహారము, అలుర్కుని ధ్యానయోగము, అంబరీషుని అధ్యాత్మిక స్వారాజ్యగాథ, మమతాత్యాగము, బ్రాహ్మణుని జ్ఞాననిష్ఠ, బ్రాహ్మణగీత ఉపసంహారము చెప్పబడినవి. చివరగా గురుశిష్య సంవాదమను ఉపాఖ్యానములో పరబ్రహ్మ స్వరూపమును గురించి శ్రీకృష్ణుడు ఉదహరించెను. ఇందులో అంగిరాది మహర్షులందరు బ్రహ్మదేవుని కడకేగి వినయపూర్వకముగ మ్రొక్కి పరమ కల్యాణ దాయకమగు ప్రశ్నలతో తమ సందేహములు దీర్చమని ప్రార్థించిరి. అపుడు బ్రహ్మదేవుడు వారికి తమోగుణధర్మములు, రజోగుణ ధర్మములు, సత్త్వగుణ ధర్మములు, ప్రకృతి యొక్క నామవర్ణనము, మహత్తత్త్వ మహిమ, అహంకారోత్పత్తి, అహంకారస్వరూపము, పంచభూతములు, ఇంద్రియసృష్టి, నివృత్తి మార్గము, ధర్మలక్షణములు, క్షేత్రక్షేత్రజ్ఞతత్త్వము, పదార్థ ఆద్యంతములు, గృహస్థ ధర్మములు, బ్రహ్మచర్య – వానప్రస్థ – సంన్యాసి ధర్మములు, ముక్తిసాధనలు, ఆత్మ–పరమాత్మ వివేచనము, ధర్మనిర్ణయతత్త్వము, సత్త్వపురుషతత్త్వములు, పరమాత్మశ్రేష్ఠత, అనుగీత ఉపసంహారము వెరసి పదునేడు అధ్యాయములలో చెప్పబడినవి.



ఆశ్రమవాస పర్వము - సంగ్రహ పరిచయము

ఈ పర్వములో ఆశ్రమవాస, పుత్రదర్శనా, నారదాగమన మనెడి మూడు ఉపపర్వములు ముప్పది తొమ్మిది అధ్యాయములున్నవి.

కథాంశము :

ధృతరాష్ట్ర మహారాజు తన పుత్రులను యుద్ధములో కోల్పోయిన పిమ్మట నిరాశ్రయు డయ్యెను. కాని పాండవులు గాంధారీ ధృతరాష్ట్రులను గౌరవ సత్కారములతో సేవలొనరించుచు పదునైదు సంవత్సరములు రాజ్యపాలన సాగించిరి. పాండవులు అన్ని కార్యములలో ధృతరాష్ట్ర మహారాజు యొక్క సలహాలను అడుగుచూ ఆయన అనుమతితోనే అన్ని కార్యములు చక్కబెట్టుచుండిరి. కుంతీదేవి కూడా సదా గాంధారీ సేవలో నుండెడిది. ధృతరాష్ట్రుని సేవలో విదురుడు, సంజయుడు, యుయుత్సుడు సావధానులై యుండెడివారు. వేదవ్యాస మహర్షి కూడా ప్రతిదినము ధృతరాష్ట్రుని వద్ద కూర్చొని దేవర్షుల, పితరుల, రాక్షసుల కథలు వినిపించెడివాడు. భీమసేనుడు మాత్రము తన పెదతండ్రి ఎడల మనస్సులో దుర్భావనలు పెంచుకొని ఆయనను క్షమించ లేకుండెను. ధృతరాష్ట్రునకు అప్రియమగు కార్యములను చేయుట, కఠోర వచనములతో బాధించుట చేయసాగెను. పదునారవ సంవత్సర ములో భీమసేనుడి వాగ్బాణములకు పీడితుడైన ధృతరాష్ట్ర మహారాజు ఖేదవైరాగ్యములు పొందెను. ఆయన తన మిత్రులందరిని సభదీర్చి తాను పాండవుల యెడ జరిపిన అన్యాయవర్తనల వలన పుత్రులను పోగొట్టుకొని, అన్ని అనర్థములకు కారణభూతుడనైతినని దెలిపి ప్రాయశ్చిత్తమునకై తన మనస్సు నియమ వ్రతములు పాలించకోరుచున్నదని తెలిపెను. "తాను - గాంధారి యీ పదునైదు సంవత్సరములు రెండు మూడు రోజులకు ఒక్కసారి మాత్రమే ఆకలి దీర్చుకొనుచు, నియమవ్రతపాలన మిషతో మృగచర్మములు - కుశాసనము వినియోగించుచు భూశయనము చేయుచుంటిమి". అనెను. తరువాత యుధిష్ఠిరునితో "నాయనా ! మన పూర్వపురుషులెల్లరు పుత్రులకు రాజ్యము నప్పగించి వనములకేగుటయే నియమముగా పాలించిరి. నేను కూడా వాయుభక్షణముతో ఉపవాసము చేయుచు నా ధర్మపత్నితో తపస్సు చేయుదును" అని పలికెను. ఆ సమయమున వ్యాసమహర్షి వచ్చి ధృతరాష్ట్ర మహారాజు కోరుకొనుచున్న వనవాసమునకు అనుమతించమని యుధిష్ఠిరునకు హితవు చెప్పెను. యుధిష్ఠిరుడు అందులకు అంగీకరించినంతనే ధృతరాష్ట్రుడు రాజనీతి ధర్మములను ఉపదేశించెను. ఈ రాజనీతి ధర్మములు ఐదు, ఆరు, ఏడు, అధ్యాయములలో విశదముగ వివరించబడినవి. ధృతరాష్ట్రుని వనవాసముకు కురుజంఘాల ప్రజలు కూడ అనుమతినిచ్చిరి. ఆ సమయమున ధృతరాష్ట్రుడు "నిష్పాప ప్రజలారా ! నా పుత్రులు చంచల బుద్ధితో, లోభులై స్వేచ్ఛాచారులగా వ్యవహరించిరి. వారి అపరాధములను మన్నించమని నేను గాంధారీ సహితునిగా క్షమాభిక్ష కోరుచున్నాను" అని ప్రార్థించెను. అపుడు ప్రజల తరఫున సాంబుడను బ్రాహ్మణుడు పలువిధముల ధృతరాష్ట్రుని ఓదార్చెను.

ధృతరాష్ట్రుడు తన పుత్రులకు శ్రాద్ధకర్మలొనర్చుటకై ధనమును కోరి విదురుని ద్వారా తన విన్నపమును పంపెను. యుధిష్ఠిరుడు ఆయన కోర్కెను ఉదారముతో తీర్చెను. ధృతరాష్ట్రుడు సంతృప్తికరముగా శ్రాద్ధకర్మలు – దానాదులు జరిపి గాంధారి సహితముగ వనములకు పోవ సంసిద్ధుడయ్యెను. వారిరువురితో బాటు తాను కూడ వనవానమునకు పోవ నిశ్చయించిన కుంతీదేవి కూడ పాండవులకు నచ్చజెప్పెను. కుంతీ సహిత గాంధారీ ధృతరాష్ట్రులు ముందుగా గంగాతటమునందు నివసించిరి. విదురుడు, సంజయులు కూడా ధృతరాష్ట్రుని అనుసరించి కుశాసనములు, సుఖశయ్యలు ఆ ముప్విరికి ఏర్పాటు చేసిరి. ధృతరాష్ట్ర మహారాజు ఇంద్రియ సంయమపూర్వకముగ నియమ పరాయణుడై సేవాసహితముగ గంగాతటమునకు పోయి అచటనుండి కురుక్షేత్రమునకు చేరెను. కురుక్షేత్రములో మహామనస్వి రాజర్షి శతయూప ఆశ్రమమునకు పోయి ఆయనను సందర్శించెను. ధృతరాష్ట్ర మహారాజు ఆయనను తోడ్కొని వ్యాసాశ్రమమునకు వెడెలెను. అచట ధృతరాష్ట్రుడు విధిపూర్వకముగ వ్యాసమహర్షిని పూజించి వనవాసదీక్షను గ్రహించెను. శతయూపుడు తన ఆశ్రమమునకు ధృతరాష్ట్రుని గొనిపోయి వ్యాసమహర్షి ఆజ్ఞానుసారము వనవాస నియమములను – విధులను వివరించెను. ఆ ప్రకారము మహామనస్వి ధృతరాష్ట్ర మహరాజు తానేగాక తనతో వచ్చిన వారిని కూడా తపస్సు యందు లగ్నమొనర్చెను. వల్కల మృగచర్మధారులై గాంధారీ కుంతీదేవి కూడ ధృతరాష్ట్రునితో సమానముగ వనవాస వ్రత నియమములు పాటించసాగిరి. ఈ సమయములోనే దేవర్షి నారదుడు పూర్వము వానప్రస్థ ధర్మము నాచరించిన రాజర్షులెందరో ఉత్తమగతులు పొందిన వివరములు ధృతరాష్ట్రునకు చెప్పెను.

పాండవులు తమ రాణివానములతో కురుక్షేత్రమునకేగి ధృతరాష్ట్రాదులను దర్శించిరి. విదురుడు నిరంతరము ఉపవాసములు చేయుచు వాయుభక్షకుడై కఠోరతపస్సు చేయుచుండెనని తెలుసుకొనిరి. అంతలో దూరము నుండి విదురుని చూచిన యుధిష్ఠిరుడు ఒంటరిగా ఆయనను అనుసరించెను. విదురుడు వనవృక్షముల చాటున కనీకనబడక ఘోరవనాంతరములోనికి ప్రవేశించెను. ఆయన వెనుక పరుగుదీసిన యుధిష్ఠిరుడు ఎదురుగా నిలిచి తన పరిచయమొనర్చుకొనెను. అపుడు విదురుడు ఏకాగ్రతతో యుధిష్ఠిరుని వంకజూచి తన దేహమును యుధిష్ఠిరుని దేహములో, తన ప్రాణములను యుధిష్ఠిరుని ప్రాణములో, తన ఇంద్రియములను యుధిష్ఠిరుని ఇంద్రియములలో స్థాపితమొనర్చెను. అపుడు మహాతేజస్వి యుధిష్ఠిరుడు తన పురాతన స్వరూపమును స్మరించుకొనెను. తాను – విదురుడు ఒకే ఒక ధర్మదేవత అంశనుండి వ్యక్తమైతిమని అనుభవమునకు దెచ్చుకొనెను. ధర్మదేవత అంశయే విదురుడు – యుధిష్ఠిరుడు యను యథార్థమును వేదవ్యాసమహర్షి కూడ ధృతరాష్ట్రునకు ఎరిగించెను. ఆ సందర్భమున గాంధారీ ధృతరాష్ట్రులు తమ మృత పుత్రుల దర్శనమును కాంక్షించిరి. కుంతీదేవి కూడ కర్ణుని రహస్య జన్మ వృత్తాంతమును తెలిపి తనకు కర్ణుని దర్శనము గావలెనని కోరెను. వ్యాసమహర్షి భాగీరథీజలములలో ప్రవేశించి మృతిచెందిన కౌరవపాండవ వీరులను ఆవాహన చేసెను. అపుడు అగణిత మృతవీరులు

తండోపతండములుగా గంగా జలము నుండి బయటకు వచ్చిరి. వ్యాసమహర్షి కృపవలన లభించిన దివ్య చక్షువులతో ధృతరాష్ట్రుడు తన పుత్రులను, బంధువులను జూచి పరమానందము పొందెను. వ్యాసమహర్షి ఆదేనుసారము కొందరు విధవ స్త్రీలు గంగానదిలో మునిగి తమ పతిలోకములకేగిరి. మిగిలినవారందరు హస్తినాపురమునకు మరలిరి.

పిమ్మట రెండు సంవత్సరములు గడిచిన తరువాత దేవర్షి నారదుడు దైవేచ్ఛతో యుధిష్ఠిరుని వద్దకు వచ్చెను. యుధిష్ఠిరుడు ప్రశ్నించగా కుంతీ గాంధారి ధృతరాష్ట్రులు దావాగ్నిలో దగ్ధమయినారని దెలిపెను. ఆ వార్తనాలకించిన యుధిష్ఠిరుడు శోకసాగరములో మునిగిపోయెను. వారు ముఫ్వురు అనాథలవలె దావానలములో దగ్ధమైన దుస్థితికి యుధిష్ఠిరుడు దురపిల్లెను. అపుడు దేవర్షి దావానల రహస్యమును చెప్పెను. ధృతరాష్ట్రుడు త్రేతాగ్నులను విడిచిపెట్టి, గంగానదిలో స్నానముచేసి ఆశ్రమమునకు మరలెను. ఆ సమయమున పెనుగాలులు వీచుటచే త్రేతాగ్నుల ద్వారా వనప్రాంతమునందు అగ్నికీలలు వ్యాపించినవి. కావున ధృతరాష్ట్రుని త్రేతాగ్నులచే వారు ముఫ్వురు దహించబడి పవిత్రులయ్యినారని వివరించెను. యుధిష్ఠిరుడు ఆ ప్రాంతమునకు బ్రాహ్మణులను పంపించి శ్రాద్ధకర్మాదులు గావించెను.



మౌసల పర్వము - సంగ్రహపరిచయము

కథాంశము:

మహాభారతము జరిగిన ముప్పదియారవ సంవత్సరము ఆరంభములో యుధిష్ఠిరునకు అనేక అపశకునములు గానవచ్చెను. వృష్టివంశజుల నడుమ మహా అన్యాయపూర్వక కలహము పుట్టెను. వారు కాలప్రేరితులై ఒకరినొకరు ముసలములతో (వజ్రపు రోకళ్ళతో) కొట్టుకొని నశించిరి. అందుకు విప్రశాపమే కారణమయ్యెను. ఒకప్పుడు తపోధనులగు దేవర్షి నారద, విశ్వామిత్ర, కణ్వాది ఋషులు ద్వారకానగరమునకు వెడలిరి. ఆ సమయమున దైవోపహతులైన సారణాది యాదవవీరులు శ్రీకృష్ణుని తనయుడగు సాంబునకు స్త్రీ వేషము ధరింపజేసి ఆ మునిజనుల కడకేగి "మహర్షులారా! ఈమె బభ్రుని పత్ని, పుత్రసంతతి గావలెనని బభ్రువు కోరుచుండెను. ఈమెకు ఎట్టి సంతానము గలుగునో దెలుపమనిరి. అందులకు ఆ ఋషులు క్రోధితులై "యాదవకుమారులారా ! మీరు క్రూర, క్రోధ, దురాచార వర్తనులవలె ప్రవర్తించితిరి గావున ఈ శ్రీకృష్ణ భగవానుని తయుడగు సాంబుడు ఒక భయంకర ముసలమును ఉత్పన్నమొనర్చును. అదియే వృష్ణి - అంధక వంశముల వినాశనమునకు కారణమగును. ఒక్క బలరామ కృష్ణులు తప్ప మిగిలిన యాదవులందరు ముసలములతో సంహరించుకొందురు.

బలరామదేవుడు స్వయముగా సముద్రములో ప్రవేశించి దేహత్యాగమొనర్చును. మహాత్ముడగు శ్రీకృష్ణుడు భూశయనుడై యున్నపుడు జరాయువను వ్యాధుడు తన బాణముతో గొట్టి గాయపరచును" అని పలికిరి. ఆయన జగదీశ్వరుడైననూ యాదవవంశజులపై వచ్చి పడనున్న కాలప్రేరిత ఆపదను తప్పించు ఇచ్ఛలేకుండా యూరకుండుననిరి. ఋషులు చెప్పిన విధముగ సాంబుని గర్భమునుండి ముసలము ఉత్పన్నమయ్యెను. యదువంశీయులు ఆ ముసలమును ఉగ్రసేన మహారాజునకు సమర్పించిరి. ఆయన వివశుడై దానిని పొడిపొడిగా చూర్ణము గావించెను. ఉగ్రసేన మహారాజు ఆ చూర్ణమును తన సేవకుల ద్వారా సముద్రములో పారవైచెను. యాదవులలో తీర్థయాత్ర జేయు ఉత్సుకత కలిగెను. వారు ప్రభాస తీర్థమునకు పయనమయ్యిరి. ఉద్ధవుడు మాత్రము యాత్రా విముఖుడై వేరొక ప్రదేశమునకు వెడలెను. బలరాముడు, సాత్యకి, గదుడు, బభ్రు మున్నగు వారు శ్రీకృష్ణుని సమక్షమునందే మదిరాపానము చేయసాగిరి. సాత్యకి మదిరాపానమత్తుడై కృతవర్మను హాస్యములతో ఆటపట్టించెను. అసహాయుడైన భూరిశ్రవుని క్రూరముగ హత్య చేసితివని కృతవర్మ సాత్యకిని నిందించెను. ఆ సమయమున సాత్యకి శ్రీకృష్ణునితో "సత్రాజిత్తు వద్దనున్న శమంతకమణిని కాజేయుటకై కృతవర్మయే సత్రాజిత్తును హత్యచేసెనను రహస్యమును బట్టబయలు చేసెను. పిమ్మట సాత్యకి కృతవర్మల నడుమ విరోధము చెలరేగినది. యాదవులు రెండు పక్షములుగా విడిపోయి పరస్పరము సంహరించు కొనసాగిరి. సముద్రములో గలిపిన ముసలము చూర్ణము కూడ అలలు ద్వారా సముద్ర తీరమునందున్న తుంగ మొదళ్ళలో చేరి మొదళ్ళన్నియు వజ్రసమానములైనవి. యాదవులు తుంగ మొదళ్ళతో కొట్టుకొని నశింపజేసి కొనసాగిరి. ముసలముతో తనపైకి వచ్చిన వారందరిని శ్రీకృష్ణుడు కూడ తుంగగడ్డి ముసలముతో గొట్టి మృత్యువాత గావించెను. యాదవుల కొట్లాటలో శ్రీకృష్ణ భగవానుని పుత్రులగు సాంబుడు, చారుదేష్ణుడు, ప్రద్యుమ్నుడు తన పౌత్రుడగు అనిరుద్ధుడు వధింపబడుట జూచి ఆయన క్రోధాగ్నితో ప్రజ్వరిల్లెను. తన తమ్ముడగు గదుడు కూడ రణశయ్యపై పడియుండుట జూచి అగ్నిస్వరూపుడై శేషించియున్న యాదవులందరిని సంహరించెను. బభ్రుడు, దారుకుడు, శ్రీకృష్ణుడు అచటి నుండి పోయి బలరామదేవుని అన్వేషించసాగిరి. బలరామదేవుని పాదచిహ్నముల ననుసరించి వనమున

కేగిరి. ఆయన ఒక వృక్షము క్రింద ఆసీనుడై ఏకాంతములో ధ్యానమగ్నుడగుట జూచిరి. శ్రీకృష్ణ భగవానుడు వెనువెంటనే దారుకుని హస్తినకేగి అర్జునునకు యాదవ సంహారవిషయము నెరిగించమనెను. తన సమీపమునందున్న బభ్రుని శీఘ్రమే ద్వారకకు పోయి అంతఃపుర స్త్రీలకు రక్షగా నిలువమనెను. కాని భిల్లుడొకడు బాణము వదులుటచే అది పొరపాటున బభ్రునకు తగిలి ఆయన మరణించెను. అపుడు శ్రీకృష్ణుడు వేవేగ ద్వారకానగరమునకేగి అంతఃపుర స్త్రీల రక్షణ బాధ్యతను వసుదేవునకు అప్పగించి మరల బలరాముడున్న ప్రదేశమునకు తిరిగివచ్చెను. బలరామదేవుడు సమాధి స్థితుడై తన పూర్వ శరీరమును విడిచి మహా సర్పరూపము దాల్చి సాక్షాత్తు ఆదిశేషునిగ సముద్ర ప్రవేశము చేసెను. శ్రీకృష్ణ భగవానుడపుడు ఆ వనములోనే ఒక చెట్టు క్రింద యోగనిద్రలో నుండెను. మృగయాసక్తి చెందియున్న వేటగాడొకడు శ్రీకృష్ణుని ఒక మృగముగా దలంచి చెట్టు చాటునుండి శ్రీకృష్ణుని అరిపాదముపై కొట్టెను. పీతాంబరధారి శ్రీకృష్ణుడు సహస్రబాహువుగా దృశ్యమానమగుట జూచి వ్యాధుడు తానొక గొప్ప అపరాధము చేసితినని తలంచి గడగడ వణికిపోయెను. శ్రీకృష్ణుడు వ్యాధునకు ఆశ్వాసమునిచ్చి స్వీయ తేజపుంజముల కాంతితో పృథివ్యాకాశములను వ్యాప్తమొనర్చి తన పరంధామమునకు వెడలిపోయెను.

దారుకుని ద్వారా యాదవనాశన వృత్తాంతము నెరిగిన పాండవులు దుఃఖితులయ్యిరి. అర్జునుడు స్వయముగా వసుదేవుని గలియుటకు ద్వారకా నగరమునకు వెడలెను. శ్రీకృష్ణ భగవానుని పదునారువేలమంది భార్యలు అర్జునుని చూచినంతనే తమ రక్షణ గోరుచు ఉచ్చస్వరముతో కరుణాక్రందనలు చేయసాగిరి. వసుదేవుడు అర్జునుని జూచినంతనే హృదయమునకు హత్తుకొనెను. తన పుత్రులను స్మరించుకొని రోదించెను. పిమ్మట అర్జునునితో "నాయనా శ్రీకృష్ణుడు ఏదైనా పవిత్ర స్థానములో శౌచాది నియమములు పాటించుచు బలరామదేవునితోబాటు శీఘ్రమే కాలము కొరకు ప్రతీక్షించెదనని చెప్పి వెడలిపోయెను. యాదవ బాలురను, స్త్రీలను అర్జునుడు ఆదరించి రక్షించుననియు, మాకు ఔర్ధ్వదేహిక సంస్కారములు చేయుననియు చెప్పెను. అర్జునుడు యిట నుండి వెడలిన మరుక్షణమే సముద్రము ఉత్తుంగ తరంగములతో ద్వారకానగరమును ముంచి వేయునని కూడ పలికెను. వసుదేవుడిటుల చెప్పి తాను నిశ్చింతగా తన ప్రాణంబుల విడిచెదనని అర్జునునకు చెప్పెను. ఆ మరునాడు తెల్లవారినంతనే వసుదేవుడు తన చిత్తమును పరమాత్మయందు లగ్నమొనర్చి ఉత్తమ గతి పొందెనను వార్త అర్జునునకు దెలిసెను. అర్జునుడు ముసలాభూతముచే మరణించిన యాదవ వీరులందరికి అంత్యేష్టికర్మలు గావించెను. తదనంతరము కొందరు విశ్వాసపాత్రుల ద్వారా బలరామ కృష్ణుల దేహముల కొరకు అన్వేషణ గావించి వారి దేహములకు కూడా దహన సంస్కారములు చేయించెను. రుక్మిణి, గాంధారి, శైబ్య, హైమావతి, జాంబవతి యను శ్రీకృష్ణుని భార్యలు పతిలోక ప్రాప్తి కొరకు అగ్నిప్రవేశము చేసిరి. సత్యభామ, ఇతర శ్రీకృష్ణ మహిళలు తపస్సుచేయ నిశ్చయించి వనముల కేగిరి. అర్జునుడు శ్రీకృష్ణుని పౌత్రుడగు వజ్రునకు ఇంద్రప్రస్థ రాజ్యము నప్పగించెను. స్త్రీలు మాత్రము వజ్రుడు వలదు వలదని వారించిననూ తపస్సు కొరకు వనవాసమునకేగిరి. అర్జునుడు సాత్యకి యొక్క ప్రియ పుత్రుడు యౌయధనుని సరస్వతీ నదీ తీర దేశమునకు అధికారిగ జేసెను. తదనంతరము అర్జునుడు దీనవదనముతో, శోకసంతప్తుడై వేదవ్యాసమహర్షి కడకేగి పరిపరివిధముల యాదవ వినాశమును స్మరించి తనకు శ్రీకృష్ణుని ఎడబాటు భరించలేనిదిగ నుండెనని మొరపెట్టుకొనెను. అపుడాయన "కుంతీకుమారా ! వృష్ణి అంధక వంశజులు బ్రాహ్మణ శాపకారణముగ నశించిరి. కనుక వారిని గురించి నీవు శోకించబనిలేదు. వారి ప్రారబ్దమటుల జేసినది. వృష్ణి వంశ స్త్రీలు దోపిడిగాండ్రచే అపహరించబడుటలో కూడ దేవరహస్యమున్నది. ఒకప్పుడు అప్సరస స్త్రీలు అష్టావక్ర మునిని అపహాస్యము చేసిరి. అందుచే మానవజన్మ నెత్తునటుల శపించబడిరి.

వారికి దస్యులచే అపహరింపబడినపుడు శాపవిముక్తి గలుగునని ఆ మహర్షి చెప్పెను. ధనంజయా ! కాలమే సంసారోత్పత్తిని జేయును. అకస్మాత్తుగా మరల కాలమే సమస్తమును సంహరించును. కాలప్రభావముచేత ఒకప్పుడు బలవంతుడైనవాడే దుర్బలుడగును. ఒకప్పుడు శాసకుడైనవాడే మరొకప్పుడు ఇతరుల ఆజ్ఞలను పాటించవలసివచ్చును. ఇది కాలమహిమ. అర్జునా ! నీ అస్త్రశస్త్రముల ప్రయోజనము పూర్తయినది. అందుచే అవి నీ కెటుల సంప్రాప్తించినవో అటులనే మాయమైనవి. మరల ఉపయుక్త సమయము ఆసన్నమైనపుడు నీ చేతిలో ప్రకటమగును. భారతా ! మీకిపుడు ఉత్తమగతులు సంప్రాప్తించు సమయము వచ్చినది. మీకు అదియే కల్యాణదాయకమనుకొందును" అని వ్యాసమహర్షి పలికెను.

మహాప్రస్థానిక పర్వము - సంగ్రహపరిచయము

వృష్టివంశ సంహార వృత్తాంతము నాలకించిన యుధిష్ఠిరుడు తన తమ్ములతో భార్య ద్రౌపదితో గలిసి మహాప్రస్థానమునకు పూనుకొనెను. పరీక్షిత్తును కురురాజ్యమునకు అభిషిక్తుని చేసెను. ధృతరాష్ట్రుని వైశ్య భార్య పుత్రుడగు యుయుత్సుని పిలిచి సంపూర్ణ రాజ్యము యొక్క బాగోగులు చూచు కార్యభారము నప్పగించెను. కృపాచార్యుని పూజించి పురవాసుల సహితముగ పరీక్షిత్తును శిష్యభావముతో నుండునటుల ఆయనకు అప్పగించెను. అటులనే యాదవులకు రాజుగా శ్రీకృష్ణుని పౌత్రుడగు వజ్రుని రాజుగా అభిషేకించి ఇంద్రప్రస్థమును రాజధానిగా నిర్ణయించెను. అర్జునుని భార్య సుభద్రాదేవిని పిలిపించి పరీక్షిత్తు - వజ్రులను రక్షించు బాధ్యత నప్పగించెను. తన అన్నదమ్ములతో గూడి శ్రీకృష్ణునకు, వసుదేవునకు, బలరామాదులకు జలాంజలులు సమర్పించి విధిపూర్వకముగ శ్రాద్ధకర్మ చేసెను. నగరవాసులందరిని సభదీర్చి వారి అనుమతితో మహాప్రస్థానమునకు సిద్ధమయ్యెను. అపుడు వారితోగూడి ఒక శునకము కూడ అనుసరించెను. అర్జునుడు గాండీవమును ధరించెను. యుధిష్ఠిర, భీమసేన, అర్జున, నకుల, సహదేవ, ద్రౌపదులు వరుస క్రమములో ఒకరి వెనుక ఒకరు పాదచారులై నడక సాగించిరి. వారికి మార్గమధ్యములో అగ్నిదేవుడు ప్రత్యక్షమై వరుణదేవుని వద్దనుండి తెచ్చిన గాండీవమును ఆయనకు సమర్పించమని చెప్పెను. అర్జునుడు గాండీవమును సముద్రములో పడవేసెను. వారు భూప్రదక్షిణగా పోవుచు సముద్రములో ద్వారకాపురి మునిగిపోవుట గమనించిరి. వారు ఉత్తరాభిముఖముగ పయనమై హిమాలయ పర్వతములను దర్శించిరి.

హిమాలయములు దాటిన పిమ్మట వారికి ఇసుక సముద్రము అగుపడెను. అచట నుండి వారికి పర్వతములలో శ్రేష్ఠమైన మహాగిరి మేరుపర్వత దర్శనమయ్యెను. పాండవులు యోగధర్మ స్థితులగుటచే చాల శీఘ్రముగ పోవుచుండిరి. వారిలో ముందుగా ద్రౌపది యోగవిచలితయై నేలకొరిగెను. తరువాత సహదేవుడు, నకులుడు, అర్జునుడు, భీమసేనుడు, నేలకొరిగిరి. యుధిష్ఠరుడు మాత్రము శునకముతో సశరీరుడై ముందుకు పోవుచుండగా దేవేంద్రుడు రథమును దెచ్చి స్వయముగా యుధిష్ఠిరుని గొనిపోవ దలంచెను. నక్షత్రరూపములో నున్న లోకములన్నియు దర్శింపజేసి యుధిష్ఠిరుని ఇచ్ఛానుసారము ఏదైనా లోకమును కోరుకొనమనెను. యుధిష్ఠిరుడు తాను తన అన్నదమ్ములు - ద్రౌపది పోయిన లోకములకు పోయెదనని చెప్పెను. భీమసేనాదులు, ద్రౌపది స్వర్గలోక స్థితులయితి రని ఇంద్రుడు చెప్పి తన రథము నధిరోహించమనెను. కాని శునకమును వదిలిపెట్టమనెను. అపుడు యుధిష్ఠిరుడు తన భక్తులను పరిత్యజించుట అధర్మమని చెప్పెను. అపుడు శునకరూపధారణతో పాండవులతో మహాప్రస్థానము చేసిన ధర్మదేవత ప్రత్యక్షమై యుధిష్ఠిరుని ధర్మనిరతిని ప్రశంసించెను. యుధిష్ఠిరుడు తన తేజస్సుతో భూమ్యాకాశముల నాచ్ఛాపించి సశరీరుడై స్వర్గలోకమున కేగెను.

స్వర్గారోహణ పర్వము - సంగ్రహ పరిచయము

యుధిష్ఠిరుడు స్వర్గసీమను చేరి అచట దుర్యోధనుడు శోభాసంపన్నుడై తేజస్వంతులగు దేవతలతో పుణ్యకర్మ లొనర్చిన సాధు గణములతో గూడి ఒక దివ్య సింహాసనము నందాసీనుడై సూర్యునివలె దేదీప్యమానముగా ప్రకాశించుచుండుట గమనించెను. దుర్యోధనుని అద్భుత శోభాసంపత్తిని తిలకించిన యుధిష్ఠిరుడు గొప్ప నిరసనతో అవహేళన చేయుచు మరొక దిశగా వెడలెను. దుర్యోధనుడొనర్చిన నీచకార్యముల పర్యవసానముగా జరిగిన ఘోర యుద్ధ సంహారమును దేవతల సమక్షమున వ్యక్తపరచెను. అపుడు దేవర్షి నారదుడు "యుధిష్ఠిరా ! స్వర్గములో ఈర్ష్యాద్వేషములు, పూర్వజన్మ అభిప్రాయభేదములు, క్రోధములు యుండరాదు. దుర్యోధనుడు కూడ యుద్ధముచేసి వీరమరణము చెందెను గావున స్వర్గభోగము లనుభవించవలసి యున్నది. నీలో ఇంకను మానవ స్వభావములు తొలగకున్నవి. సశరీరుడవై వచ్చుటచే యా భావములు పాదుకొని యున్నవి" అనెను. అవును యుధిష్ఠిరుడు తన అన్నదమ్ములు, ద్రౌపది ఎచట ఏవిధముగ నుండిరో తెలుసుకొనదలచెను. అందులకు దేవతలు ఒక దేవదూతను పిలిచి నిర్ణీత మార్గము ద్వారా యుధిష్ఠిరుని గొనిపొమ్మని ఆదేశించిరి.

దేవదూత యుధిష్ఠురునకు దారి జూపి దుర్గమ మార్గములద్వారా నడిపించసాగెను. నరకయాతనల ననుభవించు పాపాత్ముల నరక మార్గము గాఢాంధకారముతో నున్నది. కేశములు, గడ్డిదుబ్బులు, తీగెలు, లతలతో, మాంసము, రక్తముతో గూడిన బురదతో నిండియున్నది. ఆ దారి ఈగలు, దోమలు, కందిరీగలు ఇతర కీటకములతో వ్యాపించియున్నది, అచటచట మృతకళేబరములు పడియున్నవి. ఇనుప ముక్కులుగల గ్రద్దలు, రాబందులు మున్నగు మాంసాహార పక్షులు గుంపులు గుంపులుగా నున్నవి. విశాలకాయులైన ప్రేతలు సూదులవంటి ముఖములతో సంచరించు చుండిరి. మృత కళేబరముల దుర్గంధమును యుధిష్ఠిరుడు సహించనోపక ముక్కుమూసుకొనుచు, అమంగళ భీభత్స దృశ్యములను చూచుచు పయనించసాగెను. మురికి కంపుతో ప్రవహించు నదిని, కత్తుల వంటి పత్రములు గల అసిప్రత వనయును జూచెను. కొన్ని చోట్ల వేడివేడి ఇసుక మైదానములున్నవి. వేడిచేసిన పెద్ద పెద్ద బండ రాళ్ళున్నూ, సలసల మరుగుతున్న నూనెతో నున్న పెద్ద పెద్ద గంగాళములుయున్నవి. ఆ మార్గములందంతట దుర్గంధమును పీల్చుటచే కడుపులోనున్న ప్రేగులు దేవురించబడుచున్నవి. యుధిష్ఠిరుడు ఆ దారిన పోవుచు అలసిపోయి తానింకా ఎంత దూరము పోవలసి యున్నదని దేవదూత నడిగెను. అపుడా దేవదూత "మీరు యీ మార్గమున అలసిపోవు నంతవరకు గొనిపోయి మరల వెనుకకు దెమ్మని దేవతలు చెప్పిరి" అనెను. యుధిష్ఠిరుడు ఆ దుర్గంధమును భరించచలేక మరలిపోవుటకు నిశ్చయించెను. కాని మానవ స్వరములతో దీనాలాపనలు వినిపించెను. యుధిష్ఠిరుడు ఆ శబ్దములు వచ్చిన వైపు దిరిగి "మహాత్ములారా ! మీరు ఎవరని ప్రశ్నించెను. అందుకు సమాధానముగా వారు కర్ణ భీమసేన అర్జున నకుల సహదేవ ద్రౌపదీ ద్రౌపదేయులమని చెప్పిరి. మహామనస్యులగు తన తమ్ములు, ద్రౌపది తనయులు అట్టి దుర్భర స్థితిలో పడిరని చింతించిన యుధిష్ఠిరుడు దైవ విలాసమునకు ఆశ్చర్యము పొందెను. తాను కూడ వారితో నరకబాధలు పొందదలచి అచటనే నిలిచిపోయెదనని దేవదూతకు చెప్పెను. దేవదూత ఆయన నిర్ణయమును దేవతలకు చెప్పెను. అపుడు ఇంద్రాది దేవతలతో కూడి ధర్మదేవత వచ్చి, యుధిష్ఠిరుని ధర్మనిరతిని ప్రసంసించెను. దేవేంద్రుడు యుధిష్ఠిరుని శాంతపరచి "యుధిష్ఠిరా ! నీవు మహాభారత సంగ్రామములో నీ గురువుతో అశ్వత్థామ హతుడయ్యెనని అబద్ధమాడితివి. అందుకే నీకు యీ మాత్రము నరక

దర్శనము చూపించబడినది. యథార్థముగ ఇది నేను కల్పించిన మాయ. నీ తమ్ములు, ద్రౌపది, ద్రౌపదేయులు, కర్ణుడు మున్నగువారు స్వర్గ సుఖముల ననుభవించు చుండిరి. రాజులందరు నిశ్చయముగా నరకమును జూచెదరు. మానవజీవితములో శుభాశుభకర్మలెన్నియో సంచితమగు చుండును. ముందుగా శుభకర్మల ఫలము ననుభవించువారు ఆ తరువాత అశుభకర్మల ఫలమగు నరక గతుల ననుభవించెదరు. ముందుగా నరకము ననుభవించినవారు తరువాత స్వర్గ సుఖములందు తేలియాడుదురు. కుంతీనందనా ! నీకు లభించిన లోకములు హరిశ్చంద్రునకువలె అనంతలోకములై యున్నవి. యుధిష్ఠిరా! నీవిచట పుణ్యసతిల సహిత ఆకాశగంగలో స్నానమొనర్చి పునీతుడవైనంతనే నీలోనున్న మానవ భావములు అంతమగును. నీలో శోక సంతాపములు, వైరభావములు తొలగిపోవును" అని పలికెను. యుధిష్ఠిరుడు దేవనదిలో స్నానము చేసినంతనే తన మానవ శరీరము మాయమై దివ్య దేహము ధరించి వైవభావరహితుడయ్యెను. ఆయన సంతాపములన్నియు దూరమైనవి. శూరవీరులగు పాండవులు - ధృతరాష్ట్ర పుత్రులు క్రోధమును త్యజించి ఆనందపూర్వకముగ స్వర్గసుఖముల ననుభవించిరి.

యుధిష్ఠిరుడు క్రమముగా శ్రీకృష్ణార్జునులు, కర్ణుడు, భీమసేనుడు నకుల సహదేవులు, తమ అంశదేవతలతో గలిసి యుండుట జూచెను. ద్రౌపది సాక్షాత్తు స్వర్గలక్ష్మియై విరాజిల్లి యుండెను. ద్రౌపదేయులు అయిదుగురు గంధర్వులు పాండవుల వీర్యము ద్వారా ద్రౌపది గర్భమునుండి ఉత్పన్నమయ్యిరి. యుధిష్ఠిరా ! గంధర్వ రాజు ధృతరాష్ట్రుని దర్శించుము. ఆయన మీ పెదతండ్రిగ మానవ లోకములో అవతరించెను. మీ అన్నగారగు రాధేయుడు ఆదిత్యులలో కలిసియున్నాడు దర్శించుము. అంధకుల సాత్యకాది మహారథులు, మహాబలురగు భోజులను చూడుము. వారే సాధ్యులు, విశ్వదేవులు, మరుద్గణలులై విరాజిల్లుచున్నారు. అభిమన్యుడు చంద్రునితో కూర్చునియున్నాడు. నీ తండ్రి పాండురాజు కుంతీ మాద్రిలతో విరాజిల్లియున్నాడు. భీష్మపితామహుడు వసువులతోపాటు విరాజిల్లుయున్నాడు. మీ గురువగు ద్రోణాచార్యుడు బృహస్పతి వద్ద యున్నాడు చూడుము. నీ పక్షము వహించి పోరాడిన భూపాలురు, గంధర్వులు, యక్షులు, పుణ్యజనులై వెడలుచున్నారు చూడుము. కొందరు గుహ్యకుల గతి పొందియున్నారు చూడుము." అని దేవేంద్రుడు యథార్థమును దర్శింప చేసెను.

